భారతి



సాహిత్య మాసపత్రిక

నవంబరు 1985



★ బలివాడ కాంతారావు గారి చిన్న నవల

★ డా. సి. నారాయణరెడ్డి గారి ఆకాశం సరదా

★ పాలడుగు వేంకటేశ్వరరావు గారి శ్రీరామ

విజయ్ సోలార్ ఎంటర్ ప్రైజెస్

5-1-868, సుల్తాన్ బజార్

హైదరాబాద్ - 500 195

ఫోను : 45240 గ్రామ్ : **SUNTHRIL**

సూర్యశక్తితో పనిచేయు జపానులో తయారుచేయబడిన సాంకేతిక సాధనములు

సోలార్ కారు/ట్రాక్టరు బ్యాటరీ చార్జరు	సహజముగా డిశ్చార్జియగు కారు/ట్రాక్టరు/టూ వీలరు బ్యాటరీలను పూర్తి ఛార్జిలో వుంచి జీవితకాలమును పెంచును. స్టార్టింగు సమస్యను సర్వదా పోగొట్టును.
సోలార్ కారు ఏయిర్ కూలరు	కార్లలో కలుషిత వాయువును పారద్రోలి స్వచ్ఛమైన శీతల వాయువును ప్రసరణ చేయును. 24 గంటలు పని చేయును.
సోలార్ వాటర్ హీటరు	నీటిని వేడిచేసే స్టీలు సిలెండరు గలది. గృహములు, హోస్టల్సు, లాడ్జీలు, హాస్పటల్స్‌లోను ఉపయోగపడును.
సోలార్ సోడియం వాపర్ లాంపు	భద్రతకొరకు వీధి దీపములుగాను, యిళ్ళ కాంపౌండులయందు, విద్యుత్ ప్రసారములేని మారుమూల ప్రాంతములలోను ఉపయోగపడును.
సోలార్ టూత్ బ్రష్	పేస్టు అవసరం లేకుండా 1½ సంవత్సరములు దంతములు శుభ్రము చేయు విచిత్ర సాధనము.
క్లినికల్ థర్మామీటరు	స్పర్శచేతనే శరీర ఉష్ణోగ్రతను తెలుపును. అతి సూక్ష్మ ఎలక్ట్రానిక్ సాధనము.

మా ఏరియా డిస్ట్రిబ్యూటర్లు :

హైదరాబాదు, సికిందరాబాదు, తెలంగాణా
ఏరియా చీఫ్ డిస్ట్రిబ్యూటర్లు
మోతి & కంపెనీ,
4-3-345/8 బ్యాంకు వీధి, హైదరాబాదు-500195.
ఫోను : 43496

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం
శ్రీ గౌతమి ఏజన్సీస్,
9-14-1513, విజయనగరంరోడ్డు, విశాఖపట్నం.

తూర్పు గోదావరి
ప్రసాద్ సోలార్ ప్రోడక్ట్సు,
7-26-17, మాటూరివారి వీధి, రాజమండ్రి

రాయలసీమ జిల్లాలు.
న్యూ ఎనర్జీ సిస్టమ్స్,
170/2, చింతకాయలవారి వీధి, తిరుపతి.

కృష్ణా, గుంటూరు మరియు ప్రకాశం జిల్లాలకు:
మెస్సర్స్ ఆదిత్య సోలార్ ఎంటర్‌ప్రైజెస్, నెం. 40-3-11-A, కృష్ణనగర్, లబ్బీపేట, విజయవాడ.

[మియాకన్‌సన్ పవర్ ప్రోడక్ట్సు ప్రైవేట్ లిమిటెడ్, మద్రాసువారి ద్వారా]

సంపుటము : 62
సంచిక : 11

నవంబరు
1985

భారతి

సాహిత్య మాసపత్రిక

*

సంస్థాపకుడు
కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

*

సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్
(1938-1972)

*

విషయానుక్రమణిక

*

ముఖచిత్రం : కుమారి స్వాతి సోమనాథ్, శ్రీమతి వీణా గాయత్రి

శ్రీమతి వీణా గాయత్రి	-డా. పి. బి. శ్రీనివాస్	– 5
అన్నపూర్ణ	-శ్రీ బలివాడ కాంతారావు	– 7
మళ్ళీ మతం ఒడిలోకి....	-డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు	– 24
కత్తుల వంతెన	-శ్రీ రాఘూ చంద్రమౌళి	– 25
కిటికిలోంచి వాన	-శ్రీ ఎ. వి. వి. యస్. యస్. ప్రసాద్	– 26
శ్రీ రాజరాజ నరేంద్ర చాళుక్య వంశ విస్తృతి శ్రీ కూర్మము	-శ్రీ ముసునూరి సాంబశివ రామమూర్తి	–28
బాలేందు రేఖ	-శ్రీ కొణిదెన జానకి రామయ్య	–35
ఉప్పు కడలి	-శ్రీ కుంకాల సీతారామ్	–35
ఒక శ్రావణ సాయంత్రం	-శ్రీ కావూరు పాపయ్య శాస్త్రి	–38
హిరణ్మయేన పాత్రేణ	-శ్రీ సూరంపూడి భాస్కరరావు	–38
సహగమనం (సీరియల్)	-శ్రీ మధురాంతకం నరేంద్ర	–40
గృహ ప్రవేశం	-శ్రీ పి. వి. రామకుమార్	–48
మాత్రాచ్ఛందస్సులూ-మహాకవి శ్రీశ్రీ	-శ్రీ శంకరగంటి రంగాచార్యులు	–50
ప్రకృతి-ప్రవృత్తి ఊహలు	-శ్రీ పైల కృష్ణారావు	–56
శ్రీరామ	-శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు	–57
నా పేరు ప్రతిభ	-డాక్టర్ మిరియాల రామకృష్ణ	–59
సమిధలు (సీరియల్)	-దిలావర్	–60
హాలీ తోక చుక్క	-శ్రీ జమ్మి కోనేటిరావు	–66
ఇల జరిగిన కళ్యాణం	-శ్రీ పాలకోడేటి సత్యనారాయణరావు	–69
ఆకాశం సరదా	-డా. సి. నారాయణరెడ్డి	–73
తిల్లానా	-శ్రీ కొడవంటి కాశీపతిరావు	74
కుమారి స్వాతి సోమనాథ్	-శ్రీ సి. వి. రాజగోపాలరావు	76
కాటేపల్లిలో పూర్ణిమ	-వనమాలి	–76
కలగూరగంప	. . . .	–77
గ్రంథ విమర్శలు	. . . .	–80

విడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్సు ప్రయివేట్ లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు, ప్రచురణకర్త : శివలెంక రాధాకృష్ణ.
ముద్రణ : ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3; సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ.

స్వవిషయం

శ్రీమతి ఇందిరాగాంధీ హత్య జరిగి సంవత్సరం అవుతోంది. ఈ పన్నెండు నెలల కాలంలో ప్రపంచం అంతటా ఎన్నో మార్పులు వస్తున్నాయి. భారతదేశంలోనూ చాలా మార్పులే వస్తున్నాయి. ఎటువంటి మార్పులు ఎన్ని వచ్చినా భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగానే నడుస్తోందని అనిపిస్తుంది! ఇది చిన్న విషయమేమీ కాదు. వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చే ఈ వ్యవస్థ మానవ సమాజానికి అతి సహజమయినది అనే అభిప్రాయానికి విరుద్ధంగా భూగోళం మీద ప్రజాస్వామ్యాలకన్నా నియంతృత్వాలే ఎక్కువగా కొనసాగుతున్నాయి. జపాన్, పశ్చిమ యూరోపు, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా ఖండం, ఇస్రాయిల్ –ఇవికాక భారతదేశం ఒక్కటే పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థని అభివృద్ధి చేసుకోగలుగుతోంది. 1947 దాకా ఈ ఉపఖండంలో భారతదేశంలో కలిసి ఉన్న నేటి పాకిస్తాన్, బంగ్లాదేష్‌లు మత ప్రధానమయిన నియంతృత్వాలుగా కొనసాగుతున్నాయి. 1975 లో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే భారతదేశంలో వ్యక్తి స్వాతంత్ర్యాలు అంతరించి పోతాయేమో అనిపించే మార్పులు కొన్ని వచ్చాయి. ఈ దేశం కూడా పశ్చిమ, ఆగ్నేయ ఆసియా ప్రాంతాలకి చెందిన ఒక నియంతృత్వంగా మారిపోతుందేమోనన్న భయం ఎందరికో కలిగింది. అదృష్టవశాత్తు అలాగ జరుగలేదు. శ్రీమతి ఇందిరాగాంధియే ఎన్నికలు జరిపించి, అత్యవసర పరిస్థితిని తొలగించి భారతదేశంలో ఇక ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగ లేదన్న వాదంలో నిజం లేదని నిరూపించారు. ఆమె 1977 లో ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ 1980 లో మళ్లీ ప్రధానమంత్రి కాగలిగారు. ఆమె నాయకత్వం వహించిన కాంగ్రెసు–ఐ పార్టీలో ప్రజాస్వామ్య సంప్రదాయాలకి గౌరవం లభించినదనటానికి వీలులేదు. ఆ రాజకీయ పక్షాన్ని ఆమె నిరంకుశంగానే నడుపుకున్నారని అంగీకరించాలి. ఇటువంటి పరిస్థితులలో ఆమెని సిక్కు దౌర్జన్యవాదులు హత్య చేసినప్పుడు భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకి ఏమి గతి పడుతుందో అని ఆందోళన చెందిన వారికి ఆమె కుమారుడు శ్రీ రాజీవ్‌గాంధీ పెద్ద సంచలనం ఏమీ లేకుండా ప్రధానమంత్రి కావటం ఆశ్చర్యంతో కూడిన తెరిపి కలిగించింది. భారతదేశంలో వోటరుల ప్రవర్తనని గురించి ఎవరు ఏమి అనుకున్నప్పటికీ ఇక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులు గట్టిగానే ఉన్నట్లు ఋజువు అయింది. వోటరులు శ్రీ రాజీవ్‌గాంధీనే ప్రధానమంత్రిగా ఎన్నుకుని ఉండవచ్చు కాని ఇక్కడ ఇంకా వ్యక్తుల కన్నా వ్యవస్థకే ప్రాధాన్యం లభిస్తోందని అనుకోవచ్చు. శ్రీమతి ఇందిరాగాంధీ నడవడి కొన్ని విషయాలలో నిరంకుశంగా ఉండి ఉండవచ్చు కాని ఆమె ఎటువంటి పరిస్థితులలో ప్రధానమంత్రి అయ్యారో, ఆమెకి సంక్రమించిన రాజకీయ వ్యవస్థ ఎటువంటిదో, ఆమె ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో సాధించిన విజయాలు ఏమిటో ఈ సందర్భంలో గుర్తు చేసుకోవటం సముచితంగా ఉంటుంది. భారతదేశం యొక్క సమాజం లేదా సమాజాలు వేగంగా మారిపోతున్నాయని మేధావులు తరుచు అంటూనే ఉంటారు. పరిణామాలు ఏవి వచ్చినా వాటి ప్రభావం రచయి(త్రు)తల మీద ఉండకుండా ఉండదు. భారతీయులుగా, ఆసియావాసులుగా, ఈ భూగోళం మీద నివసించే మానవులుగా తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించటమే భారతి ధ్యేయం. ఈ ధ్యేయం నెరవేరటంలో భారతికి రాసే వారందరి సహాయసహకారాలూ లభించగలవని ఆశిస్తున్నాము.



పరిచయాలు

బలివాడ కాంతారావు గారి పుట్టిన తేదీ : 3-7-1927. ఊరు : మదపాం గ్రామం శ్రీకాకుళం జిల్లా. ప్రస్తుత వునికి : 42, శాంతినగర్, విశాఖపట్నం-6. ఉద్యోగం : నేవల్ ఆర్మమెంటు సప్లయి ఆఫీసరుగా 1-7-1985 న ఉద్యోగ విరమణ చేసారు.

రచనా వ్యాసంగం : 1947 నించీ చేస్తూ యిప్పటివరకు యిరవై నవలలు రెండు వందలకు పైగా కథలు, ఐదు నాటకాలు, నాటికలు రాసారు.

అనువాదాలు : 1. ఆంధ్ర వార పత్రికలో ధారా వాహికంగా ప్రచురింపబడిన నవల 'దగాపడిన తమ్ముడు' నేషనల్ బుక్‌ట్రస్టువారిచే మిగతా భారతీయ భాషల్లోనికి అనువదింపబడింది.

2. గుడ్డి సంగీత విద్వాంసునికి, మూగ ప్రియురాలు యితివృత్తంగా రాసిన 'ఇదే నరకం – ఇదే స్వర్గం' నవల హిందీలోనూ యింగ్లీషులోనూ ప్రచురింపబడింది.

3. మన్ను తిన్న మనిషి కన్నడంలో 'సంపంగి' హిందీలో.

4. 'అడవి మనిషి' నాటకం ఆలిండియా రేడియోలో నేషనల్ ప్రోగ్రాంలో అన్ని భాషల్లో ప్రసారం.

5. అన్ని భారతీయ భాషల్లోనికి కొన్ని కథలు.

అవార్డులు : 'పుణ్యభూమి' నవలను ఆంధ్రప్రదేశ్ సాహిత్య యకాడమి 1972 బహుమతి.

పరిశోధనలు: ఆంధ్రా యూనివర్సిటీలో యితని నవలమీద నాగార్జున యూనివర్సిటీలో యితని కథల మీద ఎం.ఫి.ల్. కోసం పరిశోధనలు జరుగుచున్నవి. ●

జననం, స్వస్థలం - ప్రస్తుత నివాసం : వరంగల్. క్వాలిఫికేషన్స్ : బి. టెక్ (మెకా), ఎం. ఐ. ఎస్. టి.ఇ, వృత్తి : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో లెక్చరర్ ఉద్యోగం. సైంటిఫిక్ ఫిక్షన్ పేరుతో అనవసరమైన చెత్తను, సస్పెన్స్ పేరుతో సెక్స్‌తో కూడిన జుగుప్సను పత్రికలో కుమ్మరిస్తున్న ఈ సంధి కాలంలో - వీటన్నింటి కన్నా మనిషికి అవసరమయిన తనను తాను తెలుసుకునే జ్ఞానాన్ని, చుట్టూ వున్న పతనావస్థలోని సామాజిక స్థితిని, వాటి విశ్లేషణనూ అందజేయాలన్న తపనతో "—" నవల రాస్తున్నాను.

రామాచంద్రమౌళి ●

శ్రీ **ముసునూరి సాంబశివ రామమూర్తి** గారు 1904లో ద్రాక్షారామంపక్క ఎర్రపోతవరంలో జన్మించారు.

జాతీయోద్యమంలో పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ వృత్తి చేసి ఉద్యోగవిరమణ గావించారు. కొంతకాలం చక్కెరమిల్లులో కూడా పని చేశారు.

వీరు రచించిన నాటకాలు, "అభ్యుదయము, లవకుశ," ఖండకావ్యాలు– "దివ్య సందేశము, మిథునాదర్శము."

చారిత్రక పరిశోధకులుగా, శాసన పరిష్కర్తలుగా శ్రీ సాంబశివరావుగారు పాఠకులకి సుపరిచితులు. శ్రీ తురగా కృష్ణమూర్తిగారితో కలిసి ఎన్నో శాసనాలు ప్రకటించారు.

"82 ఏండ్ల జరాభారము పైబడినను నా చారిత్రిక పరిశీలనాభిరుచిని వీడక" ఉన్నట్లు శ్రీ సాంబశివరావుగారు తెలియజేస్తున్నారు. ●

పుట్టింది ఖమ్మంజిల్లా, గొల్లపూడిలో 1952లో. చిన్ననాడు నాన్న పోతన్న భాగతంలోని పద్యాలు శ్రావ్యంగా చదివే రోజుల్లో తెలుగు సాహిత్యం పట్ల అభిలాష ఏర్పడింది. 'భారతి' పత్రికే నన్నొక రచయితగా, కవిగా పాఠకలోకానికి పరిచయం చేసి వెలుగులోకి తీసుకువచ్చింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం. ఏ. తెలుగు, హిందీ భాషలలో - ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగం.

భారతి, స్రవంతి, తెలుగు విద్యార్థి, ఆంధ్రజ్యోతిలలో కవిత్వం, వ్యాసాలు ప్రచురింపబడుచున్నవి. ఇంకా పుస్తకరూపంలో ఏవీ రాలేదు.

కావూరుపాపయ్యశాస్త్రి ●

శ్రీ **శంకరగంటి రంగాచార్యులు** గారు ఈ కింది విధంగా రాసి పంపారు.

నా జన్మదినం 13-1-1928 మా స్వగ్రామం శంకరగల్లు, అనంతపురం జిల్లాలోని మడకశిర తాలూకాలో ఉంది. 1953 నుండి అనంతపురం జిల్లా పరిషదున్నత పాఠశాలల్లో 7 ఏళ్ళు బి.ఇడి. ఉపాధ్యాయుడుగానూ, తదుపరి ప్రధానోపాధ్యాయుడుగానూ సేవ చేస్తున్నాను. ప్రస్తుతం రాళ్ళహళ్ళి పరిషదున్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడిని, శంకరగంటికి రాళ్ళహళ్ళికి మధ్యదూరం ఒకే ఒక మైలు.

నా మాధ్యమిక పాఠశాల చదువు మడకశిరలోనూ, తరువాత చదువు అనంతపురంలోనూ కొనసాగింది. స్నాతకోత్తర పట్టాలేవీ సంపాదించలేదు. బోధనాభ్యసన పట్టా తప్ప.

శ్రీమాన్ తిరుమల రామచంద్రగారు మా పెదతల్లి కుమారులు. కళాశాల అధ్యయన దినాల్లో నన్ను పుట్టపర్తివారి, 'సంపత్'గారి రచనలు బాగా ఆకట్టుకున్నాయి. ఆంధ్రభాషా సాహిత్యాలంటే నాకు అపారమయిన అభిమానం. నాకు గురుపరంపరలేదు. కోన శిష్యోవహం సర్వలోకానం'.

మా పల్లె కర్ణాటక రాష్ట్రసరిహద్దుల్లో ఉంది. కాన చిన్నతనం నుంచి కన్నడం నాకు తెలుసు. పది పన్నెండేళ్ళుగా కృషి చేస్తున్నాను. ఆంగ్లం పాఠశాలలోనూ అధ్యయనం చేసిన భాష కనుక ఆ సాహిత్యాన్ని అంతో ఇంతో చదువుకున్నాను. కాళిదాసు భవభూతుల రచనలనీ, శ్రీమద్వాల్మీకి రామాయణాన్నీ మూలంలో చదవాలని పట్టుబట్టి సొంతంగా కొంత సంస్కృత భాషా పరిచయాన్ని కలిగించుకున్నాను. తెలుసునని చెప్పుకోదగినంతగా తమిళం తెలియదు. గురుముఖతః శాస్త్రీయంగా ఏ భాషనూ అధ్యయనం చేయకపోవడంవల్ల తలస్పర్శి పాండిత్యం ఎందులోనూ లేదు. కాని నాలాంటి వాళ్ళు కూడా తమ భాషకు సేవ చేయవచ్చునని నా విశ్వాసం. 'ఉడుతాభక్తి'గా ఆంధ్ర భాషా సరస్వతికి సేవ చేయాలని నా సంకల్పం.

నాకు తెలిసిన భాషలోని ఉత్తమోత్తమ గ్రంథాలను పఠించడం నాకున్న ఒకే సద్వ్యసనం ! 'స్వాంతస్సుఖాయ' కవితలు వ్రాసుకొంటూంటాను. మిత్రులతో భాషా సాహిత్యాలను గురించి చర్చించడమంటే చాలాప్రియం.

ఆధునిక ఆంధ్రకవులెవరూ 'సానెట్'ను వ్రాయడానికి ప్రయత్నించలేదు. ఎందుకో తెలియదు. నేను ఏబదికి పైగా 'సానెట్లు' వ్రాశాను. 'సానెట్లు' పుట్టుపూర్వోత్తరాలను గురించి పీఠికగా ఒక సమగ్ర వ్యాసం వ్రాసి వాటిని పుస్తకంగా ప్రచురించాలని నాకు చాలా ఏళ్ళుగా ఒక కోరిక ఉంది. ఇంతవరకూ నా రచనలేవీ పుస్తకరూపం ధరించలేదు.

ఆంధ్ర కన్నడ జైమిని భారతాలను గురించి ఒకతులనాత్మక పరిశీలన చేయాలని నాకు వాంఛకలదు.

డా.కె.వి. పుట్టప్పగారి 'ఆచార్యకృతి' (మాగ్నమ్ ఓపస్)– 'శ్రీరామాయణ దర్శనం' (ఇది కన్నడంలో జ్ఞాన పీఠ బహుమతిని పొందిన మహాకావ్యం)ను తెనిగించితే, తెనుగు భాషకు ఒక గొప్ప సేవ చేసినట్లవుతుందనీ, అలా చేస్తే జన్మ చరితార్థ మవుతుందనీ నా అంతరాత్మ నాకు ప్రబోధిస్తోంది.

డా. మాస్తిగారి కన్నడ కథాకావ్యం 'గౌరమల్లి'ని తెనిగించాలని కూడా ఆరాటపడుతున్నాను.

భగవంతుడు నాకు ఆయురారోగ్య మనః ప్రసాదములను ప్రసాదిస్తే వీటిలో కొన్నింటినైనా చేయగలనని నా నమ్మిక. ●

డా. మిరియాల రామకృష్ణ గారు 1934 లో పశ్చిమగోదావరి జిల్లా తొలెరులో పుట్టారు. పి. హెచ్. డి. తీసుకున్నారు. తణుకు ఎస్. సి. ఐ. ఎమ్. ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖకు అధిపతిగా ఉంటున్నారు. వీరి పుస్తకాలు పది ప్రచురించబడ్డాయి. శ్రీ రామకృష్ణ వివిధ సమావేశాలలో పాల్గొన్నారు.

"శ్రీశ్రీ మీద పరిశోధన మొదలెట్టినప్పుడు నేను మళ్లీ విద్యార్థినయ్యాను....ఎన్నో చదివిన కవిని గురించి పరిశోధించ బూనుకోవడం గొప్ప సాహసం, సాహసం లేనిది జీవితం లేదు; విజయం లభించదు." అని శ్రీ రామకృష్ణ అంటున్నారు. ●

జంతుశాస్త్రంలో ఎమ్. ఎస్‌సి (కాశీ విశ్వవిద్యాలయం) జననం. 1-3-1929. ధూడుగుల విశాఖజిల్లా.

ప్రస్తుతం అద్దంకి (ప్రకాశం జిల్లా)కె. ఆర్. కె. ఆర్. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ పదవి నిర్వహిస్తున్నాను. సుమారు 35 సంవత్సరాల పాటు అధ్యాపకునిగా ప్రిన్సిపాల్‌గా 6 సం. ఉన్నాను.

అనేక రచనలు–వ్యాసాలు పుస్తకాలు– ప్రచురణ అయ్యాయి. పుస్తకాలు 30 వరకు ఉంటాయి. ఇంకా రాబోతున్నాయి. చిన్నా పెద్దా వ్యాసాలు 150–160 వరకు ఉండవచ్చు. ప్రసిద్ధ ప్రచురణ సంస్థలు, తెలుగు అకాడమి, నేషనల్ బుక్‌ట్రస్ట్, తెలుగుభాషా సమితి ఆంధ్రప్రదేశ్ అకాడమి ఆఫ్ సైన్సెస్, తెలుగు ఉర్దూ అకాడమి వంటివి నా పుస్తకాలు ప్రచురించాయి. ప్రముఖ పత్రికలు నా వ్యాసాలు ప్రచురించాయి. గతంలో ఆంధ్ర సచిత్ర వార పత్రిక "రంగుల రాట్నం శీర్షికన నా చిన్నవ్యాసాలు సుమారు వంద ప్రచురించింది ఇది నా రచనారంగంలో హైలైట్.

విజయవాడ, హైదరాబాద్ విశాఖపట్టణం, కడప రేడియో కేంద్రాలు 50 వరకు నా ప్రసంగాలను ప్రసారం చేసాయి. ప్రపంచ మహాసభలలో 1975 లో ఒక ఉపన్యాసం ఇచ్చాను. ఇతరత్రా శాస్త్రీయ విషయాల మీద సమావేశాలలో ఉపన్యసించడం హాబీ . విరివిగా ఈ కార్య క్రమంలో పాల్గొన్నాను. అనేక విద్యా సంబంధ కార్యకలాపాల్లో పాల్గొన్నాను.

నేను రచించిన ఒక గ్రంథానికి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం రు. 1000 బహుమానాన్ని ఇచ్చింది. 1982–83 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయులలో ఒకనిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సన్మానించింది.

జమ్మి కోనేటిరావు ●

డా॥ పి. బి. శ్రీనివాస్

శ్రీమతి వీణాగాయత్రి

"మా అమ్మాయి వీణకచ్చేరీ"కి మీరు తప్పకుండా రావాలి శ్రీనివాస్‌గారూ! విని ఆశీర్వదించాలి" అని ఆప్యాయంగా ఆహ్వానించారు అశ్వత్థామ నన్ను. నన్ను చిత్రసీమలో అధికంగా ఆదరించిన అనుపమ సంగీత దర్శకులలో అశ్వత్థామగారు చాలా ముఖ్యులు. తనుకట్టిన వరసలకి సంపూర్ణ న్యాయం చేకూర్చగల గాయకుడినిగా, నన్ను వారు చాలా అభిమానించేవారు. చిత్రసంగీతంలో కూడా శాస్త్రీయ సంగీతపు బాణీలకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు. ఆయన స్వతః మంచి వీణా విద్వాంసులు. ఆయన సతీమణి శ్రీమతి కమలా అశ్వత్థామకూడా వీణావాదన ప్రవీణురాలు. మరి అలాంటి కళాప్రావీణ్యంగల దంపతుల అనుగు పుత్రిక చిన్ననాటనే వీణ కచ్చేరీ ఇవ్వడంలో ఆశ్చర్యమేముంది? అయినా ఆశ్చర్యపోయాను. ఎందుచేతనంటే నేను కచేరికి వెళ్ళేసరికి ఆ అమ్మాయి వీణ వాయించడం ఆరంభించి అరగంటకి పైనే కాగా అద్భుతంగా వాయించేస్తోంది. వీణవెనక కూర్చున్న చిన్నపిల్ల కనిపించడంలేదు. గాని, వీణపై ఆ పిల్ల వాయిస్తున్న కీర్తన అతిశ్రావ్యంగా, అమోఘంగా, అద్భుతంగా వినిపిస్తూవుంది. నా కనుల్ని చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. "అన్‌డౌటెడ్లీ, గ్రేట్ ప్రాడిజీ" అని నాలోనేనే అనుకుంటూ అశ్వత్థామగారు చూపించిన పక్కసీటులో కూర్చున్నాను. ఆ కూర్చున్నవాణ్ణి అలా కచ్చేరి అయిన పిదపకూడా కూర్చుండిపోయే వున్నాను. "అమ్మాయి కచ్చేరీ గురించి ఏమిటి అభిప్రాయం" అని అడిగింది ఆయన కనుబొమలనెత్తి చూసినచూపు. వండర్‌ఫుల్ " అని అనుకోకుండానే తమంతతామే ఆంగ్లవిశేషణాలు నా పెదవులనుండి హృదయానందంతో వెలువడ్డాయి. ఆ అమ్మాయిని కన్న అశ్వత్థామ ధన్యజీవి అనిపించింది నాకు. ఆ చిన్నారి చిరంజీవి పేరే "గాయత్రి!"

గాయత్రిని గురించి నేనువాడిన విశేషణాలు వినగానే అశ్వత్థామ హృదయంలోని సంతృప్తి ఆయన కళ్ళలో మెరిసింది. నా రసజ్ఞతపైన ఆయనకి అంత మహాభిప్రాయం.

నాటి బేబీ గాయత్రి క్రమంగా కుమారి గాయత్రియై నేడు శ్రీమతి ఈ. గాయత్రీ రామకృష్ణ (భర్త)గా అభివృద్ధి పొందింది. వయస్సులోనూ మనస్సులోను ఎంత వృద్ధి పొందిందో అంతకంతగా వీణావాదన కళలో వృద్ధిపొంది క్రమక్రమ ప్రగతిసాధించి నేడు కీర్తిశృంగాన్ని అందుకుని, విదేశపర్యటనలు కావిస్తున్న మనవీణా విదుషీమణిగా రూపొందింది.

1959వ సంవత్సరములో నవంబరు తొమ్మిదవతేదీన జన్మించిన గాయత్రి తన ఆరవయేటనే వీణపై స్వరాలు పలికించడం మొదలుపెట్టింది. పూజగదిలో. గంటలతరబడి కూర్చుని, వీణ వాయించడంలో తన్మయురాలై వుండేది. ఆ తన్మయతని ఎవరు భంగపరచినా బాధపడి కన్నీరుకార్చేది. వీణపై ఆమెకుగల మక్కువని గుర్తించిన అశ్వత్థామ తన కూతురిచేత నిర్విరామంగా సాధకం చేయించడం మొదలుపెట్టారు. తలిదండ్రులే తొలిగురువులు ఆ చిన్నారిపొన్నారికి. గాయత్రి తన తొమ్మిదవ ఏటనే తిరువళ్ళిక్కేణిలోగల శ్రీ పార్థసారథి స్వామి సంగీతోత్సవంలో ప్రత్యేకంగా పాల్గొనేందుకని ఆహ్వానింపబడిన అదృష్టవతి.

ఆ ఉత్సవంలో గాయత్రి వీణావైదుష్యాన్ని వేనోళ్ళ వినుతించిన సభాసభ్యుల కోరికపైన తన పదకొండవఏట 1970లో సంపూర్ణమైన సంగీతకచ్చేరి యిచ్చిన మెచ్చదగిన అపూర్వమేధావి గాయత్రి. ఆనాటినుండి నేటివరకూ ఎన్నో సోపానాలు అధిరోహించి 1600 సంగీతకచ్చేరీలకు పైగా జరిపిన ఘనత గాయత్రికి దక్కింది.

గాయత్రి సంగీత పాండిత్యాన్ని గుర్తించి ప్రజలు, పత్రికలు ప్రశంసాసుమ వర్షం కురిపిస్తూ బిరుదులూ, బహుమానాలు ఇచ్చి సన్మానాలూ జరిపిస్తున్న సత్యం సంగీతాభిమాను లందరికీ తెలిసినదే. బేబీ గాయత్రిగా వీణా విద్యవలన ప్రసిద్ధికెక్కిన గాయత్రి నేడు వీణా గాయత్రిగా అభినందింపబడుతూ సంగీతాభిమానుల సర్వతోముఖాదరాభిమాన ప్రోత్సాహాలనందు కుంటున్నారు. వయస్సు 26 ఏళ్ళ ప్రాయం అయినా వాదన ప్రావీణ్యంలో 62 ఏళ్ళను మించిన పరిపక్వదశ నేటి గాయత్రిది.

ఆమధ్యన అనగా కొన్ని నెలల్రకితం నారదగాన సభవారి ఆధ్వర్యాన మ్యూజిక్ ఎకాడమీ కాంప్లెక్సులో జరిగిన గాయత్రి వీణకచ్చేరి వినేందుకు ప్రత్యేకమైన ఔత్సుక్యంతో వెళ్ళాను. సంగీతకళలో ఆమ సాధించిన ప్రగతికి ఆశ్చర్యానంద మగ్నుడనై అభినందన లేఖకూడా వ్రాసి పంపాను. ఆమె ఎన్నుకున్న అంగాల వైవిధ్యాన్ని బట్టే ఆమె పెంపొందించుకొన్న వైదుష్యాన్ని సులువుగా ఎవరైనా గుర్తింపగలరు.

ఆమె వీణ వాయించే విధానమే చాలా విచిత్రమైనది. తంత్రుల్ని మీటే అంగుళులు తప్ప, శరీరం ఏ మాత్రం కదలదు. వీణవాయిస్తున్న విద్వాంసురాలు, మనిషో ప్రతిమో సందేహం వచ్చేరీతిగా, కదలక అలయక, తన మనోధర్మపు పోకడలో రాగతాళలయ భావవిన్యాసాలలో పారంపర్యానికి ప్రాధాన్యమిస్తూనే, నవ్యపద్ధతుల్నికూడా అవలంబించే శ్రీమతి గాయత్రి మహా చతురమతి, అపార ప్రతిభావతి, అమలప్రభావతి.

ఓసారి మహామహోపాధ్యాయ పద్మశ్రీ డా॥ ఈమని శంకరశాస్త్రిగారితో నేను సంభాషిస్తున్న సమయాన, గాయత్రి గురించి ప్రస్తావించగా ఆ అమ్మాయి గిటారు వాయిస్తూ ఇంగ్లిష్ పాటలు పాడగా విన్నావా! అద్భుతంగా పాడుతుంది అన్నారు.

నాకది స్ట్రైకింగ్‌న్యూస్. ఈ మధ్యన నేనోరోజున ఈ విషయం ముచ్చటించి ఒక ఆంగ్ల గీతాన్ని వినిపించమనికోరగా, స్త్రీ జనసహజమైన సిగ్గూ వినయం చిరునవ్వులో ప్రతిబింబిస్తూండగా తటాలున గిటారుతీసుకుని ఆమె పాడిన ఇంగ్లీష్ పాట నన్ను విస్మయచకితుడిని కావించింది. శ్రుతిలయలు పోటీ పడుతుండగా ఒకవిధమైన హస్కీవాయిస్‌లో గాయత్రి పాడుతుండగా విస్కీతాగని నేను తాగినంతగా మత్తులోమునిగితేలాను. ఆమె గాత్రమాధుర్యతరంగిణిలో ఓలలాడుతూ.

మాయింటి మేరేజి రిసెప్షన్ సందర్భాన పతిసమేతురాలై విచ్చేసి గాయత్రి పాడిన "ఎంతమధురసీమ" అనే చిత్రగీతం నన్నెంతైనా ఆకర్షించింది. ఎస్. జానకీ నేనూ దేవాంతకుడు చిత్రానికై పాడిన యుగళగీతమది. స్వరపరచిన సంగీత విరించి, గాయత్రిని సృజించిన అశ్వత్థామగారు.

ఆమె కంఠస్వరంలో పలికిన సంగతులు మంచి " సంతులనం " కలిగివుండడం గమనించిన నాకు ఆమెచేత కేసెట్టుకి కొన్నిపాటలు పాడించాలనే కుతూహలం కలిగింది. ఆ కుతూహలపరిణామమే నేనూ గాయత్రీ పాడిన "దశగీతగీత సందేశం." గీతరచనా, సంగీతరచనా, నావే. నిజంగా చాలా చక్కగా పాడారు. శ్రీమతి గాయత్రి తనదే ఐన బాణీలో. ఈ వీణాగాన విదుషీమణి సంగీతరచనలో కూడా సిద్ధహస్తురాలు

జయదేవుడి అష్టపదులలో ఒక ప్రశస్తమైన అష్టపది, బహుళ ప్రజాదరణ పొందినది. ఆ అష్టపదిని సంగీతరచయితలూ, గాయనీగాయకులు తమతమ బాణీలలో, తమతమ వరసలలో ట్యూన్స్ పాడడం పరిపాటి. ఒకనాడు మంచి మూడ్‌లో అశ్వత్థామ ఈ అష్టపదిని తనుకూర్చిన రాగధోరణిలో తనలో తనుపాడుకుంటూ వుండగా, వచ్చివిన్న గాయత్రిని "ఎలావుంది." అని ప్రశ్నించారు. "పరవాలేదు" అని గాయత్రి తమ అభిప్రాయాన్ని నిర్భయంగా వెలిబుచ్చారు. ఇది ఆమె

స్వభావం. మనసులోని మాటని మార్చకుండా ఉన్నదున్నట్లు చెప్పగలిగే ధైర్య స్థైర్యాలు గాయత్రికి అబ్బిన వరాలు,

ఆమె అభిప్రాయాన్ని విన్న అశ్వత్థామ "ఏదీ ఈపాటకి నువ్వేవరస కడతావో కట్టి పాడి వినిపించు చూద్దాం మరి?" అని ఒకవిధమైన సవాల్ విడిచేసరికి దేనికీ బెదరని గాయత్రి "ధీరసమీరే" అని ఆలాపిస్తూ అప్పటికప్పుడు తనకితోచిన వరస "యమన్‌కల్యాణి రాగంలో కూర్చి, పాడివినిపించేసరికి ముగ్ధులైన అశ్వత్థామ ఎంతగానో అభినందించారు. తమకూతురి సంగీతరచనా ప్రాభవాన్ని. ఈ అష్టపదిని కొలంబియా రికార్డుకై 1977లో వీణపై పలికించారు గాయత్రి.

అట్టి బహుముఖ ప్రజ్ఞాశాలిని అయిన గాయత్రి కర్ణాటక, హిందూస్థానీ, పాశ్చాత్య సంగీత పద్ధతులలో పర్యాప్తపాండిత్యం పెంపొందించు కున్నారు. కానీ హిందూస్తానీ సంగీతంపైన కన్నా కర్ణాటక పాశ్చాత్య సంగీతాలపైన గాయత్రికి ఎక్కువ మక్కువ.

అలాగే ఇంగ్లీష్ నవలలలో రొమాంటిక్ నవలలు, క్రైమ్స్ ప్రధానాలైన నవలలూ గాయత్రిని అధికంగా ఆకర్షిస్తాయి. ప్రఖ్యాత నవలా రచయిత "సిడ్నీ షెల్‌డాన్" కథలూ, ఆయన కథావిధానం అంటే గాయత్రికి ప్రత్యేకాభిమానం అవి చదివిన స్ఫూర్తితో ఆమధ్య ఆమె రచించడం ప్రారంభించిన ఒక కథని నాకు వినిపించగా, ఆమె ప్రతిభని మెచ్చుకోకుండా వుండలేక పోయాను. త్వరలోనే ఆ కథని పూర్తి చేయమని కలిసినపుడల్లా జ్ఞాపకం చేయటం అలవాటయింది నాకు. కాని కవితలు చదవటంలో ఈమెకి అంతటి ఆసక్తి లేకపోవడం ఆశ్చర్యకరమే.

పాకవిద్యలో గాయత్రి నేర్పరి. చక్కని అభిరుచిగల కళాకారులకి ఏకళలోనైనా ప్రావీణ్యం ఇట్టే లభించగలదనడానికి గాయత్రి బహుముఖ ప్రతిభ ప్రముఖ నిదర్శనం.


శాస్త్రీయ సంగీతంపట్ల గల అధిక శ్రద్ధవలన ఈనాడు సినిమాలకై వీణ వాయించడం కుదరకపోయినా, మొదట్లో గాయత్రి చిత్రసీమని ఏమాత్రం చిన్న చూపు చూడలేదు. తనతండ్రి సంగీత దర్శకత్వంలో మాత్రమే కాకుండా ప్రఖ్యాతులైన పలు సంగీత దర్శకుల సంగీత రచనలకికూడా, గాయత్రి తన వీణావాదన సహకారం అందించారు కొన్ని సంవత్సరాల పర్యంతం.


1979 మార్చి రెండవ తేదీన వివాహిత అయిన వనితగా గాయత్రి గృహిణిగానూ, కళాకారిణిగానూ సంతృప్తిభరిత! భర్త "రామకృష్ణ" షిప్ (నౌకా) విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి అనుభవం గడించి ప్రస్తుతం "గ్రాంకి" ఎనర్జీకేర్ ఎడ్యుకేషన్ సెంటర్ అనే పేరున తమ స్వంత సంస్థకి అధికారిగా వ్యాపార నిర్వహణ సలుపుతున్న కార్యదక్షులు. ఆయన షిప్‌లో పనిచేస్తున్నరోజుల్లోనే గాయత్రికి, "ఆస్ట్రేలియా" దేశదర్శన ప్రాప్తి కలిగింది. ఆమెకది కళాకారిణిగా కచ్చేరియిచ్చేందుకే కాకుండా, వ్యక్తిగతమైన అభిలాషా ఫలితంగా అధ్యయనార్థం చేసివచ్చిన ఫారిన్‌ట్రిప్ (విదేశయాత్ర) ఆమె తమ జీవితంలో కావించిన ప్రప్రథమ విదేశయాత్ర సింగపూర్, మలేషియాల్లో తమ వీణా కచ్చేరీలు జరిపించిన సుసందర్భాన అక్కడి తమ అభిమానుల్నీ యితర రసజ్ఞ ప్రముఖుల్నీ ఆమె ఎంతైనా అభిమానించి అభిమానిస్తారు. తమ రసజ్ఞాభిమానుల ఆదర ప్రోత్సాహం వలననే తమకు సంగీత క్షేత్రంలో పలు విజయాలు చేకూరాయి అని ఆమె సంపూర్ణ విశ్వాసం. తమ అభిమానుల ఉత్తమ రసజ్ఞతని మెప్పించగల తమ ప్రతిభని పెంపొందించుకునేందుకై గాయత్రి ఈ నాటికీ తమ నిత్యకృషిని మానకుండా అతోఽధికంగా సాగిస్తూండడం ఎంతైనా అభినందనీయం ఏ ఆర్టిస్టుకిగాని, ఎంత ఔన్నత్యానికి ఎదిగినాగాని ఎక్కవలసిన మెట్లు కోట్లు మిగిలి ఉంటాయి గనుక, నిర్విరామ కృషిని నిలిపివేసిన పక్షాన, ఆ ఆర్టిస్టు తను సాధించవలసిన, సాధించ గలిగిన కళాజ్ఞానాభివృద్ధికి శాశ్వతావరోధం రూపొందడానికి, ఎంతైనా ఆస్కారం వుంది అనేది గాయత్రిని ముందంజ వేయిస్తున్న వినీతాభిప్రాయం.

సాటి కళాకారుల పట్ల సదభిప్రాయాన్నే సదా కలిగి ఉండడం అనేది చాలా కొద్ది మంది ఆర్టిస్టులకి మాత్రమే అబ్బే విశిష్టగుణం. అందుచేతనే ఓరోజు తమ సహోదరి శ్యామల వీణకచ్చేరీ శంకరదాస్ ఆడిటోరియంలో జరపనున్న సందర్భాన తరవాత కచ్చేరీ యిచ్చే అపారమేధావి అయిన 12 ఏళ్ళమాష్టార్ యు. శ్రీనివాస్ మేండొలిన్ పైన కర్నాటక శాస్త్రీయ సంగీతాన్ని నమ్మలేనంత మహాద్భుతంగా వినిపిస్తున్నారని, తప్పకుండా వుండి వినదగిన సంగీతమనీ, నాతో విశాలహృదయంతో చెప్పారు. ఆనాడు శ్యామలకూడా చాలాబాగా వాయించారు వీణ. తరవాత శ్రీనివాస్ కచ్చేరీ ఒక పావుగంటసేపు విని వేరే అర్జంటు పనికోసం బయలుదేరి వెళ్దామనుకున్న నేను అతడు వాయించిన ఖరహరప్రియ రాగం విని మంత్రముగ్ధుడనై కచ్చేరీ సాంతం విని ఆ బాలుడిని అభినందించి మరీ బయల్దేర గలిగాను. గాయత్రికి గల రసజ్ఞతని మనసారా అభినందించాను. తమకి పోటీకాకున్నా సాటి కళాకారుల గురించి సదభిప్రాయం వెలిబుచ్చే ఉదారహృదయులు రానురానూ అరుదై పోతున్న ఈ కలియుగాన గాయత్రివంటి మంచిమనసు గలవారు దినదినాభివృద్ధి పొందితీరుతారు.

ఒకింత దీక్షతో గాన విద్యా సాధన సాగిస్తే, అతి త్వరలో మేటి గాయనీమణిగా కూడా రాణించగల బహుముఖ కళా ప్రతిభా ప్రభావాణి శ్రీమతి గాయత్రి. అమె శ్రీయుత విద్యా గంగోత్రి." వీణ పైననే, తమ ధ్యానాన్ని కేంద్రీకరిస్తున్న గాయత్రి. ఇటీవల గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆహ్వానంపై ఫ్రాన్స్ దేశంలో పారిస్ నగరంలో జరుగుతున్న భారతీయ సంగీతోత్సవాల సందర్భాన,తమ వీణాగాన ప్రావీణ్యాన్ని పైదేశాలవారికి గూడా నిరూపించేందుకు భర్తతో సహా పర్యటిస్తున్నారు. అనుకూలుడైన భర్తనుపొందే భాగ్యంలో గాయత్రీశ్యామలా సహోదరీమణులిద్దరూ అదృష్టవంతులే. ఈ రామకృష్ణ, కే. జి. నటనానీ అనే తమ తమ భర్తల రసజ్ఞతా ప్రోత్సాహం వల్లనే తమ ప్రియ కళా

(73 వ పేజి చూడండి)







అన్నపూర్ణ

బలివాడ కాంతారావు

శ్రావణ మంగళవారం. ఆ వేళ రాత్రి స్నేహితుని సాగనంపటానికి భోజనాలయ్యాక స్టేషనుకు వెళ్ళాడు వీరభద్రరావు.

ఇంతలో బుచ్చిబాబు యింటికి చేరుకున్నాడు. భోజనందగ్గర వదిన మరిదిని ప్రశ్నించింది "రేపు వాళ్ళకేదో కబురు చెప్పాలి—ఏం ఆలోచించారండి బుచ్చి ?"

"చెప్పవలసిందేదో ఇదివరకే చెప్పాను"

"బాగా ఆలోచించండి ఊర్లో సంబంధం కష్టసుఖాలకి కాస్త చేదోడు, వాదోడుగా వుంటారు."

తడుముకోకుండా ధృఢమైన గొంతుకతో "నాకిష్టం లేదండీ వదినా" అన్నాడు.

అన్నపూర్ణ మనసు బాధపడినా సర్దుకుని "మీ అన్నయ్యగారికి ఆ సంబంధం చాలా యిష్టంగా ఉంది. మనకు కావాల్సిన అన్ని హంగులున్నాయ్ ..." కాసేపు సాలోచనగా ఆగి నెమ్మదిగా "మీరు ఒకింటి వారైతే లక్ష్మి పెళ్ళికూడా చెయ్యొచ్చు ?...."

లోపల రహస్యాన్ని యీ చివరిప్రయత్నంలో వెళ్ళగక్కింది. కాని యీ మాటలు అన్నాక మరిది ముఖంలో యేవగింపు చూస్తూనే వుంది. చప్పన "వాళ్ళ ముక్కుపిండా ?" అన్నాడు బుచ్చిబాబు మన ముక్కు పిండేవాళ్ళు లేకపోతే-మనం ఇంకోళ్ళ ముక్కు పిండేవాళ్ళమే కాదు. అయినా మీకు తెలియని యేం ఆస్తిపాస్తులున్నయ్ అమ్మి చెయ్యటానికి ...."

వదిన నెమ్మదిగా ఆడిన యీమాటల్లో సత్యా "సత్యాలు వితర్కించే అవసరం లేనట్టే "కాదంటే అలా చదివించేవచ్చు." అన్నాడు.

"పెద్దచదువులు చదివి ఏం ఉద్యోగం చెయ్యాలి?"

"చెయ్యవలసివస్తే చేస్తుంది. అది స్వతంత్రంగా బ్రతికితే...." వాక్యం సగంలో ఆగిపోయాడు. గదిలో పొంచి యీ మాటలు వింటున్న చెల్లెలు పెద్ద నిట్టూర్పు విడిచింది.

"మనవంశంలో ఆడవాళ్ళెవ్వరూ వుద్యోగం చెయ్యలేదు-' ఇంకా వదిన ఏదో అనబోతుంటే అడ్డొచ్చి "వంశమర్యాదను చూసుకుంటే యీ కాలంలో బ్రతకలేమండి వదినా!" అని కొంచెం ఆగి మళ్ళీ అన్నాడు "తెలివితేటలున్నప్పుడు చదివించడంలో తప్పేం వుంది?"

మనసులో పాతుకపోయిన ఒక గట్టి నమ్మకాన్ని ఛేదించేటప్పుడు పొందే బాధతో వదిన గింజుకుంటోంది. చివరి మాటలుగా ప్రశ్నించింది, "అయితే ఆశవదలుకోమంటారా? అని.

"నే నేదో తెచ్చుకుంటున్నాను నాకు పైవాళ్ళ డబ్బు అక్కరలేదు"

ఈ సమాధానం యిచ్చాక బుచ్చిబాబు లేచి పోయాడు.

ఈవేళ ఇంత పెద్ద తృణీకారం తట్టుకొనే నిగ్రహం కొంతసేపటికిగాని వచ్చిందికాదు. ఓర్పు కలిగి తొందర పడని మనిషి కాబట్టి "మంచిదండి" అంది.

వీరభద్రరావు వచ్చీ రావటంతో యిదేపనిగా ప్రక్కగదిలో నున్న బుచ్చిబాబుదగ్గరకు వెళ్ళి "రేపు వాళ్ళకు చెప్పొచ్చుగా" అన్నాడు. "వదినతో చెప్పానని గొణిగాడు బుచ్చి. రెండు గదులకు మధ్యనున్న గుమ్మానికి రెండువేపులా కాళ్ళదాచి నిలుచుని రెండో గదిలోఉన్న భార్యవేపు చూస్తూ "ఏం చెప్పాడే" అన్నాడు.

అన్నపూర్ణ జవాబీయలేదు. జవాబు ముఖంలో చూపించింది. గదిలో కూర్చుని "బుచ్చీ! ఇలా ఒకసారి రారా" అని శాసించాడు. తమ్ముడువచ్చి తలదించుకుని నిల్చున్నాడు.

"వాళ్ళకు మాట ఇస్తాను"

"అయితే నన్నడగడం దేనికి ?" అంటూనే అన్నాడు, "అడగక్కరలేకుండా చెయ్యొచ్చన్న మాటేనా ?"

ఈ ప్రశ్నకు జవాబు రాకపోవటంతో భద్రరావు వ్యాకులపడి కూర్చున్నవాడు లేచాడు. అన్నపూర్ణ అలానే పెరటి తలుపుకు చారబడి నిలుచుంది.

"ముఖం ముడుచుకునే బదులు ఏదో ఒకటి ఆహోరించు."

"నా కిష్టం లేదు"

కొంచెం కటుత్వం యీ సమాధానంలో చొప్పుకు పోవటంతో హతాశుడై "చూడే" అంటూ పెళ్ళాంవేపు తిరిగాడు- "మాటాడితే వెనకేసుకొస్తావ్. బుద్ధిజ్ఞానం వుండే మాటాడుతున్నాడా ?" కాస్త స్వరస్థాయి హెచ్చించి యీసడింపుతో "వెఱ్ఱి సంస్కారాలతో

ఖర్చు పెడుచేసుకోకురా! ఇస్తామని ముందుకొస్తుంటే పుచ్చుకోవటంలో ఏం తప్పులేదు.''

"కొందర్లేదు'' అంటూ మొండిగా తేల్చేసి ముఖం పెడగా త్రిప్పి రెప్పపాటున ప్రక్కగదిలోనికి వెళ్ళిపోయాడు తమ్ముడు.

ఇంతవరకు లొంగిఉండేవాడు యిలా సంచరించటంతో భరించలేని కోపానికి లొంగిపోయాడు భద్రం.

రొప్పుకొంటూ ఆ గదిలోనికివెళ్ళి ఆవేశపు అధారిటితో "ఈయింట్లో ఉన్నంతకాలం నీ యిష్టాయిష్టాలు పనికిరావు. నాకిష్టంగా వుంది చేసుకుతీరాలి''.

"చేసుకోను'' కటువుగా అన్నాడు తమ్ముడు.

"చేసుకుతీరాలి'' అన్నాడు అన్నయ్య.


తమ్ముని కళ్ళొక్కసారి చింతనిప్పు లయ్యాయి ఇన్నాళ్ళకి వుధృతంగా లేచినకోపంతో కుర్చీని గప్పున త్రోసి "చేసుకో నంటే చేసుకోను'' ఊర్ధ్వ కంఠంతో అరిచాడు.

అన్నయ్య పళ్ళపటపటా కొరికాడు. త్రోసివేసిన కుర్చీని కాళ్ళతోతన్ని పిచ్చివానిలా అరిచాడు. అన్నపూర్ణ అడ్డువచ్చింది. పోవే అంటూ పెళ్ళాన్ని ప్రక్కకు నెట్టివేశాడు. ఎనిమిదేళ్ళ నిండని కడసారపు చెల్లెలు అరుణ వదినను అన్నయ్య నెట్టివేయడంతో గట్టిగా యేడుస్తోంది. నాలుగేళ్ళపాప తల్లిచీరపట్టుకొని కళ్ళు నులుపుకుంటోంది. ఈ యేడుపుకు వుయ్యాలలో యేడుపు జతయింది. పదహారేళ్ళ పెద్దాడబడచు లక్ష్మి తలుపు చాటునుంచి చూస్తూ విషాద భారంతో అప్పుడప్పుడు కన్ల ఒత్తుకుంటోంది.

"నీకూ నాకూ యీవేళతో సరి. యెక్కడికి పోతావో పో'' భయంకరంగా వెళ్ళగ్రక్కాడు అన్నయ్య.

"పోతాను, నా అవసరం నీకేం-'' చంచలమైన మనసుతో వున్న అన్నపూర్ణ మరదినోరు చటుక్కున మూసివేసి చెయ్యిపట్టుకొని పెరటకు బలవంతాన తీసుకపోయింది.

పెనుతుఫాను వుధృతి యేర్పడ్డ ప్రశాంతతమల్లే యిల్లంతా మూగపోయినట్లుంది. సగం విరిగిన చెట్లలా అందరి ముఖాలు కాంతివిహీనమై బాధాయుతమై చెత్తగా వున్నాయ్.



నిండుయౌవ్వనంలో మల్లలా మనోహరంగా వికసించవలసిన లక్ష్మి మోము,యెన్నడూ వూహించటానికి కూడా ఆస్కారం లేనటువంటి కలత యీనాడు రేగటంతో, పూర్తిగా వాడిపోయింది మనసులోవున్న రహస్యాల్ని హృదయంలో దించుకున్న సుఖాంతమైన కోరికల్ని యీకయ్యం విఛ్ఛేదించింది. ఈ కలహానికి మూలకారణం తనే అనుకొని మెదడులో చిచ్చు పోసుకుంటోంది

అకస్మాత్తుగా రాజుకున్న యీ కలతవల్ల అన్నపూర్ణ చాలారాత్రివరకు రెప్ప వేయలేదు. రేపు తెల్లవారేసరికి యింట్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉంటుంది. చిరునవ్వుతో యెదురయ్యే మరది కనబడడు. అన్నపూర్ణ యింటిలో "అన్నమే కరువా'' అని వేళాకోళాలాడే బుచ్చిబాబు కనపడడు. పాలపళ్ళని వేళాకోళాలాడే భర్త అగపడడు. ఇనా అర్థం లేకుండా మారుతుందని ఆమె అనుకున్నా పూర్తిగా నిరాశ చెందలేదు. ఒకరి తత్వాన్ని పూర్తిగాతెలుసు. ఇంకొకరిమీద కోపం చూపించో, నాలుగు మాటలు

వడ్డించో పరిస్థితి చక్కబరచవచ్చు. ఆ ధైర్యంతోనే కాస్త మోగన్ను నిద్రచెందింది.

చిట్టి 'కీ' మంటుందే తెలిసచ్చింది. బుజ్జగించి నిద్రపుచ్చింది. భర్త యింకా యేదో చదువుకుంటూండడం గమనించింది. మెల్లగా ఆయనపాదాలచేరువలో కూర్చుని

"ఒక్క మాట అంటాను —"

భార్య స్వరం విన్నాక ఆమె వేపు చూశాడు.

"ఈవేళ మనల్ని యిరుగుపొరుగువారు మనుషుల్లా చూడలేదు—"

"అంతేగా" పుస్తకంమీద దృష్టి పోనిస్తూనే అన్నాడు.

"అత్తయ్య ఏం చెప్పారో జ్ఞాపకం తెచ్చుకోండి.

రుక్మిణమ్మ చివరిఘడియలు జ్ఞప్తికి రావటంవల్ల కాబోసు అక్షరాలన్నీ అలికినట్లు అగపడ్డాయి.



కొంతసేపయ్యాక నిశ్శబ్దాన్ని కలిబిస్తూ నెమ్మదైన స్వరం మాటలు జారుస్తోంది. "మనపిల్లలు తప్పు చేస్తే యెలా నచ్చచెప్తాం? వాళ్ళు అంతే మనకి"—

భద్రం పెదిమలు కదల్లేదు. పైకిలోకూడా అట్టే మార్పులేదు.

శోకమయమైనకంఠంతో "బుచ్చిని క్షమించకూ" అన్నది.

"వాడి విషయమే నాతో చెప్పక"

"నేను చెప్పకపోతే ఇంకెవరు చెప్తారు"

ఈ ప్రశ్నకు జవాబు చెప్పటానికి మాటలు దొరక లేదు. తను నిజం అనుకొని నమ్మిన విషయాన్ని భార్యతో చెప్దా మనుకొన్నాడు. కాని కొంతసేపటి వరకు మాటాడలేదు

"ఈవేళ జరిగిందంతా మరచిపోండి"

"వాడిమనసులో యేం వుందో ఆలోచించకుండా మాటాడకావే!"

అన్నపూర్ణ నోరుతెరచి భర్తవేపు ఆశ్చర్యంగా చూసింది.

"పెళ్ళి వద్దనటంలో వాడివుద్దేశం యేమంటావ్?"

"ఉద్దేశం ఏముంటుంది? మనకి గతిలేక కట్నం తీసుకుంటామని బలవంతం చేస్తున్నాం గానీ బుచ్చి ద్దేశ్యం మంచిది కాదంటారా?

వాడి వుద్దేశ్యం యింకా మన్కు తెలుసుకోలేదే. కట్నం పూర్లో సంబంధం అని వంకలు పెడ్తున్నాడు గాని.

"మనను పాడుచేస్తారని భయం ఉండేవుండొచ్చు. అయినా బుచ్చి చేతకానివాడా?"

"అసలు సంగతి అదికాదు. కట్నం రూపంలో వచ్చింది వీడికేం దక్కుతుంది? కట్నం పుచ్చుకొనని ఆ తప్పంతా వాడే అంకించుకోవాలని"

"ఛా ఛా...."

"ఛా ఛా యేమిటి- ఉన్నవాళ్ళు వస్తురూపంలో పిల్లకు ఆ దబ్బు ముట్టచెప్పకుండా వూరుకుంటారా?

అన్నపూర్ణ లేచి "మీ రెందుకలా అనుకోవాలి? బుచ్చి మీ మీద యింకోలా అనుకొంటే- మధ్యనున్న ఆడపిల్లల్ని యేడిపిస్తారు-"

"ఎవరైనా యెందు కేడవాలి?"

ఈ యేడముఖాలూ పెదముఖాలతో మమ్మల్ని ఏడిపించండి."

"మధ్య నువ్వెందు కేడవాలి? నీవు తెచ్చిన మూడువేలలో మిగిలింది వాడి చదువుకింద తగలేశావ్. వాడిచెయ్యి కలిశాక నోరుకట్టుకొని యీ రెండేళ్ళలో గడించింది యిలా పెళ్ళికింద తగలేయ్. యెవరొద్దన్నారు?" అంటూనే దీపంతగ్గించి లేచిపోయాడు. పరుపుదగ్గరకు వెళ్ళినా అన్నపూర్ణ యింకా అక్కడే కూర్చుంది రెండుమూడుసార్లు భార్యవేపు చూశాడు. ఆమె అలానే కూర్చుంది. కాని చీరకొంగుతో కళ్ళు ఒత్తుకోవటం చూశాడు.

"చాలా రాత్రయింది పడుకో" అన్నాడు. అన్న

పూర్ణ తలెత్తి చూసింది. ఎదురుగా భర్తనుచూసి చప్పున లేచిపోయింది. "మర్యాను నాకెందుకా నిష్ఠూరం నీ యిష్టంవచ్చినట్లు కానీ. నేనేవిధంగా అడ్డురాను" అన్నాడు.

ఈమాటలు విన్నాక ఆమె ముఖంలో వెలిగిన వెలుగు ఒకవిధంగా ఆయన దగ్గరగా రావటానికి తోడ్పడింది. భర్త వక్షంమీద పరిపూర్ణానందంతో వ్రాలిన ఆమెను అర్థంచేసుకున్నా నన్నట్లుగా ఆయన సంచరించాడు.

నిముషాలు దొర్లుతున్నా ఇరువురు అలా నిల్చుండి పోయారు. ఈవేళ కయ్యంవల్ల ఉత్పత్తి అయిన హాలాహలం తరువాత అమృతమేమో యిది. అంతగా తనకులానై దిగిరావటం యేనాడు జరగలేదు-దీనికి యింకొక కారణంకూడా లేకపోలేదు. రాత్రి జరిగిన సంఘటన గురించి ఒకవిధంగా సిగ్గుపడాలని తన అంతరాత్మ బోధిస్తూనే వుంది.

సన్ననిస్వరం, మెల్లగా లేదుకున్న ఆ స్వరంతో "బుచ్చిని మామూలుగా పిలుస్తారు కదూ ?—ఆమె నోరు ఆవిలించింది...కళ్ళు మూత పడలేదు— చేతులు వదులు దేరాయ్....

"హాఁ" అన్నాడు భద్రం చివరకి.

నోరు కళ్లమూతబడి శక్తికొలదీ భర్తను బంధించింది బాహువులతో....

పరుపుమీద కళ్లు మూతలు పడేముందు "లక్ష్మి పెళ్ళి విషయం ?" అన్నాడు.

"ఆ పిల్ల అదృష్టం యెలావుందో ?"

"అదృష్టానికే విడిచిపెట్టేస్తామా ?"

"మా అమ్మవుంటే, అని అపిల్లలు అనుకోకుండా వుండటానికి చెయ్యవలసింద చేద్దాం" అన్నది అన్నపూర్ణ.

"అమ్మ యేదో చెప్పిందన్నావ్ ఒకసారి"

"ఆవిషయం మీతో చెప్పక్ఖర్లేదనుకుంటాను"

"ఏం"

"ఎప్పుడో అవసరంవస్తే చెప్తాను"

కనురెప్పలు బరువెక్కటంవల్ల కామోసు ఇద్దరూ మూగవోయారు.

* * *

తెల్లవారింది. డాబామీది మంచములోనే రాత్రంతా పడుకున్నాడేమొ మొఖం కొంచెం నిగారించివుంది. పరుపుతో క్రిందకి దిగుతున్న బుచ్చిబాబు వంటయింటి వసారాలో నిల్చున్న వదినవేపు చూశాడు. కాని ఇదివరలా నవ్వలేకపోయాడు. వదినముఖం చప్పున త్రిప్పివేయటంతో సిగ్గుపడ్డాడు.

వదిన మోము గంభీరంగా వుండటంవల్ల పిల్చి ఏవైనా మాటలు వడ్డిస్తుందేమోనని అక్కడే యిటూ అటూ పచార్లు చేశాడు. మరదిముఖం చూడనని ఒట్టు పెట్టుకున్నట్లుగా సంచరించటంతో యేడుస్తున్న చిట్టిని తీసికొని వదిన దగ్గరగా వెళ్ళాడు. వదిన అక్కడ నుంచి వెళ్ళిపోతుంటే "చిట్టిని తీసుకోండి వదినా" అన్నాడు.

వదిన చేతులుచాపింది. అప్పుడైనా చూడలేదు. బుచ్చిబాబు సిగ్గుతో సగం గొంతుకల్పి "కోపంమీద యేదో అనేశాను మరచిపొమ్మని చెప్పండి వదినా"

పిల్లాడిని బుజ్జగిస్తూ అన్నపూర్ణ కోపంగానే "నాతో చెప్పటం దేనికి ?"

మరది తెల్లనిముఖం నల్లబడిపోయింది.

వదిన మళ్ళీ అన్నది "చెప్పవలసిన వాళ్ళతో చెప్పండి"

కర్తవ్యమూఢినిలా చూస్తూ నిలుచుని కొంతసేపటికి జుత్తులోనికి వ్రేళ్ళు పోనిస్తూ "అన్నయ్య యెదర పడటానికి సిగ్గుగావుంద" న్నాడు.

అయితే మరేం ? చీర కావాలా ?"

ఈ ప్రశ్న వేశాక యిక నవ్వాపుకోలేకపోయింది. బరువెక్కిపోయిన మనిషి పెద్ద నిట్టూర్పుతో తేలికైపోయాడు.

"ఎప్పుడూలేనిది అలా డాబా యెగరగొట్టేశారేం"

"ఏంటో అలా వచ్చేసింది-అన్నయ్యనింటే"

"ఏమి చేశారేమిటి ? పెళ్ళిచేస్తే ఒళ్లు వంచాలని కామోసు. కుంటపట్టేవాళ్ళం వున్నాంగా భయందేనికి బాబూ ?"

"అన్నయ్య పైవాళ్ళతో యెందుకు చెప్పాలి ?"

బుచ్చిబాబు ముఖం కొంచెం గంభీరమైంది.

"ఏంచెప్పారు ?"

"అమధ్య రెండుసార్లు సినిమాలకి, ఒకసారి ఆఫీసువాళ్ళతో ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళి డబ్బు తగలేశావని యింకా యేవేవో ఆ గోపాలకృష్ణమూర్తి గారితో చెప్పారు. ఆయనేదో బ్రహ్మాండం బద్దలయ్యేటట్లు నలుగురిమధ్య పుట్టుపూర్వోత్తరాలు జ్ఞాపకానికి తెస్తూ బుద్ధులు చెప్పుకొచ్చారు. ఏం ! అన్నయ్య మనసులో యేమైనా వుంటే మీతో చెప్పకూడదండీ ! మీకంటే బుద్ధులు చెప్పేవాళ్ళింకెవరున్నారు ? ఆ కోపం ఈ కోపం అంతా."

రాత్రి గలాటా జరగటానికి కారకురాలని తనే అనుకొని యేమీ మాటాడలేకపోయింది.

భర్త ఆమెతోనూ ఈవిషయం చెప్పారు. భర్తను వారించిందిగాని మరదితో ఆమాటలు చెప్పలేదు. లక్ష్మి అంతలో అక్కడ నిలుచోవటం చూసి బుచ్చిబాబు పళ్లుదోము పుల్లకోసం వెళ్ళాడు.

కాఫీ గదిలోనికి తెస్తూ ప్రక్కగదిలోనున్న మరిదిని కేకవేసింది. బుచ్చిబాబు వచ్చాడు. అన్నదమ్ములిద్దరూ ఒక గదిలోనే వున్నారు. అన్నపూర్ణ పెరటి తలుపుకు చారబడి చిన్నినవ్వుతో అంది "మీ తమ్ముడుగారు క్షమించమంటున్నారని"

ఈమాటలు విననట్టే కాఫీ సేవిస్తున్నాడు పీర భద్రుడు.

వెనుకకు తిరిగి లక్ష్మివేపు చూస్తూ "కాస్త పొయి దగ్గర కూర్చో అమ్మా- ఈ తగువు తీర్చివస్తాను"

"నీలా దాని చెయ్యి కాల్చుకోవియ్" అన్నాడు భద్రం.

"కుంపటి పట్టేటప్పుడు చట్టుకుదురుమీద మట్టి కుండలా కూర్చుంటే యెలా కొతుంది ! చెయ్యి కాలినా అనుభవించాలి !"

"ఓహో బలేయిల్లాలు దొరికిందే- ఒరేయ్ బుచ్చీ మరేం." కొంచెంఆగి "కానీ మరదలు పిల్ల మహా ఘటికురాలని విన్నాను"

"మా చెల్లెలు మీ మొఖాసాలేం దోచుకుపోదు లెండి ?

"దోచుకుంటే వూరుకునే వాళ్ళెవరే ?"

"ఆ ఊరుకుంటారా. కుర్చీలు విరగదోసుకుంటారు. దొమ్మరివాళ్ళలా అరుస్తారు - మొఖాలు ముడుచుకుంటారు-అంతేనా ! మరేంచేస్తారు !"

వదినవచ్చి నోరుమూస్తారు ఎంతో కోపంగా వున్నట్లు నటిస్తారు"

"అదేమిటిరా అటువేపు తిరిగావ్"

"మనం యేమిటో గొప్పవాళ్ళమనుకుంటాం గానీ వాళ్ళతరవాతే మనం అన్నయ్యా"

కలతలెలా వచ్చినయ్యో కలియికకూడా అంత వేగంగా జరగటంతో అన్నపూర్ణ సంతోషగర్వంతో ఫక్కున నవ్వింది.

"ఎందుకు నవ్వుతావ్ ? పాలుపళ్లు కనిపిస్తున్నయ్" చివర అక్షరాలింకా భద్రం నోటిలోనే వున్నయ్. పెరటినుంచి ఒక సన్నని స్వరం "అన్నయ పళ్ళంటే చిన్నవే" అంది. లక్ష్మి మాటలువిని నిర్విణ్ణుడైనా మళ్ళీ సర్దుకుని "సరి ఈయింట్లో నే వొక్కడినే ఒకటి"

"నన్ను వెక్కిరించినంతకాలం అంతే"

"ఏమైనా మానేదిలేదు"

అన్నపూర్ణ వంటయింటివేపు కాఫీగ్లాసులు పట్టుకుపోతూ "వాళ్లూ మానేదిలేదు" అంది.

"పోనీ నువ్వు వెక్కిరించలేవుగా"

జవాబులేదు. కాని అన్నదమ్ములిద్దరూ ముఖాలు చూసుకున్నారు

* * *

కార్తీకమాసంలో బుచ్చిబాబు పెళ్ళయింది. ఈ పెళ్ళిలో ఒక ప్రత్యేకత వుంది. జరగవలసిన తంతులు జరిగినా పెళ్ళిపీటలమీద తగువయింది. పెళ్ళికొడుకు పీటలమీదనుంచి లేచిపోతుంటే వదిన బలవంతంచేసి కూర్చోబెట్టింది. బుచ్చిబాబు వైఖరికి నవ్వినవాళ్లు, స్తుతించేవాళ్లు కూడా లేకపోలేదు. మాటాడకుండా నోరుకట్టుకుని కూర్చున్నవాడు భద్రం ఒక్కడే. ఆలోచించవోయ్ అన్నాడు గోపాలకృష్ణమూర్తి పెళ్ళికొడుకుతో

"మీ పోరు దాకేమీ భంగంరాదు. అంత హెచ్చుగా వుంటే దానంచేసుకోండి" ఈ చివరిమాటలు గంభీరంగా రావటంతో ఒక్కసారి పరిస్థితి అదుపులోనికి వచ్చింది

పద్మజ అప్పుడే రెండుసార్లు అత్తవారింటికి రావటం వెళ్ళటం జరిగింది.

మూడోసారి అత్తవారింటికి వచ్చేటప్పుడు మాటాడితే విసుక్కోవటం, ఎప్పుడూ చిన్నముఖం వేసుకొని ఒకదగ్గర కూర్చోవటం చేస్తుండేది.

ఆదివారమని బద్ధకం విరుచుకుని దీమాగా లేచేసరికి పద్మజ సిల్కుచీరతో అగపడింది. అప్పుడే యేదో అనుమానం ఆవహించినా స్నానం, కాఫీ అయ్యాక కుర్చీమీద కూర్చుని "చాలా అందంగా కనిపిస్తున్నావే" అన్నాడు నవ్వుతూ

దగ్గరగానే వున్న వదిన "ఇదెక్కడి హాస్యం

అమ్మా'' అంటూ ముఖం ప్రక్కకుతిప్పింది.

"మర్యాదయిస్తున్నా నండీ-గాజుబొమ్మలా ఎంత అందంగా - ఆ బొమ్మలా జాగ్రత్తగా చూడాలి ఇలాంటి....''

పద్మజ చరచరా గదిలోనికి వెళ్ళిపోయింది. అప్పుడే భద్రం బొగ్గులబస్తా పెరటవేయిస్తూ "ఈ వేళకి నువ్వే బజారుకు వెళ్ళిరా'' అన్నాడు. తమ్ముడు లేచి బట్టలువేసుకుని వంటయింటి దగ్గరకు వెళ్ళాడు. లక్ష్మి వంటయింట్లో వుంది. వదిన యేదోపని పురమాయిస్తోంది.

"ఇదేమిటండీ....పెళ్ళిముందు అన్ని కబుర్లాడి తీరా లక్ష్మిని పొగమధ్యను కూర్చోబెట్టారు'' అన్నాడు నవ్వుతూ. ఉద్దేశాన్ని గ్రహించినా ఆ విషయం ప్రస్తావించకుండా

"వేగంగా మీరు రావాలి."

"ఎన్ని వీసెల బంగాళదుంపలు?"

"ఎన్ని వీసెలెందుకూ? ఒక అరవీసె చాలు"

"సరి మా అత్తారింట్లో రోజూ బంగాళదుంపల కూర వుండితీరాలి"

ఈ మాటలు భార్యకు వినిపించినట్లున్నాదేమో బజారుకు వెళ్ళేముందు ఒకసారి గదిలోనికి వెళ్ళాడు. పద్మజముఖం పెడగా త్రిప్పివేసింది. కాస్త నవ్విద్దామని చేతిని నడుముదగ్గరకు చేర్చేసరికి ఒక గొంతుని విని త్రుళ్ళిపడ్డాడు. ముఖకళ మార్చడానికి పద్మజ ప్రయత్నించవలసివచ్చింది. బుచ్చిబాబు పెదా కొకసారి చప్పరించుకున్నాడు.

పద్మజ అన్నయ్యను కుర్చీమీద కూర్చోబెట్టింది. శ్యామలరావు మూడొంతులు యింగ్లీషున్న తెలుగును యేకధాటిగా గౌరవమైన భాషగా చెల్లగొట్టున్నాడు.

బుచ్చిబాబు బావదగ్గరగా వెళ్ళి వంగాడు. తల నుంచి సువాసన కొట్టింది. "బావగారూ! ఎనిమిది దాటినట్టుందే'' అన్నాడు. కోటు సవరించి వాచీ చూసి "ఇప్పు డిప్పుడే యెనిమిదయిందన్నాడు

"బజారు పనివుంది."

"సర్వెంట్ లేదూ"

"అంతా మేమే- వస్తాను'' అంటూ చిన్న వాన జల్లులోనే వెళ్ళాడు!

అన్నచెల్లెళ్ళు మాటాడుకుంటుంటే అన్నపూర్ణ వచ్చి బయట గుమ్మానికి చారబడి నిలుచుని,

ఏం తమ్ముడూ! అమ్మా అంతా కులాసాగా వున్నారా?

"హాఁ రేపు వచ్చి మా సిస్టర్ని తీసుక వెళ్తుందేమో!"

"వచ్చి రెండు నెలలైనా కాలేదు"

"మా సిస్టర్ హెల్త్ యేమీ బాగాలేదు."

అన్నపూర్ణ వూరుకుంటే వెనుకనుంచి లక్ష్మి పొడుస్తూ మెల్లగా వూదుతోంది "బాగానే వుందను వదినా — మేం పంపించమను"

అన్నపూర్ణ అప్పటికి మాటాడలేకపోయింది. బుచ్చిబాబు "పావువీసే తెచ్చానండి వదినా'' అంటూ గొడవ చేసుకొచ్చాడు. సంచి అందుకుని చూసింది. వంకాయలు కూడా వున్నయ్. మిగతా డబ్బులు కానితోసహా లెక్కచెప్పి వదిన చేతిలో పెట్టుండటం అన్న చెల్లెళ్ళిద్దరూ చూశారు.

సిగరెట్ ముట్టిస్తున్న బావగారికి కాస్త దూరంగా ఒక ట్రెంకు పెట్టెమీద కూర్చుని "చదువులెలా వున్నాయండి" అన్నాడు. 'ఆఁ' అని గొణిగాడు బావ. ఈ వైఖరి కొంతవరకు అర్థం చేసుకున్న బుచ్చిబాబు మరికాస్త విజృంభించాడు.

"ఈమధ్య ఏవి పిక్చర్సు చూశారు?"

"ఏవో మీకు నచ్చనివి"

"బి. ఎస్. సి. లో నాలాగే ఫస్టుక్లాసు వస్తుందని మీ సిస్టరు అంటోంది. మీలాంటివారికి రాకపోవడ మేంటి?"

జవాబు లేదు.

"ఈమధ్య లవంగాల ధరలు పెరిగాయన్నారు?"

ఈ ప్రశ్న వేసి పద్మజ ముఖం వేపు చూశాడు. కుపితుడై శ్యామలరావు లేచి వెళ్ళిపోయాడు. అన్నపూర్ణ తమ్ముడూ, అని పిలిచినా లాభం లేకపోయింది.

గదిలో పద్మజ, బుచ్చిబాబే వున్నారు. చాలసేపటి వరకు ఒకరిముఖం ఒకరు చూసుకోలేదు. శుష్కహాసం చేస్తూ "మీ అన్నయ్య చాలా తెలివైన వాడు'' అన్నాడు. పద్మజకు ముళ్ళు గుచ్చుకున్నట్లయింది.

లేచి యిటూ అటూ పచారు చేస్తూ కొంచెం కళ్ళల్లో నీరు తెచ్చుకున్న భార్యను చూశాడు. కిటికీ దగ్గర ఆగి, గజాలు పట్టుకొని మేఘావృతమైన ఆకాశం వేపు చూస్తూ మెల్లిగా మాటలు తొణికేస్తున్నాడు. "ఇలా కన్నవారికి అన్నీ చెప్పుకోవటం వల్ల యెప్పుడో ఒకనాడు విచారిస్తావు — నువ్వెన్నో ఆశలు పెట్టుకున్నావ్ — కానీ నేను ఆ రోజున యేం చెప్పానో యిప్పటికీ ఆ మాటలే చెప్తాను — మా అన్నయ్యకు వదినకు శాసించటానికి హక్కుంది — శిరసావహించటం నావిధి"

ఉపదేశంలా యీ మాటలు అన్నాక భార్య వేపు చూడలేదు. ఇంతలోనే వేగంగా తేలిపోయానని కామోసు సిగ్గుపడ్డాడు. భార్య తనవిషయమై ఒక విధమైన శోకువను మనసుకో సృష్టించుకోటానికి ప్రయత్నిస్తుందని "ఆకాశం మీద యెంతదో''

అన్నాడు అభినయంతో.

పద్మజ కదల్లేదు మెదల్లేదు.

"చూశావా! చూడు"

ఈ సారి లేచింది. కానీ వది

కిటికీగుండా చూసింది పెదాలువిరచి :

"గులాబి పువ్వును చూడలేదూ?"

జవాబు లేదు.

"ఆకాశంమీద హరివిల్లైనా పొ

— ఛీ — అదేమిటో నీ ముఖం

చూడలేను''. తరువాత ఇద్దరూ యేది

కూర్చుండిపోయారు.

మరుసటిరోజు తహశీల్దారుగారు

చారు. నిలుచున్నపాటునే కూతుర్ని

కూర్చుంది. అన్నపూర్ణ చివరకు "

వరకైనా వుండండి పిన్ని'' అని బతి

పనుంది. సాయంత్రం ఆయనే వస్తార

నికి వుండమని బతిమాలినా వుం

పోయింది.

ఆవిడ వెళ్ళాక "పంపటానికి ఏ

పోయావా వదినా—వాళ్ళిష్టమా మని

పోదామంటే మరీ ఖుదిగావుంది"

అన్నపూర్ణ "తొందరపడి నో

కమ్మా" అని లక్ష్మిని వారించింది.

పిల్లాడికి పాలు పెట్టూ పద్మజకి

నని మా అమ్మ నాకేం పట్టినా నె త్తి

కుంటుంది. అయినా అత్తవారింట్లో

చెప్పుకొని పరువు కాల్చుకుంటామా-

రాలా కష్టపడకుండా బతకడానికి...

డుగు బట్టి బతుకొస్తున్నాం... ఈ

యీ డబ్బురొక్కటం తీరుతుంది. బు


నింగయిపోయి రెండు వందలదాకా

కాబట్టి యీ యిబ్బందులన్నీ తీరుతాయి

ఇంతవరకు నిమ్మళంగా తోటిక

దేకానీ తనకు కాదన్నట్లుగా పద్మజ వె

సాయంత్రం అయింది. ఉదయం





బాబు ముందుగా వచ్చాడు. ఒళ్ళంతా జిడ్డుగా ఉండటంవల్ల స్నానానికని పెరటి నూతిదగ్గరకు వెళ్ళాడు. భద్రం యింకా రాలేదు తహశీల్దారుగారు వచ్చారు. "వచ్చేవేళయింది కూర్చోండి బాబాయ్" అంటూ కుర్చీమీద కూర్చోబెట్టి కాఫీ తీసుకు రావటానికి వెళ్ళింది. తండ్రీ, కూతురు మాటాడు కుంటుంటే భద్రంవచ్చి గది బయట నిల్చొనే నమస్కరించాడు బయటకువస్తూ "ఒకసారి అమ్మాయిని పంపించండి. వారం పది రోజుల్లో దిగబెడ్తాను" అన్నారు.

ఇంట్లో ఇద్దరికీ తప్పించి అందరికీ యీ కోరిక సమంజసమే అనిపించింది. పద్మజ వెళ్ళాక బుచ్చి బాబు వంటయింటిదగ్గరకు "ఏం కూరండి వదినా" అంటూ వచ్చాడు.

"ప్రొద్దున తెచ్చిన వంకాయ వేపుడు— అవును గానీ ఇంతకంటె మంచివి బజారులో లేవండీబుచ్చి?"

"మీ బాబాయి లాంటి వాడెవడో మంచిమాటలాడి అంటగట్టాడు. అయినా రేపు పూరుకుంటానా ?"

"ఏం చేస్తారు ?"

నుక్కుపిండి మరీ వసూలుచేస్తాను"

"మీ పుణ్యం వుంటుంది. కయ్యం తెచ్చుకో గలరు?"

"అన్నా ఏమండీ మహాపిరికి" అంటూనే బుచ్చి బాబు నవ్వాడు. చెల్లెలు అరుణతో సహా అందరి ముఖాలు వెలిగాయి.

వారం, రెండు వారాలు, మూడువారాలు కూడా దాటాయి. పద్మజను దిగబెట్టలేదు. ఆనోటా యీనోటా పడి భద్రంవరకూ వచ్చిన నిందవల్ల అన్నపూర్ణను గడప దాటనీయలేదు.

ఆదివారం అన్నదమ్ములిద్దరూ కాఫీ త్రాగుతుండగా "అవునండీ బుచ్చి—మాతమ్ముడితో అలాపౌడర్లూ స్నోలని వేళాకోళం ఆడారు. వాళ్ళేమను కుంటున్నారు ?" అన్నది అన్నపూర్ణ

పై లోకంనించి దిగివచ్చినట్టు మాటాడతాడు. కోతలు కోసేవాళ్ళదగ్గర కొయ్యాలిగానీ. అవునుగానీ —ఒక రోజుకు పౌడరులేదని ఆడవాళ్ళు గింజుకు చచ్చి పోవాలా ?"

తమ్ముడు మాటలకు చప్పున అన్నయ్య "దానికేం తెలుస్తుందిరా? పందెంవేస్తాను ఒక పౌడరుపేరు చెప్ప మనూ? "

"ఈ హాస్యాల మాటకేం గానీ ఈవేళైనా ఒక సారి నన్ను వెళ్ళనీయండి. మా చెల్లెమ్మ ఒంట్లో బాగులేదని విన్నాను."

"ఏముఖం పెట్టుకొని వెళ్తావ్ ? కబురూ కాకర కాయ లేంది ?" యీసడించాడు భద్రం.

"ఇద్దరూ యిలాంటి పట్టింపులు పెట్టుకుంటేఎలా? సాయంత్రం ఒకసారి వెళ్తాను".

"వారంరోజుల్లో దిగబెట్తానన్న పెద్దమనిషి యేం చేశాడు ? వెళ్ళు—వాళ్ళకాళ్ళు పట్టుకో యెవరొద్దన్నారు

"వాళ్ళనంటే ఏం లాభం? తప్పంతా మనలో పెట్టుకొని" బుచ్చిబాబు అంటూనే లేచిపోయాడు.

అన్నపూర్ణ కొంచెం నిష్ఠూరమైన స్వరంతో "నిజమే తప్పు మనదే- పిలవటానికి వెళ్ళామా ?"

"ఎలాగో మీరంతాచావండి. నాకెందుకు?" భద్రం కోపంతో మూలిగాడు.

ఈ మాటలతో మళ్ళీగదిలోనికి బుచ్చిబాబువచ్చి "వాళ్ళతగ్గట్టే మనం ఉండాలి. పంపించపోతే నష్ట మెవరికి?"

"పోనీయండి బుచ్చీ! తగూల్తో మరింత పరువు పోతుంది. మనకూ ఆడపిల్లలున్నారు. అభిమానాన్ని కాల్చేయటమెందుకు? మన లక్ష్మిలాంటి పిల్ల. ఏది పిస్తే మనకేం శ్రేయస్సుకాదు. సాయంత్రం వెళ్దాం.

"మంచినీరైనా యిస్తారా? " అన్నాడు భద్రం. ఇచ్చినా యివ్వక పోయినా మనం వెళ్ళినపని అయితే చాలు

"అలాగనే పెళ్ళిలో అన్నింటికీ తలవంచావ్. పదు ఎవరొద్దన్నారు?"

"సంబంధాలు చేసుకున్నాక యెవరివల్లో ఒకరి వల్ల లోపాలుంటాయి. ఎవరో ఒకరు సర్దుకోకపోతే యెలా?"

"నే రాను" అంటూ మొండిగా తేల్చేసి బుచ్చిబాబు బయటకి వెళ్ళిపోయాడు.

"మీరైనా రండి"అని అన్నపూర్ణ ప్రతిమాలింది. భర్తను. ససేమిరా రానన్నాడు, అప్పుడు, నెమ్మదిగా ముందుకు రాగల విషయాలు నచ్చచెప్పింది. చూడండి వాళ్ళిద్దరూ హాయిగా వున్నట్లు చూడాలి. ఇద్దరిమధ్యా యేవో కలతలున్నాయి. పెద్దవాళ్ళం మనం కలపాలి గాని విడదీస్తే పాపం! అదికాకపోయినా మరి కొన్నాళ్ళకి బుచ్చి యే వేషాలు వేసినా మనం తలయెత్తుక తిరగ్గలమా? ఈ వేళ మనం వెళ్ళి బుచ్చి నొకసారి పంపిద్దాం"

ఇలా కొంతసేపు నచ్చచెప్పాక భద్రం "సరే" నన్నాడు.

ఆ వేళ సాయంత్రం తహశీల్దారుగా రింటికి వెళ్ళి వచ్చాక భద్రం నోరు చాలాసేపటి వరకు అద్దూఅపూ లేకుండా పేగిలింది. నిజానికి క్రొత్త కోడలినిపూజి స్తున్నామని వీరనుకొంటుంటే వాళ్ళుదానికి యెదురు ఆరోపించారు. ఆమెను సంతోషపెట్టడానికి తనింకేమి చెయ్యాలో అన్నపూర్ణకు అంతుపట్టలేదు.

బుచ్చిబాబు అన్నయ్య మాటలంతావిని చివరకు "ఇందులో ఒక్కమాటైనా వాళ్ళెదురుగా అన్నారా వదినా?" అన్నాడు.

ఈ సూటిప్రశ్నతో పరిస్థితి కొంతవిషమించింది. కోపంతో తల్లిల్లిపోతున్న అన్నయ్యవేపు చూడకుండా "వాళ్ల నెందు కనాలి"? అన్నాడు.

పెద్ద యీసడింపుతో అన్నయ్య లేచేసరికి అన్నపూర్ణ మోము భయావృత మైంది.

ఇంతలో పాప 'కీ' మంటూ గెంతులేసుకుంటూ చెయ్యి దులుపుతూ గగ్గోలు పెట్టుకుంటూ వచ్చింది. భద్రం గప్పున వ్రేలిని నొక్కిపట్టి "ఎక్కడ చెయ్యి పెట్టావమ్మా" అంటూనే భార్యవేపు తిరిగి "వేగంగా వుల్లిపాయ నూరు" అన్నాడు. తీరా చూశాక వంట యింటి అలమారులో పంచదార డబ్బా చాటున ఇంకా తేలు నక్కివుంది.

మరునాటిరోజు ఆఫీసుకు వెళ్ళేముందు వదిన, ఒకసారి అత్తవారింటికి వెళ్ళమని నచ్చచెప్పింది. సాయంత్రం అలా చూసుకొనివస్తా నన్నాడు.

సాయంత్రం వచ్చిన వెంటనే "వెళ్ళొరాండి బుచ్చీ" అన్నది. వెళ్ళానన్నాడు క్లుప్తంగా. కానీ విషయమేమీ చెప్పలేదు. కొంతసేపయ్యాక "మనుషులని చూసి మరీ మసలాలండీ!"

ఎందుకిలా మరది అంటున్నాడో ఆమెకు అవగాహన కాలేదు.

సంబంధం చేశారుగాని సంగతులు తెలుసుకున్నారు కాదు."

అన్నపూర్ణ మళ్ళీ మొగం వేలవేసింది. "ఉన్నా, లేకపోయినా నీ వెంటే నేనూ అంతే అని పట్టు వదలకుండా వుంటే ఎవరికోసం లొంగుతారు? చిత్రం బత్తెం అనుకుని కూర్చుంటే లోకువచెయ్యరూ మరి!"

"నోరగాని చేసుకోలేమకదా?"

"అంతలో కొట్టేసుకుంటామా?" తిట్టేసుకుంటామా? నిలదీసి అడిగితే ఒంట్లో బాగున్నాక తప్పకుండా ఁగిబెట్టా మన్నారు"

అన్నపూర్ణ పెద్ద నిట్టూర్పు విడిచింది. "రోజూ అలా త్రోవేకదా! ఒకసారి చూసి మరీ రండి" అంది.

బుచ్చిబాబు నవ్వాడుగాని యింకేమీ అనలేదు. కానీ ఆవేళ అన్నయ్య చేయవలసినపని తనుచేసి నందుకు చాలాసేపు కంగారు పడ్డాడు.

నెల దాటింది. వచ్చేవారంలో పద్మజ వస్తుందనగానే భద్రం "మీ అమ్మకు కొంచెం జ్వరం కాస్తోందట వెళ్తావా?" అని అడిగాడు. అన్నపూర్ణ వెంటనే వెళ్ళనని చెప్పలేకపోయింది. ఆ వారంలోనే భార్యతో అన్నాడు "అల్లుడు మామలు కలిసి తిరుగుతున్నారే"

మీలా వుండమంటారా? మనకి కావలసిందేమిటి? వాళ్ళకీ మనకూ యెటువంటి అరమరికలు లేకుండా వుండాలనేగా"

పొడినవ్వునవ్వి వెళ్ళిపోయాడు. ఎల్లుండి పద్మజ వస్తుందనగా రాత్రి ఎనిమిది దాటినా ఆవేళ రాలేదు. బుచ్చి మొదటి ఆట సినిమాకు వెళ్ళిపోయాడు. కళ్ళు కాయలు కాసేటట్లు యెదురు చూసుకొని కూర్చుంది. తొమ్మిది దగ్గరైంది. వచ్చాడు. ఆలస్యానికి కారణం అడిగితే ప్రయాణం కమ్మన్నాడు.

బుచ్చిబాబు సినిమానించి వచ్చేసరికి వదిన కళ్ళలో నీరు కారుతోంది. తరవాత ఫోంచేస్తానని స్టేషన్‌కు వెళ్ళాడు. రైలులో కూర్చొని తల్లి కెలా వుందనే బెంగను దిగమ్రింగి మరదికి ఎల్లుండి పద్మజ వచ్చాక జాగ్రత్తగా తను వచ్చేవరకు త్రిప్పుకోమంది. గోపాల కృష్ణమూర్తి స్టేషనుకు రావటంవల్ల భద్రం ప్లాటుఫారం చివర యేదో మాట్లాడు తున్నాడు. రైలు కదిలేసరికి భద్రం వచ్చాడు. తమ్ముడు పెట్టె నుంచి దిగిపోయాడు.

భార్యాపిల్లలను కన్నవారింట్లో విడిచిపెట్టి వచ్చిన వారంరోజులనాడు ఇంట్లో సామానులు చాలవరకు పాక్ చేయిస్తున్నాడు. ఆవేళనే "ఎలమంచిలి బదిలీ అయిందని" తమ్మునితో చెప్పాడు. అకస్మాత్తుగా యిలా రావటంతో బుచ్చిబాబు యేవేవో ప్రశ్నలు వేశాడు ప్రయత్నిద్దామన్నాడు. అన్నయ్య "లాభం లేదు. నయం చింతపల్లి ఏజన్సీకి వెయ్యకుండా రక్షించారు అన్నాడు.

వెళ్ళిపోయేముందు 'వుత్తరం వ్రాయి అన్నయ్యా' అన్నాడు. అలాగే అన్నాడు అన్నయ్య. ఒక్కొక్కసారి అదొక విధమైన నవ్వును బుచ్చి గమనించక పోలేదు. దానికి కారణం యేమా అని ఆలోచించినా ఏమీ పాలుపోకుండా వుంది. లక్ష్మి, అరుణల విషయం ఏమైనా చెప్తాడంటే ఏమీలేదు.

రైలు ఎక్కేముందు చెప్పాడు. "మీ వదినను అలాగే తీసుకువెళ్తాను. నువ్వేమీ అనుకోవద్దు" అన్నాడు. ఈ చివరివాక్యం అతని జీవితంలో తొలిసారిగా అన్నయ్య నోటివెంబడి వినటంతో బుచ్చి నిర్విణ్ణుడయ్యాడు.

"వదిన కొన్నాళ్ళిక్కడవుంటే" అన్నాడు.

"నాకక్కడ హోటల్లో కష్టంగా వుంటుందిరా" అన్నాడు.

రైలు కదులుతుంటే తమ్ముడు శిలాప్రతిమలా నిలుచుండిపోయాడు వాళ్ళ జీవితాలలో విడిపోయి వుండటం యిదే తొలిసారి. అన్నయ్య వెనుకకు తిరిగి కిటికీగుండా వారైరు ప్లాటుఫారంవేపు చూసినా మళ్లీ వెంటనే తలత్రిప్పాడు. అంతవరకు అపుకున్న కోపం ఆవులింతలతో గాలిలో కలసిపోయింది తమ్ముడు తల వంచుకుని మెల్లగా అడుగులుచూసుకుంటూ వచ్చాడు.

అచ్యుత రామయ్యగారు గానీ, అన్నపూర్ణ గానీ యెటువంటి అనుమానానికిగానీ పాల్పడకుండా సంతరించటానికి బహువిధంగా కృషిచేశాడు.

అన్నపూర్ణకు యెలమంచిలి రాగానే ఇల్లుఒంటిగా వుండటం ఏమీ నచ్చలేదు. ఇరుగుపొరుగులేని ఇళ్లల్లో వుండటమంటే ఆమెకు గిట్టదు. కాని యిల్ళకరువు. ఎలాగో వుండక తప్పేదికాదు. తను అడక్కముందే భర్త అన్నీ చెప్తున్నారు. తమ్మునిమీద యింత అభిమానంతో మెసలుతుండటం ఆమెకెంతో ఆనందాన్ని కలిగించింది. నెలనెలా డబ్బుపంపించటం, వుత్తరాం మీద ఉత్తరాలు వ్రాస్తున్నట్లు మరిది, పద్మజ, లక్ష్మి, అరుణల క్షేమాలు భర్త చెప్పటంవల్ల యెలాగో కాలం గడచిపోతూంది.

కాలగర్భంలో అయిదునెలలు క్రుంగిపోయాయి. ఆదివారం సాయంత్రం లక్ష్మిని తోడుకొని గుమ్మంలో కాలుపెట్టగానే పాప "చిన్నాన్న చిన్నాన్న" అంటూ కాళ్ళకు రెండుచేతులతో లంకెవేసింది. అన్నపూర్ణ ఈ గొడవ విని పెరటినుంచి గబగబ వచ్చేసరికి మరిది పాపను యెత్తుకుని వున్నాడు. లక్ష్మి నాలుగడుగులు ముందుకేసి వదినని కౌగలించుకుంది.

ఇంతలో "ఇప్పుడే వస్తానని" పాపను దించి బైటకు వదినమాటలు వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. లక్ష్మి పెద్ద నిట్టూర్పువిడిచి పాపను ఎత్తుకుని బిస్కట్లపేకట్ చేతిలో పెట్టింది.

"ఉత్తరం వ్రాసి వారంరోజులైందే యింత ఆలస్యంగా వచ్చారేమమ్మా" అంది వదిన.

క్రిందకు దిగాలనుకున్న పాపను దించేస్తూ వదినతో వసారాలోనికి వస్తూ "నయం! చిన్నన్నయ్య యెదరగా యిలా అడగలేదు"

"ఏం?"

"నీవు వ్రాయించిన వుత్తరం అన్నయ్యకు చూపించలేదు వదినా."

లక్ష్మి యిలా యెందుకు దాపరికం చేసిందో ఆమెకు అర్థం కాలేదు.

వసారాలో కూర్చోమంటూ "సరేగానీ! ఇలా చిక్కిపోయావేం?"

లేని నవ్వు తెచ్చుకొని "బావుంది వదినా నువ్వు చిక్కిపోయి నేను చిక్కిపోయానంటావ్?"

"మా చెల్లెమ్మ అరుణ అంతా...."

లక్ష్మి యీమాటలకు సమాధానం యీయకుండా వుయ్యాల వేపు చూస్తూ "చిట్టి చాలా పెంకితనం చేస్తున్నాడేమో—సాయంత్రం నిద్రపోతున్నాడా—రాత్రికి పడుకోనిస్తాడూ?"

"నే నడిగిన దానికి జవాబు చెప్తావా?"

"ఏం చెప్పను వదినా" ముఖం త్రిప్పుకొనే అంది "దాపరిక మెందుకమ్మా? నేనేమైనా అనుకుంటానా?"

"అదికాదు వదినా—మా అమ్మే వుంటే" లక్ష్మి గొంతుక పట్టుకు పోయింది. కంటి రెప్పలు చెమ్మగిలినాయ్.

అన్నపూర్ణ గతుక్కుమన్నా సర్దుకొని "చెప్పమ్మా ఇక్కడున్నానేగానీ నా మనసంతా అక్కడే వుండేది, కానీ బుచ్చి మనసు తెలుసు కాబట్టి యేదో కాస్త ధైర్యంగా మెసిలేదాన్ని"

"చిన్నన్నయ్య యేంచేస్తాడు వదినా? నిజానికి నాకీయింటికి రావటానికి యిష్టం లేక నీవు వ్రాయించిన వుత్తరం దాచేశాను. కానీ—"

ఏదో అవమానం పీక్కుతినటంచేత అన్నపూర్ణ అన్నది "అవునమ్మా! ఇల్లు గుల్లచెయ్యటానికి యిల్లాలినయ్యానా?"

ఈ ప్రశ్న లక్ష్మిని వ్యాకులపరచింది. వదిన యింకోలా అర్థంచేసుకుని గప్పున గొంతుక వరస మార్చి "నిన్నంటే మాకళ్ళు పోతాయ్ వదినా ఏ నిష్టూరం వేసినా అన్నయ్యలమీద వేస్తాంగాని"

"మగవాళ్ళు-వాళ్ళు గొడ్డుల్లా కష్టపడి యింట్లో వేస్తేనా మనం సంసారం సాగించేది? ఈ నిష్టూరాలని యింటి వ్యాపకాలనీ వాళ్ళ నెత్తిన యెక్కిస్తే మనం వుండియెందుకు ?"

లక్ష్మి వదిన యింకేదో అనబోతుంటే హఠాత్తుగా "నాకేది యిచ్చిపుచ్చుకోలేదని ఈనాడుకాదు యేనాడూ అనను అన్నయ్యల దగ్గరనుంచి ఒక చల్లని కబురైనా"

అన్నపూర్ణ పాలిపోయిన ముఖం కాస్త సిగారించింది. "ఏం! వుత్తరాలు వ్రాస్తున్నారుగా !"

ఒకవుత్తరంలోనైనా నాగురించిగాని,అరుణగురించి గాని ఒకమాటైనా వ్రాశాడా? మా వూసే అక్కరలేని అన్నయ్యముఖం యెందుకు చూడాలి ?"

వదిన విభ్రాంతితో "వ్రాయలేమూ" అంది. "లేదు. వ్రాసుంటే అనటానికి నానోరెలా వస్తుంది ? పోనీ నీకైనా ?"

అన్నపూర్ణ కళ్ళల్లో నీళ్లు నిండుకున్నాయి. ఒత్తుకొని "అన్నదమ్ములు యిగ్గిమలో వ్రాసుకుంటారు. ఏదో ఆయన చెప్పింది నమ్మటానుగానీ నన్నిలా అబద్ధాలాడి మోసం చేస్తారని యెలా అనుకుంటాను? నేను వ్రాయటానికి వానాకాలం చదువాయె—వ్రాయటానికి ఆయన తప్పించి యింకెవరున్నారు? ఏదో మా తమ్ముడు రాబట్టి ఆయనకు తెలియకుండా అన్ని కష్టసుఖాలు వ్రాయించాను"

"నేను అంతె అనుకున్నాను. అన్నయ్య రమ్మనమన్నట్లు వ్రాయించావుగాని అన్నయ్య రమ్మంటాడా వదినా?"

"ఎందుకనరమ్మా? మీమీద అభిమానం లేకపోతే నెల నెలా యిక్కడ కష్టపడైనా మీ రెక్కడ బాధ పడ్తారేమో అని."

"అంత అభిమానంవుంటే మరేం?" చప్పున అర్థోక్తిలో అందుకన్న లక్ష్మి మాటలతో వ్యాకులపడి "ఏం పంపలేమూ?"

"లేదు వదినా ఒక్కానీ పంపలేదు చిన్నన్నయ్య సంగతి నీకు తెలుసుగా ఇంట్లో వస్తుంటాడుగానీ దగ్గర స్నేహితుణ్ణైనా ఒక దమ్మిడీ అడగడు. ఇక్కడెకు పాతికపోను సంసారం యేం సాగిస్తాడు?"

అన్నపూర్ణ తలమొత్తుకుంది. లక్ష్మి యింకా చెప్పుకుపోతోంది. "మొదటినెల చూశాం. డబ్బు పంపలేదు. చిన్నన్నయ్యకు వ్రాయటానికి యిష్టం లేదు. తెచ్చినజీతం పాలవాళ్ళకి. యింటి అద్దెకూ. చిల్లర బాకీలకే పోయింది. కోరి కోరి పంతంమీద తెచ్చుకున్నావ్ తోటికోడల్ని. ఆవిడని యెప్పుడూ మెప్పిస్తూ కూర్చుంటేనే ఆ యింట్లో యీ తల్లిలేని పిల్లలు మెసలేది."

ఈ మాటలు అన్నపూర్ణ వినలేక పోయింది. ముఖం పెడగా త్రిప్పి కన్నీరు కార్చుతోంది.

"బలవంతంచేసి నేనే చిన్నన్నయ్యచేత వుత్తరం వ్రాయించాను. పెద్దన్నయ్య ఏం మనసులో పెట్టుకున్నాడో మాకేం తెలుసు వదినా?"

జవాబు చెప్పటంకాని, యిటువేపు చూడటం గాని చెయ్యలేదు. పెదిమల చివర గగుర్పాటు కలిగిందామెకు.

"బట్టనుచూసి కోటు కత్తిరించుకో"మని పదిహేను రోజులు పోయాక జవాబిచ్చాడు. చిన్నన్నయ్య యీ వుత్తరంచూసి ముఖం మాడ్చుకున్నాడు పెద్దన్నయ్యకోపం నాకు తెలుసుగా మళ్ళీ నచ్చచెప్పి యింకో వుత్తరం వ్రాయించాను. ఆ వుత్తరానికి జవాబీయలేదు. రెండో నెల పెద్దన్నయ్య ఒక వుత్తరం వ్రాశాడు. మొదటి ఉత్తరం సంగతిలేకుండా నేనూ ఇక్కడ సంసారం సాగించాలి. నాదగ్గరనుంచి ఎటువంటి సహాయం గురించి ఆలోచించకని — నేను యీ వుత్తరంచూసి యేడ్చాను వదినా? చిన్నన్నయ్య ఏమీ అనలేదు. కానీ ఆవిడ పెద్ద హంగామాచేసింది. ఆవిడ వద్దంటే బలవంతంచేసి నేను వ్రాయించినందుకు ఫలితమిదని—ఆవిడ మాట కద్దా? నీవున్నప్పుడు పొయ్యి దగ్గరకు వెళ్తే కోప్పడేదానివి. నేను స్కూలునుంచి వచ్చేవరకూ పొయ్యి రాజెయ్యదు. పోనీ నేనేదో కష్టపడ్తాను. కానీ అరుణ!!"

"నా అరుణ నేం చేసింది?" అంది తొందరగా అన్నపూర్ణ. బహుఆత్రుతతో అటుమటిస్తుంటే లక్ష్మి పెదిమలు వేగంగా కదపలేకపోయింది.

"చెప్పమ్మా చెప్పు ఏంచేసింది ?"

"ఏంచేస్తుంది? చంపెయ్యదుగా" అంది లక్ష్మి. వదిన మనసు ద్రవించిపోయింది.

"ఆ పిల్లచేత నానాచాకిరీ చెయ్యిస్తుంది. దాని వయస్సెంత వదినా—అప్పుడే అది పొయ్యిరాజెయ్య గలదా? నేనా పదిగంటలకు పోయి సాయంత్రం వస్తాను. అన్నయ్య ప్రొద్దునపోయి సాయంత్రం వస్తాడు. రోజూ నేనింటి కొచ్చేసరికి యేడుపు. వదిన ఇలాచేసింది, అలాచేసిందని. నేనేదేనా అంటే నోటి కొచ్చినట్లు అనేస్తుంది. నాలుగు కాలాలపాటు బ్రతికుండవలసిన మనిషికదా అప్పుడే యింత కుళ్ళెందుకు వదినా ? ఆవిడలా చీరలుకొనమని యేం అల్లరి పెట్టున్నానా ! నువ్వున్నప్పుడు ఏంకొన్నావో అవే. అరుణ మాసినబట్టలతో నీవున్నప్పు డెప్పుడైనా వుందా? నీవు మాని పాపమ్కూడా లేకుండా తల్లిలేని పిల్లలని మమ్మల్ని ముందుచూసేదానివి. నువ్వుండబట్టి మా అమ్మను మరచిపోగలిగాము గాని లేదా అంటే అన్నయ్యలిలా వున్నందుకు మేం యేమయ్యేవాళ్ళం వదినా ?"

అన్నపూర్ణ కళ్ళు చీరకొంగుతో వత్తుకుంటోంది. "పెద్దన్నయ్య కోపిష్టి అని నేనెప్పుడూ ఏడవలేదు. అన్నయ్య కోపిష్టి అవటానికి కారణం మనమే. అమ్మ పోయాక యిల్లు నిలబెట్టాడా. ఈ సంసారం సాగించడానికి యెంత హైరానాపడ్డాడు. మేం అందరం పీక్కుతినేవాళ్ళం. కాని చిన్నన్నయ్య యేం కష్టపడ్డాడు. ఈ అయిదు నెలలకే యెంత మారిపోయాడు, మాటలతో పీక్కుతింటుంటే యెందులోపడి చావాలి వదినా ?"

"నేను చచ్చిపోలేదమ్మా" అంది అన్నపూర్ణ.

"ఆ ధైర్యమే బ్రతకాలనిపించింది. ఐనా మగాళ్ళ మాటలు సాగుతాయిగాని"

"సాగినన్నాళ్ళూ సహించిన వాళ్ళుంటే సాగుతాయ్."

"నీవిలా అంటావుగాని-ఇప్పుడేమైంది వదినా"

"అయిందేదో అయిపోయింది. బుచ్చికి కలవు దొరకలేదని, మీరంతా కులాసాగా వున్నారని యిలా అబద్ధాలాడి యింతవరకు తెచ్చారు. అంతా మరచిపో అమ్మా."

వదిన బ్రతిమాలేసరికి లక్ష్మి కళ్లు నీటితో నిండినా సర్దుకుని "మరచిపోక పోవటానికి యిదేం పెద్ద విషయాలా వదినా. ఇన్నాళ్ళూ మనసులో దాచిపెట్టుకున్నది నీదగ్గర వెళ్ళగక్కేశాను."

లక్ష్మియొక్క యీ పరిపూర్ణ హృదయాన్ని వదినా! యెన్నోసార్లు చవిచూసింది.

"ఆయన వెక్కిరించినా యేమన్నా-మీ అందరు చూపించిన అభిమానంవల్లే బ్రతికాను"

"అభిమానం నీమీదే ఎందుకు చూపించాలి వదినా ఆ పద్మజమ్మ పెద్దింటిపిల్ల కాపచ్చుకాని నిన్ననటానికి అధికారం యెవరిచ్చారు? చిన్నన్నయ్యలా చేతకానివాళ్లం అవుతామా? ఒకనాడు మనసుండబట్టక యీ యింటికి రావటానికి నువ్వే కారణమని చెప్పాను, వుండిపోదు. ఏం భాగ్యభోగాలు అనుభవించటానికి వచ్చేశా అంది. అన్నికష్టాలు పడ్డపుడు అన్నయ్య మా ఎదురుగా నీమీద విరుచుకుపడ్డప్పుడైనా యిలాంటి మాటలు అన్నావా వదినా ? ఏమైనా చిన్నన్నయ్య

యెదురుగానే అనేస్తుంది."

"నన్ను పొగడటంతోనే గడిపేస్తున్నావు. అరుణను విడిచిపెట్టి యెలాగ రాగలిగావు"

"వచ్చేటప్పుడు ఒక్కటే ఏడుపు. తీసుకు వెళ్లమంటే అన్నయ్యకు కోపంవచ్చింది. చిన్న తల్లి కాని రోజూ ఏడుపే."

"బ్రతికుండి చచ్చిన దాన్నయ్యాను."

"నీ పేరెత్తితే ఆవిడగారికి మంట! నువ్వేదో చిన్నన్నయ్యను మొదటనుంచీ షోకిల్లాలా తిరగనిచ్చావు కాదని కామోసు. ఇంట్లో లైటులు దానిచేత తుడిపిస్తుంది నేను చేస్తానంటే యిప్పటినుంచి పిల్లని మొద్దుని చెయ్యకండి. బడికి పంపకుండా ఆవిడ మొద్దును చేస్తుందిగానీ నేనా చేస్తాను? ఒకనాడు నే నింటికొచ్చేసరికి వెక్కి-వెక్కి యేడుస్తోంది. ఏమే అంటే ఏడుస్తుంది కానీ చెప్పదు. తరవాత తెలిసింది. డోము తుడుస్తున్నప్పుడు జారిపోయి ముక్కలై పోయింది. దానికి ఆవిడగారు చెయ్యి చేసుకున్నారు."

"కొట్టటమే!" అంది ప్రాణం పోయినట్లుగా "కొట్టడం ఆవిడ కొని తీసుకురా అక్కర్లేదు వదినా నేను ఆవిడ వయస్సుదానిని అయిపోయానుగాని లేద అంటే నన్నూ కొట్టేదేమో! అయినా వూరుకుండా మాటలతో పీక్కుతింది."

ఈమాటల ధోరణిలో దుఃఖం ముంచుకొచ్చినా యెలాగో విన్నది వదిన.

"ఆవిడ నెవరు కులాసాగా ఆనందంగా వుండొద్దన్నారు. ఇద్దరూ కలసి మమ్మల్నిద్దర్ని వదిలేసి సినిమాలకి వెళ్ళేటప్పుడైనా ఏమైనా అన్నామా? ఆవిడగారికి సిల్కు జాకెట్లు గద్దలు తెచ్చేటప్పుడైనా ముఖం ముడుచుకున్నామా? మా మానాన మేం యింట్లో మసలుతుంటే ఆమెకా ఓర్వలేని తనం యెందుకు? మొదటిలో పెళ్ళిముందు అంత పెద్ద కబుర్లాడిన చిన్నన్నయ్య యేమయ్యాడు? సిన్నర్థం చేసుకున్న వాళ్లగొప్పవాళ్లై యుండాలివదినా - నీకు కోపంవస్తే రావచ్చు. నువ్వనుకున్న మరిది, యిప్పుడు నీ ఇంటికి రాలేదు."

అన్నపూర్ణ ఆడపడుచు ఇచ్చే అభిప్రాయాలతో పాటు మనస్సులో అలముకుంటున్న విషయాలవల్ల వర్ణించలేని బాధపడుతోంది.

లక్ష్మి ముఖంయెత్తి అన్నది "నీ యెదురుగా నా చదువు విషయమై అన్ని కబుర్లాడాడా? వచ్చే యేటి నుంచి చదువు మానేమన్నాడు"

"ఇంతవేగంగా మారిపోయ రా అమ్మా"

"మొదట్లో యేదో పట్టుదలతో వున్నాడు. ఆవిడ ఏం మంత్రంవేసిందో మరి. అత్తవారింటి దగ్గరనుంచి అప్లీ,యిప్లీ రాసాగినయ్. మొదట్లో యెందుకని కేకలు వేసినా మళ్ళీ వూరుకునేవాడు. ఇదీ అదీ లేదనిచెప్తే యెక్కడనుంచి తేవటం అంటూ చిరాకుపడేవాడు. తరవాత ఆవిడ ఏం చెప్పిందో ఏమిటో రానురానూ మావూసే యెత్తేవాడు కాదు. తిన్నారా చేశారా అని అడగక్కర్లేదు. ఉన్నారనైనా, పైవాళ్ళం కావనైనా ఆలోచించనట్టుంది. ఇల్లు మారిస్తే అద్దె చాలా కలిసొస్తుందంటే ఇల్లు కరువాయెను. ఇలాంటి యిల్లు వదిలేస్తే ఇన్ని సదుపాయాలున్న యిల్లు తక్కువకు దొరకదు. కన్నవారింటి పొరుగులో యిల్లు చూసింది. నాకు ససేమిరా ఇష్టంలేదు అన్నయ్యతో చెప్పాను. యిల్లు చవకగా వుంది అని తేలికగా అనేశాడు. నా కష్టం ఏమిటో చెప్పలేకపోయాను వదినా"

"కన్నవారి పొరుగున మరింత..." వాక్యం సగంలో ఆగింది వదిన.

"అదికాదు వదినా. ఈ నెలవలెందుకొచ్చాయో గానీ.. కన్నవారింట్లోనించి గ్రామఫోను తెచ్చింది.... రోజూ సాయంత్రం వాళ్ళన్నయ్య ఏవో క్రొత్తక్రొత్త రికార్డులుతెచ్చి యిల్లంతా గోల. ఎందుకొస్తున్నారని చెప్పను? ఏదో పేలుతాడు. ఎంతని సహించను. కనపడకుండా ఏమూలో దాగుంటే ఆవిడగారికి కోపం. మా అన్నయ్య ఇంటికొస్తే నీకెందుకు కోపం అని అంటుంది. నిజంగా నాకు కోపమే. కానీ అనలేదు. వచ్చేవాళ్ళు వృథాగాపోతే నాకెందుకొదినా కోపం? వాళ్ళన్నయ్య అందగాడని ఆవిడ మురిసిపోవాలి గాని నన్ను మురిసిపొమ్మంటే నా మనసెలా ఒప్పుతుంది? మొన్ననే ఇల్లు మార్చేశారు. అప్పుడే ఆయనగారు రోజంతా కాలాకాని - చిన్నన్నయ్య వున్నా కూడా కేరింతాల మధ్యన ఒకరోజుకే సగం చచ్చాను"

అన్నపూర్ణ పెద్ద నిట్టూర్పు విడిచింది. పాప యిటూఅటూ గదిలోకి దావిడిలోకి తిరుగుతూ బిస్కట్లు పూర్తిచేసి అత్తయ్యవేపు చూస్తూనే దగ్గర కూర్చుంది. పాపను దగ్గరగా తీసి "ఇలాంటి పిల్లలను కొట్టడానికి చేతులెలా వస్తాయ్ వదినా! నెయ్యిగురించి మధ్యాహ్నం గురించి కొరిపిడ పఠించిందండి. అరుణ అక్కడే వుండేమో ఒక్కతే "పో నువ్వే కోతి" అంది "థప్ నోరుముయ్" అంటూ చెయ్యి త్రిందావిడ. అరుణ "నువ్వే కోతివి పో నువ్వే కోతి" వని రెట్టించింది. గప్పున లేచి వీపుమీద చరిచింది. గదిలోనుంచి చూస్తున్న దాన్ని భరించలేక పోయాను. అరుణను తీసికొని "చేతులెలా వచ్చాయమ్మా!" అనేసరికి అగ్గిమీద గుగ్గిలం పడ్డట్టయింది. "మేం కోతులు కామంది"

నిజమే కాదమ్మా! కోతులైనా పిల్లలను చూసి కాస్త కనికరిస్తయ్" అన్నాను. ఆవిడ మరింత రేగింది "ముద్దిస్తూ కూర్చో. సిగ్గుపడనివాళ్ళకి ఏంచెప్తే ఏం లాభం?" అంది. ఎంత కోపమైనా వచ్చింది. ఏం చేస్తాను? నా నాలిక నేనే కరుచుకుని ఏడ్చుకున్నాను. ఏమైనా అంటే యింటినుంచి పంపించే అంత చాకచక్యం కూడా వుంది. అప్పుడెక్కడికి వెళ్ళటం-పెద్దన్నయ్యకు కోపం. అయినా ఆ రాత్రి యెక్కడికైనా వెళ్ళిపోయి అడుక్కుని బ్రతుకుదామనిపించింది. కానీ మా అమ్మలాంటి దానివి నువ్వొకర్తె వున్నావు. ఒకనాడు కాకపోతే యింకోనాడైనా అన్నయ్య మనసు మార్చి మాకోసం పంపిస్తావ్. అప్పుడు మేం ఇంట్లో లేకపోతే నువ్వు బెంగపెట్టుకుంటావ్-నీ పిల్లలు మాలా అవటానికి నేనే కారకురాలవ్వాలా? నాలాంటిదానికి పౌరుషంవుంది యెందుకని చంపేసుకున్నాను. అరుణ నాపక్కనే పడుకుంది. పెంచింది నువ్వు. ఉండివుండి నీకోసం పలవరిస్తోంది. ఏంచెయ్యాటమో తోచక వేళా రాత్రి పోయాను. అప్పుడే నీకు వుత్తరం వ్రాద్దామనుకున్నాను. కానీ నాకు తెలుసు. నీకా వుత్తరం అందదని. మళ్ళీ దేవుడిమీద భారంవేశాను. నా కర్మమిట్లా కాలించనుకున్నాను—"

ఈ మాటలింకా లక్ష్మి నోటిలో వున్నయ్. స్తంభానికి చారబడివున్న వదిన చీరకొంగుతో కళ్లు కప్పుకుని వెక్కి-వెక్కి ఏడ్చేస్తుంది. ఆ యేడుపుచూసి లక్ష్మి కళ్ళల్లో నీళ్ళు బాగా నిండుకున్నయ్. పాప తల్లిమీద చారబడి కళ్లు నులుపుకుంటోంది. చాలసేపటివరకు యెవరి నోటంటా ప్రయత్నించినా మాటరాలేదు చివరకు వదిన మెల్లగా అడిగింది "క్రొత్త యింటికి వెళ్ళాక ఏమైనా నోరు జారేవా" అని.

లక్ష్మి కొంచెం తేరుకుని "వెళ్ళిన రెండోరోజునే అన్నగారితో యేవేవో విషయాలు చెప్తోంది. నేనక్కడనుంచి పెరటికి వెళ్లిపోయాను. తరువాత వచ్చి ఒకసారైనా నవ్వుముఖం చూడలేదన్నారు. నాకు రిమ్మెత్తింది. సహించలేకపోయాను. తిమ్మనలా వున్నావని వెక్కిరించాను. అంతే నేను చేసింది. ఆవిడగారు ఏంచెప్పారో ఏమిటో నాకేంతెలుసు"

"సరేలే అమ్మా—ఎప్పుడు రైలెక్కావో కాస్త'

"ఇప్పుడేమీ అక్కర్లేదు..."

ఇంతలో నిద్రమేల్కొని మూలుగుతున్న చిట్టిని యెత్తుకుని ఆడిస్తూ కూర్చుంది. వదిన వంటయింటివేపు వెళ్ళింది. వంట యింటినుంచి తిరిగివస్తున్న వదినవేపు చూసి "చూశావా వదినా నీ కొడుకేంచేసాడో?"

"అత్తయ్య మర్యాదని వుంటాడా? వెళ్లమ్మా బిందెతో నీరువుంటాయి. స్నానంచేస్తే...." అంటూ చిట్టిని తీసుకుంది.

ఈమాటల్లోనే బాగా ప్రొద్దుపోయింది. రోజూ సాయంత్రమైతే యిల్లు కదలని యింటి పెద్ద రాలేదు. బుచ్చిబాబు కూడా యింకా రాలేదు. పాప నాన్న యింకా రాకపోవటంతో వ్రాసేవి అ, ఆ లైనా మాటిమాటికి నాన్ననిగురించి అడుగుతోంది. "అంత ప్రొద్దు వుండనగా వెళ్ళారు. మీరొచ్చారని కామోసు యీవేళ యింత ఆలస్యం" అంది వదిన లక్ష్మితో.

ఇంతలో బుచ్చిబాబు వచ్చాడు. వదిన ముఖం చూడలేక లజ్జాన్వితుడై పాపను యెత్తుకొని నిలుచున్నాడు పెరటి వసారాలోనికి వెళ్లి వదిన చిన్నన్నయ్య నేమంటుందో అని చెవు లప్పగిచ్చి వింటోంది లక్ష్మి. "ఏమండీ బుచ్చీ! మా చెల్లెలిని తీసుకవచ్చారు కాదు"

"లేదు" అన్నాడు ముక్తసరిగా వదినేదో గుండె చీల్చేటట్లు మాట్లాడుతుందనుకుంటే యింకా అభిమాన వాక్యాలు పలుకుతుందేమో అని లక్ష్మి లోలోన మండిపోతోంది

"ఇలా ఒకసారి రండి" అంది వదిన పాపను

దింది వెనకాలే వెళ్తూ. "ఇంకో అరగంటలో రైలుంది. వెళ్తానండి" అని నమిలాడు మాటల్ని.

"రైలు దిగేసరికి చాలా రాత్రవుతుంది. రేప్రొద్దున్న వెళ్ళకూడదూ? ఇంతదూరం వచ్చి మీ అన్నయ్యను చూడకుండా వెళ్తారా?"

'లేదండి వెళ్ళాలి"

ఈ మాటలు కాస్త దృఢమైన స్వరంతో రావటంతో "భోంచేసి వెళ్ళండి" అంది.

మరది ముఖంలో విముఖత తిరిగి చూసి కాంతి విహీనమైన నగవుతో "అన్నపూర్ణ యింట్లో అన్నమే కరవా— భోంచెయ్యకుండా వెళ్ళటం— యిదెవరు చెప్పారు"

తనమాటలు తనకే అప్పచెప్పటంతో విధిలేక నాలుగు మెతుకులు నమిలాడు.

భోజనం చేస్తుండగా అన్నపూర్ణ యెందుకో మాటాడలేకపోయింది.

చెయ్యి కడుక్కున్న వెంటనే బయలుదేరాడు. వదిన సాగనంపుతూ గదిలోనే "ఆగండి బుచ్చి" అంది. దగ్గరగానే లైటు వెలుగుతోంది. మరిదిముఖం లోనికి చూస్తూ చెయ్యిపట్టుకొని చేతిలో యేదో పెట్టింది. బుచ్చిబాబు చూశాడు. నాలుగు పది రూపాయల నోట్లు. "అక్కర్లేదు. మీరీ డబ్బివ్వక పోతే వచ్చిపోం" అన్నాడు.

"నా ముఖం చూడండి — మీ అన్నయ్య కోపం మీకు తెలుసు — యిప్పుడు అబద్ధాలు కూడా నేర్చారు. నేను చచ్చిపోయా ననుకున్నారా? మీరీ డబ్బు తీసుకు వెళ్ళకపోతే నన్ను చంపుకుతిన్నట్టు"

వదిన స్వరం శోకమయం కావటం మరదిని కొంచెం వ్యాకులపరచింది.

"ఒక తల్లిబిడ్డలు— అందులో మీఅమ్మ యెలా పెంచారో అప్పుడప్పుడూ జ్ఞాపకానికి తెచ్చుకోండి—"

ఈమాటలకు కూడా మరిది కంఠం పుక్కిరిబిక్కిరవటంచేత మాటాడలేకపోయాడు.

"వెళ్ళండి— కానీ ఒక్కమాట"

ముందుకు రెండడుగులు వేసినవాడు ఆగాడు.

"ఈసారి మీరొచ్చేటప్పుడు చెల్లెమ్మని అరుణను తోడుకొనే వస్తారు కదూ."

ముందు తటపటాయించినా "హాఁ" అంటూ కదిలాడు.

"ఈ విషయం మరచిపోకండి."

బుచ్చిబాబు తనకాళ్ళు బూరగాళ్ళయినట్లు భ్రమ పడ్డాడు.

ఇంతవరకూ కొంకొంటాడుతూ లోలోన మండి పోతున్న లక్ష్మి భుజంమీద చెయ్యి వేస్తూ "బుచ్చి బాగా చిక్కిపోయారు. నువ్వైనా వేళకు భోజనం పెట్టలేదమ్మా" అంది.

ఏమనాలో, యేం చెయ్యాలో తోచలేదామెకు. వదిన ముఖంలోని విషాదరేఖలు, క్షణకాలపు మౌనం, లక్ష్మి మనసులో ఆలోచనలను రెచ్చకొట్టినయ్. దాచటానికి చోటులేక పైకి వెళ్ళగ్రక్కింది. డబ్బిచ్చి పంపావ్ నీవు పిచ్చిదానివి వదినా - నిన్ను మోసం చేశాడు"

"నన్నా? లేదు" అంది అదే ధోరణిలో.

"లేదూ! కట్నం పుచ్చుకోనని పెద్ద కబుర్లాడాడే ఇప్పు డావిడిగారి ఒంటినిండా బంగారమే"

బహుశః కర్త ఆర్తి అడిన మాటలు జ్ఞప్తికి రావటంవల్ల కామోసు అన్నపూర్ణ ఆ ఆలోచనలతో పంపింది. "మంచిదే. అవసరం వస్తే అప్పైనా దొరుకుతుంది."

"ఇన్ని చెప్పాను వదినా, నా యెదురుగా అడిగితే పోయేదిగా."

అన్నపూర్ణ పొడినవ్వు నవ్వటంతో లక్ష్మి నిజంగా వదినకు పిచ్చెత్తిందేమో అనుకుంది. తన్ను కూర్చో బెడ్తూ అడిగి ప్రయోజనం?

మరింతరాజేస్తే యేం లాభం?

"అడిగుంటే ఏం అనేవాడో, నిలుచున్నపాటున ప్రయాణం కట్టాడే. ఉంటావా లేదా అంటే యెవరి కోసం వుంటాడు."

"ఏదో కోపాలు చల్లార్చి యిల్లు నిలబెట్టాలి మనం. మనం పౌరుషాలంటూ పెట్టుకుంటే వాళ్ళకి చెప్పగలం? చూడు కోంపతో యేదో అనేశానే అనుకో —అప్పుడు నీ విషయం?"

"ఏం—"

"మీ అన్నయ్య యీనాడు కాకపోతే యేనాడైనా అసలైన అన్నయ్య కాకుండా పోతారా? నేనన్న మాటలు నువ్వే చెప్పావని నీమీద అసహ్యపడరూ?"

"పడితే పడ్తాడు- అన్ని పెద్దకబుర్లాడినవాడు అత్తారిడబ్బు యెందుకు పుచ్చుకోవాలి?"

అన్నపూర్ణ మళ్ళీ నెమ్మదిగా నవ్వి, మధ్యను "నీకెందుకమ్మా యీ పంతం— మా యెవరికీ లేనిది?"

"నువ్వెప్పుడూ ఇలా సర్దుకొస్తావు వదినా!" అంటూ చప్పున లేచిపోయింది.

వెనకాలే వెళ్ళి "ఇంకా నీవు చిన్నదానవమ్మా. మనలాంటి కుటుంబాలలో కష్టసుఖాలింకా మా తోటి కోడలిలా నీకేమీ తెలీవు. అవసరం యెంతపనైనా చెయ్యిస్తుంది. బాధపడ్డవాళ్ళకిగానీ మిగతావాళ్ళకి ఆ విషయాలు తెలియవమ్మా. మీ చిన్నన్నయ్య యింతలా మారటానికి కారణం యెవరంటావ్?"

"ఇంకొకరి నెందుకనాలి?"

ఈయన డబ్బు పంపిస్తే బుచ్చి అలా అవుతారా? మీ మీద మాటలు విసురుతారా? అయిందేదో అయిపోయింది. పదమ్మా. ఎప్పుడు భోంచేశావో?"

"అన్నయ్య భోజనం కానీ."

• • •

భద్రం రాగానే పాప బుచ్చిబాబు రాకను పోకను చాలా గమ్మత్తుగా చెప్పింది. ఈ విషయం ముందుగా తెలిసినట్టే, యిదొక పెద్దవిషయం కానట్టే సరిగ్గా వినిపించుకోకుండా "అమ్మను పిలు" అన్నాడు. ఈలోగా రంగారావు బట్టలు మార్చారు. అన్నపూర్ణ కూతురు వెనకాలే వచ్చి గుమ్మందగ్గిర తలదించి నిలుచుంది.

"మీ తమ్ముడు రేపే పోవటానికన్నాడు."

ఈమాటలు తనకు కాదన్నట్లుగానే మౌనముద్ర అయ్యింది.

"ఏదీ, వచ్చి వారమే అయ్యింది. ఇంకో వారం వుంటే యేంపోయింది."

బావగారి మాటలకు అందుకున్నాడు- "అక్కడ పదిరోజులైనా వుండకపోతే నాన్నకు కోపం వస్తుంది."

ఇక బావమరుదులు వాదనలోనికి దిగారు. అన్నపూర్ణ అడ్డొచ్చి "రేపొకరోజుండి ఎల్లుండి వెళ్ళిపో తమ్ముడూ" అన్నాక అక్కడినుంచి వెళ్ళి పోతూ "భోజనాలకి లేవండి" అంది.

భద్రం భోజనానికి కూర్చొనేముందు చెల్లెల్ని వంటయింట్లో చూచి హేళనగా నవ్వుతూ "ఈ దొప్ప చెవులన్నయ్యమీద అభిమానం పుట్టిందేమో" అన్నాడు.

ఒకసారి యెవరో క్రొత్తచుట్టం యెదురుగా వదినను వెక్కిరించాడని అన్నయ్యను దొప్ప చెవులన్నయ్యని పరోక్షంగా వెక్కిరించింది అన్నయ్య వరకెలా వెళ్ళిందని ఆలోచించి యెటువంటి జవాబు యీయలేదు.

మాటల్లో మాటగా పంక్తిలో కూర్చున్న బావతో అన్నాడు "నాలాంటి వా డుండబట్టి మీ అక్కయ్య బ్రతికిపోయింది."

సహజంగా సిగ్గుకు లొంగే మనిషి రంగారావు. ఒక చిన్ననవ్వు నవ్వి అక్కయ్య వేపు చూశాడు. భద్రం ఇంకా లోకువను బాగా వినియోగించుకుంటుంటే యిక అక్కమీద ఆధారపడి లాభంలేదని నోరువిప్పాడు.

"మీ పేరు ఊరూరా చెప్పుకుంటున్నారు"

"చెప్పకోరటోయ్—ఆ పాఅవళ్ళు"

"మీపళ్ళ కంటే పెద్దవికావు" అన్నాడు. చప్పున తనతో ఏకీభవించే యీయన నొకసారి లక్ష్మి తొంగి చూచింది. రంగారావు యిదివరకన్నా కాస్త శరీరం చేశాడు. తలవంచి భోంచేస్తున్నవాడు గప్పున తలెత్తి యెదురుగా కనపడి వెంటనే మాయమైన కళ్ళని మనసులో వెతుక్కుంటున్నాడు.

ఈసారి బావగా రేమన్నా యెదురాడలేదు. ఒకవిధంగా కులాసాగా వుండి భార్య ముఖకళను మార్చాలని యిన్నివిధాల ప్రయత్నించినా లాభం లేక చేతులు కడుక్కున్నాడు భద్రం.

కోపంతో ఏదో అనేముందు ప్రయత్నంమీద నోరు నొక్కుకొని ఆలోచించి మళ్ళీ అవసరమైతే అందామనే తత్వం గల మనిషి కాబట్టి అన్నపూర్ణ ఆ రాత్రి చాల సేపటివరకు ఆలోచిస్తూనే వుంది.

తెల్లారేక మామూలుగా యింటిపనుల్లో నిమగ్నమయ్యింది. భద్రం ఆఫీసుకు వెళ్ళాడు. రంగారావు వీధిలోనికి వెళ్ళేముందు అక్కతో చాలాసేపు మాట్లా

డాడు. చిట్టివి నిద్రపుచ్చి కూర్చుంది, గదిలో ఒక మూల నేలమీద తలమీద చేయి వేసుకొని.

వంట పూర్తయాక పాపతో పాటల పోటీకి దిగింది లక్ష్మి. ఏకాంతరూపా అనే యెనిమిదిసార్లు వల్లించింది పాప.

ఈ పాటలు బయటకు వినిపిస్తున్నాయేమో రంగారావు తలుపు తట్టకుండా బయట నిల్చుండి పోయాడు. తరవాత లక్ష్మి అన్నపూర్ణల మాటలు విని తలుపు తట్టాడు. లక్ష్మి అక్కడినుంచి మెరుపులా మెరసి మాయమయ్యింది.

అక్కా యెదురుగా కుర్చీమీద కూర్చొని "మంచి నీరు" అన్నాడు నవ్వుతూ.

"లక్ష్మీ! మంచినీరు తీసుకురా అమ్మా" అంది తల త్రిప్పి.

"ఏమిటక్కా! కూతుర్ని పిలిచినట్లు"

"కూతురుకంటె హెచ్చు తమ్ముడూ...."

లోపలనుంచి యిప్పటివరకూ యే సమాధానం లేదు. కొంచెంసేపటికి "ఇదిగో వదినా" అంది. అన్నపూర్ణ నవ్వి "అంత సిగ్గుపడితే యెలా? తీసుకు రామ్మా" అంది. లక్ష్మి గ్లాసు గుమ్మం దగ్గర పెట్టి గప్పున మళ్ళీ మాయమై పోయింది.

"ఏమిటమ్మా యింతసిగ్గు—నిన్నేవరూ మింగెయ్యరు" అంటూ లేచి గుమ్మం దగ్గరకు వెళ్ళి గ్లాసు పట్టుకొని చూసింది.

"పో వదినా" అన్నట్లు నవ్వుతున్న వదినవేపు చూసి ముఖం ముడుచుకొని సైగచేసి పెరటివైపుకు వెళ్ళిపోయింది.

మరుచటి రోజు వెళ్ళిపోయేముందు ఒంటిగా కూర్చున్న లక్ష్మి వేపు చూస్తుంటే, పరిస్థితి విషమించిందని తెలుసుకొని లక్ష్మి వెళ్ళిపోయింది. రంగారావు నాలుగడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు.



వాతావరణంలో మార్పు వచ్చింది. వరసగా వాన జల్లు నాలుగురోజులుంది. అన్నపూర్ణకు తల నొప్పితో పాటు వుండివుండి కాస్త జ్వరం కూడా కాస్తోంది. అయినా యింట్లో పనిపాటలు పూర్తిగా లక్ష్మిమీద విడిచి పెట్టలేదు.

సంసారం సాగిపోటానికి అవసరమైన విషయాలలో భర్తతో మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నించినా యిదివరలా మనసు వికసింపజేసికొని మాటాడలేదు. నిలదీసి అడగాలని అనుకుంది కాని ఆపని చేసేముందు ఆలోచించటయే యీ పది హేను రోజులూ అమె నిలా మెసలనిచ్చింది. ఏమైనా ఆ వచ్చే నెల జీతాలందేవరకు వూరక వుండటమే మంచి దనుకుంది.

ఆదివారం పదిగంటల వేళాదు. అప్పుడే నాన్న రావటంచేత మంచం మీదనుంచి లేచింది. నాన్న మనుమరాలితో ఆటల్లో పడ్డారు. బొమ్మ కావాలని పాప మారాం చేసింది. వీధిలోనికి పాప నెత్తుకొని వెళ్ళార

తిరిగి వచ్చేసరికి పంద్రెండుదగ్గరయింది. శ్రీధరం కూడా అప్పుడే వచ్చాడు. ఏలాగో ఓపిక పడి అన్నపూర్ణే అల్లుడు మామలకు వడ్డించింది. భోంచేస్తూనే

అచ్యుతరామయ్యగారు అల్లుడ్ని ఉద్దేశిస్తూ "ఏమోయ్ చెప్పులు వేసయ్యావు కదా ఇంకో పెళ్ళైకి అవకాశం వుందా?" అన్నారు.

"ప్రస్తుతానికి ఇంతే" అన్నాడు అల్లుడు.

ఆ విషయాన్ని యిరువురిలో యెవరూ ముందుకు సాగించడానికి ప్రయత్నించలేదు. మౌనంతోనే మజ్జిగ వరకూ వచ్చారు.

భారీ శరీరాన్ని కాస్త పీటమీద సర్ది అన్నారు. "ఆఁ అడగటం మరిచాను— శంగడ్ని యెందుకు పిలిపించినట్లు?"

ఆ ప్రశ్న కొంచెం అసహజమైన స్వరంతో రావటంతో సంకోచంతోనే "వూరకనే" అన్నారు.

"అంతేనా" అర్థోక్తిలో అన్న మామగారి వేపొక సారి చూశాడు.

"మీ మనసులో యేం వుందో చెప్పండి" అన్నాడు నిర్మొహమాటంగా.

"ఏం వుంది! ఇప్పుడు వాడేం అఘోరిస్తున్నాడు ఇంటా వంటా లేని పని చేస్తున్నాడు."

"ఏమిటా పని?" గబాల్న అందుకున్నాడు. అల్లుడు.

"పిలిపించినట్లు పిలిపించి వాడికి నేర్పిస్తావటోయ్"

"మేమేం నేర్పించట్లేదు. మెత్తగా వున్నా నేర్పింది వాడు మీవాడే"

"ఇదిగోనోయ్—దాపరిక మెందుకు? కుంత మార్పుకు నేను ఒప్పుకోను"

చేతిలో అన్నం, భద్రం యెదురుగా నున్న ఆకు మీద పడిపోయింది. త్రుళ్ళిపడ్డాడు. క్రోధారుణిత నేత్రాలతో భార్యవేపు చూశాడు. పలికినట్లే ఆమె తలదించుకొని నిలుచుంది. తలదించిందిప్పుడు భద్రం. లేచి చెయ్యి కడుక్కున్నాడు.. గదిలోనికి వెళ్ళిపోయి బట్టలు మార్చి, తరాలుక తలుపు వేసి వీధిలోనికి వెళ్ళిపోయాడు. బొమ్మతో ఆడుకొంటున్న పాప త్రుళ్ళిపడింది. బొమ్మను గట్టిగా పట్టుకొని కేక వేసింది

అందరి గొంతుకలు కట్టుబడ్డాయ్, అచ్యుత రామయ్యగారు బొజ్జ నిమురుకుంటూ అంగడిగదిలో వాలుకుర్చీమీద చారబడ్డాడు.

ఆవులింతలు తీస్తు కూర్చున్న తండ్రిదగ్గరగా వచ్చి నిలుచుంది ముఖం దించుకొని "ఇంకేమైనా అనాలని వుంటే నేనున్నాను నాన్నా" అంది.

"నువ్వీ విషయంలో మధ్య పడకమ్మా" సహజమైన ప్రేమతోనే.

"తమ్ముడితో చెప్పిందాన్ని నేనే. ఆయనకి విషయం యేమీ తెలీదు నాన్నా"

"కప్పుకొస్తున్నావు గానీ—ఇదాపని!"

"నామాట నమ్మరా నాన్నా" అంది కంపించే గొంతుకతో. ఆ గొంతుక కొంతవరకు పనిచేయటం చేత తండ్రి జబాబీయలేకపోయాడు.

అన్నపూర్ణ మళ్ళీ అంది "నేనే వుత్తరం వ్రాయించాను. నేనే ఆ పిల్లను చూపించాను. చేసిందంతా నేనే. ఆయనకేమీ తెలీదు.

"ఏం కానీ! నాకు ససేమిరా యిష్టంలేదమ్మా. ఈ కబురు చెప్పడానికే వచ్చాను— ఎక్కడికో వెళ్ళినట్లుంది. విన్నా వినకపోయినా యీ కబురు చెప్పేయ్—వస్తాను" అంటూ కుర్చీమీద నుంచి లేచి పోయాడు.

ఇంత వేగంగా వెళ్ళటానికి నాన్న లేచినా అన్నపూర్ణ వుండమనైనా అనలేకపోయింది. బట్టలు వేసుకొని గొడుగు పట్టుకునేవరకూ తండ్రివేపు కొయ్యబారి చూస్తోంది. చివరకు "ఆశ విడిచిపెట్టుకోమంటారా నాన్నా" అంది.

"నువ్వే చెప్పమ్మా! ఇదేం పరువుగా వుందో." "తెగతెంపులుచేసి నేనెలా సాగ్లాదతాను నాన్నా" పిల్లమాది. పెంచాం పెద్దచేశాం పీక నులిపేస్తామా" అంది ఈ మాటలు హృదయారాటాన్ని విస్పష్టంగా బహిర్గతం చేస్తోంటే తండ్రి అలా నిలుచుండి పోయాడు.

"ఉన్న వాడొక్కడేనా.... నలుగురో"

"దీనికే మీ పరువుపోతుందా నాన్నా?"

ముసలాడు ముఖం త్రిప్పి "మీ అమ్మకూడా యిష్టం లేదు. నామాటవిను. కాదంటే ఆపిల్లకేదో సంబంధం చూద్దాం" అంటూనే ముందుకుసాగాడు.

"పేదవాళ్ళ యింటిలో పుట్టడమే ఆ పిల్లచేసిన తప్పు. అయినా మేం పస్తుండైనా ఆ పిల్లను ఒక యింటిదాన్ని చెయ్యకుండా పోతామా? వెళ్ళండి నాన్నా." అంది.

నాన్న ఒక్కొక్కడుగు వేస్తోంటే అన్నపూర్ణ గొంతుక రానురాను శోకంనుంచి తేరుకుంటోంది. గుమ్మందగ్గర కాలువేసి వెనుకకు చూసేసరికి కూతురు చీరకొంగుతో కళ్లు ఒత్తుకుంటోంది.

"వస్తానమ్మా" గొణిగాడు తండ్రి.

"మంచిది నాన్నా—కూతురి కిచ్చినట్లు కొడుకు నమ్మైనా రాబట్టుకోండి

డబ్బుతో తనకూ వున్న సంబంధ మెలాంటిదో తెలిసున్న కూతురిలా అంటుందని యేనాడూ అనుకోని పెద్దమనిషికి ఒళ్లొక్కసారి పీక్కుపోయింది.

"వచ్చారు—ఇంట్లో పెద్దకలహం లేవదీసి పోతున్నారు. వెళ్ళండి—నాకు తల్లీతండ్రి లేరనే బ్రతుకుతాను."

ముసలాడి చంకనున్న గొడుగు జారిపోయింది. అన్నపూర్ణ అక్కడ నిల్చోలేక రెండో గదిలోనికి వెళ్లిపోయి మంచంమీద కూలబడింది. కూతురు మాటలు కాళ్లను బంధించినా ప్రయత్నంమీద ముందుకు కదిలాడు.

ఎండ చల్లబడ్డాక అచ్యుతరామయ్య మళ్లీ వచ్చారు. నాన్నను తను పలకరించకుండా నిద్రనుంచి లేచిన కూతుర్ని కూడ దగ్గరకు వెళ్లనీయలేదు వీధిగదిలో కూర్చొని చివరకు రెండో గదిలోకి వెళ్లాడు. తల నొప్పితో పడుకున్న కూతుర్ని పిలవటానికి ప్రయత్నించాడు గాని పిలవలేక అక్కడే వున్న పాపను యెత్తుకున్నాడు. పాప చేతితో నోరుమూసుకుంది.

"చాల్లేవే నీ వేషాలు—కళ్లుకూడా మూసేసుకో- పట్టాడిన ముసలాణ్నిగా."

"చెవులు కూడ" పాప కళ్లుమూసుకుంది.

పాప ఒక్కసారి కళ్లు తెరచి లల్లలల్లా అని నాలికతో వెక్కిరించింది.

"చూడమ్మా! నీ కూతురు చెవులుపట్టుక అది స్తోంది...."

అన్నపూర్ణ లేచి కూర్చుంది. మంచంమీద కూతురు ప్రక్కనే పాపనెత్తుకొని కూర్చొని "చాలా పెద్దమాట అనేశావమ్మా" అన్నాడు.

ఆమె యేమీ అనలేదు. ముఖం దించింది. కానీ దుఃఖం మాత్రం పుటికిపోతోంది. ముసలాడు ముక్కు కాస్త నులుపుకొని "నీకంటేనమ్మా" అన్నాడు. శోకం నిండుతున్నా కళ్లుకప్పుకొని "కన్నవారిమీద నిష్ఠూరం వెయ్యక 'యింకెవరిమీద వేస్తాను నాన్నా" అనేసరికి ముసలాడి కంటిరెప్పలు చెమ్మగిల్లినాయ్. పాప నోరు తెరచి ఆకళ్లవేపు చూస్తోంది. వాళ్లజీవితాల్లో ఆపుకోలేని దుఃఖం మళ్లీ యిద్దరికి ఒక్కసారి పొంగటం యిది రెండోసారి.

అచ్యుత రామయ్యగారు కొంతసేపయ్యాక "అమ్మను వారం పదిరోజుల్లో మంచి రోజు చూసి పంపిస్తాను" అన్నాడు. తండ్రి వెంటనే రైలువుందని ప్రయాణం కట్టాడు. వెళ్లేముందు "చాల నీరసంగా వున్నావు. కొంచం జాగ్రత్తగా వుండమ్మా" అన్నాడు.

అన్నపూర్ణ మౌనంగా నిగారించిన ముఖంతో కూతుర్ని యెత్తుకొనే గుమ్మంవరకూ సాగనంపింది గుమ్మందాటుతున్న తాతయ్యని పిలిచి మరీ లల్లాలల్లా అని వెక్కిరించింది పాప.

పోవే అంటూ ముసలాడు వెనక్కి తిరిగాడు. విరగబడినవ్వుతూ మళ్లీ పాప వెక్కిరించింది.

పాప బుగ్గపట్టుకొని, రెండోబుగ్గ మీద ముద్దులాడి "వస్తానమ్మా" అంటూ వెళిపోతోంటే కూతురు తండ్రి కనిపించేవరకూ చూస్తూనేవుంది.

వీరభద్రరావు వచ్చేసరికి బాగా చీకటిపడింది. అన్నపూర్ణ కొంచం జ్వరం తగలటంవల్ల మూలుగుతూ మంచంమీదపడుంది. అన్నయ్యను చూసి లక్ష్మి పెరటిలోకి వెళ్లిపోయింది చిట్టి వుయ్యాలలో నిద్రపోతున్నాడు.

పాప ఒక్కర్తె తప్పించి ఆ యింట్లో ఆయనను అప్పటికి పలకరించే వారెవరూ లేకపోయారు. తండ్రిచుట్టూ గెంతులేస్తూ తాతయ్య నెలా వెక్కిరించిందీ చెప్పుకొస్తోంది. చిరాకుగావున్నా ఒక్కొక్క సారి దృష్టి పాపమీద పడటంచేత నవ్వువస్తున్నా ఆపుకున్నాడు.

అన్నపూర్ణ ఒకఅరగంట పోయాక మెల్లిగా లేచి 'భోజనానికి లేవండి" అంది. మాటాడకుండా లేచి పెరటకు వెళ్లాడు. చేరువలోనే కూర్చొని "అప్పుడనగా వెళ్లి యింత ఆలస్యంగా వచ్చారేం" అంది. భద్రం నోరు మనసు భోజనం మీదే లగ్నమైయుంది. లక్ష్మితో యిది తీసుకరామ్మా అది తీసుకరావమ్మా అని చెప్తూనే భర్త భోజనం అయ్యేవరకూ అక్కడే కూర్చుంది.

సోమవారంనాడు యింటియజమాని ఒక క్రొత్త మనిషిలా మెసలటం తప్పించి మిగతావన్నీ మామూలుగానే జరిగిపోతున్నాయ్.

నాలుగురోజులు పోయాక ఒంట్లో కాస్త నిమ్మళించాక భర్తతో లక్ష్మి పెళ్ళివిషయం మెల్లగా నచ్చ చెప్దామని, తరవాత మరదికి వుత్తరం వ్రాయిద్దామని, సంకల్పించుకుంది. కానీ మంగళవారం చీకటి

సర్దాక బుచ్చిబాబు, పద్మజ, అరుణ రావటంతో అన్నపూర్ణ ఆశ్చర్యపడింది.

అరుణ పరుగెత్తివెళ్ళి మంచంమీద అన్నపూర్ణ ఒడిలో పడి వెక్కి-వెక్కి యేడ్చేస్తోంటే అందరూ అలా నిశ్చేష్టులయ్యారు. వదిన కళ్ళు మసకలు కమ్మి నట్లైనయ్. మాటాడటానికిగాని, ఆలోచించటానికి గాని పాలుపోలేదు. వదిన చెక్కిళ్ళపై కన్నీరు జారటం బుచ్చిబాబు చూశాడు. చివరకి యెక్కడనించి శక్తి వచ్చిందో లేచి అరుణను యెత్తుకొని మెల్లగా పెరటకు నడిచింది. వదిన యెక్కడ పడిపోతుందనో లక్ష్మి వెనకాలే వెళ్ళింది. వసారాలో కూర్చోబెట్టి అన్నం తీసుకరమ్మని సైగ చేసింది. అరుణ వీపుమీదవేసిన చెయ్యి ఆపిల్ల భోజనం పూర్తి చేసేవరకు తీయలేదు.

లక్ష్మి వంటయింటిలో క్రొత్తగా వంటప్రయత్నంలో వుంది ఆమె వెనకాలే పద్మజ కూడ వుండి సహాయం చేస్తోంది. భోజనాలు పూర్తయేసరికి తొమ్మిది దగ్గర యింది. అక్కదమ్ములిద్దరూ భోజనం దగ్గర ముభావం గానే వున్నారు.

వదినా మరుదులు మాట్లాడుకొనేటప్పుడు పద్మజ రెండుసార్లు ఆగదిలోనికి వచ్చి ఏదో సామాను తీసుక వెళ్ళింది. ఆమె ముఖంలో యిదివరకున్న కళ యిప్పుడు లేదు కాస్త రగరదేరిన మనిషిలా వుంది. కోరిలక్ష్మికి వంటప్రయత్నంలో సహాయం చెయ్యటం కూడా అన్నపూర్ణకు పరిపరి విధాల ఆలోచించటానికి అస్కారంయిచ్చింది.

భోజనాలయ్యాక పిల్లలు ముగ్గరూ పడుకున్నారు. బుచ్చిబాబు, పద్మజ, లక్ష్మి వదినదగ్గర కూర్చున్నారు. భద్రం అంగడిగదినుండి వచ్చాడు తమ్ముడు తల దించాడు. పద్మజ, లక్ష్మి అక్కడనుండి పెరటకు వెళ్ళిపోయారు.

"నీతో రేపు లక్ష్మిని తీసుకపో" అన్నాడు అన్నయ్య.

"అందుకేనా టెలిగ్రాం" అన్నాడు తమ్ముడు.

"హాఁ, అందుకే" అంటూ భద్రం వెళ్ళిపోయాడు మామ్మూలు స్థలానికి. ఇంతవరకూ యీ టెలిగ్రాం విషయమై వినని ముగ్గురూ విభ్రాంతపోయారు.

అన్నపూర్ణ తేరుకుని చూసేసరికి పరిస్థితి విష మించినట్లుంది. బుచ్చిబాబు అంగటి గదిలోనికి వెళ్తే పరిస్థితి విషమిస్తుందని "కూర్చోండి బుచ్చి" అంది. బుచ్చిబాబు కూర్చోలేదు. "సరేగానీ...." మాటలు యీ ఒంత పదం తరవాత దొరకలేదు. పరిస్థితి అదుపులోనికి తేడానికి కాస్త చలించింది. ఒకప్రక్కను వచ్చికూర్చున్న పద్మజ కన్పించింది. ఇదివరలా ఆమె మొహంలో అట్టే యేవగింపు ఆగ పడలేదు. ఇదివరకు చెప్పాలనుకున్న విషయం చెప్పితే పద్మజే కాదు— యింట్లో యెవరికీ తెలియని విషయం ఒకటుంది— భర్తకు అవసరంవస్తే చెప్తా నన్న విషయం అదే- ఇంతకంటె మంచి సమయం లేదని శక్తిని కూడగట్టుకొని "చెల్లీ" అని అభి మానం ఉట్టిపడే స్వరంతో పిలిచింది. పద్మజ కాస్త జరిగింది "ఈ యింటి కోడలిని కానీ యీ యింటి సంగతి యిన్నాళ్ళూ నీతో చెప్పలేదు. వింటావా?"

పద్మజ మౌనంగా కోరికను వ్యక్తపరిచింది.

మళ్ళీ నీరస కంఠంతో "కూర్చోండి బుచ్చి ! మీకూ తెలియని విషయాలున్నయ్—" ఏమనుకున్నాడో బుచ్చిబాబు కూర్చున్నాడు. ముఖం మాత్రం వదిన వేపు లేదు.

ఆ శాంత స్వరం అశాంతి యుతమైన విషయాన్ని చెప్పటానికి సాహసిస్తోంది.

"మామయ్యగారు ముక్కుకు సూటిగాపోయేవారట! అందువల్ల చాలామంది బంధువులవద్ద చెడ్డయ్యారు. ఆ కోపం అత్తయ్య కాబట్టి సహించగలిగారు. అత్తయ్యగారు గట్టివారు కారాయె. పట్టున పదినెలలు ఆరోగ్యంగా వున్నారని లేదు. ఆవిడగారి క్రింద డాక్టర్లకి పోసేసరికి సరిపోయింది. గడించిందేమీ లేదు. మీ బావగారి తర్వాత ముగ్గురు పోయారు. బుచ్చి తరవాత యిద్దరు పోయారు. లక్ష్మి తరవాత లేక లేక మళ్ళీ అరుణ. ఈ చావులతోనే ఆవిడ మరింత నీరసించిపోయారు. మీ బావగారు బి.ఏ. పాసయ్యే సరికి అప్పటికి మూడునెలలై మామయ్యగారు దీర్ఘ రోగంతో మంచం పట్టారు. కష్టాలన్నీ ఒక్కసారే కూడుకొన్నయ్. ఋణాలు తప్పించి యింట్లో మిగిలిం దేమీలేదు. మీ బావగారికి అనగానే ఉద్యోగం దొరికిపోతుందా?"

అన్నపూర్ణ ఆగింది. ఆమె అలసట చెందు తున్నట్టు గ్రహించిన పద్మజ మరికాస్త జరిగింది. శక్తి కూడగట్టుకొని—

"లోకంలో యెవరకు యెవరనుకుంటే మనం యెక్కడుంటాం చెల్లీ? ఒకరు కాకపోతే ఒకరైనా కనికరించేవాళ్ళు వుండకపోరు. కానీ కష్టాలు చెప్పుకొని చెయ్యి చాపటానికి సిగ్గుతో చచ్చిపోయే వాళ్ళ సంగతి యేం చెప్పను ? ఇంట్లో పస్తు—యింటి యజమానికోసం మందులు కావాలి. డాక్టరు తొందర చేశాడు...."

అన్నపూర్ణ గొంతుక పట్టుకపోయింది. అందరి ముఖాలు ఆదృతితో ముందుకు వంగాయ్. ఆ గదిలో వున్న ముగ్గురకు రవణమ్మ యేంచేసిందో తెలియదు కంఠం సవరించుకొని "అత్తయ్య యేం చేస్తారు ? పసుపుకొమ్ము కట్టుకొని —పుస్తె పెద్దకొడుకు చేతిలో పెట్టారు—అంత పెద్దకొడుకు రాయి అయి పోతే వెళ్ళు నాయనా త్వరగా అంటూ త్రోసిందావిడ. చెయ్యి వడుకుతుందేమో పుస్తె జారిపోయింది, మీబావ యేంచేస్తారు ? వెళ్ళారు గుండెపట్టుకొనే చేరారు. మందు తీసుకొని పరుగెత్తుకొని వస్తుంటే అంతదూరంలో వుండగా యేడుపు వినిపించిందట. నడిరోడ్డుమీద చేతిలోని సీసా జారిపోయింది— మెడలో మంగళసూత్రం మట్టిపాలైంది."

కళ్ళకు కట్టినట్టు విషాదాంతమైన యీదృశ్యాన్ని విషాదమైన స్వరంతో అన్నపూర్ణ చెప్పటంతో ముఖాలన్నీ బరువెక్కి వంగిపోయాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంతలోనే గడియారం పదిగంటలు బదులు తప్పుగా ఏడుగంటలు కొట్టడం యెవరూ గమనించినట్టు లేదు.

అన్నపూర్ణ పద్మజవేపు చూస్తూ,

"ఇక వీళ్ళసంగతి —ఆయన చెప్పారు అప్పటి యింట్లో పరిస్థితిచూసి ఆయనకు ఏ నూతిలోనో పడి చచ్చిపోవాలనిపించే దట— అలాంటి దుఃఖంలో కూడా మీబావగారికి నచ్చచెప్పి కాలం వెళ్ళబుచ్చిం దావిడ. పరామర్శకు వచ్చినవాళ్ళు ఆ ఏడుపులో సగం విని వెళ్ళిపోతున్నారు. మిగతా సగం ఏడుపు అర్థంచేసుకొనే వాళ్ళెంతవారై యుండాలి? మా నాన్న చాలా దూరపుబంధువు. చూడటానికి వచ్చారు. నాన్న యింటికొచ్చాక అమ్మతో మాట్లాడుతుంటే విన్నాను. అమ్మను పంపించారు. బలవంతం చేసి మూడువంద లిచ్చారు. అత్తయ్య ఆకలితో చచ్చేపోయే బదులు యిలా బ్రతకాలనే ఆ డబ్బు పుచ్చుకున్నారట. మా మేనమామ అప్పుడు హుజూరుసిరస్తదారుగా వుండే వారు. నాన్న మీబావగార్ని కష్టంమీద వుద్యోగంలో వెయ్యించాక మొదట యిచ్చిన డబ్బువిషయమై మరచిపోతున్నారు. కానీ అత్తయ్య మరచి పోలేదు. మానాన్నకు ఆవిడ కోరిక కాదనటానికి మనసుపోలేదు. మాఅమ్మకు యిష్టం లేదు మాఅమ్మతో అనటం విన్నాను—

"ఆ రవణమ్మలాంటి మనిషిని చూడలేదు. అటువంటి యిల్లు నిలిపితే నాకూతురు నా పేరు నిల పెట్టినట్టే—దానికోసం మన అన్నపూర్ణ బాధపడినా నేను విచారించను"—ఇదే చెల్లి యెప్పుడైనా జ్ఞాపకం వస్తే ఒళ్ళు ఝల్లుమంటుంది. ఈ యింటి కోడల్ని సంసారం యేమిటో—యెలా మసలాలో నాకేం తెలుసు ? క్రొత్తగా ఒకసంవత్సరం వరకు అత్తయ్య వెంట త్రిప్పుకున్నా, యేనుయ్యో గొయ్యో చూసుకోవా లని వుండేది—నేనేం చేసేది ? అప్సరసలా వుండా లంటే దేవుడివ్వని అందాన్ని యెక్కడ తేను ? అత్తయ్య గురువైనా, దైవమైనా అంతా ఆమే. ఆవిడ ప్రయత్నంవల్ల కాల తోపాటు ఆయన మనసు కూడ మారింది."

వదిన తమతో యింతగా చెప్పని విషయాలను తోడికోడల నుద్దేశిస్తూ వెళ్ళగక్కటంతో లక్ష్మి, బుచ్చిబాబు మనసు లోకవిధంగా తేలికైనయ్. పద్మజ తలదించుకొని వింటునేవుంది. అన్నపూర్ణ వదనంలో హెచ్చుగా నీరసం అలముకుంటోంది. మాటాడటానికి కూడా కష్టపడిపోతోంది. అయినా చెప్పాలనుకున్నది చెప్పితీరాలన్న ఆతృతపట్టుదలవల్ల మెల్లగా గొంతు విప్పింది. ఈసారి భద్రం మాత్రం చెవులు బాగా రిక్కించాడు. తనకు యిదివరకు చెప్తానన్న విషయం చెప్తుందేమో అని. "ఆవిడ కాలంచేసే ముందు నా పిల్లలు తల్లిలేదని యెప్పుడూ యేడవరన్నారు— ఆ పిల్లలు మాఅమ్మ వుంటే యింత అన్యాయంచేస్తారా ? అని యేడపకుండా వుండాలనే యింత ప్రయాసం చెల్లీ ! ఆవిడ అంతకు ముందు ఒకవిషయం కూడా చెప్పారు. చెప్పవలసిన అవసరం వచ్చింది కాబట్టి చెప్తున్నాను- ఆవిడ అన్నారు. నాశరీరం దిట్టమైంది. కాదాయె. ఏనిముషంలో కళ్ళు మూస్తానో-అన్నదమ్ము లిద్దరూ సఖ్యంగా వుంటారని నాకేం నమ్మకం లేదు. మధ్యను కలిగిపోయేవాళ్ళు ఆడపిల్ల లిద్దరూను వాళ్ళ అత్తవారిళ్ళకు వెళ్ళేవరకైనా సఖ్యంగా వున్నట్లు చూడమ్మా అన్నారు— ఈ అన్నదమ్ములిలా వుంటు న్నారా ? ఎదముఖాలు పెడముఖాలతో వాళ్ళ బాగో గులు చూసుకుంటున్నారు గానీ తల్లిలేని పిల్లలు బావుర మని యేడిస్తే వాళ్ళకేం శ్రేయస్కరం కాదనైనా అను కుంటున్నారా ? ఏదీ లేదు వాళ్ళ నోటి కొచ్చినకూత



కూస్తూ యిద్దర్నీ హతిమార్చేస్తున్నారు. అన్నయ్యగారిని మర్యాద యిస్తున్నారని వాళ్ల లేతమనసుల్లో విచ్చు పోస్తారా? చెప్పండి బుచ్చి చెప్పండి!

చివరిమాటలన్నీ ఆవేశంతో రావడంవల్ల ఆమె మంచంమీదనుంచి లేచిపోయింది. ఆమె కళ్లు తిరిగాయి మళ్లీ మంచంమీదే వాలిపోయి మాటాడటానికి కూడా శక్తి లేకపోయింది.

అందరూ అలా కొయ్యబారిపోయారు. నిస్త్రాణగా పరుపుమీదనుంచే పద్మజవేపు చూస్తోంది. ఎవరితలలూ పైకి లేవలేదు.

మాట్లాడగలిగి మాట్లాడలేని వారి పరిస్థితిని కొంత వరకు మాటలురాని చిట్టి సరిచేశాడు. కీ(మంటూ వుయ్యాలలో స్వరం హెచ్చించగానే అన్నపూర్ణ లేచి కొడుకును యెవరినీ కష్టపెట్టకుండా తనేతీసుకొని అద్దాలలో వేసుకుంది అతి కష్టంమీద.

* * *

తెల్లవారేసరికి పద్మజ కాఫీకాచి అన్నపూర్ణ యెదరగా పెట్టడంతో ఆమెకళ్లల్లో ఆనందబాష్పాలు సిందుకున్నాయి. రాత్రి యేమీ తీసుకోలేదని బలవంతం చేసి అన్నపూర్ణ త్రాగేటట్లు చేసింది.

ఏకాంతంగా లక్ష్మిని అడిగింది "ఇంట్లో యిలా కష్టపడేవా?" అని

"బాగా నేర్పి తీసుకొచ్చాడేమో చిన్నన్నయ్య. అక్కడైనా యెంత ముద్దుచేసేవాడో అంతగా పనికూడా చెయ్యించేవాడు" అంది లక్ష్మి

ఈ పరమసత్యాన్ని ఆమె చేష్టలే నిరూపిస్తున్నాయని అన్నపూర్ణ అనుకుంది బుచ్చి చేతకాని వారా అని భర్తను సూటిగా ప్రశ్నించినందుకు తగ్గట్లే భార్యను వంచారని సంతృప్తిపడింది. ఐనా పద్మజ పూర్తిగా మారిపోలేదు. విసుగుబాటు. అసూయ ఆమెను పూర్తిగా విడిచిపెట్టలేదు.

ఏడు దగ్గరైంది. అచ్యుతరామయ్యగారు భార్యతో సహా కలిసిరాకపోతే రాత్రంతా ఆలోచనలతో మనసులను నింపుకున్న వాళ్ళ ప్రవర్తనలో మార్పు కొంతలో కొంతైనా దృశ్యమయ్యేది.

సగంచచ్చి వచ్చిన సుబ్బమ్మ రాగానే కూతుర్ని చూసి నిండుజీవి అయ్యింది. అచ్యుత రామయ్యగారు అల్లునివేపే చూడలేదు. బుచ్చిబాబు నమస్కరించటం ఆయన అందుకొని కుశల ప్రశ్నలు వెయ్యటం జరిగింది. దంతధావన చేస్తూ వీధి అరుగుమీద బుచ్చిబాబుతో మాట్లాడారు. స్నానం పూర్తయాక కాస్సేపు కూతురుతో యేకాంతంగా మాట్లాడారు.

ఇంతకు పూర్వమే సుబ్బమ్మ జరిగిన తంతంతా కూతురుతో చెప్పుకొచ్చింది. "ఆ మూలకి వెలిగిరాం చేరేసరికి ఒకరోజు ఆలస్యం. రెండురోజులై యెడతెరిపిలేకుండా వర్షం పడుతోంది. పొలాల గట్లు దాటి రోడ్డు కొచ్చేసరికి బస్సులన్నీ తప్పిపోయాయి వేగంగా రమ్మని రెండుముక్కల్లో తెల్పాడు— నీ ఒంట్లో బాగులేదని మీనాన్న చెప్పారేమో సగం చచ్చానమ్మా—రంగడు ధైర్యం చెప్తూనేవున్నాడు— అప్పటికప్పుడు బండి కట్టించుకొని స్టేషను కొచ్చేసరికి రైలు వెళ్లిపోయింది. రాత్రిబండివరకూ వున్నాం. ఆ పాడుబండి నాలుగ్గంటలు లేటు— మీనాన్న ధైర్యం చెప్తునేవున్నారు కానీ ఏమిటో నమ్మా—కాలం చూస్తే

మంచిది కాదు. అందులో ఏమహారాత్రాన యీవూళ్లో అడుగుపెట్టావో యీసీరు నీవంటికి పడింది కాదు."

ఇరువైపుల పెళ్ళిగ్రాంలు యిద్వాక భద్రం ఆశించిందొకటి. కాని జరిగింది వేరొకటి. అటు తమ్ము డొక్కడే వస్తాడనుకున్నాడు. యిటు మామయ్య గారొక్కరే వస్తాడనుకున్నాడు.

ధ్యానం అయ్యాక అచ్యుతరామయ్యగారు బొజ్జ నిమురుకుంటూ అంగటి గదిలోనికి వచ్చారు. అల్లుడు కాఫీ త్రాగుతున్నాడు. మధ్య గుమ్మానికి చేరువగా నిల్చొని పెరటివేపు చూస్తూ "అదేంటోయ్ బుచ్చీ! పిల్లిలా అనూల కూర్చుని త్రాగుతున్నావ్"

"అబ్బే.... అబ్బే...." గొణుక్కుంటూ లేచి పోయాడు బుచ్చి.

"సరేగాని— యిలా వస్తావటోయ్...."

బుచ్చి తనవేపు రావటం చూసి అల్లునివేపు తిరిగాడు. బుచ్చి గదిలోనికి వచ్చి ముఖం పెరగా త్రిప్పుకున్నాడు. ముసలాడు యిటూ అటూ పచారు చేస్తూ "ఏంవోయ్! పెళ్ళిగ్రాం యెందు కిచ్చినట్టు?" సహజ గంభీర స్వరంతో అడిగాడు.

ఇదే సమయానికి అన్నపూర్ణ రెండో గదిలో గుమ్మందగ్గర చాటుబడి నిలుచుంది. ఎటువంటి బిడియం పడకుండా అల్లుడన్నాడు "దానికి యీనీరు పడలేదు. కొన్నాళ్లు మీయింటికి తీసుకువెళ్తారని"

"ఇలాంటి విషయాలు యిదివరకు పెళ్ళిగ్రాంల మీద నడవలేదే— " కొంచెం ఆగి "అదే నా సంశయం లే"

ఈ సంశయం తీరుతుం దనుకొనే మాటలు నమల టానికి అల్లుడు కొంత విరామం తీసుకోవలసివచ్చింది.

"జ్వరం ముదరకూడదని— అక్కడ సరియైన సంరక్షణ లేదని— " ఈ సగం వాక్యాలు సరిగ్గా వుచ్చరించకపోవటంతో ఆయన చప్పున "ఇదివరకు అబాధ వుండేది. ఇప్పుడు లక్ష్మి వుందిగా" అన్నాడు.

అది యీవేళో రేపో వెళ్ళిపోతుంది"

"ఎక్కడికి?"

"బుచ్చి తీసుకువెళ్తున్నాడు"

"ఎందుకూ ?"

ఈ ప్రశ్నల పరంపరలకు సమాధానం యిచ్చే ఆవశ్యకత గురించి భద్రం ఆలోచించాడేమో ఒక్క మంది జవాబీయలేదు.

అచ్యుతరామయ్యగారు బుచ్చిబాబు వేపు తిరిగి "ఏంవోయ్ బుచ్చీ—ఎందుకు తీసుకువెళ్తున్నావో చెప్పగలవా?" అన్నాడు.

నేను తీసుకువెళ్ళటం లేదు."

"ఏం?

"ఏమీ లేదు. వాకిష్టం లేదు"

ఈమాటలు భద్రం సహనాన్ని భేదిస్తున్నయ్. మామ యెడగా నిల్చొని యిద్దరివేపు దృష్టిని పోనిస్తూ "మన నువ్వుల్లో నూనె లేకపోతే తెలకలివాణ్ణంటే ఏం లాభం? మీ బుర్ర లింతవరకే పని చేశాయి. చదువుకున్నారు. కాస్త మీ స్థితిగతులు ఆలోచించ టానికి ప్రయత్నించండి."

ఆ పెద్దమనిషి మళ్లీ యిటూ అటూ తిరుగుతూ "సిగ్గూ ఒగ్గూ లేకుండా మసలటం మంచిపని కాదు. మధ్యను యేపాపం యెరగని ఆడపిల్లల్ని బయట వేస్తారటోయ్—మాకేం బరువని కాదు. కాని ఆడ పిల్లలు కన్నవారింట్లో గాదిక్రింద యెలకల్లా బ్రతుకు తామని భయపడుతుంటారు—బాగా ఆలోచించండి.

ఎవరూ నోరు పెగిలించకపోవటంతో ఆగి బొజ్జ మీద చెయ్యి గిరగిర మెల్లగా త్రిప్పుతూ "నేను చెప్పాల్సివచ్చింది కాబట్టి చెపున్నాను. యోగ్యతగం వాళ్లని పాడపకముందే చెప్పటం నావిధి.... నేన నేడి-అన్నదమ్ము లిద్దరూ యిలా కొట్లంచుకోమని కాదు. కలత లెలా వచ్చినయో కలయికకూడా అంత కాలం పట్టుంది. ఇద్దరూ తాతయ్యేవరకూ కలసిమెలసి వుండాలని కాదు. అలావుండాలన్నా వుండ లేరు. మీ కుటుంబ పరిస్థితులు తెలుసుకొని కాలం యెరిగిన వాళ్లేమంటా రంటే- ఆ ఆడపిల్లలు అత్తవారిళ్లకు వెళ్లే వరకైనా మీరు సఖ్యంగా వుండాలంటారు— చిన్న వాళ్లు కారు—ఆలోచించండి.

బుచ్చిబాబు దించిన తల యెత్తలేదు- కాని భద్రాన్ని యీ మాటలన్ని రిమ్మె త్తిస్తున్నట్లు ముఖకళే చెప్తోంది. మధ్యను యిలా యీ ముసలాయన రావటం సుతరాం యిష్టం లేనట్లుగా చిరాకుపడుతున్నాడు. ఈ చిరాకుతో సంబంధం లేకుండానే ముసలాడు అన్నాడు "తగూలకి పెద్దకారణా లుండఖ్ఖర్లేదు. ఇదంతాయెందు కొచ్చిందో చెప్తావా ?"

భద్రం కోపం పట్టలేనంతయింది. ఇంతలో యెవరూ మాటాడకపోవటంతో అన్నపూర్ణ ముందు కొచ్చి నాంది ప్రస్తావన చెయ్యబోయింది. భద్రం చప్పున లేచిపోయాడు. కళ్లు చింతనిప్పులయ్యాయ్. భార్యమీద కోపం యింకోవిధంగా చూపించటానికి లాభంలేక యిల్లు కదులుతుంటే "ఆగవోయ్! మని షికి యీగూ, గెలుపూ రెండూ వుండా" అన్నాడు మామ.

ఈ మాటలు వినకుండా అల్లుడు రొప్పుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. ఇల్లంతా మౌనంతో నిండి పోయింది. చాలసేపటికి అచ్యుతరామయ్యగారు అక్కడే నిల్చున్న కూతురువేపు తిరిగి "ఇలాంటి దొమ్మరివాళ్ళ సంబంధం చేసుకోమంటావమ్మా— అప్పుడు గడ్డితిన్నాను. ఇప్పుడూనా? నేను వెళ్తున్నాను." యిలా అంటూనే స్టాండుకున్న ఉద్దరు పంచె తీశారు. ప్రయాణం అయ్యేవరకు నోరెత్తడానికి యెవరికీ ధైర్యం చాలింది కాదు. ఆయన కోపం అంతే, మళ్ళీ ఆయనే వస్తారని అన్నపూర్ణ యీసారి చెప్పలేకపోయింది.

వెళ్ళిపోయేముందు అక్కడే నిల్చున్న బుచ్చి బాబుతో "మా రంగడికి మీయింటి సంబంధం చేస్తా ననుకున్నాను. కానీ యిప్పుడు ఆలోచించవలసి వస్తోంది —చూడూ మనిషిఅన్న యెత్తాక కష్టాలు అను భవించాలా? ఆ కష్టాలలో యేమూలనుంచో కాసింత అభిమాను లేకపోతే తేరుకొని సుఖపడలేం_అన్న దమ్ము లిద్దరిలోనూ ఆ పిల్లమీద యేకోశాన అభి మానం లేనప్పుడు నే నెలా చేసుకుంటాను?"

ఈ చివరివాక్యంతో యేకీభవించని బుచ్చి కాస్త ముక్కు ముడుపుకున్నాడు. గుమ్మం దాటుతూ వెను కకు తలత్రిప్పి "నే నొకటి చెప్పటంవల్ల నీకు కోపం రాదనుకుంటాను" అన్నాడు.

అందరూ చెవులు రిక్కించారు. తలయెత్తిన బుచ్చి బాబువేపు ఒకసారి చూసి చేతులూడిస్తూ "నీకొక విషయం చెపున్నాను ఎద్దు తంతుందని గాడిదకాళ్ళ దగ్గర కూర్చోవద్దంటున్నాను ఇంటిపరువు నిలబెట్టా లంటే ఆ యెద్దునే మచ్చిక చెయ్యవోయ్—నా లోపం యేంలేదు నే నెందుకు బాధపడాలంటావేమో? సరి అయ నుండీ యిదంతా యెందుకు? నీకు చేసిన మేలు బట్టి మీ వదినముఖం చూసైనా నీ పౌరుషం చంపుకోవాలి- నాజోక్యం అనవసరం అని మీ అన్నయ్య స్పష్టపరి చాడుగా—ఒకరు కలిపేకంటే మీకై మీరే కలుసు కుంటే మంచిది—అంచేత చెప్పాను_సరా !"

ముసలాడు చంకను గొడుగు సర్దుకుని ముందుకు సాగిపోబోతూ వెనుతిరిగి కూతురుముఖం వేపు చూశాడు. కొంచెం తటపటాయించినా మళ్లీ ముందుకే సాగాడు. ఆయనకనిపించేవరకు చూసి ఆమాటంతో లోలోన క్రుళ్లిపడుతున్న బుచ్చిబాబు కుర్చీలో కూర్చుండిపోయాడు.

అన్నపూర్ణ చిట్టిని వుయ్యాలలో వేసి వూపు తోంది. సుబ్బమ్మ ఏదో పెరట గొణుక్కుంటోంది. లక్ష్మి పద్మలు వంటయింటిలో వున్నారు.

బుచ్చిబాబు లేచాడు. ఇటూ అటూ గదిలోనే కంగారుగా పచారు చేశాడు. వదిన ముఖం గంభీరంగా వుండటం గమనించకపోలేదు.

అనుకోనట్లుగా అన్నపూర్ణ అంగటిగదిలోనికి వచ్చింది. గంభీరంగా వున్నా నీరసం స్పష్టంగా కని పిస్తూనే వున్నవి. కిటికీలోనుంచి వీధిలోనికి చూస్తోంది. కొంతసేపయాక "ఇంకా కోపం చల్లారలేదేమో" అంది.

వదిన ఈమాటలు ఒకవిధంగా తనమీదే ప్రయో గించిందని బుచ్చి కొంచం తొట్రుపాటు పడ్డాడు.

"క్లబ్బులో పేకాట ఒకటి క్రొత్తగా నేర్పారేమో-యింటిమీదెందుకుంటుంది ?"

అలా గజాలు పట్టుకొనే చాలాసేపటి వరకూ నిల్చుంది. బుచ్చిబాబు వదనకళల్లోనుంచి నీరు జారటం గుర్తించాడు ఏమనటానికి తోచలేదు. కన్నీరు మెల్ల మెల్లగా తుడుచుకుంటూ హీనమైన స్వరంతో "ఇన్నాళ్లూ ఒకఆశ పెట్టుకున్నాను—లక్ష్మి పెళ్లి చూసేవరకైనా బ్రతుకుతానని, ఆ ఆశ ఈ వేళతో సరి"

ఈమాటలు బుచ్చిబాబు నిజానికి వినలేక పోయాడు. వదిన మళ్ళీ మరింత హృదయం కదిపే ట్లు అన్నది—"నిజం చెపున్నానండి బుచ్చి— నాకింట్లో ఏమీ బాగాలేదు. నిద్రపోదామన్నా నిద్దర రావటంలేదు. ఏం జబ్బో ఏమిటో నాకేం తెలియటం లేదు."

బుచ్చిబాబు గప్పునలేచి వదిన దగ్గరగా వెళ్దామను కొనేసరికి సుబ్బమ్మ రావటంతో మళ్ళీ కూర్చుండి పోయాడు.

సుబ్బమ్మ వస్తూనే "నా బిడ్డడిలాంటి వాడివి. నన్ను కాస్త గుండె దిట్టంచేసుకుని బతకనియ్-ఏమడి

గినా అమ్మాయి చెప్పదు. ఇంకొకర్ని చెప్పనివ్వదు-- ఇదంతా ఏమిటో....” అంటూనే బుచ్చిబాబుకు చేరువలో కూర్చుంది.

బుచ్చిబాబు తలెత్తలేదు. బహుశః తనలో రేగిన శోకమయమైన వుద్రేకాన్ని అణచుకోవటంలో నిమగ్నుడై వున్నాడు.

“అమ్మాయిని చూస్తుంటే మాకేమిటో భయం వేస్తోంది. పోనీ యే డాక్టరుకు చూపిద్దామన్నా ఫలానా జబ్బని చూపిస్తామా? ఏదో ఆ అల్లుడికి ఆ విశాఖపట్నమే బదిలీ చెయ్యించాలని అనుకుంటే ఆయనగారి రాకట అలావుంది. ధూమ్‌ధామ్ అంటూ మీ మామయ్యగారు వెళ్ళిపోయారా? నేను వెళ్ళి యీ విషయమేమైన కదిపేనా అంటే నన్ను బ్రతకనివ్వరు”

బుచ్చిబాబు ఒకసారి వదినవేపు చూశాడు. ఆమె కూడా తన పరిస్థితిలోనే వున్నట్లు గుర్తించాడు.

“ఆ మధ్యను మా అన్నయ్యకొడుకు పెళ్లాం మాటలువిని వేరుపడ్డాడు. తండ్రికొడుకులను కలపాలని మీ మామయ్యగారెంతో హైరానాపడ్డారు. అత వాళ్ళకు మోజులెక్కువ నగలు నాణాలంటే ప్రాణం పెట్టారు. మా అన్నయ్య కోడలి వంటిమీద బంగారం తిన్నాడుకదా వాడినేమీ అనకుండా కోడలినంటే యేం లాభం? నేరం నిష్ఠూరాలు పడ్డానికి దాని వయస్సెంత? మనం యివన్నీ చూడాలా మరి? ఈమాటలన్నానని మీ మామయ్యగారు కొట్టినంత చేశారు. ఆయన తంతే అంత—నీవేమీ అనుకోకు బుచ్చి--”

బుచ్చిబాబు ఒకవిధంగా యిటువంటి ప్రసంగం రావటంతో నిర్విణ్ణుడై పోయాడు.

“నేను పెద్దదాన్ని—ఆమాత్రం చెప్తాను. మనసులో చెడ్డ పెట్టుకుంటే మహాపాపం అంటారు. మంచి చెడ్డలు మూగనోము పట్టే తేలిపోతయ్యా?”

సుబ్బమ్మ హితబోధ చేస్తుంటే బుచ్చిబాబు గొంతుక సవరించుకున్నాడు. ఏవిషయంలో కాకపోయినా ఒక విషయంలోని నిజానిజాలు బయటపెట్టాలనే వులలాట పడ్తున్నాడు—లక్ష్మిని తనెందుకు హఠాత్తుగా విడిచిపెట్టాడో చెప్పెయ్యవలసి వుంది.

సుబ్బమ్మ మళ్ళి శాంతంగా అన్నది. “చిన్నప్పటి నుంచీ చూస్తున్నావ్. మాకంటే మీ అన్నయ్య సంగతి నీకే బాగా తెలియాలి. మా పెదతండ్రి కొడుకుండేవాడే—యిలాగే యింట్లో యెవరైనా యెదురాడినా యింటి తగువుల్లో దగ్గరవాళ్లు మధ్యకొచ్చినా హంగామా చేసిపారేసేవాడు—అది వాళ్ళ నైజగుణం పుట్టుకతో మధ్యనుపోతుందా—చూడు నీమీద అభిమానం లేకపోతే వుత్తరాలెందుకు వ్రాస్తాడు? టెలిగ్రాం యెందుకిస్తాడు?”

రెండోగదిలో చాటునవింటున్న లక్ష్మి తన బతుకు ముసలిది బయటపెట్టిందని గతుక్కుమంది. తను మాట్లాడటానికి ఒక విధమైన వాతావరణాన్ని సుబ్బమ్మ సృష్టించటంతో బుచ్చిబాబు వెంటనే అన్నాడు.

“మీతో అంతా చెప్తే చాటభారతం అవుతుందండి. తప్పులన్నిటికి తలవంచాక యిప్పుడేం అనుకుంటే ఏంలాభం”

“ఒకరి తప్పు ఇంకొకరు సర్దుకోకపోతే కుటుంబం యెలా నిలుస్తుంది. బుచ్చీ మనలాంటి కుటుంబాలు గుమ్మటంగా బ్రతకాలి గానీ యిలాంటి తగూల్తో బయటపడ్తామా?”

“బయటపడింది అన్నయ్యకానీ నేనుకాదు ఏమండీ వదినా!”

వదిన ఒక్కసారి తలయెత్తింది. ఏమాటా అనలేదు. సుబ్బమ్మ సౌజన్యస్వరంతో మళ్ళీ మొదటకు వచ్చింది—“ఈ యెడముఖాలకి పెడముఖాలకి కారణమేమిటి”

“ఏవుందండీ! అణిగివున్న వాళ్ళని మరింత అణిచేయటం!”

అన్నపూర్ణ గతుక్కుమంది. కాని బాగా లోకాన్ని చూసిన సుబ్బమ్మ నవ్వి “మీ మామయ్యగారు కోపంతో ఏమైనా అంటే వచ్చినట్లు నోరుమూసుకుంటాం ఆర్చేవాళ్ళు, తీర్చేవాళ్ళు కాబట్టి ఏమైనా అంటారు-- అలాగని వాళ్ళకి అభిమానం లేదనగలమా? దీనికంత మాటపట్టింపులా బుచ్చీ?.

“అవునండీ! దొంగను దొంగంటే బావుండికానీ”

“తరవాత మెల్లగా నేను దొంగను కానని చెప్పితే వూరకనే అన్నవాళ్ళు సిగ్గుపడ్తారు”

“అన్నయ్య దగ్గర తక్కలేనన్నాడు” అన్నాడు చిరాకుగా.

సుబ్బమ్మ మందహాసం చేస్తూ “ఎంతైనా ఒక పేగు—అభిమానాలెటు పోతాయ్—పోనీ అన్నయ్య దగ్గర భయమైతే—” వాక్యం సగంలో ఆపేసి

కూతురివేపు చూసింది.

పైకి చప్పున వచ్చిన మాటలు మళ్ళీ ప్రతిధ్వనించటం వల్ల సిగ్గుపడ్డాడు. ఈ సిగ్గును కప్పిపుచ్చడానికి గంభీరంగా గంభీరమైన విషయం చెప్పాడు.

ఈవిషయం విని అందరూ బిక్కమొగాలు వేశారు. వేగంగా మాటాడటానికి యెవరినోరూ పెగిలింది కాదు. అన్నపూర్ణ ప్రయత్నంమీద "ఇది నిజమా, ఇలా యెవరన్నారు" అంటూ ప్రశ్నించింది.

"మమ్మాటకి నిజం. ఇదంతా ఎందుకండి వదినా? మా మామయ్య తహశీల్దారు అయితే కావచ్చు. నేను తహశీల్దారుని కాదుగా - నేను మామగారితో చెప్పి ఈ మూలకు బదిలీ చెయ్యించానని వూళ్ళో కొందరితో చెప్పాడు అన్నయ్య. మీరంతా ఇక్కడికి వచ్చాక నెలపోయాక ఆ గోపాలకృష్ణమూర్తిగారు నన్ను పిలిచి దీసి నలుగురిలో అడిగాడు—నేను వచ్చినట్లు వదినా నేను బదిలీ చెయ్యిస్తే"

సుబ్బమ్మ గప్పున కలుగజేసుకుంది "కిట్టని వాళ్ళు చిలవలు పలువలు చేసి...." సుబ్బమ్మ మాటలకు హఠాత్తుగా అడ్డొచ్చి "గోపాలకృష్ణమూర్తి అన్నయ్య మీద కిట్టని కబుర్లు చెప్తాడా ?"

"ఏమో బుచ్చీ మన దినాలు బాగులేకపోతే ధర్మమే పాపమై కరుస్తుంది"

"హుం.... మీకు తెలియదండీ వాళ్ళిద్దరి కెంత స్నేహమో ! ఇందులో ఏం దాపరికంలేదు. ఏకోపం లేకపోతే అలాంటి వుత్తరాలెందుకు వ్రాస్తాడు—నేను అత్తవారింటికి గులాంనై పోయానట ! వుత్తరాలు చూసి ఆ గోపాలకృష్ణమూర్తే ఏమన్నాడు ? పౌరుషం అంటూ వుంటే జవాబే వ్రాయొద్దన్నాడు"

తను చూడని వుత్తరాలు కూడా వున్నయ్యని లక్ష్మి నివ్వెరపోయింది.

"తప్పు చెప్పకుండా ఇలా గూఢార్థాలతో గుమ్మరిస్తే యెలా వుంటుంది? క్రొత్త సంసారమా ? ఇంచుమించు సామానులన్నీ యిక్కడికే మోసుకొచ్చాడు. డబ్బు రొక్కటంతో తల పగిలిపోయేది,—ఏల వుంటుందండి—పోనీ అంతటితో చాలించాడా ? ఆ ఇద్దరి ఆడపిల్లల పెళ్ళి ఎలాచేస్తాడో చూస్తానని చాటుకొచ్చాడు. వాళ్ళిద్దర్నీ అక్కడ అందుకోసమేనా వదలి వచ్చాడు."

మిగతా వారెవరూ మాటాడటానికి సాహసించలేదు.

"నాకు పౌరుషం వుంది. అంత పౌరుషం వున్నవాడివి లక్ష్మిని ఎందుకు దిగబెట్టావని అడగ్గలరు ? అక్కడున్న పరిస్థితులుబట్టి లక్ష్మిని రెండు నెలల క్రితం నుంచీ యిక్కడ విడిచి వెళ్లామనేవుంది. వదిన నొక్కసారి చూడాలని మనసు పుట్టింది. అదీకాకుండా ఇల్లు మార్చేముందు గోపాలకృష్ణమూర్తిగారు శలవులొచ్చాయి కదా ఒకసారి లక్ష్మిని పంపించటం వుత్తమమని చెప్పారు. ఆలోచించాను— ఇల్లు మార్చామా ? ఆ కోతి అక్కడ మరీ గెంతుతోంది"

అన్నపూర్ణ పూర్తిగా చివరివాక్యం అర్థం చేసుకోలేదు ; సుబ్బమ్మకు అయోమయంగా వుంది. ప్రక్కగదిలో చాటున నిల్చున్న లక్ష్మి తలతిరిగి పోయి గప్పున కూర్చుండిపోయింది. కొంతసేపటికిగాని ఆమె యిట జరుగుతున్న సంభాషణ వినలేకపోయింది.

పద్మజ పాపతో పెరట వంటయింటిలో వుంది. లేదా అంటే ఆమె అన్నయ్యను కోతిని చేసినందుకు ఎంత గొడవచేసేదో !

"అన్నయ్య బదిలీ గురించి కనుక్కోగా చివరకు బయటపడిం దేమిటంటే మామయ్యగారు చెయ్యించారు."

అందరి నోటినుండి 'హా' అనే ఆశ్చర్యార్థకం వచ్చింది.

"మన గొప్పను వాళ్లేం అర్థంచేసుకున్నారు ? అలాంటివాళ్ళని మనం ఎందుకు గౌరవించాలి ? వాళ్లేం యిచ్చినా వద్దనలేదు—కూతురు ఒళ్లు బంగారంతో నింపినా చివరకు మందిదే అన్నాను—మా లక్ష్మి వుందని—నా తప్పుంటే చెప్పండి అత్తయ్యగారూ ?"

అసలు తప్పు అబద్ధమని చెప్పటానికి ఆమె సంకోచించిందేమో ! కాని అన్నపూర్ణ లక్ష్మితో అవసరమనేది యెంత పనైనా చెయ్యిస్తుందన్న మాటలను వూహించుకొనే వుంటుంది !!

సుబ్బమ్మ సహజ శాంతస్వరంతో "తప్పులెంచుకుంటే ఏంలాభం బుచ్చీ ? అమ్మాయైనా నేనైనా అన్నీ మరచిపొమ్మని కోరతాం గానీ—"

బుచ్చిబాబు వదినవేపు చూశాడు. దీక్షగా కొంతసేపు చూశాడు. "మీరెప్పుడూ ఇలానే సర్దుకొస్తారండి వదినా" అని తనలోతనే అనుకున్నట్లు భ్రమపడ్డాడు ఆమె ఎందుకు సర్దుకొస్తుందో ఎందుకు మౌనం దాలుస్తుందో, ఎందుకు హాస్యమాడుతుందో ఎందుకు కోపంగా వున్నట్లు సంచరిస్తుందో అంతా ఆయనకు తెలుసు. ఈ అయిదు నెలలకి అలాంటి అనుభూతులన్నీ ఒక్కసారి శరీరమంతట వ్యాకిపోయినయ్. కళ్లల్లో నీరు అలుముకోవటం, చేతులు కంపించటం జరక్కుండా అక్కడ నించి లేచి వీధిలోనికి వెళ్లాడు. క్లబ్బుకు పోయేరోడ్డు పట్టాడు.

మండుటెండలో అన్నదమ్ములిద్దరూ కలసిరావటం నిరీక్షిస్తున్న వాళ్ళ కళ్లు మిరమిట్లు గొలిపాయ్. సుబ్బమ్మ గబగబ పెరటకువెళ్ళి "ఏమిటమ్మా యింకా వంటకాలేదా ?" అంది. పద్మజ "అయిపోవచ్చిందండి"

బుచ్చిబాబు గదిలో కాలుపెట్టూనే "మూటాముల్లె కట్టండి వదినా—రేపే ప్రయాణం" అన్నపూర్ణ మరిది ఎలా సాధించగలిగారని ఆలోచించకపోలేదు.

కమీజు విప్పుతూ "అన్నయ్య వారం పది రోజులు హోటల్లో బాధపడతారు. రెండునెలలు శలవు పెట్టున్నారు. అక్కడకు బదిలీకోసం ప్రయత్నిద్దాం" బుచ్చిబాబు గొంతుక పూర్తి లొంగుబాటును సూచించటంవల్ల మరిది దాసోహం అని భర్తను తీసుకొచ్చాడని అనుకుంది.

అన్నపూర్ణ వడ్డించింది భోంచేస్తూ "పప్పులో వుప్పు హెచ్చుపోశారే" అన్నాడు బుచ్చిబాబు పెళ్లిలా భోంచేస్తున్నాడు భద్రం. సుబ్బమ్మ అందుకుంది

"వేగంగా జీర్ణసికొస్తుందిలే బుచ్చి కావాలని చేసిందేమో పద్మజ !!"

"మహా ఘటికురాలు ! ఈసారి అన్నయ్యబదులు తమ్ముడే ఒక ఆశతో అన్నాడు. దానికి తగ్గట్టుగానే అన్నపూర్ణ మాచెల్లెలు మీ మొఖాసాలేం దోచుకపోదు లెండి"

బుచ్చిబాబు యీసారి అన్నయ్య మాట్లాడుతాడని ఆశించటంచేత మౌనాన్ని దాల్చాడు. ఇంతలో ఒక గంభీరమైన గొంతుక వినిపించింది—"ఆఁ మనకోసం మనం బ్రతకాలటండీ ? లోకంలో అందరికోసం కాకపోయినా కొందరికోసమైనా బ్రతకాలి—ఎలాగో ఆ యింటిని నిలబెట్టారు.

అందరూ నిశ్శబ్దంగా విన్నారు. అన్నపూర్ణ గబగబ అంగడిగదిలోనికి వెళ్ళింది. అచ్యుతరామయ్యగారు యింకో ముసలాణ్ణి కుర్చీమీద కూర్చోబెట్టున్నారు. "నాన్నా" అంటూ మహానందపూత్సాహంతో దగ్గరకు రాగానే "మా అమ్మాయండి. ఇదిగో అమ్మా సుంకరణం వెంకటప్పయ్యగారు. మనకి దగ్గరవాళ్లేయిన్నాళ్లూ యీ వూరిలోనే వున్నారు. చూడలేకపోయాను."

అన్నపూర్ణ చేతులు జోడించింది. వృద్ధుడు దీవించాడు. భోంచేస్తున్న వాళ్లని, దగ్గరగావున్న వాళ్లనందరిని చూసి వృద్ధుడు వెళ్లిపోయాడు.

అమృతరామయ్యగారు మెల్లగా పెరటికి వస్తూ "మళ్లీ దగపడ్డాను. యెవరికీ కోపం రాదుకదా ?"

కోపం చప్పునపాపకు వచ్చింది. లల్లలల్లలా అని వెక్కిరించింది.

"పోవే !" అంటూ ముందు కొచ్చాడు ముసలాడు. అనుకుంటున్న చిట్టి, దొండపండు తాతమీద విసిరాడు. "ఏమోయ్ ! నీకూ నామీద కోపమే" అంటూ కుర్రాణ్ణి యెత్తుకొని మనమరాలితో హాస్యానికి దిగాడు.

ఇల్లంతా పకపక ప్రతిధ్వనిస్తోంది. అన్నదమ్ములిద్దరూ ముఖాలు చూసుకొని నవ్వుకోవటం తలుపు దగ్గర నిల్చొని ప్రశాంతంగా చూస్తున్న అన్నపూర్ణ కళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయ్. పెదాలు కంపించినా మాటాడలేకపోయింది. నోరునిండుగా యేదో అమృతం వూరుతున్నట్లయింది. అక్కడనుంచి మెల్లగా అంగడిగదిలోనికి జారిపోయిచేతిలో చేయిపట్టి అణచిపట్టుకొని గట్టిగా నవ్వుకుంది.

"చూడమ్మా ! నీ కూతురు చెవులు పట్టుక ఆడిస్తోంది." అని ముసలాడు దగ్గరకు రాగానే కూతుర్ని తీసుకొని ముద్దులాడి మురిసిపోతోంటే ముసలాడు బొజ్జమీద చెయ్యి గిరగిర త్రిప్పుకున్నాడు.

(అయిపోయింది)

(ఈ చిన్ననవల మొదటిసారిగా 1950 భారతి డిసెంబరు సంచికలో ప్రచురించబడింది.)

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

మళ్ళీ మతం ఒడిలోకి ...

జాతిని భావపరంగా, బాధ్యతపరంగా, సంస్కారపరంగా, సాంప్రదాయికంగా సుసంపన్నం చేయటానికి మతం అనే భావన అవసరమని శాస్త్రీయ దృక్పధం ఉన్నవాళ్లు ఒప్పుకొంటారు. జాతి ఛిన్నా భిన్నం కాకుండా పటిష్టంగా విశిష్టంగా వికసించటానికి మతం తోడు పడినంతగా మరే యితర సాధనాలు కూడా - చివరికి విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం కూడా - తోడుపడలేవని స్ఫుటంగా గోచరిస్తుంది. శాస్త్రిలు సమాధానం చెప్పలేని ఎన్నో ప్రశ్నలకి మతం ఒక్కటే మార్గదర్శక మవుతోంది. మానవ జీవితాన్ని ప్రభావితం చేసి ప్రగతి పధంలోకి నడిపిస్తాయని భావించిన సైన్స్ పరిజ్ఞానం అర్ధంకాని అశాంతిని, భవిష్యత్తు పట్ల ఆందోళనని కలిగించడంతో మతం ఒడిలోకి మళ్లీ రావడం జరుగు తోంది. మతం మమతలు పంచిపెట్టే మాత వంటిదన్న సత్యం ఇప్పుడిప్పుడే పాశ్చాత్య దేశాల్లో సయితం అవగాహనకు వస్తున్నట్లుంది. కిరస్తానీయులు, మహమ్మదీయులు, జీనులు, బౌద్ధులు, హిందువులు, యూదులు - ఒకరని ఏమిటి - అందరూ మళ్లీ మతం అందించే మాధుర్యాన్ని గ్రోలి ఉపశాంతిని పొందడానికి తల్లడిల్లి పోతున్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి. మహా మహా మేధావులు సయితం మతం ఒడిలో ఓలలాడుతున్నారు. తాత్త్వికులు, దార్శనికులు, శాస్త్రవేత్తలు, కవులు, రచయితలు, కళాకారులు - అందరూ మతం పట్ల గౌరవ భావాన్ని పెంచుకొంటున్నారు. నిరక్షరాస్యులు, అక్షరజ్ఞానం ఓ మాదిరి ఉన్న సామాన్యమానవులు ఎప్పుడూ మతాన్ని నమ్మినవారే ! మూఢనమ్మకమో, భక్తో, భయమో - ఏదైనప్పటికీ - మతం పేరిట ఉన్న కొన్ని కట్టుబాట్లని కచ్చితంగా పాటిస్తున్నది ఈ సామాన్యులేనని ఎంతోమంది మతాధికారులు, పీఠాధిపతులు, స్వాములు, బాబాలు అభిప్రాయపడుతున్నారు.

సుమారుగా ఇరవై ఏళ్ల క్రితం టైమ్ అనే వారపత్రిక (1966, ఏప్రిల్ 8) "దేవుడు చచ్చిపోయాడా ?" అనే శీర్షికతో ఒక వ్యాసాన్ని ప్రచు రించింది. అప్పటి పరిస్థితి అలాగే ఉండింది. చంద్రలోక విహారాలు, అంతరిక్ష నౌకలు, సముద్రాంతర మధనాలు, నాళికా శిశువులు, జన్యువిచికిత్సలు; న్యూక్లియార్ రసాయనికాలు ఎప్పుడూ తిరుగాడుతూ ఉంటే దేవుడు కనిపిస్తాడా ? దేవుని పేరిట నెలకొన్న నైతిక బాధ్యతలు, శిక్షణాయుతమైన సిద్ధాంతాలు మర్యాదని పొందుతాయా ? దాదాపు ప్రపంచంలోని అన్ని దేశాలు - మన దేశంతోసహా - విజ్ఞాన సాంకేతిక శాస్త్రిల మోజులోపడి - మతాన్ని కాదన్నాయనే చెప్పాలి. మతాన్ని ధిక్కరించడమే కాదు, దాని ఉనికికూడ అనవసరం అన్న దృక్పధాన్ని కూడా కొన్ని దేశాలు కనబరచినాయి. మన దేశంలో కూడ హేతువాదం పేరిట, నాస్తికత మాటున మతానికి వ్యతిరేకంగా దుమారం ఈనాటికీ రేగుతూనే ఉంది.

దేనికైతే శాస్త్రీయ దృక్పధం ఉంటుందో అదే మనగలుగుతుంది. ఈ లెక్కన మతానికి ఎదురు ఉండదని చెప్పుకోవచ్చు.

మతం అంటే మౌఢ్యమని అనుకోవడం పొరపాటు. మనిషిని లోక శ్రేయో క్రియాపరునిగా తీర్చిదిద్దేది మతమని విజ్ఞుల అభిమతం. ఏదైతే నిబిడాంధ కారం నుండి నిన్నడు భవిష్యత్తులోనికి నడిపిస్తుందో, ఏదైతే అసిశ్చిత ఆందోళనా పధం నుండి నిశ్చల నిర్మల ప్రగతి పథంవైపుకి నడవమని ఆదేశిస్తుందో. ఏదైతే జాతిని నిత్యం జాగృత పరుస్తూ చైతన్య వంతం చేస్తుందో, ఏదైతే మనిషి మనిషిలో మనీషిని సృష్టిస్తుందో - అదే మతం ! అంతేకాని దేవుళ్ళ పేరిట, కులాల పేరిట కొనసాగే అశాస్త్రీయ, అనారోగ్య ఆలోచనల పరంపర కాదు. మరి నే డెంతమంది మతం విలువని గుర్తిస్తున్నారు ? మతం మౌఢ్యం కావడానికి, మత్తు మందు కావడానికి, సాంఘిక దుష్టశక్తులే కారణం కాని, దేవుడుకాదు. సమాజ జాగరణలో, మానవసేవలో, జాతిరక్షణలో, విశ్వమానవతలో భగవంతుడున్నాడని నిర్ద్వంద్వంగా తెలియబరచే మతం సర్వజన సమ్మతం కావాలి ! మాన్యమానవ సంస్కృతీ బద్ధం కావాలి !

ప్రొఫెసర్ బెత్ కే ఎల్ష్ తయిన్ "పబ్లిక్‌మ్యాన్, ప్రయివేట్ ఉమన్"లో రాసినట్లు మతం పేరిట కుమ్ములాటకి దిగే ఆదిమవాసుల దేవుడు ఎప్పుడో చచ్చి పోయాడు. ఎలా బ్రతకాలో తెలియజేస్తూ జాతిపట్ల, సమాజంపట్ల, సంస్కృతిపట్ల మనిషికుండే బాధ్యతలని గుర్తుచేసే దేవుడు మాత్రమే ఇప్పుడు బ్రతికి ఉన్నాడు. ఈయన చెప్పిన ఈ మాటని ఎన్నోవేల ఏళ్ళ క్రిందట భారతీయ ఋషి పుంగవులు ఎప్పుడో చెప్పారు. చేతులు కాలిన తరువాతే ఆకుల అవసరం తెలిసినట్లు, మనిషి జీవితానికి అభద్రత ఏర్పడి, ఉనికి సందిగ్ధంలో పడిపోయి, భవిష్యత్తు అయో మయమై, దిక్కు తెలియకుండా పోయినప్పుడు మాత్రమే దేవుడు గుర్తుకొస్తాడు కాబోలు !

శాస్త్రపరంగా మనిషి పరిధి వికసిస్తోంది కాని, సంస్కారపరంగా కుదించుకొని పోతోందని బెర్ట్రాండ్ రసెల్ అన్నమాట వాస్తవం. ఈ సంస్కార పరిధి కుదించుకొని పోవటానికి శాస్త్రీయ దృక్పధమున్న మతాన్ని కాదనడమేనని చాలమంది అనుకునే మాట కూడ అసత్యం కాదు. "విజ్‌డమ్ ఆఫ్ ది వెస్ట్" లో శాస్త్రీయ అవగాహనకే భగవంతుని భావన అర్ధమవుతుందని, వివిధ మత గ్రంధాలపేరిట వెలిసినవన్నీ సశాస్త్రీయ సిద్ధాంత వ్యాసాలేనని రసల్ అన్నాడు. దేంట్లో అయితే ఎక్కువ శాస్త్రీయ అవగాహనకు వీలు కల్పించే తర్కం ఉంటుందో, అదే మనిషిని ఎక్కువగా ప్రభావితుణ్ణి చేస్తుంది. ఈ లెక్కన ఒక మనిషి ఆధారంగా రూపొందిన మతాలకన్నా ఎందరో ఋషి తుల్యుల భావన ఆధారంగా వెలుగొందిన మన సనాతన ధర్మ సాంప్రదాయమే ఎక్కువ సంస్కారాన్ని తర్కబద్ధంగా కలిగి ఉంటుందని అనుకోవడంలో పొర పాటు ఉండదు. పైగా అది ఆత్మస్తుతి కూడ కానేరదు !

ఏమైతేనేం మొత్తానికి మతంపట్ల విశ్వవ్యాప్తంగా భక్తి ప్రపత్తులతో కూడిన ఆదరణ లభ్యం కావడం సంతోషాన్ని కలిగించే అంశం. ఈ మాటని మనదేశంలో ఉన్న విశ్వహిందూ పరిషత్ వారు అన్నారు. వాటికన్ సిటీకి చెందిన ప్రధాన పోప్‌లు అన్నారు. మక్కా మసీదులోని ప్రవక్తలు అన్నారు. అరబ్బు దేశాలలోని మతాధికారులు అన్నారు. వీళ్ళేకాదు... బాగా చదువుకొని శాస్త్ర పరిశోధనలు చేస్తున్నవారు కూడ అన్నారు. తగిన సాక్ష్యాధారాలను కూడా చూపారు. మానవక్షేమాన్ని కోరుకొనే వారికెవరికైనా ఈ పరిణామం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. కాలుష్యం, యుద్ధభయం, ఆకలి బాధ, సామ్రాజ్య కాంక్ష, హింస, ప్రతీకారం మొదలైన వన్నీ పుష్కలంగా ఉన్న ప్రస్తుత సభ్య సమాజంలో నవనాగరిక సంఘంలో - మతంపేరిట అయినా, దేవుని మాటున అయినా - కాసింత ఉపశమనం, ఇసుమంత చిత్తశాంతి, మానసిక ఉల్లాసం, నవజీవన చైతన్యం కలుగుతుంటే ఎవరు ఆనందించరు ?

హార్వర్డ్ కళాశాలకి చెందిన డివినిటి ప్రొఫెసర్ హార్వీ కాక్స్ "నైతికవిలువలు నిండుకున్న ఏసుక్రీస్తు జీవితం"పై ఇటీవల కోర్స్‌ను నిర్వహిస్తే అసంఖ్యాకంగా - యువకులు సైతం - పాల్గొన్నారట, చర్చిలలో సభ్యుల సంఖ్య పెరుగుతోంది కూడా ! కాకస్ 1965 లో "ది సెక్యులర్ సిటీ" అనే పుస్తకం రాశాడు. అందులో మతంపట్ల దైవచింతన పట్ల ప్రజలలో ఆసక్తి తగ్గి పోతున్నట్లు స్పష్టంచేశాడు. ఆయనే తిరిగి 1984 లో "రిలిజియన్ ఇన్ ది సెక్యులార్ సిటీ" అనే పుస్తకంలో మళ్ళీ మతం పునర్జన్మ ఎత్తిందని, పెద్ద ఎత్తున ప్రజలు మతం పట్ల ఆకర్షితులవుతున్నారని, మతపరమైన చైతన్యం అంతటా వెల్లి విరుస్తోందని, అది తనకెంతో ఉరవడిని కలిగించే అంశమని పేర్కొన్నాడు.

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన రాబర్ట్ బెల్లాక్ అనే

కత్తులవంతెన

శ్రీ రామా చంద్రమౌళి

తప్పదు ఈ కత్తులవంతెనపై పరుగెత్తడం
అరికాళ్ళలోనుండి రక్తపుధారలు కనిపిస్తాయి.. .అగ్నిపుష్పాల్లా
కాని పిడికెడు హృదయంలోనుండి దూకే అశ్రుసముద్రాలో
తన్నుకుని తన్నుకుని గ్రుడ్డును చీల్చుకుని జీవితాన్ని పొందే పక్షిపిల్ల
పోరాటాన్ని ప్రవచిస్తూ

ఈ నా పిడికిళ్ళలో సూర్యుణ్ణి పొదుగుతూనే ఉంది.
ఐతే ఓడిపోవడం గెలుపుకు పునాది
మౌనం ప్రళయానికి నాంది
దేహం మండే కొలిమై, ఆత్మ ఎక్కుపెట్టిన ధనువై
లక్ష్యం నిర్మూలన....నిర్మూలన....వ్యాధిమూల నిర్మూలనై
శోధనతో, వేదనతో, పిక్కటిల్లు గర్జనతో
వచ్చే నా చూపులు....దహించే నలకేలలు, వణికించే జడివానలు

పరుగు....పరుగు....పరుగు
ఎక్కడికి....ఎక్కడికి. ..ఎక్కడికి___
తెలియని నీ 'ముందు' నుండి తెలియని నీ 'వెనుక'లోకి
మళ్ళీ ఒక శూన్యం....మళ్ళీ ఒక నిర్లిప్తత....మళ్ళీ ఒక ప్రశ్న
చేసే పని ఎందుకు....ఎవరి కోసం

నీ కోసమే ఐతే....డ్రాప్ ద కార్డ్స్
కనీసం ఇంకో మనిషికోసమైతే....ఆకుపచ్చజెండా....కమానఫైట్
పక్షి....ఒట్టి పక్షి
ఎందుకుపోరాడుతోంది ఆకాశంలో ....స్వేచ్ఛలోజీవించిమరణించడం కోసం
నిజమైన స్వేచ్ఛ నీకుందా....? ప్రశ్నను నీ ఎదలో గుచ్చుకుంటే
...బ్బాబ....ఆత్మహత్యే___

సోషియాలజీ ప్రొఫెసర్ మత ప్రతిష్ఠంపై కొన్యూనిటీ సంప్రదాయం మళ్ళీ పరాక్రమించి వచ్చి చేరుతుందని వ్యాఖ్యానించాడు. "ప్రొటెస్టెంట్స్ గ్యాప్" అనే పుస్తకంలో విల్లియమ్ స్నీదర్, సేమపుర్ మార్టిన్ లిప్సెట్ అనే శాస్త్ర నిపుణులు 1975 వరకు ప్రార్థనామందిరాలలోని సభ్యత్వం చాల తక్కువని, 1975 తరువాత బాగా పెరిగిందని పేర్కొన్నారు. 30 శాతం మంది మతపరమైన సంస్థలపై విశ్వాసం ప్రకటించినట్లు, బాప్టిస్మము చేసుకొంటున్న వారి సంఖ్యకూడా పెరుగుతున్నట్లు వారి పుస్తకంలో ఉంది!

యూదుల మత చైతన్యంపట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ "హార్వర్డ్-రాడ్క్లిఫ్ హిల్లెల్ సంస్థ" డైరెక్టర్ రబ్బి బెంజామిన్ గోర్డ్- "పాతిక సంవత్సరాలలో వచ్చిన ఈ మార్పు తననెంతో ముగ్ధుణ్ణి చేస్తున్నద"ని అన్నాడు. మసీదుల్లో ఖురాన్ పఠించేవారి సంఖ్య, చర్చిలలో బైబిల్ చదివేవారి సంఖ్య, బుద్ధుని సూక్తులను వల్లె వేసేవారి సంఖ్య, భగవద్గీతను నిత్యం పారాయణం చేసేవాళ్ళ సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. విశ్వహిందూ పరిషత్ వారు ఇటీవల కొనసాగించిన ఏకాత్మతా యజ్ఞానికి హాజరయినవారి సంఖ్యను గమనిస్తే మత భావన పట్ల మనవారి కుండే దృక్పథం ఏపాటిదో అర్థమవుతుంది. సామాజిక స్పృహను కలిగిస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించకుండా, జాతిని ముందుకు తీసుకొని వెళ్ళి మార్గదర్శకం గావించే మతంపట్ల ఎవరికీ నిరాపేక్ష ఉండదు. చికాగోలోని మత పరిశోధనా సంస్థలో రీసర్చ్ అసోసియేట్‌గా పనిచేసే ఆన్‌డ్రూగ్రీలీ అనే ఆయన ఎక్కువ మంది మతంలోని శాస్త్రీయ దృక్పథం పట్లే మక్కువ కనబరుస్తున్నారని తన సర్వేలో తేలిందని చెప్పడం గమనించ వలసిన విషయం. దేవుడున్నాడా? లేడా? అనే ప్రశ్నలో ఏమాత్రం సంబంధం లేని మతం పట్ల నాస్తికులు సయితం ఇష్టాన్ని కనబరుస్తారని ప్రొఫెసర్ డేనియల్ బెల్ అనడంలో అనౌచిత్య మేమీ లేదు. ఫిలాసఫీ ప్రొఫెసర్ హిల్లరీ పుట్‌మన్ జీవితంలో క్రమశిక్షణనీ నేర్పింది విలువైన అంశాలు ఉదాహరణకి – కమ్యూనిజం, మతగ్రంథాలు శాస్త్రీయసిద్ధాంత వ్యాసాలు మతం – మొదలైనవి ఎప్పుడూ సందేహం అందులోని సందేహాలను రేపుతూనే ఉంటాయని అనడం కాదనలేము.

మనదేశం విషయం కూడా అంతే! అది శతసహస్ర దళ పద్మము వంటిది. ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలు మిళితమైఉన్నా, మవుళికమైన మత భావనవల్ల నేటికీ అఖండంగా, అభేద్యంగా ఉంది. ప్రపంచ దేశాలలో మతం బాగా పడిపోయి నప్పుడు కూడా, మనదేశంలో మతం సమాజాన్ని ఉద్ధరిస్తూ ఉద్దీపింప జేస్తూనే ఉండిందన్న మాట సత్యదూరం కాదు. పోతే పాశ్చాత్యదేశాల వైఖరి ఇప్పుడిప్పుడే మారుతోంది. ఇది హర్షించదగ్గ మార్పే! పరదేశాల సంస్కృతుల వల్ల మన సంస్కృతి పలుచన అవుతున్నా, ప్రాథమికంగా సనాతన ధర్మమే సర్వత్రా కనిపించడం సంతోషాన్ని కలిగిస్తుంది. భారతీయుల ప్రత్యేకతగా ఈ అంశం నిలిచిపోతుంది కూడా!

మూఢనమ్మకాలకి, జంతుబలులకి, స్త్రీ న్యూనతా ధోరణులకి, పరమత విద్వేషాలకి, శత్రుత్వ వైఖరులకి, సంకుచిత మనస్తత్వాలకి, సామ్రాజ్య కాంక్షలకి, అధికార వాంఛలకి – దూరంగా వున్న మమతల ఒడి, మానవతా గుడి, మాతృత్వపు చావడి, పరాత్పరుని బంగారు గుడి, మతం! దాని ఒడిలో సేదదీరి, దాని లాలనలో ఊరడిల్లి జాతిభద్రత కోసం, మానవ సంక్షేమం కోసం కట్టుబడి ముందు కెళతానంటే – ఆనంద రసతప్త హృదయులై, కరుణార్ద్ర పూరిత మానసులై – ఆనందాశ్రువులు చిలికించని మానవ మాత్రులెవరైనా ఉంటారా?

కిటికీలోంచి వాన

ఎ.వి.వి.యస్.యస్. ప్రసాద్



చిరుజల్లు కొడ్తోంది –

వానపడ్డపుడల్లా రుక్మిణక్క గుర్తొస్తుంది –

రుక్మిణక్క గుర్తొచ్చినప్పుడల్లా 'వాన' కళ్ళముందు కురుస్తున్నట్టు అన్పిస్తుంది–

వానా, రుక్మిణక్క గుర్తొచ్చినప్పుడల్లా నా చిన్నతనం గుర్తొస్తుంది–

నా చిన్నతనంలో –

అప్పుడు నేను ఫస్ట్‌ఫారమ్ జిల్లా పరిషత్తు స్కూల్లో చదువుతున్నాను. వాన గట్టిగా కురిస్తే స్కూలుకి సెలవు !

ఆ రోజు వాన పెరుగుతుందన్న అంచనాతో మా మేస్టారు ఒడికి సెలవు ప్రకటించారు.

చిరుజల్లులో తడుస్తూ ఇంటికి చేరాను.

అరుక్క అనుకొని వున్న కిటికీలో రుక్మిణక్క దుప్పటి కప్పుకొని కూర్చుని వానలోకి చూస్తోంది... రుక్మిణి మా పెదనాన్నగారి అమ్మాయి.

రుక్మిణక్క థర్డ్‌ఫారమ్ వరకు చదివి మానేసింది.

"ఈడొచ్చిన పిల్ల బైటకెళ్ళకూడదంతే..." అన్నారు పెద్దవాళ్ళు.

"ఇక్కడ కూర్చున్నావేంటే ?..." అన్నాను గుమ్మంలోకి అడుగు పెడ్తూ

నా మాట వినబడ్డట్టులేదు.

"ఏమే...నిన్నే !" గట్టిగా అన్నాను.

"ఏమిట్రా ?..." అంది ఉలిక్కిపడి విసుగ్గా నాకేసి చూస్తూ.

"ఏం చేస్తున్నావే ?"

"వానలోకి చూస్తున్నాను." కళ్ళని విచిత్రంగా తిప్పుతూ అంది.

"నా బొంద. చూడడాన్కి ఇంకేమీ దొరకలేదా? వాన తప్ప." ఎక్కిరిస్తున్నట్టు అన్నాను.

"నీ మొహం నీకేం తెలుసురా." అంది కాస్త కోపంగా.

"ఏం తెలీదు. అందుకే మార్కులు కూడా తక్కువొచ్చాయి పరీక్షల్లో." పెద్ద తెలివిగా అన్నాను.

"ఎప్పుడు స్కూలుగోలే. వెళ్ళి ఆడుకో" కోపంగా అంది.

"బైట వానే" నవ్వుతూ అన్నా

"పెద్ద తెలివి."

"సరే కానీ రుక్కూ! ఏం చూస్తున్నావే నువ్వు వానలో. అదేదో నాకూ చూపెట్టరాదూ?" అన్నాను సౌమ్యంగా.

"నీ మొహానికి అంత ఇది కూడానా?..." అని అన్నా, తాతయ్యతో చెప్పి రుక్కుని తిట్టిస్తానని కాబోలు.

"సరే, ఇలారా." అంది.

కిటికీ పెద్దది. దుప్పటి నా క్కూడా కప్పింది.

ఇద్దరం వానలోకి చూస్తున్నాము.

'కాగితం పడవలకి ఏఏ పుస్తకాల్లో పేజీలు చింపాలా?' అని ఆలోచిస్తున్నాను.

"కాగితం పడవలు చేద్దామా?..." పైకే అన్నాను, మనస్సులో అనుకుంది.

"నీ బొంద. నోర్మూసు కూర్చో."

"ఎంతసేపు చూస్తాం ఇలా. చిరాగ్గా."

"చిరాకేమిట్రా చిరాకు.... ఆకాశంనుండి భూమికి ఏదో వర్తమానం తీసుకు వస్తున్నట్టు రాలే చినుకు... బంగారు తీగలా మెరిసే మెరుపు... చిరుజల్లుగా ప్రారంభమయి, క్రమేణా పెద్దగా కుంభవృష్టిగా... క్షణంలో ఎంత మార్పు?... పెద్ద చెరువులో తామరాకుమీద బిందువువేసే చినుకు... శివాలయ శిఖరంమీదపడి చిటుకుతున్న చినుకు... గాలికి వూగే ధ్వజస్థంభపు చిరు గంటలు... చిటారుకొమ్మలు, చివురు రెమ్మలు, లేత ఆకులు చినుకుస్పర్శకి పునర్జన్మ పొందుతున్నట్టు పులకించిపోతుంటే... వణుకుతూ పరవశించిపోతుంటే... తనలో పడిన చినుకులో స్వప్న ప్రపంచాన్ని ఆవిష్కరించుకొంటున్న పూవు... కొండమీది కోవెల ప్రాంగణంలోవున్న గడ్డిపూవుమీద నృత్యం చేస్తున్న చినుకు... అలలతో కదిలే చినుకు..., పచ్చని పైరుమీద కురిసే వాన... చిగురాకుచాటున వాన... చలిలో... చలికి వణుకుతూ, వానలో తడుస్తూ... సౌందర్య లోకాల అంచులకి చేరుకొంటుంటే... చుట్టూ పచ్చదనం... గడ్డిపూలు... పుప్పొడి రేణువులు... దూరంగా ఆకాశంలో విచ్చుకున్న హరివిల్లు... ఆ అనుభూతికి ఏ భాష సరిపోతుంది...?..." ఏదో చెప్పుకుంటూ పోతోంది. నాకంతా ఏదోలా వుంది.

ఆలా చెప్తున్నప్పుడు ఆమె కళ్ళల్లో తేజస్సు... వెలుగు... వినూత్న కాంతి... కళ్ళల్లో ముత్యాల్లా మెరుస్తూ నీళ్ళు... అందాన్ని వానచినుకులో అన్వేషిస్తోంది!

సౌందర్యాన్ని వాన చినుకులో వెతుకుతూ పరవశించిపోతున్న కమలం ఆమె —

ఎన్ని జన్మలు తపస్సు చేయాలో 'సౌందర్యోపాసన' చేయడాన్కి—?

అని యిప్పుడు అనిపిస్తోంది.

అప్పుడు ఆమె మాటలు సుద్ద బోరు!

వానని చూసినప్పుడల్లా పరవశించిపోయేది! పులకించి పోయేది!

కొన్నాళ్ళకి—

నేను కాలేజి చదువులకి పట్నం వెళ్ళవలసి వచ్చింది. అక్కడ మామయ్యగారింట్లో ఉండేవాడ్ని... పట్నంలో ఉన్నప్పుడు రుక్మిణి పెళ్ళి అయి పోయింది. నేను పెళ్ళికి వెళ్ళలేదు పరీక్షల వలన—

చదువు పూర్తయ్యాక ఉద్యోగాన్వేషణలో మా వూరుకేసి వెళ్ళలేదు. ఆదీకాక, నాన్నగారు వాళ్ళు నేను పట్నం వచ్చిన కొన్నాళ్ళకి, ఉన్న భూమి అమ్మేసి పట్నం వచ్చేశారు.

ఇవాళ—

ఇన్నాళ్ళకి—

దాదాపు పుష్కరంన్నర తరువాత ఈ వూరికి వచ్చాను.

ప్రొద్దున్నే దిగాను బస్సు.

కాస్త నడుంవాల్చి లేచేసరికి వాతావరణం మసకతెరలతో కమ్మి వుంది.

తాతయ్యపోయాక ఇల్లంతా బోసిగా వుంది...!

మామయ్య వాళ్ళుంటున్నారు ప్రస్తుతం.

కొంతసేపటికి చినుకులు ప్రారంభమయ్యాయి —

చినుకును చూసేసరికి రుక్మిణక్క గుర్తొచ్చింది —

'ఇప్పుడేం చేస్తోందో...?'

ఈ వూరు ఇవతలవైపు తాతయ్యగారిల్లు... అటువైపు రుక్మిణక్క అత్తారిల్లు... బావగారు స్కూలు టీచరు. వూరు దాదాపు మర్చిపోవడంవల్ల; మరోసారి చిరునామా మామయ్యనడిగి 'వానొస్తోంది... తరువాత వెళ్దువుగానీ అంటున్నా' వినకుండా గొడుగు తీసుకొని రుక్మిణక్క వాళ్ళింటికి బయలు దేరాను —

వానొస్తున్నప్పుడు రుక్మిణక్క ఏ చేస్తోందో? అనే కుతూహలం నాలాంటి బద్ధకస్తుడిని కూడా కదిలించింది.

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ, మధ్యలో ఒకరిద్దర్ని అడిగి, రుక్మిణక్క వాళ్ల ఇంటికి చేరుకున్నాను—

చినుకులు పెద్దవవుతున్నాయి—

ఆశ్చర్యం!

రుక్మిణక్క కిటికీలోంచి, రెప్ప కప్పకుండా, కూర్చుని చూస్తోంది వానని— వానచినుకులని!

"ఏమే క్షేమమేనా?" గుమ్మంలోకి అడుగుపెడ్తూ అడిగాను—

"..అ ..ఆఁ..." అని లేచి గ్లాసుతో మంచినీళ్ళు తీసుకొచ్చి, విశేషాలు అడిగింది.

వాన పెరుగుతోంది—

కొంతసేపటి తరువాత, నాతో మాట్లాడుతూనే కిటికీ చేరి, నాకేసి, వానకేసి చూస్తూ సంభాషణ కొనసాగిస్తోంది.

నేను ఏవో ప్రశ్నలు వేస్తున్నా, 'హూఁ' 'ఆఁ' అంటోందే కానీ, సరిగ్గా సమాధానం చెప్పడంలేదు, బహుశా వాన మహత్యం కాబోలు—

"ఏమిటే 'వానంటే' అప్పటికి, ఇప్పటికి ఇలాగే వున్నావా ...?" ఎలా ప్రశ్న వేయాలో తెలీలేదు .. నిముషం తరువాత—

"ఏమిటోలా శంకరం ... వాన చినుకల్లే ఖర్చులు ... పెరుగుతున్న వానలా, రోజురోజుకి 'అప్పు' పెరుగుతోంది ... వచ్చే జీతం చాలదు ... అప్పు తప్పదు ... పెద్దది పెళ్ళికొస్తోంది ... రెండోది చదువు ... మూడోవాడ్ని వచ్చే ఏడాదినుండి కాలేజి చదువుకి పట్నం పంపించాలి .. ట్యూషన్లు మునపటిలా రావడంలేదు. మధ్య మధ్యలో "పిడుగులా' ట్రాన్స్ఫర్ గొడవొకటి .. వానపడిన తరువాత ఏర్పడిన బురదలా వుంది జీవితం ... పెరుగుతున్న వానకి పెరుగుతున్న ఖర్చులకి..."

ఆశ్చర్యపోయాను—!

మునపటి అక్క!

ఇప్పటి అక్క!

'ఇద్దరి' అనుభూతుల్లో, భావాల్లో ఎంత తేడా?

కానీ—

అప్పుడు—

ఇప్పుడు—

వాన ఒక్కటే—

కిటికీలోంచే ఆ వానకూడా—

మునుసూరి సాంబశివరామమూర్తి

శ్రీ రాజరాజ నరేంద్ర చాళుక్యవంశ విస్తృతి

శ్రీకూర్మము

విషయ సూచిక :-

1) రాజరాజ నరేంద్రుని సాపత్నీసోదరుడు వీర విజయాదిత్యుడు ఆగర్భశత్రువగుటచే రాజరాజ నరేంద్ర పట్టాభిషేకము నాలుగు సంవత్సరములు నిలిచిపోయెను. 2) పది ఏండ్ల పిదప ఆ సోదరుడే రాజరాజును పదభ్రష్టుని గావించి సింహాసన మ్మాక్రమించెను. తిరిగి మరి పది ఏండ్లకు తిరిగి పదభ్రష్టుని గావించెను. అందుచే రాజరాజు సంధి గావించుకొని పశ్చిమ చాళుక్య సామంతుడయ్యెను.

విద్వద్గోష్ఠి కవిపోషణ దేశ భాషోద్ధారణ గ్రంథ రచనాకాలమున ప్రధానుడగు యువరాజును మహాభారత కర్తయగు కులబ్రాహ్మణుడు నన్నియ భట్టుయు వాని సహపాఠియగు నన్ని నారాయణుడు గూడ కనుమఱుగైరి.

అచిరకాలముననే నన్ని నారాయణ కూతురు కుపమయు రాజమార్తాండ విష్ణువర్ధనురేవల దేవుల కూతురు సోమిలదేవియు ద్రాక్షారామక్షేత్రమున శిలాశాసనములు నెలకొన్నవి.

యువరాజగు రాజేంద్రచోడుడు కాలాంతరమున విశ్వవిఖ్యాతుడై మాతామహ రాజ్యమగు చోళసామ్రాజ్యమునకు సార్వభౌముడై తిరిగి వేంగీ దేశమును వశపరుచుకొని తన కుమారులచే జననాథి నగరీ రాజధానిగా వేంగిని పరిపాలింప జేసెను.

రాజేంద్రచోడుని జీవితకాలమందే పరాంతకుని ఏలుబడిలో మానవ్యస గోత్ర రాజమహేంద్ర నివాసమున భారత కృతిపతియైన రాజరాజ నరేంద్రుని తన వంశపెద్దగా పంచ మహాశబ్ద లబ్ధ మహా మండలాధిపతి (దాపర్తి) విజయాదిత్యుని శాసనమును నెలకొనెను.

ఆ పిదప ఒక శతాబ్దానంతరము తిరిగి ఈ వంశీయులు పై విషయములనే బేర్కొనుచు కళింగగాంగ రాజుల దరిజేరి మంత్రి సేనాపతులై ప్రజ్ఞాపాటవమున గాంగరాజుల సామంత రాజులై శ్రీ కూర్మ చక్రవర్తులుగా ప్రసిద్ధి కెక్కిరి. ఆ గాంగరాజులును శ్రీ కూర్మ చక్రవర్తులను తమచు చాలుకకన్యా (సుందరుల) బాంధవ్యముల నొందిరి.

అంతకు ముందునుండియు చాలుక - చోడవంశజులైన పలువురు సోమిలదేవులు గాంగసార్వభౌముల రాణులైరి. ఆ సోమిలదేవీ సంబంధ బాంధవ్యముల వలన కాబోలు ఈ శ్రీ కూర్మచక్రవర్తుల మూలపురుషులు విజయాదిత్య రాజరాజాదులు గాంగసార్వభౌముల దరిజేర ననువు కలిగియుండును

అట్లు శ్రీ కూర్మ చాళుక్యులు 14వ శతాబ్దారంభమువరకును చక్రవర్తులను పేర గాంగసామంతులై శౌర్యధైర్య సాహసోపేతులై దానశాసనాదుల ప్రసిద్ధి కెక్కిరి.

అంతలో సర్వసిద్ధి, పంచదారలపాలకులైన దాపర్తి చాళుక్యులను బాహుబలోపేంద్రాదులును 15వ శతాబ్దారంభము వరకును పాలించిరి. వీరును శ్రీకూర్మ చాళుక్యులవలెనే చంద్రవంశము చాలుక్య భీముడు, రాజమహేంద్ర రాజధానీనగర రాజరాజును తమ మూల పురుషునిగ వర్ణించుచు చాళుక్యుల బిరుదులనే ధరించుచు రాజ్యమేలినట్లు పిన్నకోట పెద్దన విరచిత కావ్యాలంకార చూడామణి యందు వర్ణింపబడెను.

ఈ శ్రీ కూర్మ - సర్వసిద్ధి, పంచదారలు ప్రదేశములు సమీపముగ ఒక్కచోటనే యుండుటయు ఈ రెండు వంశములవారు మాత్రమే భారత రచనా రాజమహేంద్ర పట్టణ నివాసము మానవ్యసగోత్రము లుదాహరించుట చేతను సోమిలదేవుల బాంధవ్యములను ఈ రెండు వంశములవారును రాజరాజనరేంద్ర సంతతి వారయ్యెను.

శ్రీ కూర్మ చాళుక్యులు - శిలా శాసనములు

శ్రీ రాజరాజ నరేంద్ర చాళుక్య విష్ణువర్ధన వంశ విస్తృతి.

రచయిత :- మునునూరి సాంబశివరామమూర్తి (రామచంద్రపురం)

పీఠిక :- ఆంధ్రదేశమున తూర్పు చాళుక్య వంశీయులు వేంగీ సామ్రాజ్యాధిపతులై యశో విరాజితులైరి. అందున రాజమహేంద్రవరము రాజధానిగా రాజరాజ నరేంద్రుడు క్రీ. శ. 1031 వరకు పాలించి "ఆంధ్రభోజుడను" కీర్తి గాంచెను. రాజ్యమేలిన ప్రతి తూర్పు చాళుక్య రాజునకు "చాళుక్య విష్ణువర్ధనుడు" అనునది పట్టాభిషేక సార్థక నామము. ఆ రాజరాజ నరేంద్రుడు వేంగీ సార్వభౌముడై క్రీ. శ. 1061 వరకు పాలించెను. నిజమునకు అతని వంశము అంతటితో నిలచి పోయెను. (చ్యుతి గాంచెను). అని చెప్పవలసి యున్నది. అయితే అతనికి పుత్ర సంతతి లేకపోలేదు. ఆ పుత్రుడు అసమర్థుడునూ కాదు. కాని విధి వక్రించినది. దేశము అధోగతి పాలయినది. అందుకు గల కారణము ఆనాటి దాయాది కలహములు, శత్రు సమరములు, రాజకీయ కుటిల ద్రోహ చింతలు అనక తప్పదు.

అందువల్లనే రాజరాజ నరేంద్రుని పుత్రుడును, యువరాజును అగు రాజేంద్ర (చాళుక్య) చోడుడు (తండ్రిచే శిక్షింపబడి) దేశాంతర గతుడయ్యెను. తుదకా తండ్రీ, తనయులు జీవితాంతము వరకును, ముఖ సందర్శనమునకైనను నోచుకొనరైరి. ఆనాటి కుటిల రాజకీయ ద్రోహ చింతలంతటి జుగుప్సాకరములై మహాకవుల కావ్యముల నెలుగెత్తి చాటసాగినవి.

దేశాంతర గతుడైన యువరాజ రాజేంద్ర (చాళుక్య) చోడుడు ప్రవాస జీవితమున నానా యిడుములు గుడిచి కొంత వడికి (ఒక దశాబ్దానంతరము) మాతామహులగు చోడ సామ్రాజ్యాధిపతుల నాశ్రయించి, మెప్పుపొంది ఆ చోడ రాజ పుత్రికను పెండ్లాడి యిల్లరికపుటల్లుడై సైన్యాధికారియై రణరంగమున వారి శత్రువుల నుక్కడించి ఆ మాతా మహ చోడ సామ్రాజ్యమునకు సార్వభౌముడయ్యెను. అప్పటి కాతడు నిజదేశమగు వేంగీ మండలమునుండి వైదొలగుట చేతను జన్మకారణులగు తల్లితండ్రులను చిరకాలము క్రితమే వీడియుండుటవల్లను తనకిచ్చుట ఏమాత్రము అండదండలు చేకూర్చకపోవుట చేతను మాతామహుల అండదండలు చేకూరి మనుగడ సాగించి అభివృద్ధి చెందుట చేతను రాజ్యాధిపత్య మొనగూరుట చేతను ఆత్మవంశ (చాళుక్య) చ్యుతుడై పంచపిత సాంప్రదాయాను సారముగా చాళుక్య విష్ణువర్ధన నామము" త్యజించి ఉభయ కులోత్తుంగ రాజేంద్ర చోడుడు అను సార్థక నామమున ప్రసిద్ధుడయ్యెను.

అంతలో అతని తండ్రి శత్రు రణరంగమున వీరమరణము నొందుటచే అతను, అప్పటికిని పైతృక రాజ్యమున తనకు అండదండలు చేకూరకుండుట చేతను, రాజ్యము పరహస్తము కాకుండా కాపాడుటకై తనకును, తన తండ్రికిని కూడ ఆగర్భశత్రువైన తన పినతండ్రి సప్తమ విజయాదిత్యునకే రాజ్యము వదిలి వేసెను. అయితే దైవ దుర్విపాకమున ఆ పినతండ్రియు అతని పుత్రుడును కూడ కుటుంబాభివృద్ధి లేకనే మరణించిరి. కాలకర్మ దోషముచే వంశచ్యుతి కలిగి యున్నను ఆ రాజరాజ నరేంద్రుడు సరస సాహిత్య గోష్ఠి విలాసుడై విలసిల్లుచు పండిత, కవి, గాయకుల పోషించి తన కులబ్రాహ్మణుడును

అవిరళ జపతప హోమ తత్పరుడును అగు "నన్నయ" భట్టారకునిచే వ్యాస భగవానుని సంస్కృత మహాభారతమును ఆంధ్రీకరింపజేసి తాను కృతిపతియై "ఆంధ్రభోజుడు" అను యశశ్చంద్రికల విశ్వవ్యాప్తినందెను. అయ్యది ఆ మహాపురుషునికి యిప్పటి స్మృతిద్వారా కాన వానికొలు ఆంధ్ర మహాభారతము దేశభాషా నుడికార్య వ్యాప్తికి కారకుడై తెలుగునకు కృతజ్ఞత పాత్రుడయ్యెను.

వేంగి మండలమున పూర్వ చాళుక్య రాజవంశము అంతరించి మరల్ల వారు దేశమునందును, కాల మనంతము, లోక మెరుగదగు ఉండుటే చెప్పదగిన రాజ్యమ్మై వినయ గౌరవముతో ప్రశంసింప బడినది ఆ వంశములు పెద్దపెద్ద వైభవము కాలగతిచే నశించెను, స్థలాంతరములు, అనేక విధముల యశశ్చక్రవర్తులై గోచరించుచున్నారు.

ఆంధ్ర భారతావతరణమున రాజరాజ నరేంద్రుడును శాసనములు లేవే యుండినను ఆ కొండంతచే ఆంకిత నన్నపార్యుడును ప్రకాశించు చున్నారు. వారు ఆ ఆంధ్ర మహాభారత కృతిపతిత్వ సంస్మరణచే ఆతని నిజసంతతివారై చాళుక్య వంశోద్ధారకులు అయి వారును నిజగుణగణభూరిధైర్య శౌర్య సాహసోదంతముల యశోవిరాజితులైరి.

అయితే వారు పైతృకమైన వేంగి సామ్రాజ్యాధి పత్యము రాజ మహేంద్రవరమున గానరాదు. ఆనాటి దేశద్రోహ కుటిల రాజకీయ తంత్రము లచే యువరాజే దేశాంతరముల ప్రవాసియయ్యెను. సార్వభౌముడే రణరంగమున వీరస్వర్గమునలంకరించెను. అట్టి తరి అంతఃపురజనులకు ఆశ్రితులకు రాజబంధు వులకు లచ్చట మనుగడలెట్టిసలిదును. అందుచే వారందరును యువరాజు వలెనే ప్రవాస జీవితము గావించిరి. ఆ యువరాజు తిరిగి ఉభయ మండల సామ్రాజ్య సార్వభౌముడైనను ఆంధ్రమండలము (వెనుకటి జుగుప్సాకర హేతువుల రోసి) తాను పాలింప నొడంబడక తన సంతతి వారల రాజ్రప్రతినిధుల గావించి వారి నైనను పైతృక రాజధానీ నగర నివాసము నిషేదించి 'జననాథపురము'ను రాజధానీ నగరము గావించి పట్టాభిషేకమందనాజ్ఞలనిచ్చెను. అందుచే నాటి నుండియు రాజరాజ నరేంద్ర అంతఃపురవాసులు, ఆశ్రితులు జననాథపురవాసులై క్రమక్రమముగా కాలాంతరముల మారదూరములకేగి తుదకు యిరుగు పొరుగు రాజ్యముల స్థిరపడిరి.

రాజరాజ నరేంద్రుని పాలనాకాలమందే క్రీ. శ. 1035 ప్రాంతముననే ఆతని కులబ్రాహ్మణునిగా ఏతెంచినట్టియు ఆస్థాన కవివర్యుడుగాను శాసన కార్య కర్తగాను వర్ధిల్లిన నన్నయ భట్టారకులు కాని పశ్చిమ చాళుక్య ప్రభువు త్రైలోక్యమల్లదేవర ప్రధానియై రాజరాజ నరేంద్రునితో ఆ ప్రభువుకు సంధి కల్పిక తన తూర్పు చాళుక్య ప్రభువుల ఆస్థానమున జేరిన నన్నయ భట్టారకుని సహపాఠి యగు కారణమునను తాను అష్టభాషాకవితా ప్రవీణుడగుటచేనను భారత రచనలో నన్నియ్యకు తోడైన నారాయణభట్టును క్రీ. శ.   నవంబరు నుండియు ఏమైరో తెలియరాకుండా వేంగి సంస్థానమున కనుపించరైరి. ఆ యిరువురి సంస్మ రణ నందంపూడి మండ త్రామ శాసనములే ఆధారములు. అందు నందంపూడి త్రామ శాసనములోగల దాన ప్రశస్తియందు సర్వసాధారణమైన "మంత్రి పురోహిత సేనాపతి, దౌవారిక, యువరాజు ప్రధాన సముత్ మిత్థమాజ్ఞాపయతి" అను పాఠము అంతరించినది. మండ త్రామ శాసనమున క్రొత్తరీతి పోలు పొంది "సర్వ ప్రధాన సేనుక్షమిత్థమాజ్ఞాపయతి" అను వాక్యము దొరకున్నది. దీనిని గమనింప శాసన కర్తయగు నన్నియ భట్టారకునిచే పంచ ప్రధానులలో ప్రముఖుడైన యువరాజు అంతర్గతుడైనాడు. ఇది సామాన్య విషయము కాదు. దీనిచే యువ రాజు అప్పటికే స్వస్థలము వీడి పరవీహ్యుతుడై దేశాంతరగతుడైనాడని తెలియ దగును.

ఆ పిమ్మట రాజరాజ మరణానంతరము ఆతని ఆగర్భశత్రువుడును సాపత్న సోదరుడు అయిన సప్తమ విజయాదిత్యుడు రణరంగమున రాజరాజ మరణమునకు కారణభూతుడై అన్న రాజ్యము తాను వశపరచుకొనుటచే తొల్లిటి ప్రభువైన రాజరాజ మరణముతోనే అంతఃపురము, ఆశ్రితులు, ఆస్థాన వాసులు కూడా అచ్చటు వదిలి పరదేశములకు ప్రవాసులైరి. అది ఆనాటి సహజ పద్ధతి. అటులనే వారి జీవిత శేషగాథలేఖియు నెవ్వరికిని గానరాకున్నది.

అందుకు తార్కాణముగా ద్రాక్షారామ భీమేశ్వరుని ప్రాంగణమునే ఆత్మల్ప కాలమునందే క్రీ. శ. 1055వ రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవిపీఠ మలంకరించిన (నన్నె) నారాయణభట్టు (పశ్చిమ చాళుక్య ప్రధమమంత్రి) కూతురు కుసుమాదేవి నిలిపిన దీపదాన శిలాశాసనము సాక్షీభూతముగా నిలచియున్నది. అది చాళుక్య సప్తమ విజయాదిత్య విష్ణువర్ధనుని పరిపాలనా కాలమందే నెల కొన్నది.

అంతేకాదు క్రీ. శ. 1065 రాజరాజ నరేంద్రుని మరణానంత రము సమయకాలమందే ద్రాక్షారామ భీమేశ్వరుని ప్రోలనే రాజమార్తాండ ఘూర్జరి - శ్రీ విష్ణువర్ధన భూవిభుడయ భూమి దేవింటోల్ రవల దేవికినిన సోమల దేవి నొసర్చిన దీపం రౌస్యంచ కిసకరచితరుచిర కంబమే నిరామం. నిలిపిన బంధము మొసగిన శిలాశాసనము ప్రత్యక్ష సాక్ష్యమే కదా !

విషయము :—

వంశ వి స్తరణావలోకము.

ఈ పై విషయములు గమనింప రాజరాజుని మరణానంతరము వేంగి మండలము శత్రుహ స్తముగతచే ప్రకృత్యనుసారముగా తొల్లిటి రాజ వంశము, ఆస్థానము, అంతఃపురము, ఆశ్రితులునుకూడా ఆ ప్రదేశమును తను మరుగై ప్రవాస జీవిత శేషముల గడిపిరి. కాని వారు అచ్చట అచ్చట మనుగడ సాగింతురో జీవిత శేషములు ఎట్లు సాగినవో తెలియనగు సాధన సంపత్తి చేకూ రుట లేదు.

చాళుక్యమ్యుతి నొందిన యువరాజ రాజేంద్ర చోలుడు (చాలుక్యుడు) మాత్రము నానాదేశ సంచారియై ప్రచ్ఛన్న జీవితమున కాలము వెళ్ళబుచ్చి తుదకు మాతామహులదగు చోడదేశము చేరి కన్యను బెండ్లాడి యిల్లరికపుటల్లుడై సేనాధిపతియై వారి కొలువు కూటమున నిలచి శత్రుసంహారమొనర్చెను. కాలము అనుకూలించు తరి ఉభయకులోత్తుంగ చోడ చక్రవర్తియై యశో విరాజితు డయ్యెను. సప్తమ విజయాదిత్యుని మరణానంతరమున తన పుత్రులు వరుసగా పైతృకరాజ్యము (వేంగి) నకు పట్టముగట్టి రాజ్యమేలించెను. అప్పటినుండియు ఆ సంతతి (రాజేంద్రచోడుని) వారెల్లరు చోళులై చోళరాజ్య చక్రవర్తులైరి. వారు తిరిగి వేంగి మండల నివాసులు కాలేదు. ఆ విధముగా వేంగి మండలమున చాలుక్య వంశచ్యుతి వాటిల్లినది.

కాని అంతటితో రాజరాజ నరేంద్రుని వంశము అంతరించి పోలేదు. దేశ మనంతము, కాల మనంతము, అమవస వెనుక పౌర్ణమాస్య సిద్ధించుట ప్రకృతి సిద్ధమేకదా ? అట్లే సమయానుకూల కాలమాసన్నమగుటచే వారు స్థానభ్రష్టులు, పదభ్రష్టులు అయినను వారి నిజవంశ గుణగణ కీర్తనములచే స్థలాంతరముల తిరిగి సుప్రసిద్ధులై వెలుగొందిరి.

ఇందుకు ప్రమాణము ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వారి ఆలయమున లోపలి ప్రాకార ద్వారమునుండి ఉత్తరాభిముఖియై శ్రీ భీమేశ్వరస్వామి సన్నిధికి ప్రవేశించుటలో దేవర హుండీగల స్తంభముపై యున్నది. (1) సౌ. ఇం. ఇన్స్క్రిప్షన్స్. వాల్ 4. 1878 ఎ. పి. 488. ఎ. ఆర్. 440 ఆఫ్ 1893.

1. [శ్రీ] మద్విజయాదిత్య లక్ష్మీ శాశి . . .
2. తజీవినః [*] భారతాత్యాన [క] ల్లో [ల] శశ్వ . . .
3. దురు కీ ర్తిర్ ధవళీక్రిత లో కాశి. . .
4. . . . యద [స్తే] విని బ్బి ఇ ర శం క్కారతవిబుధ్రప . . .
5. చాళుక్య [వం] శోవిభవామ [రే] ం ద్రః [దేవ]
6. [శ్రీ] లోకే నరేంద్రనృపః . . . శాకాబ్దే నాగ [నన్ద]
7. [గ్నై] న్నర్ భేం [ద్రు] . . . వరవిలసిత . . .
8. గోపసీయః పంచ్ఛ . . .
9. మూల్కో తర్థం ప . . . ధ నామ్నే . . .
10. త్తరం ఆదిపతి . . . కోటి సహః . . .
11. క్రం శ్రీ విష్ణు వర్ధరిన మహారాజుల . . .
12. . . . త్ను నరేంద్ర దేవ . . .
13. . . . శ్రోలు బాడిలోని పసత్రా . . .
14. [ం] ట్టి రక్షణము నం బంధుః . . .
15. . . . .

శాసన విభాగము :-

ఇది శాకాబ్దేనాగ [నన్దా] [గ్ని] [న్నర్ బేందు] అని ఉదాహరింపబడుటచే శా. శ. 1038. అనగా క్రీ. శ. 1116 సం॥న గావింపబడినది. అనగా తూర్పుచాలుక్య రాజరాజనరేంద్ర వేంగి సార్వభౌముని మరణానంతరమున 54సం॥లకు నెలకొన్నది. అప్పటికి చాలుక్య యువరాజు రాజేంద్రచోడుడు ఉభయ కులోత్తుంగ చోడుడు అను పేర చోడ సామ్రాజ్యాధిపతియై యుండి ఆగర్భ శత్రువైన పినతండ్రి సప్తమ విష్ణువర్ధన విజయాదిత్యుని మరణానంతరమున పైత్రుకమైన వేంగి దేశాధిపతియై తాను చోడ దేశమునందుండియే తన కుమారుల జననాథపురమును రాజధానిగా చేసి రాజ ప్రతినిధులుగా వేంగి రాజ్యము నేలించెను. ఈ శాసన కాలము నాటికి రాజేంద్ర చోడ పుత్రుడగు విక్రమచోడుడు పరాంకుసుడు అను పట్టాభిషేక నామముతో 1094 - 1118 వరకును పాలించెను. ఈతని కాలమున సామంతాదులెల్లరు సీతని పాలన నొల్లక ఇతరులతో కలసి శత్రుకుమారుల జేరదీసి ఎదిరించి స్వతంత్రులై రణరంగమున పోర దొరకున్నది. అప్పుడు రాజేంద్రచోడుడు ఆదినుండియు విశ్వాసపాత్రులైన వారినే సైన్యాధిపత్య మొనర్చి అండగ నిల్పెను. వారిచే శత్రుపరాజయము గావించి అందు కొందరకు సామంతరాజ చిహ్న ప్రధానము గావించి సామంతరాజుల మహా మండలేశ్వర గావించెను. ఆ తరుణముననే ద్రాక్షారామ భీమేశ్వర సన్నిధానమున 'ఒడ్డవాడి చోడయ', 'వీరగొట్టం చోడయ', 'వీరగొట్టం సూరన', 'జంతురునాటి తమ్మన', 'రాపర్తి చేతయ', 'సరుదునాటి వీర చోడుడు' శత్రురాజుల గూడి రాజ ద్రోహులైన తిరిగి వారు పశ్చాత్తపులై, పరాంతక దేవుని తప్ప వేరొకరిని గొల్చువారము కామనియు అట్లు జరిగిన మా ఇల్లాండ్రను వారికిచ్చిన వారము అగుదము. వారే మాపైన మమ్మేలినచో వారి ఇల్లాండ్రను మాకు ఈయకొంచుమనియు ప్రమాణపూర్వక శాసనములు గావింపబడినవి. అనగా ఆనాటి దేశమెంత కల్లోల పరిస్థితుల నలుముకొన్నదో గ్రహింపవచ్చును. అట్టి తరుణమునందే ఈ పైని పేర్కొన్న "పంద్రువాడ" గ్రామ ప్రధాన శాసనము నెలకొన్నది. ఈ దానమున నుదహరింపబడిన శ్రీ విష్ణువర్ధన మహారాజు పరాంతక దేవుడును పట్టాభిషేక నామాంచ్యుతుడైన విక్రమచోడుడే.

విజయాదిత్యుడు భారతాఖ్యాన కల్లోల శశ్వదురు కీర్తిధవళాకృతుడు వినిర్భిత శంకారః కవిబధ ప్రకార చాలుక్య చంద్ర విభోవామరేంద్రుడు లోక నరేంద్ర నృపుడు [రాజరాజ నరేంద్రుడు] అగువానిచే పంచ మహాశబ్దముల గైకొనిన మహా మండలేశ్వరుడు. అతని సామంతరాజ్య ప్రదేశ భాగము ఈ శిలాశాసనమున అక్షర శైథిల్యమందుటచే తెలియరాకున్నది. దాన భాగము ప్రోలునాటిలోని పసరపూడి దక్షిణ భాగములో యున్న పంద్రువాడ గ్రామము. ఇది తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం తాలూకాలో యున్నది. ఈ దానమెవ్వరికీయబడెనో అక్షర శైథిల్యముచే తెలియరాకున్నను ద్రాక్షారామ భీమేశ్వరాలయమున నెలకొనుటచే ఇది ఆ భీమేశ్వరునికే గావింపబడెనని చెప్పనొప్పును.

ఈ విజయాదిత్యుడు ఎవ్వరైనదీ ఈ శాసనము వలన విశదమగుటలేదు. కాని ఇందు శ్రీమద్విజయాదిత్యోల్లక్ష్మీశాళి ... తజీవినః - శ్రీ విష్ణువర్ధన మహారాజుల ... రాజ నరేంద్రదేవ అనుటచేతను పంచ్చ ... అద్రిపతి ... కోటిసహా ... అని యుదహరించుటచే ఈతడు స్వతంత్రాధినేత గాక శ్రీ విష్ణువర్ధనుల సామంతుడనియు హిమవంతుని కూతురైన ఉమాదేవితో కూడిన శ్రీ భీమేశ్వరస్వామి వారి నాశ్రయించిన వాడనియు కవిబుధ ప్రకాండునిచే భారతాఖ్యానము తెనిగింపచేసి గొప్ప కీర్తిని పొందిన చాలుక్య చంద్రుడను వైభవ నామాంచితుడగుటచే వారి వంశజుడగుట చేతను ఈ విజయాదిత్యుడు తూర్పు చాలుక్య రాజరాజ నరేంద్రుని వంశము వాడనియు ఆనాటి పరాంతక దేవ విక్రమ చోడ విష్ణువర్ధనునిచే పంచ మహాశబ్దముల గైకొన్న సామంతరాజైన మహా మండలేశ్వరుడనియు దృఢము గావించవలసియున్నది. దీనికి తోడు ఆ సం॥లోనే ద్రాక్షారామ భీమేశ్వరాలయమున వేరొక శిలాశాసనము యున్నది. పరాంతక దేవుడు ద్రాక్షారామ భీమేశ్వరునకు 'శాల' యను గ్రామము సర్వకర పరిహారముగా చేసి, శ్రీ స్వామి వారి హవి బల్యర్చనల నిమిత్తము దేవభోగముగాను శివ పార్వతుల పార్శ్వమున హిమవత్పుత్రియగు 'పార్వతి'ని ప్రతిష్ఠించి తత్ పూజార్థము 'పంద్రువాడ' గ్రామమును మార్గశిర మాసమున ఆర్ద్రానక్షత్ర ఉత్సవము జరుగు నిమిత్తము ఒరటివాడ గ్రామమును, ఆశ్వయుజమాసమున పూర్వఫల్గునీ నక్షత్రోత్సవము జరుపుటకై భీమేశ్వరుని పోక తోటను పరాంతక చక్రవర్తి దాన శాసనము గావించి ఆలయ కుడ్యభాగము నిల్వరించెను.

ఇందలి విశేషము సార్వభౌమ సామంత రాజులిరువురును ఒకే దైవమునకు ఒక్క సం॥రమునందే గ్రామదానము గావించుట, ఒకే స్థలమున శాసనములు గ్రహించుటచే ఇందెవ్వరు దేనిని ముందు గావించిరో ఎవరి తరువాత ఎవరు ఏల గావించిరో నూహింప శక్యము గాకున్నది. సామంతుడు ఒక్క గ్రామదానము గావింపగా సార్వభౌముడు ఆ గ్రామమును కూడ నుదహరించుచు మరి రెండు గ్రామములను, ఒక పోక తోటను కల్పి దానశాసనము గావించెను. ఈ రెండవ శాసన సమయమునకు ఆ సార్వభౌమ సామంత మండల ప్రభువుల అన్యోన్యానురాగాల, బాంధవ్య అనుకూల, ప్రతికూల శత్రుత్వముల వివరింప శక్యముకాకున్నది. కాని ఆనాటి పరిస్థితులు గమనింప సామంత సార్వభౌములు యిరువురును అన్యోన్యానురాగ బద్ధులైరనియు సామంతరాజు తన ఏలుబడిలో యున్న పంద్రువాడ గ్రామము మాత్రమే దానము గావింపగా సార్వభౌము డంగీకరించి, సంతసముతో తన అధికారములోని మరి రెండు గ్రామములను గూడ జతకూర్చి దానమునర్చిన యశో విశాలుడయ్యెను.

ఈ శాసనమున మరియొక విశేషము :-

వేంగి సార్వభౌముడైన తూర్పు చాలుక్య రాజరాజ నరేంద్ర కీర్తి వైభవము కేవలము సార్వభౌమాధికార పరిణామము చేతనే చేకూరినది కాదు. అంతవరకున్న సాహిత్య రసపోషణకు నిలయమైన సంస్కృత భాషను వెలి గావించి దేశభాషలకు ప్రోత్సాహము కల్పించుచూ పంచమ వేదమైన వ్యాస కృప సంస్కృత భారతమును తన ఆస్థాన కవి అగు కులబ్రాహ్మణునిచే ఆంధ్రీకరింప చేయుట చేతను, అతడు ఆంధ్రభోజుడను పేరుతో శ్లాఘింపబడి కృతజ్ఞతా సూచకముగా కీర్తన నీయదయ్యెను. అయితే ఆ విషయము 'నన్నియ' భట్టారకృత మహాభారత అవతారిక ఆశ్వాసాంత పద్యములవల్లనే విదితమగుచున్నది. కాని శాసనమూలములు విదితమగుటలేదు. ఆ భారత రచనా కాలము 68 సం॥రములు గడిచినను కృతికర్త రాజరాజ నరేంద్రుని కాలగతి 53 సం॥రములు గడిచినను ఇంతవరకు మరెవ్వరును ఈ విషయమెందుకు లిఖిత పూర్వకముగా వెలిబుచ్చి యుండలేదు. కాని ఈ శాసనమందే విజయాదిత్య మహా మండలాధిపతియే ప్రప్రథమముగా శాసన పూర్వకముగా వెల్లడించియున్నాడు. ఇందీతని తండ్రి తాతల పేర్ల నుదహరింపలేదు. అయినను ఆ భారత కృతిపతి రాజరాజ నరేంద్రుని కుమారుడు రాజేంద్రచోడుడు ఉభయ కులోత్తుంగ చోడుడై జీవించుచు కుమారులచే వేంగి రాజ్యమును పాలింప చేయుచునే యున్నాడు. కావున ఈ 5 సం॥రముల కాలము తరములు దాటిన అత్యంత వ్యవధి కాలము కానేరదు. అందుచే ఈ సార్వభౌమ సామంతుడైన రాజేంద్ర చోడుడును చాలుక్య చోడ విష్ణువర్ధన పరాంతక దేవుడును ఈ విజయాదిత్య మహా మండలేశ్వరుడును సమకాలికులే గాని వేరుగాదు. రాజేంద్ర చోడుడు చాలుక్య రాజరాజ నరేంద్ర విష్ణువర్ధనుని ఔరస పుత్రుడగుటచేతను ఈ విజయాదిత్యుడు ఆ చాలుక్య వంశమునే వర్ణింపుచూ ఆ విష్ణువర్ధనుని చేతనే పంచ మహా శబ్దలబ్ధిని సామంత మహా మండలేశ్వరుడగుటచేతను వీరు యిరువురకును అతి సన్నిహిత బాంధవ్యముండి యుండవలెను. అంతేకాక తూర్పు చాలుక్య వంశమున ఆ కాలమునందు ఇంకెవ్వరును విజయాదిత్యుడు లేకుండుట చేతను ఆ చాలుక్య వంశ రాజరాజ నరేంద్రుడే తన కులపెద్దగా వర్ణించుట చేతను రాజులు బహువల్లభులగుటచేతను రాజరాజ నరేంద్ర విష్ణువర్ధనునకు యువరాజు రాజేంద్ర చోడుడు ఒక్కడే కుమారుడు కాదనియు "కృతాభిషేక మహిషి భోగిన్యో అన్యనృపస్త్రియః" అను నైఘంటిక సూత్రముచే నీతడు ఆ రాజరాజ నరేంద్రుని వేరొక భార్య (పెండ్లాడిన భార్య) వలన జన్మించిన వాడే విజయాదిత్యుడనియును యువరాజు ప్రవాస దేశాంతర గతుడగుటవల్లను సార్వభౌముని మరణానంతరము రాజ్యము శత్రుగతమగుటవల్లను తొల్లిటి రాజాంతఃపురము రాచకీయోద్యోగులు, ఆశ్రితులువలెనే ఈ వీర విజయాదిత్యుడును ప్రవాస జీవితమునందున కాలము గడిపి తరుణకాల మాసన్నము కాగా క్రీ. శ. 1116 సం॥రము పంచ మహా శబ్దాదులనంది మహా మండలేశ్వరుడగుటకు వీలు కల్గినది. అందుచే వీరు యిరువురును సాపత్ని సోదరుడన వీలగుచున్నది.

రెండవ భాగము

శ్రీ కూర్మ చాళుక్య చక్రవర్తులు - శాసనములు

శ్రీ కూర్మములోని శిలా శాసనములు

ఎ. పి. ఇన్. వాల్ ౯, పు. 82, వాల్ 4, పు. 236, శ. వ. 1195.

1. స్వస్తి - శ్రీమాన భూత్ పురాకశ్చిత్సోమవంశే మహాశయం- [1 *] చాళు...

2. క్య విమలాదిత్య చక్రవర్తిర్ నృపాగ్రణిః [౧ *]. ఏక ఏవనభో దేశే...

3. యధా చంద్ర [ః *] శ్రీయాయు [తః] నమయశ్చను శత్రు పద్మాని...

4. తధాసక్షితి మండలే [౨ *] తస్మాదభూత్ క్షితి పతి ప్రణుతాం...

5. త్రిమి పద్మ [ః *] శ్రీరాజ రాజ నృపతిః ప్రవిశాల కీర్తిః యస్సూరి...

6. భి సహకిల స్మృతి జాల సార మంధ్రీ చకార విరహ భా...

7. రతవంశ వృత్తం [౩ *] సేవాగత నృపాకర్ణే రాజమహేం...

8. ద్ర పట్టనే [1 *] స్థితోపి తేజసాక్రాంతే ర రాజ వసుధా...

9. తలే [*] శంకా మన్య మహోదధౌచ విధధేనా కౌక సా...

10. ం ఫేనయా [౪ *] యస్త (త్వా) ద్ధదబో వితాన వితతే [ః] పా...

11. దబ్బంద్దేన్నృణాం అసారే తది భోరు విలుఠ ద్దా...

12. హాం బుభి [ః *] స్రోత సాం ప్రత్యర్థిక్షితి పాల మౌళి మ

13. ణి రు జ్న రాజి తాంఘ్రి ద్వయః [౫ *] తద్వంశే విజయా

14. దిత్య ఇతి ఖ్యాతో నృపో భవది మానవ్యస సుగోత్రీ [యో]

15. విజయశ్రీ నికేతనం [౬ *] తస్మాజ్ఞాతశ్చరాజ దూ రాజరా

16. జ ఇతి స్మృతః మంత్రీ వీర నృ సింహస్యవాదస్పతిమ

17. హా మతిః [౭ *] తస్య సూను స్సురా ధీశ తులితోద్ధమ ప్రకృతః [1 *]

18. జానాతి విదుషాం యోర్ధం గుణౌరత్నా కరో పమః [౮ *]

19. స్వస్తిశ్రీ శాకవర్షే శరనిధి శశి భూ సమ్మి తా [ర్కే] తులాస్థే రుద్రా

20. హే సౌమ్య వారే సితయు జి [మహా] తః కూర్మ నాథస్య నిత్యం ప్రా-

21. దాద్దీపాయ పంచోత్తర దశ యుగా [ః] వాంఛి తార్థస్య సిద్ధ్యై సో...


22. యం చాలుక్య వంశాంబుది శశి విజయాదిత్య చక్రవర్తి [౯ *]ని


23. త్యం నిర్మల చేత సైక రైవ ష్ణ వైర్నీతి వేదిభిః [1 *] గ్రామీ ణైరపి ధర్మేయం.

24. పాలనే యః ప్ర [య] త్న తః [౧౦ *]

ఈ శాసనము 19, 20 పంక్తుల ప్రకారము శ. వ (శర నిధి శశి భూ సమ్మితా) 1195 (అర్కే తులాస్థే రుద్రా హే సౌమ్యవాసరే సితయుజి) తులా మాసము శుద్ధ ఏకాదశి సోమవారం అనగా క్రీ. శ. 1273 అక్టోబరు లేక నవంబరు నెలల్లో నెలకొన్నది. అనగా పైని పేర్కొన్న భారతమును ఆంధ్రీకరింప చేసిన రాజరాజ నరేంద్రుని వంశజుడైన విజయాదిత్యుని పండ్రువాడ శిలా శాసన మనంతరము అనగా 1273-1117 = 156 సం॥ వెనుక కళింగ దేశ మందలి శ్రీ కూర్మ చక్రవర్తులై కళింగ సామ్రాజ్య సార్వభౌమ వీరభానుని మహా మంత్రియై ప్రత్యక్ష మయ్యెను. అతని తండ్రి రాజ రాజు అనియు తాత విజయా దిత్యుడనియు పేర్కొనెను. అంతేకాక తన వంశమును వెనుకటి విజయాదిత్య శాసనమున బేర్కొన్న ముందు వాడగు అతని తండ్రి విమలాదిత్యుని గూడ బేర్కొనుచూ సోమవంశము, మానవ్యస గోత్రమును గూడ బేర్కొని తన వంశమూలమును నిర్ద్వంద్వముగ రూఢి పరచినాడు. అందుకు గల కారణము జాగ్రత్తగా పరిశీలించిన గోచరమగును. రాజ మహేంద్ర వాసియైన రాజ రాజు గతించి 1273-1053=250 సం॥ చిరకాలము గడచినది ఈ లోపున ఈ వంశం వారు ప్రవాసముననను, ప్రచ్ఛన్నముననూ మనుగడ సాగించిరి. అందుచే ఆ విషయ [వంశ] నిర్ధారణమునకై ఇట్లు సోమవంశమని శాసనముల బేర్కొన్న ప్రప్రధముడైన 'విమలా దిత్యుని' బేర్కొనుచూ ఈ వంశము మానవ్యస గోత్ర మని రూఢి గావించెను. చిరకాల వ్యవధిచే ప్రజలు గుర్తించుటకు అసాధ్యము. కావున అంత లోతునకు బోయి నిర్ద్వంద్వముగా రూఢి గావింపవలసి వచ్చినది. అంతతో బోక తన తండ్రి తాతలను కూడ బేర్కొని 200 సం॥ కాలము గూడ వ్యవధి లేకుండా ఋజువు గావించెను. అప్పటికి పదవీచ్యుతుడై ప్రవాస జీవితము నొందిన తరి కాలమనుకూలించి తొల్లిటి పైతృక స్థానము నొదలి పొఱుగు రాజ్యమున కళింగ సార్వభౌముల వొంత మంత్రి సేనాపతులై మరి రెండు తరముల తరువాత తమ శౌర్యధైర్య సాహసో పేతముల ఉన్నత స్థానములనంది వెలువడిరి. కాలమనుకూలించినది.

అయితే తొల్లిటి విజయాదిత్య శాసనమున ఈ విషయము బేర్కొన లేదు. అది సరియైన రాజనీతి ధర్మము. ప్రభువు సార్వభౌముడు తనకు సన్నిహితుడు. తాను సామంత మండలేశ్వరుడు. ప్రభు కరుణాకటాక్షముల నంది మనుగడ సాగించ వలసినవాడు. ఆశ్రితుడు. ఆశ్రితుడు ఆశ్రయమిచ్చిన వారికన్న హెచ్చు కారాదు. సరికిదా సరి సమానము కూడా కారాదు. అటు కానిచో మరుగడియలోనే అతని అదృష్టమంతయు మాసిపోవుట సహజము. ప్రభువు, ప్రభువు తండ్రియు, తనకు సమకాలికులే. తాను భవ గండములు తప్పి, బైటపడి సాంద్రసాగర వీచికల తల మునకలై దోబూచులాడుచుండ తనవాడై అభిమానించి తన సాటివానిగ చేసి గరు వము సాధించి పెట్టిన ప్రభుని యందు అణకువ, భయభక్తులు నెలకొల్ప వలసిన బాధ్యత తనయందు గలదు. పెద్దలు జీవించియున్నారు. అట్టి సమయమున





పరాభవము నొందిన సార్వభౌమునితో తనకు గల సన్నిహిత బాంధవ్యమును వెల్లడించుట పాలుమాలిక తనమై మొదటికే మోసము వాటిల్ల కల సమయ సంఘటనలు ప్రత్యక్షము ఆ రాజనీతిని అనుసరించియే తాను ప్రజ్ఞాధురీణుడై విషయము విస్మరించక నిజము మరుగుపరచక ఛాయా మాత్రమున సమకాలికులకు ఎరుగు పర్చిన మహాధీశాలి, ఆ శాసన కర్తయగు విజయాదిత్యుడు.

రెండవ శాసనమున ప్రభువు అన్యదేశస్థుడు, అన్యవంశజుడు. చిరకాల విషయములు జోడించి నూతన ప్రభువు మన్నన బొందుటకే వంశ విషయములన్నియు సమయ స్ఫురణతో పూర్తిగా విశదపరిచెను.

ఒక సందేహము :-

క్రీ. శ. 1117 శాసన కర్తయైన విజయాదిత్యుని తరువాత వారి వంశం వారి రెండవ శాసనము క్రీ. శ. 1273న గాన వచ్చుటచే 1273 - 1117 = 156 సం॥ కాలవ్యవధి కలదుగదా ! ఇంత కాలము ఆ వంశీయులు ఎందరు? ఎవరు ఎక్కడ ఏ విధముగా సంచరించిరి ? ఆనాటి వేంగీవాసులు నేడు కళింగ మెట్లు చేరిరి ?

తూర్పు చాళుక్యులు ఆదినుండియు దాయాదుల దాడుల కోర్వలేని సమయమున పొరుగు రాజ్యమయిన కళింగమునకు చేరుట కానవచ్చును. ఆదిని 7వ శతాబ్దమున కొక్కిలి భట్టారకుడు భ్రాతృ పీడన కోడి కళింగ దేశమున సర్వసిద్ధికి చేరెను. కొక్కిలి నివాసము రాజ్యమేలెను. అమ్మరాజ దానార్ణవుల కాలమందును అట్లే ఓడిన కాలమందు కళింగమున తలదాల్చుకొని అదును చేకూర్చుకొనుచూ వచ్చి తరువాత తమ తొల్లిటి పదవులను అలంకరించుటయు కాననగును. అట్లే రాజరాజ నరేంద్రులును ద్వయమాతురానతుని దాడులకు పదభ్రష్టులై కొంతకాలము కళింగము చేరినట్లును గానబడును. అట్లే ఈ విజయాదిత్య వంశజులును కాని కాలమున ప్రవాస జీవులై కాలక్రమమున కళింగము చేరి విజయాదిత్యుడును కళింగము చేరి ఆ ప్రభువుల నాశ్రయించి వీరనృసింహదేవరకు మంత్రి అయ్యెను. ఆయన తండ్రి రాజరాజును తాత విజయాదిత్యుడును కూడ అంతకు ముందే ఆ కళింగముననే ప్రవాస జీవితము గడిపియుండిరి.

క్రీ శ. 927 సం॥ రము కంటిక బేత విజయాదిత్యుడును యుద్ధమల్లాని జ్ఞాతులచే దరుము కొట్టబడి పారిపోయి ప్రవాస జీవితము గడిపి తుదకు కొన్ని తరముల తరువాత క్రీ. శ. 1127 సం॥న జననాథ నగరమున పట్టము గట్టుకొని (మూడవ విజయాదిత్యుడు) బయల్పడి పేరు కెక్కెను. ఆ వంశం వారు 200 సం॥ కాలము 5, 6 తరముల వారు ప్రవాస జీవితము గడిపి, కాలము కూలించు తరి బయల్పడిరి.


అటులనే ఈ విజయాదిత్య వంశీయులును క్రీ. శ. 1117 నుండి 1273 అయిన 156 సం॥లు దైవదుర్విపాకమున ప్రవాసులై దీర్ఘకాల అనంతరమున బయల్పడుటకు ఆశ్చర్యపడు నవసరము లేదు. ఈ 1273కు పూర్వము ఈ విజయాదిత్యుడు ఆతని తండ్రి రాజరాజు ఆతని తండ్రి విజయాదిత్యుడు మూడు తరముల వారు పేర్కొన బడుటచే వారి ప్రవాస కాలమందలి 156 సం॥లందును సుమారు 60 సం॥ల మనుగడ ఛాయా సూత్రముగా తెలియచుండుటచే మిగిలిన 100 సం॥ కాలము మూడు తరముల వారు అట్లే దైవవిపాకము వలన వేంగీ నుండి కళింగము చేరి ప్రవాస జీవులై కడకు కలసి వచ్చుటచే కళింగమున కళింగ సామ్రాజ్యాధిపతుల దరిజేరి తమ శౌర్య ధైర్య సాహస కార్యముల పరాక్రములై శేముషీ దురంధరులై మంత్రి పదవుల నెఱపుచు అచ్చటనే శ్రీ కూర్మ మండలమునకు పట్టాభిషిక్తుడై "శ్రీకూర్మచక్రవర్తులు"అను పేర ప్రసిద్ధికెక్కిరి. కావున ఈ శాసన పాఠము ననుసరించి మానవ్యస గోత్రీకుడయిన వేంగీ రాజరాజ నరేంద్ర వంశ సంభూతు డనుటకు అవంతయు సందియము లేదు.

ఆ దేవాలయమందేయున్న శిలాశాసనము
శ, వ1199[క్రీ.శ. 1277]

1. స్వస్తి.శ్రీ శకవత్సరే [నవ] నిధి క్షోణీం దుభిః
 సమ్మితే దీపార్థం కమ తౌ [క్రితే]
2. ర్మరరాధిపో రా చంద్ర తారా గణం [1*] పంచాశత్
 ప్రవరాండ కాంగుణనిధిః [*] శ్రీ కి ...
3. ర్తివృద్ధ్యైతరాం [సం] ప్రాదాత్ పురుషోత్తమ
 క్షి [తి] పతి[ః*] శ్రీ రాజరాజా
4. త్మజః [౧ *] శక వర్షంబులు 1199 యగు నేంటి
 శ్రీ కూర్మనాథ దేవు
5. కి నఖండ తాపము సంతతమై వెల్లుటకు
 రాజరాజ దేవుని కొ
6. డుకు పురుషోత్తమ దేవ చక్రవర్తి
 పెట్టిన గొఱియలు ఏంబయి
7. రెండు [1*] ఈ ధర్మువు వైష్ణవరక్ష [ః]"

(4) సి. శక సంవత్ 1231 = (1309 క్రీ. శ.)
స్వస్తి శ్రీ శాకే వర్షే శశిగుణ రవిగేచా [శ్వాయు]
శుక్లపక్షే మాసే కౌంతేయ తిథ్యాం సుర
గురు దివసే కూర్మ నాథస్య విష్ణోః = ప్రాదా
తి శ్రింగ్గార భోగం దశయుగ యుగాం ని
ష్క మా చంద్ర తారం శ్రీమచ్చాళుక్య వంశో
దధి తుహినకరా ద్విశ్వ నాథాభి ధానాత్
శ్రీ మజ్జియ్యాన విశ్వనాథ మనఘం శ్రీ కార్య మాశ్చర్య కం
కృత్వా కూర్మ [మమోఘ] పురీశ్వరస్య భగవతే
 శ్రింగ్గార వారాన్ని ధేః ।
భూయాద్యా దనుజారి ద్విక్రమ జితస్సా మంత్ర
 చూడామణే స్తస్య శ్రీ
పురుషోత్తమ క్షి [తి] పతేః పుత్రస్య సంప
 త్తయే ! స్వస్తి శ్రీ శక వర్షం
బులు 1231 గునేం [ట్టి] శ్రీ జగన్నాథ దేవర
 విజయ రాజ్య సం [వత్సరంబు]
లు [॥] గు క్రాహి కన్యాసుర్ల గి యు గురువార
 మున శ్రీ వీర భాను దేవర జి [య్య]
నంగారి వెహరణము నందు శ్రీ కూర్మ స్వామికి
 చాళుక్య చక్రవర్తులై
నమానవ్యస గోత్రులు శ్రీ పురుషోత్తమ
 దేవ జియ్యము గారి సుపుత్రుడై
న శ్రీ విశ్వనాథ దేవ జియ్యన దమకు
 నాయురారోగ్యైశ్వర్యాభి వ్రి
ద్ధి యుం పుత్ర పౌత్ర సమృద్ధియుగలా
 (17 - 27) — — — — —
శ్రీ కూర్మనాథుని భండారమునం బెట్టిన
 గంధ మాడలు 40 ఈ ధర్మ
వు శ్రీ కూర్మ స్వామికి నాచంద్రార్క స్థాయిగా
 శ్రీ విశ్వనాథ భోగముచె
 ల్లంగల యది
— — — — — —

(5) డి. శక సం 1240 (1318 = క్రీ. శ.)
(1) శ్రీః - సామాన్యేయే సమభవ ఇతి భువ
 రాజ రాజదేవ నృవతో మభి వతో నృ
(2) పచక్రవర్తీ ! తత్సూను రాష్ట్ర విజయో
 విజయార్క దేవనామా మనో
(3) జ్ఞ చరిత స్సుకృతో కృతజ్ఞః - తద్భాతా
 పురుషోత్తమో గుణనిధి దేవో
(4) దయా కారిధేః శ్రీ కూర్మా యతన ప్రసన్న
 నృహరే స్సత్పుత్ర దాతుః
(5) ప్రభోః ! శాకే వ్యోమయుగా [ ] ధౌవితి
 యుతే వర్షేం నభోమాస్య దాతే



గాయం ఎంత చిన్నదైనా దానిపైన మట్టి పడచ్చు
దాంతో ఆ గాయంపైన సూక్ష్మజీవులు చేరచ్చు, బాధ ఎక్కువ కావచ్చు.

వెంటనే బ్యాండ్-ఎయిడ్ వెయ్యండి

ప్రపంచమంతటా, తల్లులకు బ్యాండ్-ఎయిడ్ పట్టీలపైన పూర్తిగా నమ్మకం. మరి బ్యాండ్-ఎయిడ్ పట్టీ వెయ్యడం వలన గాయాలపై యిక మట్టి పడదు, సూక్ష్మజీవులు చేరవు. బాధ ఎక్కువవడం జరగదు.

అదెందుకంటే, బ్యాండ్-ఎయిడ్ అంటేనే పూర్తి రక్షణ అన్నమాట. బ్యాండ్-ఎయిడ్‌లో, పూర్తిగా నమ్మదగ్గ ఏంటీసెప్టిక్ పదార్థం ఉంది—అది గాట్లూ, పగుళ్ళూ గల గాయాలను నయం చేయడానికి తోడ్పడుతుంది—చిన్న చిన్న రంధ్రాలలోకి గాలి వెళుతుంది, యిక దాంతో గాయం ఎంతో త్వరగా నయం కావడానికి అది సహాయపడుతుంది. మరి అద్వితీయమైన, అంటుకోని ప్యాడ్‌తో మీకు మరింత ఉపశమనం కలుగుతుంది.

బ్యాండ్-ఎయిడ్ పట్టీలు వేర్వేరు ఆకారాల్లో, సైజుల్లో వస్తాయి—పెద్ద గాయాలకి, చిన్న గాయాలకి లేదా గాట్లూ పగుళ్ళకోసమూ, అంటే పట్టీ వేయడానికి వీలుకాని చోట్ల వేయడానికీను. బ్యాండ్-ఎయిడ్ ఎప్పుడూ యింట్లోనూ, మీ దగ్గరా ఉంచుకోండి—ఎప్పుడూ.



బ్యాండ్-ఎయిడ్ ఎప్పుడూ మీ దగ్గర ఉంచుకోండి మరి—
దెబ్బ అనేది ఎక్కడైనా, ఎక్కడైనా తగలచ్చుగదా మరి.

Johnson & Johnson

OBM/2513

(6) దివ్యం సువర్ణ నిష్కకలితం గ్రైవేయకం
కాంతి మతే — ఏషా నృసింహ

(7) కవినా కవితా ప్రశస్తిః !

ఈ శాసన కాలము బాగుగా పరిశీలించిన తూర్పు చాళుక్య విజయాదిత్యునకు రాజ రాజు అను కుమారుడు కలిగెను. అతడు రాజ మహేంద్ర పట్టణము రాజధానిగా (వేంగి దేశము) పరిపాలించెను. అతడు తన ఆస్థాన కవులలో అగ్రగణ్యుడైన నన్నయ భట్టారకునిచే భరత వంశ చరిత్రమగు (వ్యాసరచిత) మహా భారతమును ఆంధ్రీకరింప చేయించెను. ఆ వంశము నందే మానవ్యస గోత్రజుడైన విజయాదిత్యుడు దిగంత యశో విశాలుడై వర్ధిల్లెను. అతనికి రాజ రాజను పుత్రుడు గలడు. అతడు వీరనరసింహ (గాంగ)రాజునకు మంత్రి అయ్యెను. అతని కుమారుడు విజయాదిత్యుడు. అతడే "విజయార్కుడు" అను బిరుదాంకితుడు. అతని సోదరుడు పురుషోత్తముడు. అతడు వీరభాను దేవు (ii) నకు సమకాలికుడు. పురుషోత్తముని కుమారుడు "జగన్నాధుడు" అను విశ్వనాధుడు" వీరభాను దేవు (ii) కి సమ కాలికుడు. ఈ చాళుక్య రాజులను విజయాదిత్య రాజరాజ, విజయార్క, విజయాదిత్య, పురుషోత్తమ, జగన్నాథ, విశ్వనాధులు, సామంత రాజ చక్రవర్తులుగా ప్రసిద్ధి కెక్కిన వారగుట చేతను క్రీ. శ. 1117 రాజేంద్ర చోళునకు 1270 – 1320 వరకును శ్రీ కూర్మమును గానవచ్చుట చేతను అనేక దానధర్మ శాసనముల రీత్యా ప్రసిద్ధులగుట చేతను శాసన కర్తలు రాజరాజ నరేంద్ర వంశజులై యున్నారు అనుటకు సందియమావంతయు కానరాదు. ఈ మాత్రమే గాక ఇంకను చాళుక్య సుందరులైన చాళుక్య వంశజులగు వారి రెండు దాన శిలాశాసనములు ద్రాక్షారామ భీమేశ్వర ఆలయమున నున్నవి.

సౌ ఇం.ఇ. నెం. 4 పు 361 నెం. 1084 ఎ.ఆర్. 236 ఎ. ఆఫ్.1893 శా. శ. 1196 క్రీ శ. 1274.

(1) స్వస్తిశ్రీ — — — — — — —
— — — — — — — — —

(2) క్యాః। తస్యాత్మజా షటవతీ వీర
భాను పట్టమహిషీ లసద-

(3) -మాంబా [ ] తర్కరత్న దరణీందు సంఖ్యయా
భావితేరు శకరాజ వత్సరే । మా [ఘ]

(4) శుద్ధ విలసత్తృతీయ యాయుక్త భౌమదిడసే
[మ] హోత్సవం భీమేశస్య జగద్గు

(5) రోస్తవ విధిం నిమ్మార్ యత్రాద్రుద్గినే ప్రత్యబ్దం
సమయోపహార విలసద్భోగస్య

(6) యాత్థర్ం చసా। త్రిం శత్కండుక సంమితాపి
మహేంద్ర వీర భానో మ్మర్ హా దేవీ సం –

(7) త తోండి దిషయో ప్రాదాజ్ఞ గన్మంగలం
భీమనాధ పుర పూర్వ దిక్తటి తోపు మధ్యగ

(8) తద మండపం । నందనం నవమారికా [ః]
కోమలై బ్భూరి హైరిహ తయా మనోర

(9) మైః చాగాతిరేక సంతత గజపతి భానో
స్సు పుత్ర పౌత్రవతీ సాపట్టమ

(10) హాదేవీ జీయాత్సా భాగ్యవతీ శ్రీ
వీర భాను దేవ్యై తవ వీధి

(11) ద్యుత్సవ [స్వ] హృది ముదితో ఆత్మాను రూప
నిశ్చల సౌభాగ్యం పార్వర్ తీ దద్యాత్

(12) నిధాయ మూల్యం విధివత్ క్రయేణ సుమల్ల భూభర్తుర్
రియంధరిత్రీ యదా ద్యోతంమే

(13) మేతే పరిపాలయంతు చలుక్య ధమ్మర్ం
భు వి భావి భూపాః॥

సౌ. ఇం ఇ. వాల్ నెం. 4 పు 396 నెం 1142 ఎ. ఆర్. 292 ఆఫ్ 1893 శా. శ. 1 96 క్రీ. శ 274.

(1) శ్రీ సోదరస్య పరిపూర్ణ సుధాకరస్య
(2) వంశే చాళుక్య నరనాధ పరంపరాభూత్
(3) శ్రీ రాజరాజ నృపతే ద్విజయ స్తత్వోభూత్
(4) శ్రీ రాజరాజ నృపతే ద్విజేయ క్షితీశః
(5) నిర్మాయారామ రేఖం వివిధ తరులతా
(6) సంచయై సప్తగోదాతీరం సర్వాం శిలాభి
(7) స్సిత కనక దశైర్భీమనాధాలియాగ్రం
(8) దత్వా సౌభాను నామ్నా పురమపి సుకరా
(9) ద్యాగ్రహారేషు సద్యః సంక్రాంతౌ సౌరవీట్యం
(0) తవవిధి రచనాం క్రోత్తమావాస్య యాత్రాం
(11) భీమేశస్య జగద్గురో రభినవం మాఘాంత్త
(12) ధర్మోత్త రం సాసానంద విరదయ్య సోదర
(13) తయా స్వసాగ్ర జాయా అపి ధర్మి వ్యావృతి
(14) సాధనాయ సుతరా మైతాంబికాయా మహి
(15) నాధ స్తర్కమణీందు భూమి గణితే రమ్యేశాకేబ్దే
(16) — — — — —

ఈ రెండు శాసనములును ద్రాక్షారామ భీమేశ్వరాలయమున చాళుక్య రాజరాజ నరేంద్ర వంశజులైన చాళుక్య సుందరులు వీరభానుని మహిషి జక్కలాంబ అను సోదరి అయిన వీరభానుని భార్య ఐతాంబికయు క్రీ. శ. 1274న దాన శాసనము గావించిరి. ఈ శాసనము బట్టి శ్రీకూర్మ చక్రవర్తులు కళింగ సార్వభౌముల సామంతరాజులై ప్రఖ్యాతిగన్నవారు. వీరు వేంగి సామ్రాజ్య చాళుక్య వంశము వారై యుండినపుడు కళింగరాజుల నెట్లు చేరగల్గిరి ? వివరింప వలసి యున్నది. అందుకు గాంగరాజుల చాళుక్య చక్రవర్తుల సమకాలిక వివరణము.

అర్వాచీన కళింగరాజులు కాలము	చాళుక్య రాజరాజ నరేంద్రుని సంతతి వారైన శ్రీకూర్మ చాళుక్యుల - చాళుక్యరాజ బంధువులు
—	సోమిలదేవి 1065
అనంతవర్మ వజ్రహస్తుడు క్రీ. శ. 1038-70	—
దేవేంద్రవర్మ రాజరాజు క్రీ. శ. 1070-78	చోళరాజు సుందరి (అమ్మంగిదేవి అక్కగారు)
అనియంక పెద్ద అనంతవర్మ చోడగంగు క్రీ. శ. 1078-1149	సోమిలదేవి క్రీ. శ. 1118 శా చాళుక్య విజయాద్యుడు 1117 శా (రాపత్రి)
కామార్ణవుడు క్రీ. శ. 1149-1153	—
రాఘవవర్మ క్రీ. శ. 1;56-1170	—
ఇమ్మడి రాజరాజు క్రీ. శ. 1170-1194	—
అనియంక భీముడు క్రీ శ. 1194-1198	—
ముమ్మడి రాజరాజ దేవుడు క్రీ. శ. 1198-1211	—
ఇమ్మడి అనియంక భీముడు క్రీ. శ. 1211-1238	సోమిలదేవి
మొదటి నరసింహుడు క్రీ శ. 1238-1263	రాజరాజు
మొదటి భానుదేవుడు క్రీ. శ. 1263-1278	విజయాదిత్య చక్రవర్తి 1272
ఇమ్మడి నరసింహుడు క్రీ. శ. 1278-1305	సోమిలదేవి
ఇమ్మడి భానుదేవుడు	విజయాదిత్య విక్రమార్కుడు,

బా లేం దు రే ఖ

శ్రీ .కొణిదెన జానకిరామయ్య

అలసిపోయిన అహస్కరునకు
చల్లని నీడనిచ్చే చరమాద్రిశిఖరమా ?
రాగరంజిత సంధ్యాసుందరి
కపోలాన మెరిసే నక్షత్రమా ?
గ్రహాలు తిరిగే గగన వృక్షానికి
ప్రభవించిన ప్రథమ పల్లవమా ?
ప్రబలాంధకార పటలిని
భేదింపవచ్చిన భిదురమా ?
హృదయరాజ్యాలను గెలవడానికి
దర్పకుడెక్కుపెట్టిన ధనుస్సా ?
కష్టాలను మరపించి కమ్మగా నిద్రపుచ్చే
నిశామాత శిశుల దరహాసమా !
పరమశివుని జటాజూటంలో
భాసించే పారిజాతమా ?
"[illegible] ?"

ఉ ప్పు క డ లి

శ్రీ కుంకాల సీతారామ్

ఉప్పైన కన్నీరు
పసిపాపల కళ్ళనుండి
అబలల కళ్ళనుండి
అనాథల కళ్ళనుండి
పాయలై
కాలువలై
ఏరులై
సెలఏరులై
నదీనదములై
పొంగి ప్రవహించి
స్వచ్ఛమైన
సముద్రాన్ని
ఉప్పుకడలిగా
[illegible] !

క్రీ. శ. 1306-1327	పురుషోత్తమ విశ్వనాథ జగన్నాథ జియ్యర్ 1309-1318 సోమలదేవి
ముమ్మడి నరసింహుడు క్రీ. శ. 1327-1353	
ముమ్మడి భానుదేవుడు క్రీ. శ 1357-1378	—
నాల్మడి నరసింహుడు క్రీ. శ 1378-1409	—
నాల్మడి భానుదేవుడు క్రీ. శ. 1409-1414	—

భారత కృతిపతియైన రాజరాజ నరేంద్ర చాళుక్య విష్ణువర్ధనుడు క్రీ. శ. 1061 రణరంగమున నిహితుడయ్యెను. కాని వీరి వంశీయుడైన విజయాదిత్యుడు క్రీ. శ. 1117 శా. (రాపర్తి బేతయ అనంతరము) వెలువడినాడు. ఇతడు పంచ మహాశబ్దముల నొందిన మహా మండలాధీశుడు సామంత రాజుగా పర్థిల్లి ప్రోలునాటి పంద్రవాడ (పిఠాపురం తాలూకా) గ్రామమును శ్రీ భీమేశ్వర స్వామికి అర్పించెను. ఆనాటికిని జననాథపురనివాసియైన పరాంతకుడు అను విక్రమ చోళుడు వేంగీ పాలకుడు. ఆ కాలముననే సామంత రాజులు శత్రుపక్షమున చేరిన కుట్రలలో ఓటుపడి పరాంతకుని పేర ద్రాక్షారామ భీమేశ్వరుని ఆలయమున పరాంతకునిగాక తాము ఇతరుల నొల్లకుండునట్లును అట్లు చేసిన తన ఇల్లాండ్రును వారి కర్పించునట్లును అట్లుగాక ఇతరులు తమ్మేలినచో వారి ఇల్లాండ్రను తాము పరిగ్రహించునట్లును ప్రమాణ శాసనములు గావించిరి అందు బద్దవాడి చోడయ, వీరగొట్టం చోడయ, వీరగొట్టం సూరయ్య, [సూరపరాజు], దంతుర్నాటి తమ్మన [భీమన్న], రాపర్తి బేతయ, సరుడు నాటి వీర చోళుడు... మొత్తము ఏడ్వురును శాసనము గావించిరి. "భారతాఖ్యాన కల్లోల ... చాళుక్య చంద్రోదయ" అను వాక్యోదాహరణముగా చాళుక్య వంశమును కీర్తించిన మొదటి విజయాదిత్యుడు ఇతవొక్కడే. అనగా రాజరాజు అనంతరము ౬ సం॥లకు ఇదియొన గూడినది ఆ సమయమున చాళుక్య చోడ వంశమున విజయాదిత్యుడు ఎవ్వరునూ కానరాడు. చాళుక్య రాజరాజ నరేంద్ర వంశోద్ధారకుడని ఈతని [illegible] అనుచున్నది. ఆ సంవత్సరమునే క్రీ. శ. 1116, 1117 సంవత్సరముల ప్రమాణ పూర్వకముగ రాపర్తి బేతయ్య శాసనము వ్రాయించెను. ఆ [illegible] పంచ మహాశబ్ద [illegible] మహా మండలేశ్వరునిగా ఈ విజయాదిత్యుడు ప్రత్యక్షమయ్యెను. ఆ సంవత్సరమే విజయాదిత్యుని ప్రభువగు పరాంతక దేవుడు సామంత విజయాదిత్యుడు దానము గావించిన పంద్రువాడతో కలిసి కీల, వరదవాడ గ్రామములను పోక [illegible] ఆ భీమేశ్వరునికే అర్పించి శాసనము గావించెను. దీనిని గాంచ అంతవరకూ ఉన్న రాపర్తి బేతయను తొలగించి ఈ విజయాదిత్యుని సామంతరాజుగ [illegible] యుండును. అయితే రాపర్తి బేతయకు, ఈ విజయాదిత్యునకు ఎట్టి సంబంధ బాంధవ్యములు వుండినవో తెలియుటకు ఆధారములు కానరావు. ఈ విజయాదిత్యుడు రాపర్తి విజయాదిత్యుడని [illegible]. శ్రీ సూర్య చాళుక్య చక్రవర్తులు వేంగి రాజ మహేంద్ర రాజరాజ నరేంద్ర చాళుక్య విష్ణువర్ధనుని అతని తండ్రి విమలాదిత్యునిని పేర్కొనుట చేతను భరతాఖ్యాన ఆంధ్ర మహాభారత కృతిపతియై యశోవిశాలుడైన వాని ఉదహరించుట చేతను ఈ విజయాదిత్యుడే శ్రీ సూర్య చాళుక్య చక్రవర్తులకు మూల పురుషుడని చెప్పవలసి యున్నది. అంతేగాక రాజరాజ నరేంద్రుని అనంతరము [illegible] సం॥లకే ఈతడు ప్రసిద్ధుడయ్యెను. అప్పటి కింకను చాళుక్య యువరాజు రాజేంద్ర చోళుడు జీవించి యుండుట చేతను ఆ వేంగి సార్వభౌము రాజేంద్ర చోళ కుమారుడు వీర విక్రమ చోళ పరాంతకుడును మహామండలేశ్వరుడు అగుటచేతను వారిరువురి కాలముననే భారతాఖ్యాన వివరణము శాసనస్థము గావించుట చేతను ఈతడు చాళుక్య రాజరాజ వంశజుడని దృఢపడుచున్నది. ఈ రాపర్తి గ్రామము వేంగి సామ్రాజ్యాంతరతయగు గోదావరి జిల్లా పిఠాపురమునకు నాలుగు మైళ్ళ దూరమున యుండి నేటికిని క్షత్రియ కుటుంబములతోటే విరాజిల్లుతున్నది.

అంతేగాక సర్వసిద్ధి తాలూకా (నేటి ఎలమంచిలి తాలూకా) పంచధారుల ఏలికయగు చాళుక్య విశ్వేశ్వరుడు విన్నకోట పెద్దన్నచే కావ్యాలంకార చూడామణి అని కృతిపొందెను. అందు వారును తాము రాజరాజ చాళుక్య విష్ణువర్ధన రాజరాజ వంశజులని కీర్తించెను. అందు రాపర్తి ఉపేంద్రుడు మొ॥ వారిలోని విశ్వేశ్వరుడు రాజరాజ నరేంద్రుని బిరుదులను ధరించెను.

ఈ శాసనములలో తమ వంశముల మూల పురుషుడైన విజయాదిత్య, రాజ రాజ నరేంద్రుల గురించి చాల కాలము గతించిన తరువాత పుట్టబడుట చేతను ఇందు తమ వంశానుక్రమము పూర్వ చాళుక్యుల వలె పూర్తిగా ఉదహరింప బడక పోవుట చేతను విటిని విశ్వసింప వచ్చునా యని కొంత సందేహమేర్పడవచ్చును! అందుకు పరిహారోక్తి - క్రీ. శ. 927 సం॥న పట్టభద్రుడైన వేతకంఠిక విజయాదిత్యుడును అతని వంశస్థులును క్రీ. శ. 1127న అనగా 200సం॥ల తరువాత గాని వారి ప్రవాస జీవితములు తుదముట్టించలేకపోయిరి.

ద్రాక్షా రామ భీమేశ్వరాలయమునగల సోమిలదేవి శిలాశాసనము.

సౌ. ఇం. ఇ. వాల్ 4 పు. 238 నెం. 1007 ఎ. ఆర్. నెం. 182 ఆఫ్ 1893 శా. శ. 987 క్రీ. శ. 1065.

శాకే సంవత్సరేషు మునివసునిధిగే రాజమార్తాండ భూ బృ
త్వ [శ్రీ సారంగ] నేత్ర కనక విరచితం కల్ప భూజాత పుష్పం
ప్రాదాద్భీమేశ్వరాయ వ్య విశద ధనదానీప్యదాదంద్రతారం
దీపం రౌప్యంచ పాత్రంచిన సదృశ భుజాంరేవలేపీతనూజ॥
శ్రీవిష్ణు వర్ధన - భూవిభు దయ భామి
దేవిపోల్ రేవల - దేవి కనిన
సోమిలదేవి గుణారాము జగదేక
సున్దరి మ త్తేభ మన్దగమన
ద్రాక్షి భీమేశ్వర వల్లభునకు సిత
మణి బద్ధ మిచ్చె సన్మణియుతముగ
నురులిచ్చె గంగనాం బరు వాడి వినువారి
బురుడించునట్లుగను సరసిజాస్య
గనక రచిత రుచిర కల్పావనీ రుహ
కుసుమంబిచ్చె దనకు నసము నెరుగ
వెణ్డి మణ్డ తోన - కిణ్డి దివ్వె వెల
సమరదిచ్చె విశాల - కనులనేత్రి॥
సకల వసు [మతి] శ - మనుడ అన్వర [త్న]।
కిరణ రుచి విరాజ - చరణుణ్డగును।
నిజ భుజ ప్రధాని - (బె) జుతో దేవుని।
కూంతు సరియె హోల్ప - గాంతవెంయా॥

ఈ శాసన కర్త్రి సోమిలదేవి రాజమార్తాండ బిరుదు గల విష్ణువర్ధనుని భార్య భూమిదేవిని బోలిన రేవలదేవి 'కన్న కూతురు' నియము ప్రధాని గణేక దేవుని కూతురు అని వక్కాణింపబడినది.

దీనిని పరిశీలింపగా రాజమార్తాండ రాజరాజ నరేంద్ర చాళుక్య విష్ణువర్ధనునికి భూదేవి వంటి ఓర్పుగల రేవలదేవి అను భార్య కలదనియు, వారిరువురకును సోమిలదేవి అను కూతురు కలిగెననియు, ఆ రేవల దేవి తండ్రి గణేక దేవుడనియు నిశదమగుచున్నది. రాజులు బహువల్లభుడగుట సామాన్య ధర్మము. అయితే కొందరు చాళుక్యులు దీనికి అంగీకరింపక ఈ రేవల దేవి రాజరాజ నరేంద్రుని సాపత్నియ సోదరుడగు సప్తమ విజయాదిత్యుని భోగపు పడచు కూతురని వాదింప నారంభించిరి. అది సరిగాదనియు ఆ కాలమున 'రాజ మార్తాండ' అను బిరుదు కలవారు రాజరాజ నరేంద్రుడొక్కడే యగుటచే రేవల దేవి రాజరాజ నరేంద్రుని మరియొక భార్య కృతాభిషేక మహిషి భోగినోర్వ్ అన్య నృపశ్య (యః) అనియు వారి కుమార్తయే ఈ సోమిల దేవియనియు పెద్దలైన చారిత్రకులు రూఢి గావించిరి. అందుకు ప్రమాణము 1922 సం॥ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక. ఆనాటి రాజకీయ కుటిల ద్రోహచింతలు మున్నగునవియే. ఇదివరకేనే చాళుక్యులకును ఈ చోళునితో గల బాంధవ్యము రెండు తరములనుండి యున్నవి. ఇప్పుడు మూడవతరము వాడైన రాజేంద్ర చోళునికి గూడా ఇమ్మడి రాజేంద్ర చోళదేవి కుమార్తెయైన మధురాంతకినిచ్చి పెండ్లి గావించు సమయము తరువాత మనకు ఈ శాసనములన్నియును ద్రాక్షా రామమును కళింగదేశమునందలి శ్రీ కూర్మమున గానవచ్చుచున్నది. అందుచే చోళులకును గాంగులకును గల సంబంధ బాంధవ్యములు పరిశీలింపవలయును.

కళింగ చోళ వంశ బాంధవ్యములు :-

కళింగ గాంగ వంశజుడైన దేవేంద్రవర్మచే నోటువడిన చోళరాజగు రాజేంద్ర చోళుడు తన కుమార్తెయగు రాజ సుందరిని సంధి షరతున వివాహము గావించెను. ఈమె రాజరాజ నరేంద్ర చాళుక్యుని భార్య అమ్మంగి దేవికి అక్కగారు.

ఇండ్ ఎంటి 17 పు. 169

అనంతవర్మ చోళగంగదేవుని కొర్ని శాసనము 23-25 పంక్తులు :-

తతస్తుత స్యాత్మ భవోరి సుద్ధనస్సు రాజరాజ క్షితిపతిః క్షితింసమాః।
శ్రీ (బు) రక్షిదష్టౌ వరుణాలయాం బరాన్నిధిగ్గుర్ జాన్నిధి పాల సన్నిభః
తతో రాజేన్ద్రస్య చోలస్య తనయా రాజసున్దరీ రాజ్ఞస్తస్యాగ్ర మహిషీ సతీ
సుతము జాయతే శా. శ. 1081.

క్రీ. శ. 1112 కొర్ని శాసనము 87 పంక్తి.

(రాజరాజః) క్షమా మరక్షదష్ట సంవత్సరాతస్యవర్ణానేగ్నికాః స రాజ రాజ ప్రథమ(మ్) జయశ్రియః పటిర్బుర్ భూవ ద్విలోత్సవే విరాజ మానామపి "రాజసున్దరీ ముదూఢవాన్" అనియును వివరింపబడినది. అంతమునందే గంగయకొండ రాజేంద్ర చోళుడు తన కుమార్తెయగు రాజ సుందరిని అనంత వర్మ చోళ గంగదేవర కళింగ దండయాత్రాసమయమున అతనికి వివాహము గావించెను. మరియొక కుమార్తెయైన "అమ్మంగిదేవిని" చాళుక్య రాజ రాజునకు వివాహము గావించెను. అందుచే చాళుక్య రాజరాజును గాంగ దేవేంద్ర రాజును చోళకన్యకల బెండ్లియాడి తోడియల్లుండ్రయిరి. కళింగదేశ చరిత్ర (3.6 పుట.)

సోమిలదేవుల సంబంధ బాంధవ్యములు :-

సోమిలదేవి విరవిజయాదిత్యుని భోగపు సంతానమును కొందరు వాదిరి. అట్లైనచో సోమిలదేవి తన తండ్రి సోదరుడైన విర విజయాదిత్యుని అగ్ర సోదరుని రాజమార్తాండ రాజరాజనరేంద్రుని పేర్కొనుట ప్రశ్నల విరుద్ధము. రాజమార్తాండ బిరుదమును సప్తమ విజయాదిత్యునకున్నట్లు ఏ విధమునగను యిటువంటిగల ఆధారము కానరాదు. ఆ కాలమున తూర్పు చాళుక్యులలో వేరొక విజయాదిత్యుడు కాని, రాజ మార్తాండుడు కాని కానరాదు. కావున సోమిలదేవి రాజమార్తాండ విష్ణువర్ధనుడు యను రాజరాజ నరేంద్రుని వేరొక భార్యయైన రేవలదేవి కూతురు యనుటచే ఈమె రాజ రాజ నరేంద్రుని కుమార్తె యనుటలో సందియము లేదు.

అంతియేగాక సోమిలదేవి భోగపు పడచు పిల్లకాదు. తూర్పు చాళుక్యుల రాజమహేంద్ర రాజధాని పాలకుల కులదేవత శ్యామలాంబ. ఆ శ్యామల దేవియే భూషాపై కృతక సాంప్రదాయమున సోమిలదేవి అయ్యెను. ఆమె పేరిటనే నేటికిని రాజమండ్రిలో కోటకు తూర్పున సోమాలమ్మ గుడి యుండి ఆరాధింపబడుచున్నది. ఆ కారణముననే చోళ చాళుక్య వంశమున బిడ్డలంబి (శ్యామలాంబ) సోమిలదేవిగా కళింగరాజులుగా గాన్పించుచున్నారు. అంతియేగాక కళింగ సార్వ భౌములు కేవలము భోగపుకతైలగు పలువురు సోమిలదేవి నామధారులైన వారిని రాణులుగా చేయరు. అందుకును ఈ క్రింది యుపపత్తులు గాన్పించుచున్నవి.

గాంగరాజులు అగు అనంతవర్మ చోడగాంగ రాజుల జీవితంలో సోమిలదేవియు యున్నది. క్రీ. శ. 1118.

సౌ. ఇం. ఇ. వాల్ 4 నెం. 1012. గుణధామ సోమిలదేవి మహో మానస హంసి యా త్రికళింగ మండల పతిః శ్రీగంగ చూడామణిః॥ అని యుండుటచే సోమిలదేవి కళింగ గాంగరాజు అనంతవర్మ చోళగంగుని రాణియై యున్నది. అప్పటికింకనూ రాజరాజ నరేంద్ర పుత్రుడు రాజేంద్రచోళుడను పేర చోళ చక్రవర్తియై జీవించి యున్నాడు. ఆ సమయముననే పంద్రదువాడ దాన శాసనకర్త విజయాదిత్యుడును ఉన్నారు. ఈతడు తూర్పు చాళుక్య రాజరాజ నరేంద్రుని వంశకర్తగా వర్ణించినాడు అందుకే సోమిలదేవియు విజయాదిత్యుడును కూడా రాజరాజ నరేంద్రుని పట్టమహిషికన్న వేరైన భార్యల సంతానమని చెప్ప వచ్చును. వారిరువురును ఏకగర్భసంచిలో కాక సాపత్న్య సముద్భవులో తెలియ రాదు. ఈ సోదరి సోమిలదేవి కళింగ సార్వభౌముని రాణి యగుటచేతనే ఈ విజయాదిత్యుడో, అతని సంతతివారో కళింగమును చేరియుండురు.

ఎ. పి. ఇం. 94 — 182 పుట. క్రీ. శ. 1230. ఇమ్మిడి అసియంక భీముని దేవేరలయందును ఒక సోమిలదేవి యున్నది. ఈమె ఉదయ కామదానము చేసెను. ముమ్మడి రాజరాజ చోళుని కుమార్తె క్రీ. శ. 1223—1225 ప్రాంతమున, దక్షిణ దేశ దండయాత్రలో చోళరాజ్యాంతర్గతమైన ఒడ్డెమ్ఘాకల స్తూరంభ సమయమున ముమ్మడి రాజరాజు పరాజితుడగుటచే తన కుమార్తె యగునట్టి "సోమిలదేవిని" యుద్ధ పరిహారముగ నర్పించెను. ఈ విషయము క్రీ. శ. 1235 నాటి మటియొక శాసనమునందు కలదు.

అనంతవర్మ చోడగాంగుని దేవేరి "సోమిలదేవి" తూర్పు చాళుక్య రాజరాజ నరేంద్ర విష్ణువర్ధన రాజమార్తాండునికి 'రేవలదేవి' యను వేరొక భార్యవలనకలిగిన కుమార్తయే. ముమ్మడి రాజరాజపుత్రియగు సోమిలదేవి రాజరాజ నరేంద్ర చాళుక్య విష్ణువర్ధన రాజమార్తాండ దేవదేవుల పుత్రికయైన సోమిలదేవికి దౌహిత్రియై యుండవచ్చునని డా॥ నేలటూరి వేంకట రమణయ్యగారి వ్యాసము

భారతి 1945 ఫిబ్రవరి 161 పు; జూన్ 541; జూలై 67 పు. డి. సి. సర్కార్ ఎ. పి. ఇండికా 30 — 191 పు, 31 పు99–102. టి. వి. ముఖలింగం, ఎ. పి. ఇండికా 31 94–98 లో ఉన్నట్లు 1975 భారతి డిసెంబర్ తెలుపుచున్నది.

హోసల చక్రవర్తి ఇమ్మిడి నరసింహదేవునికి "సోమిలదేవి" అనునొక పుత్రిక గలదు. ఆమెను ముమ్మడి రాజరాజ చోళదేవుని దేవేరి పుత్రికకు తన తల్లియైన సోమిలదేవి పేరుపెట్టి యుండవచ్చును. అనియు సూచించి యున్నారు.

ఈ రాజరాజ నరేంద్ర వంశ పరంపర శ్రీ కూర్మ చక్రవర్తులే గాక పంచధార పాలకులైన రాపర్తి వారి వంశీయులు. ఈ రాజరాజ నరేంద్ర సంతతిగానే కావ్యాలంకార చూడామణి యందు కలదు.

రాపర్తి చాళుక్యుల వంశము

శ్రీకంఠ చూడాగ్ర — శృంగార కరణమే
రాజున కన్వయా — రంభగురుడు ।

చాళుక్య వంశ భూ — షణము శ్రీ విష్ణువ
ర్ధనుడే మహీశు దా — తలకు దాత ।

భృత కుమారా రామ — భీముండు చాళుక్య
భీముడే నృపకులా — ధిక విధుండు ;

రాజ మహేంద్రపు — రస్థాత రాజన
రేంద్రుడెన్నువ తాత — యే విభునకు ;


నంధ్ర ధళ దానమోసేంద్రు — దగునుపేంద్ర ।
ధరణి నల్లభుడే రాజు — తండ్రి తండ్రి ।
ఘనుడుపేంద్రాఖ్యుడెవ్వని — కన్నతండ్రి ।
యతడు విశ్వేశ్వరుడు లక్క — మాంబసుతుడు ॥


చతురుపాయ బాహుశక్తి క్షమాపః ।
బాఅవిడిచి చిత్రభాను సాక్షి ।
బాపె సర్వసిద్ధి పదమేది ధరణీ వ ।
రాహమునకు నోడి రాచ కదుపు ॥

స్తుత హిమకరు జూటా చూర్ణిత ద్విట్కిరీటా
ప్రతత గుణ పటా పంచధారా ధరిణా
సిత కరకుల దీప స్నిగ్ధబద్ధ ప్రతాప
సతత లసదభిఖ్యా సర్వ లోకాశ్రమాఖ్యా

అని ఇట్లు స్తుతింపబడిన చాళుక్య విశ్వేశ్వరుడు సర్వసిద్ధి పంచధారా క్షితమును క్రీ. శ. 1377–1401 వఱకు పాలించిన కవి పోషక చక్రవర్తి. ఈతని బిరుదులు చూడ సర్వ లోకాశ్రయ చక్రవర్తి — కరవాల భైరవ — రాయగండ గోపాల — ఉపేంద్రక్ష్మావరనందన — రాజనారాయణ — పరగండ భైరవీ విజయార్క — అది మానస చండ ఢండిమ రాయ అని చాళుక్య విష్ణువర్ధన వంశ బిరుదులును రాజరాజ నరేంద్రుని బిరుదులును ధరించి రాజమహేంద్రవరమును, చాళుక్యవంశమును, సోమ వంశమును స్తుతించెను. వీరిది రాపర్తి. చాళుక్య వంశం వారిలో రాపర్తి భేతయ విజయాదిత్యులను గూర్చి 1117 పంద్రువాడ మొదలగు శాసనముల ప్రస్తావింప బడినది. ఆనాటి రేవలదేవి తనయ సోమిలదేవి దీపదాన శిలాశాసనము గురించి 1922 రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక యందు డా॥ చిలకూరి నారాయణరావుగారు, కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు, నేలటూరి వేంకటరమణయ్యగారు, గుర్జా శేషగిరిరావుగారు, వేపా రామేశం పంతులుగారు, భావరాజు కృష్ణారావు గారు మొ॥గు చారిత్రక వర్తములందరు చర్చించి రాజులు బహువల్లభులగుటచే రాజరాజ నరేంద్ర విష్ణువర్ధనునకు అమ్మంగిదేవి యొక్కతెయే గాక ఇతర భార్యలు లేదనరాదు. ఈ శాసనరీత్యా రేవలదేవియు రాజరాజ నరేంద్రుని వేరొక భార్యయే యనియు ఆమె కూతురు సోమిలదేవియు అని రూఢి గావించి యున్నారు. అట్లే శ్రీకూర్మ చాళుక్య చక్రవర్తులు పై విషయములు గమనింప రాజరాజ నరేంద్రుని భార్య రేవలదేవియో, వేరొక భార్యయో వలన కలిగిన సంతానమై తొలుత రాపర్తి నుంచి తిరిగి పదభ్రష్టులై ఈ రేవులదేవులు కళింగ గాంగుల ఇంటి కోడండ్రై కాలక్రమమున కళింగ గాంగుల నాశ్రయించి శ్రీకూర్మ చక్రవర్తులై ప్రసిద్ధి శాఖగను, సర్వసిద్ధి పంచధారా విషయ చాళుక్య విష్ణువర్ధనులు గను క్రీ. శ. 15వ శతాబ్దప్రాంతము వరకును వర్ధిల్లెనని రూఢి యగుచున్నది. బాగుగా పరిశీలించిన ఇంకను ఈలాటి చిరుప్రాంత పాలకులైన విష్ణువర్ధన వంశములు రాజరాజ నరేంద్ర విష్ణువర్ధన సంతతివారుగా తెలియనగును. ఆ పని భావి పరిశోధకులైన వారిపై ఆధారపడి యున్నది.

అజ్ఞాత కృత దోషములు మన్నించి ఒకే పరిశీలనతో అపద్ధ్వతలను, దోషములను సవరింగించిన కోవిదులను, పెద్దలను కృతమస్తకాంజలిని వినమ్రముడ నయ్యెదను.





ఒక శ్రావణ సాయంత్రం

శ్రీ కావూరు పాపయ్య శాస్త్రి

తల స్నానం చేసి
కురులార బెట్టుకుంటున్న
కోమలి శిరోజాల్లా
పాయలు పాయలుగా తేలిపోయే నీలిమేఘాలు—!
ఎదలో ఒదిగి ఉండలేని
పరుచుదనపు హుషారు
పెదవులపై ఈలపాటలా షికారు చేసినట్లు
అల్లరిగా, అలవోకగా వీచే శీతల మందానిలాలు!
తియ్యటి జ్ఞాపకాల నెమరువేతలో
మత్తుగా కలలు కంటున్న మనసులా
మందంగా....అందంగా వాతావరణం....!
వానజల్లులో తడిసి ముద్దై
సిగ్గుతో ముడుచుకు పోయిన
ముంగిలిలోని ముద్దమందారంలా, ముగ్ధలా
గోముగా, స్తబ్ధుగా ప్రకృతి....!
రెపరెపలాడే చిలిపి కోర్కెల్లా
గజిబిజిగా ఎగిరే తూనీగలు....!
ఎంతో చెప్పాలని ఉన్నా,
అంతరంగాన్ని విప్పి చెప్పబోయాలని
ఊహాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా,
ఏమీ చెప్పలేని
వలపుజంట తొలికలయికలా
మౌనంగా శ్రావణ మాస సాయంత్రం....!

హిరణ్మయేన పాత్రేణ...

శ్రీ సూరంపూడి భాస్కరరావు

ఇంత నిప్పును గప్పెనెట్లింత నివురు;
ఎంత సూర్యునిగప్పె తానింతమబ్బు!
చందురునిదాచు నాన్యమౌ ఛాయయొకటి;
ఔర సబలుల దుర్బలు లణతురేమొ!

కానపడుబొమ్మ నిజముగ లేనెలేదు
ఉన్న తెరమాత్ర మెందుకో కన్నుసారదు
విశ్వమంతను వెలిగించు విమలదీప్తి(ని);
కురులు విరబోసుకొని కప్పె క్షుద్ర తమము!

ఎంత ధీమంతులే బలవంతులైన;
వలలువైచువారలకు లోబడుటవింత!
గుణ విశాలుడు ఏయవ గుణము కతన
నో నిలంబడు కావలివానిపొంత!

ధనము పొరగప్పి ధర్మము దాగుడుపడె;
దీపమే తాను మసిని వర్ధిల్లజేసె!
ప్రకృతిలోమాసె పురుషు డవికృతుడయ్యె!
కప్పె సత్యముఖమును బంగారుగిన్నె

రావత్రి చాళుక్యుల వంశము :

రావత్రి సీతయ —— రావత్రి విజయాదిత్యుడు క్రీ. శ. 1117.

కాలక్రమమున (1) ఉపేంద్రుడు (గాంగరాజుల) క్రీ. శ. 1263

↓

మల్లపదేవుడు = భార్య చొక్కాంబ

↓

(2) ఉపేంద్రుడు = భార్య మల్లాంబ క్రీ. శ. 1283

↓

కొప్పరాజు = (భార్య) గంగరాజు క్రీ.శ. 1316

↓

(3) ఉపేంద్రుడు = భార్య భీమాంబ

↓

బెన్నగ = [భార్య] ముమ్మడమ్మ —— మహేంద్రుడు = [భార్య] లక్కాంబ కుమార్తె అంబికాదేవి క్రీ. శ. 1378

బెన్నగ ↓ : (4) ఉపేంద్రుడు క్రీ. శ. 1372 ; చోడేంద్రుడు

మహేంద్రుడు ↓ : విశ్వేశ్వరరాజు క్రీ. శ. 1377 to 1401

ఈ వ్యాసమున కుపకరించిన సాధిక గ్రంథములు

1. ఆంధ్రదేశ శాసనసంగ్రహము —— భారతి. డా. చిలుకూరి వీరభద్రరావుగారు అభియుగము
2. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి —— ఖండవల్లి లక్ష్మీరంజనంగారు
3. తెలుగు విజ్ఞాన సర్వస్వము 3వ భాగము —— డా॥ నేలటూరి వేంకటరమణయ్యగారు
4. ఆంధ్ర వీరులు —— కులోత్తుంగ చోళుడు —— మల్లంపల్లి సోమశేఖరశాస్త్రి
5. చెల్లూరు తామ్రశాసనము —— వీరచోలుడు 52, 62 పంక్తులు
   సౌ. ఇం. ఇ. వాల్ 4
6. ఎ. పి. ఇం. వాల్ 5
7. రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక 1922
8. కళింగదేశ చరిత్ర సంచిక —— రాళ్ళబండి సుబ్బారావుగారు
9. ఆంధ్రీకృత భారతము —— నన్నయ ఆది, సభా, అరణ్య పర్వములు
10. రాజరాజ నరేంద్రుడు —— భావరాజు వెంకట కృష్ణారావుగారు
11. విశ్వసుందర విజయము —— నాట్యాచార్య దువ్వూరి జగన్నాథశర్మ
12. ద్రాక్షారామ భీమేశ్వరాలయ శాసన మంజూష సవ్యాఖ్యానము ప్రథమ సంపుటం. చరిత్ర విద్యాధర తురగ కృష్ణమూర్తిగారు
13. భారతి మాసపత్రికలు 41వ సంచిక. 1963 జనవరి. ఎఱ్ఱపల్లి పునురుదత్త తామ్రశాసనము
14 1969 జనవరి చోడవరం శిలాశాసనము
15. 1945 జూన్
16. 1975 డిసెంబర్ వగైరా ॥.

□

భారతి

చిన్న నవలల పోటీ !

భారతీయ సంస్కృతిలో ఒక భాగమైన తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబంగా ఉంటున్న భారతి సాహిత్య మాసపత్రికలో చిన్న నవలల పోటీ పెడుతున్నామని తెలుపటానికి సంతోషిస్తున్నాము. పోటీలో పాల్గొనే రచయిత్రులూ, రచయితలూ క్రింది నిబంధనలని తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది.

★ నవల యితివృత్తం తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించినదై ఉండాలి.

★ నవల నిడివి అరవై అరటావులకి మించి ఉండరాదు. కాగితానికి ఒక వైపునే యింకొపెన్‌తో కాని బాల్‌పెన్‌తో కాని రాయాలి. నవల వ్రాత ప్రతిపైన "చిన్న నవలల పోటీకి" అని స్పష్టంగా రాయాలి.

★ అనువాదాలు, అనుసరణలు, కాపీ నవలలు పంపరాదు. గతంలో ప్రచురించబడిన, ఆకాశవాణిలో ప్రసారం అయిన నవలలని పంపరాదు. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్నవాటిని అసలే పంపరాదు.

★ రచయిత్రులూ, రచయితలూ వ్రాత ప్రతులతో పాటు రచన తమ స్వంతమేనని పేర్కొంటూ హామీ పత్రం విధిగా జతపరచాలి. హామీ పత్రంలేని రచనలు పరిశీలించబడవు. రచయిత(త్రు)లు కలంపేరు వాడినా తమ అసలుపేరు, పూర్తి చిరునామా స్పష్టంగా రాయాలి.

★ పోటీలో గెలుపొందిన రచయిత(త్రు)లు తమ ఫోటో, జీవిత విశేషాల ప్రచురణకి అంగీకరించవలసి ఉంటుంది.

★ రచనలపై వచ్చే ఎటువంటి పేచీలకైనా రచయిత(త్రు)లే బాధ్యత వహించవలసి ఉంటుంది.

బహుమతుల వివరాలు

సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన నవలలకి బహుమతులు లభిస్తాయి. బహుమతుల నిర్ణయంలో సంపాదకునిదే తుది తీర్పు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు.

మొదటి బహుమతి : రు. 2500

రెండవ బహుమతి : రు 2000

మూడవ బహుమతి : రు. 1500

పోటీకి అందిన నవలలలో సాధారణ ప్రచురణకి యోగ్యమైనవి ఉంటే వాటిని ప్రచురణకి స్వీకరించి వీలు వెంబడి ప్రచురించడం జరుగుతుంది. ఈ విషయాన్ని ఆయా రచయిత(త్రు) లకి ఉత్తరాల ద్వారా తెలియ జేస్తాము. ప్రచురణకి స్వీకరించబడని నవలలని తిప్పి పంపాలని కోరుకునేవారు తగిన తపాలా బిళ్లలు అంటించిన పూర్తి చిరునామా గల కవరును విధిగా జతపరచవలసి ఉంటుంది.

నవలలు చేరవలసిన ఆఖరుతేది : నవంబర్ 30

పోటీకి పంపే చిన్న నవలలని సంపాదకుడు, భారతి సాహిత్య మాసపత్రిక, ఆంధ్రపత్రిక కార్యాలయం, గాంధీనగరం, విజయవాడ-520003; అన్న చిరునామాకి పంపాలి. వ్యక్తుల పేర పంపరాదు. కవరు పైభాగంలో భారతి- చిన్న నవలల పోటీకి" అని మరచిపోకుండా రాయాలి.

★ రచయిత్రులూ, రచయితలూ ఉత్సాహంగా ఈ పోటీలో పాల్గొని దీనిని జయప్రదం చేయగలరని ఆశిస్తున్నాము.

-సంపాదకుడు

సీరియల్

సహగమనం



మధురాంతకం నరేంద్ర

(గత సంచిక తరువాయి)

3

"సార్, కళ్ళజోడు..." వెనకే పరిగెత్తుకొచ్చాడు అటెండరు.

మెట్లు దిగుతున్నవాడు అలాగే ఆగిపోయి, అసంకల్పితంగా జేబులు తడుముకుని, "మరచిపోయాను, థాంక్యూ!" అంటూ కళ్ళజోడందుకున్నాడు రాజేష్.

మోటార్‌బైక్ దగ్గరికి నడిచాక, కీ కోసం మళ్ళీ వొకసారి జేబులు తడుముకున్నాడు.

విసుగ్గా నిట్టూర్చి, వెనక్కు నడిచాడు.

మెట్లెక్కి, తన గదిలోకి వచ్చి తెచ్చుకునే ఓపిక లేకపోవడంతో, "ఇదిగో, రమణా!" అంటూ గట్టిగా కేకేశాడు.

"సార్!" అటెండరు వరండాలోకొచ్చి కిందికి తొంగిచూశాడు.

"నా టేబుల్‌పైన కీ చెయినుండాలి. కాస్త తెచ్చిపెట్టు..."

అటెండరు కీ చైను తీసుకొచ్చి ఇచ్చాడు.

"థాంక్యూ!" కీ తిప్పి కిక్కర్‌ను తొక్కాడు. ఇంజన్ స్టార్టుకాలేదు. విసుక్కుంటూ మళ్ళీ ప్రయత్నించాడు. ఇంజన్ చెప్పినమాట వినడంలేదు. ఆయిల్ ఫ్లో సవరించిన తరువాత, విసుగ్గా కిక్కర్‌ను వెనక్కు నెట్టాడు. ఇక తప్పదన్నట్టుగా ఇంజన్ స్టార్టయింది.

రాజేష్ వెనక్కు తిరిగి చూశాడు.

అటెండరు నవ్వుకుంటూ తనవంకే చూస్తున్నాడు.

బలవంతంగా తానూ ఒక నవ్వును కొని తెచ్చుకొని మోటర్‌బైక్‌ను పరిగెత్తించాడు.

యెండ బాగా తగ్గిపోయింది.

షికార్లకూ, షాపింగ్‌లకూ తిరిగే జనంతో రోడ్లు హడావుడి పడుతున్నాయి.

బస్‌స్టాప్‌ల దగ్గర జనం గుమికూడి పోతున్నారు.

శ్రీనగర్ క్రాస్ దగ్గరికి రాగానే, ఫర్లాంగుపొడవునా ఆగిపోయిన వాహనాలు వెక్కిరిస్తున్నట్టుగా కనిపించాయి.

"ట్రాఫిక్ జామ్..." ప్రక్కనే ఆగిన ఆటోలోంచి డ్రైవరు మాటలు వినిపించాయి.

జేబులోంచి రుమాలు పైకిలాగి, నుదుటిపైని చెమటను తుడుచుకున్నాడు రాజేష్.

ఎదురుగాలి తాకిడి చల్లగానే అనిపిస్తున్నా, వొళ్ళంతా చీదరగా తయారవడంతో విసుగ్గావుంది అతడికి.

'ఇంటికెళ్ళి స్నానంచేస్తేగాని కుదరదు' అనుకున్నాడు.

'నెమ్మదిగా వున్నప్పుడు పరిశీలించడానికి వీల్లేకుండా అన్నీ ఒక్కసారిగా అకస్మాత్తుగా జరుగుతోంది. గాలిలో తేలిపోతున్నట్టుగా ప్రారంభమైన ట్యాంక్‌బండ్‌పైని సర్వే ఇప్పటికీ గానీ పూర్తికాలేదు. స్నానం చేశాక, బట్టలు మార్చుకుని వెంటనే హోమ్‌కు వెళ్లాలి. సాగర్ యెలావున్నాడో యేమిటో? మానస ఆరోగ్యం యెలా వుందో? దగ్గరుండి సహాయపడవలసిన సమయంలోనే క్యాంపులూ, సర్వేలూ... పని ఒకచోట, ధ్యాస మరియొక చోట... నచ్చినపని చేయడానికి కోటి అడ్డంకులు... వీలు దొరికినప్పుడల్లా మనిషికి అతడి అల్పత్వాన్నీ అసమర్థతనూ గుర్తుచేయాలని పట్టుబట్టుకుని కూర్చుంది ప్రపంచం...'

వెనకనుంచీ హారన్ గొంతుచించుకుంటోంది.

వాహనాలు మెల్లగా కదులుతున్నాయి.

ఇంకా పూర్తిగా పరిగెత్తే అవకాశం దొరకలేదు. చీమదూరే సందు దొరికినా ఆక్రమించుకోవడం కోసం ప్రతి వ్యక్తి పరుగులు తీస్తున్నాడు. ప్రవాహంలోకి దిగిన తరువాత తన అస్తిత్వానికి విలువలేదు. ఇష్టంలేకున్నా ముందుకు కొట్టుకు పోవలసిందే!

తానూ ముందుకు కదిలాడు.

పెళ్ళి వూరేగింపుల ట్రాఫిక్ మెల్లగా సాగుతోంది.

రోడ్డు క్రాస్‌చేయలేకపోయిన బాటసారులంతా యెటువైపున్నవాళ్ళు అటువైపునే ఆగిపోయి, బిక్కమొహంవేసుకుని చూస్తున్నారు.

కూడలి దగ్గర 'స్టాప్' బోర్డు తగిలించుకున్న కానిస్టేబుల్ శ్రీకృష్ణ పరమాత్ముడిలా అభయముద్రతో 'చూశారా, నా ప్రతాప'మన్నట్టుగా ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు.

అతన్ని దాటుకున్నాక కట్టలు తెంచుకున్న ప్రవాహంలా ట్రాఫిక్ వురకలువేసింది.

రాజేష్ మరో అయిదు నిముషాలో తన గదిని చేరుకున్నాడు.

మోటార్‌బైక్ స్టాండువేసి, కీ వేశాడు. గది తలుపులముందు కాస్సేపు బిగంతో కుస్తీపట్టి, లోపలికి ప్రవేశించాడు.

తీవాచీపైన వుత్తరం కనిపించింది.

తీసుకుని టేబులుపైకి గిరవాటు పెట్టాడు.

గది అడ్రసుకు సామాన్యంగా యెవరూ జాబులు రాయరు. యెన్ని సార్లు చెప్పినా, గది అడ్రసుకే వుత్తరాలు రాసే యేకైక వ్యక్తి యెవరో అతడికి బాగా తెలుసు.

నాలుగయిదు. రోజులుగా గదిలో ఊసం నడయాడక పోవడంతో అది 'బ్రహ్మచారి కొంప' అని స్పష్టంగా తెలియజేయడంకోసం కళాదర్శకుడు నిర్మించిన సెట్టింగులా వుంది.

మంచంపైన మాసిన బట్టలు ... హేంగర్లకు వ్రేలాడుతున్న ప్యాంట్లూ ... టేబుల్‌పైన పుస్తకాల దొంతరలూ ... నేలపైన దుమ్మూ, సిగరెట్టు పీకలూ ... షర్టు తీసేశాక, చుట్టూ వోసారి తిరిగి చూసి. బాగు చేయడం కంటే పాడుచేయడమే సులభమైన పనిగా గుర్తించినట్లు, దాన్నిగూడా మంచంపైకి విసిరేశాడు రాజేష్.

లుంగీ కట్టుకుని, ఫాన్ ఆన్‌చేసి. యీజీఛేర్లో కూచున్నాడు.


టేబుల్‌పైన వుత్తరం రెపరెపలాడింది.

చేతికందుకున్నాడు.

కవరు చింపి, వుత్తరం పొరలు విప్పాడు.

'యీసారి వుపోద్ఘాతాల్ని వదలిపెట్టి, యేకంగా పెళ్ళిసంబంధాల జాబితాను తయారుచేసేశారు. వరసగా అరడజను సంబంధాలు ... చదువు, తండ్రి ఆర్థిక స్థోమతా, యివ్వగలిగిన కట్నమూ – వరసగా గీతలుకొట్టి పట్టిక నొకదాన్ని తయారుచేసి పంపితే సరిపోయేది గదా !' రాజేష్ తనలో తానే నవ్వుకున్నాడు. రిటైరై యింట్లో కూచున్న తనకు యీ చివరి బాధ్యత నుంచీ విముక్తిని కలిగించమనీ, అమ్మ బెంగపెట్టుకుందనీ, అన్నయ్యా వదినా కోపగించుకుంటున్నారనీ నిష్ఠూరం చేస్తూ ముగించాడు ఆయన. తండ్రిపైన కోపమూ, సానుభూతీ రెండూ వొకేసారి కలిగాయి అతడికి.

'తనకు పెళ్ళిచేసుకోవలసిన వయసొచ్చి నెత్తిమీద కూచుందన్న విషయమూ తెలుసు. తాను పెండ్లాడదలచుకుంటే టెండర్లు పంపుకోవడానికి సిద్ధంగా వున్న తల్లిదండ్రులు దండిగానే వున్నారన్న సంగతీ తెలుసు. కానీ పెళ్ళిచేసుకోవాలంటే యివేమీ ముఖ్యంకాదని ఆయనకెలా చెప్పాలి ? మొదటిసారి చూసినప్పుడు, కనీసం క్షణంసేపయినా హృదయాన్ని స్పందింపజేయని అమ్మాయిని జీవితంలోకి యెలా ఆహ్వానించడం ? అమ్మాయికేం ? లక్షణంగా వుంది – అంటాడు నాన్న. చిదిమి దీపం పెట్టుకోవచ్చు – అంటుంది అమ్మ. అందంగా లేదన్నానా నేను ? – ప్రశ్నించేవాడు తాను – మరింకేవిటి నీ గొడవ ? యెలా చెప్పాలి తాను ? 'అరయన్ వంశము నిలపనేగద వివాహంబు ?' యెవడన్నాడా మాట ? వంశమన్న ప్రవాహంలో వ్యక్తులు కొట్టుకు పోవలసిందేనా ? జీవితాన్ని వీలయినంత సుఖవంతంగా మలచుకోవడం కోసమే తోడు కావాలి. కేవలం శారీరక వాంఛల్ని తీర్చుకోవడం కోసమయితే పెళ్ళెందుకు ? యేదీ. నిజంగా , నా



జీవితాన్ని నందనవనంగా మార్చే తోటమాలి ? వొక చిరునవ్వుతో బడలికనంతా తుడిచిపారేసే మాధుర్యమూర్తి ! ... వొళ్ళంతా నగలు దిగేసుకుని, పట్టు చీరలో వుడికిపోతూ, వైవాహిక జీవితమనే వుద్యోగానికి యేర్పాటు చేసిన యింటర్వ్యూలో నెగ్గుతానో లేదోనని కంగారుపడుతూ, బెదురు చూపులు చూసే యీ అమాయకపు ప్రాణులు నాకొద్దు. నాక్కావల్సిన వ్యక్తి యెవరో మీకెలా చెప్పాలి ?'

బాత్రూంలోనికి వెళ్ళి గబగబా నీళ్ళు నెత్తిపైన దిమ్మరించుకున్నాడు.

'తన పెళ్ళి చేశాక బాధ్యతలు తీరిపోతాయని నాన్న ఆశ. బాగానే వుంది. తరువాత జీవితమంతా యెవరిది ? తనది. మంచి జరిగినా, చెడు జరిగినా అనుభవించవలసింది యెవరు ? తానే ... పాపం ! మానస ... అవిడ కోరిక ప్రకారం యెమ్మేలో చేర్చినా బావుండేది! యిప్పుడేమయింది ? కొలాప్స్ ...సర్వ నాశనం ... యిక ఆమె జీవితంలో యేం మిగిలింది ? నథింగ్ ... యింత కంటే తుపాకీతో వొక్కసారిగా కాల్చిపారేసినా బావుండేది. అయ్యో మానసా ? భర్త అన్న పదానికి అర్థమయినా పూర్తిగా అవగతం కాలేదే నీకు ? భార్యగా నీ వెత్తిన అవతారం ఆరు నెలలయినా కొనసాగలేదే ? మాగరేట్ యూజ్ డి గోల్డ్ ఫార్ వుమెన్, యిట్ యీజ్ యే సింపుల్ ఛేంజ్ యిన్ డి లైఫ్ ఆఫ్ యే మాన్ ... నాన్సెన్స్ ... యెందుకింత వలపక్షం ? యేమిటి ఆడవాళ్ళు చేసిన నేరం ? శారీరకంగా కూడా యెదగనివ్వకుండా జాగ్రత్త పడుతూ, తనకొక న్యాయాన్నీ, ఆమెకొక న్యాయాన్ని సృష్టించి, అమానుషంగా ప్రవర్తిస్తుంటే చూస్తూ వూరుకోవలసిందేనా ? నో, యీ అవినీతి యిలాగే చెలామణి కావడం నేరం. లే మానసా, యీ గతజల సేతుబంధనాల్ని వొదిలించుకుని పైకిలే ... అందరి కళ్ళు కుట్టేలా, అందరూ తల వంచుకునేలా కసిగా మళ్ళీ పెళ్ళాడు ... అవును మళ్ళీ పెళ్ళాడు. పెళ్ళాడు మానసా పెళ్ళాడు. నీకేం తక్కువ ? చిదిమి దీపం పెట్టుకోవచ్చు. యెంతటి అపురూపమయిన సంస్కారం నీ సొత్తు !

ఆరునెలల క్రితం వరకూ, నిన్ను పెళ్ళాడగలిగినవాడు చాలా అదృష్టవంతుడని అనుకొందిగదా ప్రపంచం...యింతలో, యీ చిన్న యెపిసోడ్ అడ్డం వచ్చినంత మాత్రాన ఆ విలువ మారిపోతుందా ? అదే అందం ... అదే సంస్కారం...అదే వ్యక్తివి నువ్వు... నేడు సైతము నిన్ను పెళ్ళాడిన వాడు అదృష్టవంతుడు గాక పోతాడా ? నో... ముమ్మాటికీ అతడు లక్కీ ఫెలోనే ! నువ్వు 'వూ' అనాలేగాని, యెవరయినా నిన్ను కళ్ళకద్దుకుని చేసుకుంటారు. యెవరిదాకానో యెందుకు ? నేను..."

మంచినీళ్ళలో విద్యుత్తు ప్రవహించినట్టయింది.

భూకంపం వచ్చి, సరిగ్గా తన పాదాలకింద భూమి పగిలి పోయి, తానెక్కడో అగాధంలోకి జారిపోతున్నట్టుగా తోచింది.

ముఖానికి పట్టించిన సోపు నురగ చివాలున తెరచుకున్న కనురెప్పల సందుల్లోంచీ లోపలికి దూరి, కళ్ళను భగభగ మండించింది.

రాజేష్ కళ్ళు మూసుకున్నాడు.

రెండు మూడు నిమిషాలసేపు అచేతనుడై నిలుచుండి పోయాడు.

అతడి మనసు ఆలోచించడం మానేసింది.

యెద రొమ్ముపైన గుండె లోలకంలా టక్కు టక్కు మని కొట్టుకొంటోంది.

కళ్ళు మండుతున్నాయి.

షవర్ తిప్పాడు.

తల దిమ్మ తిరిగేలా నీళ్ళు దుమకసాగాయి.

'తన కెందుకొచ్చిందీ ఆలోచన ? నాన్న కోపంతో యెగిరి గంతు లేయడూ యీ సంగతి తెలిస్తే ! అమ్మ, అన్నయ్య, వదిన, బంధువులు, స్నేహితులు, యీ ప్రపంచం - యేమనుకుంటారు తనను జూసి ? అమ్మ యేడుస్తుంది. అన్నయ్య మండిపడతాడు. కొందరు బంధువులు బాధ పడతారు. కొందరు జాలిపడతారు. యింకొందరు తమ కసి తీరింది లెమ్మనుకుంటారు. స్నేహితులు యెగతాళి చేయరూ యిది విని ? లోకంలో తలెత్తుకుని తిరగ్గలడా తాను ? అందమయినదే కావచ్చు... సంస్కారవంతురాలు అయివుండవచ్చు. అయినా వితంతువుని... యెందుకీ యెదురీత ? అందమయిన జీవితాన్ని యెడ తెగని పరీక్షగా యెందుకు మార్చుకోవాలి ? తన కెందుకొచ్చిన బాధ ? తనకు మాత్రం యేం పట్టింది ? అందరూ చేతులు ముడుచుకుని కూర్చున్నప్పుడు, యిదిగో 'నేనున్నానండి సంస్కర్తని..' అంటూ దప్పు వాయించరని, అపురూపమైన జీవితాన్ని అంతులేని శోధనగా యెందుకు మార్చుకోవాలి ? నో... తన తరంగాదు. తనకేం కొదువ ? లక్షల కట్నం, కోరుకున్న అందం అన్నీ సిద్ధంగా యెదురు చూస్తున్నాయి. తన సమాధానం కోసం...అన్నిటినీ వదలిపెట్టి ముళ్ళ దారిలో యెందుకు ప్రయాణం ? కావలిస్తే యింకెవర్నయినా పెళ్ళాడమను. తానూ వెళ్ళి అభినందించి వస్తాడు. అంతేగానీ, తనకు మాలిన ధర్మం యెందుకు ? అసలింతకూ యిలాంటి వూహ తనకెందుకు రావాలి ?'

టవలుతో తల తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు.

స్విచ్ నొక్కగానే, టేబుల్ ఫాను విజృంభించింది.

సిగరెట్ వెలిగించుకున్నాడు.

హాయిగా వుంది.

యేదో పెద్ద ప్రమాదం నుంచీ బయట పడినట్టు అనిపిస్తోంది.

భయంకరమయిన కలగని, వులిక్కిపడి మెలుకువ అంతా కేవలం కల మాత్రమేనని గుర్తించిన తరువాత, 'అమ్మయ్య' అనుకొని వూపిరి పీల్చుకున్నట్టు- చాలా ఆనందంగా వుంది.

గదిలో చీకటి ముసురుకుంటోంది.

వీధి దీపాలు వెలిగినట్టున్నాయి.

కిటికీలోంచి వెలుతురు టేబుల్‌పైకొచ్చి వాలుతోంది.

తెల్లటి వెండికప్పుపై పడిన వెలుతురు కిరణం నక్షత్రంగా చిట్లి, ఫక్కుమని నవ్వుతోంది.

యెవరో చాచి లెంపకాయ కొట్టినట్టయి, దిగ్గున లేచి కూచున్నాడు రాజేష్.

వెండి కప్పు పక్కనే ఫోటో... వైస్ ఛాన్సలర్ దగ్గరినుంచీ ప్రశంసలందుకుంటూ నవ్వుతున్నాడు తాను.

వెంటనే పక్కకు తిరిగి నిలువుటద్దంలో తన ముఖాన్ని చూసుకున్నాడు.

'రేగిన జుట్టు, పాలిపోయిన ముఖం, చీకటితో తయారుచేసినట్టున్న వికృత మానవాకారం _ తానే. వైస్ ఛాన్సలర్ చేతుల మీదగా బహుమతినందుకుంటున్న ఆ సుస్వరూపికీ, యీ అష్టావక్రుడికీ పోలికెక్కడుంది ?- ఎలా వుంటుంది? ప్రజాస్వామ్యవాదమా ? కమ్యూనిజమా ?- డిబేట్‌లో ప్రయిజు- అదిగో అదే ఆ షీల్డు. స్త్రీలకు సమానహక్కులవసరమా, కాదా ?- యెలక్యూషన్‌లో మళ్ళీ తనకే మొదటి బహుమతి- తన వాదన విన్న జడ్జెస్ ఆశ్చర్య చకితులై పోయేవారు. యింతటి ఆదర్శవాది సైతం వుంటాడా అని ముక్కున వేలేసుకునే వాళ్ళు అందరూ. ఆదర్శం తన టేబుల్ పైని షో పీస్ ఆదర్శం తన వేషం. ఆదర్శం తన మేకప్- అది తొలగిపోతే మిగిలేదేమిటి ? యిదిగో యిదే !... అద్దంలోని ప్రతిబింబం తనకే వికృతంగా కనిపిస్తోంది...'

యెవరో తరుముతున్నట్లుగా పైకి లేచి స్విచ్ ఆన్ చేశాడు.

ట్యూబ్‌లైటు నాలుగైదుసార్లు విసుక్కుని, చివరకు తప్పదన్నట్టుగా వెలిగిండి.

టైంపీస్‌లో విమానం బొమ్మను అతికించుకున్న పెద్దముల్లు నిర్విరామంగా పరిగెడుతోంది

రాజేష్ బ్రష్‌తో తల దువ్వుకున్నాడు. ముఖానికి పౌడరు రాసుకున్నాడు. మరోసారి తన ప్రతిబింబాన్ని పరీక్షించి చూసుకున్నాడు.

'యిప్పుడు పరవాలేదు. కానీ ... యేమిటిది ? పౌడరుపూత తెరలా అడ్డుపడినా, లోపల యేదో వికృత శరీరం కదలుతున్నట్లుగా వుంది ...'

గబగబా బట్టలు తొడుక్కుని, గదిలోంచీ బయటకొచ్చేశాడు.

బీగం తగిలించి, మోటార్‌బైక్ స్టార్టు చేశాడు.

హోటల్‌కెళ్ళి వేడివేడిగా వో కప్పు కాఫీ తాగాడు.

యెక్కడికి వెళ్ళాలన్న సందేహం కలిగింది.

సాయంకాలం యెలాగయినా నర్సింగ్‌హోం కొస్తానని మాటిచ్చాడు తాను. గంట యేడు కావస్తోంది.

ప్రశాంతి నర్సింగ్‌హోమ్ వైపుకు వాహనాన్ని మరల్చాడు.

[illegible] పెళ్ళి ఊరేగింపు ఎదురయింది. మల్లెపూలతో అలంకరిం చిన ఎరుపురంగు [illegible] కారులో నూతన వధూవరులు ఊరేగుతున్నారు.

రోడ్డు మలుపు తిరగగానే, కార్పొరేషన్‌వాళ్ళ శవవాహనం ఎదు రయింది. [illegible] ఎవరో పెద్దమనిషి పోయినట్టున్నాడు. నల్లటి బ్యాడ్జీలు ధరించిన వ్యక్తులు కొందరు శవవాహనాన్ని అనుసరిస్తున్నారు.

'జీవితంలో పుట్టుక ఎంత సహజమో, మరణమూ అంతే సహజం. [illegible] మనుషుల్ని ఒకటిగా కలిపేది బంధం పెళ్ళి. ఒక వ్యక్తిని మిగి లిన ప్రపంచం నుంచి శాశ్వతంగా [illegible] మరణం. కేవలం ఒక వ్యక్తి [illegible] మాత్రాన, మిగిలిన వ్యక్తులు శోకగ్రస్తులు కావలసిందేనా? [illegible] సైతం ఒక్క అంటూ [illegible], పరాయి ప్రపంచంలో వారికి సద్గతులు లభించాలని [illegible] చేసే ప్రపంచం, బ్రతికినవాళ్ళ అతి [illegible] న్యాయమేనా?"

[illegible]

[illegible] చూశాడు రాజేష్.

[illegible] రు. మనాలపిందా సంస్థలు [illegible] [illegible] ... [illegible] ... [illegible] ... [illegible] జీవిత [illegible] ...

[illegible]?

[illegible] కదలలు.

[illegible] ఇవ్వడం [illegible]. [illegible] జీవితం తనది. [illegible] ప్రపం [illegible] మార్పుకో [illegible], నాలాంటి ఆదర్శాల గురించి [illegible] మహాత్ముడని అభినందిస్తారు. అంతే [illegible] ... [illegible] తెగాక ...'

[illegible] అనేక వాహనాల్లో, సాగర్ మోటరు బైక్ కూడా కనిపించింది.

[illegible] లాక్ చేసి, లోపలికి వెళ్ళారు.

[illegible] కనిపిస్తున్న స్పెషల్ వార్డులోని [illegible] గదుల్లో, మానస గదిని [illegible] పడవలసి వచ్చింది.

ఆ గదిలో నిశ్శబ్దం ఘనీభవించినట్టుంది.

మంచంపైన మానస తీగలు తెగిన వీణలా ముడుచుకుని పడుకొని వుంది.

[illegible], పలకరించడం కోసం విశ్వ ప్రయత్నం [illegible] ఫలించక పోవడంతో వలవెల [illegible] తున్న [illegible] తెస్తున్నాడు.

నారింజపండ్లతో కుస్తీపడుతున్న అన్నపూర్ణ "రా నాయనా!" అంటూ కుర్చీ చూపెట్టింది.

గదిలోకి మరో వ్యక్తి ప్రవేశించిన సంగతి సైతం మానసకు [illegible] మయినట్టు లేదు.

ఎవరిని పలకరించాలో తోచలేదు.

ఏమని ప్రశ్నించాలో స్ఫురించలేదు.

రాజేష్ తనలో తానే తికమక పడిపోసాగాడు.

నాలుగయిదుసార్లు మాట్లాడడానికి ప్రయత్నించి విఫలుడైపోయాడు.

చివరకు "డాక్టరేమన్నాడు?" అంటూ ప్రశ్నించాడు.

సమాధానంగా కృష్ణమూర్తి [illegible].

అన్నపూర్ణ [illegible] తలపైకెత్తి చూసింది.

"మీ అమ్మానాన్నా ఏం చేస్తున్నారోయ్! [illegible] హుషారుగా కనిపిస్తున్నారు." అంటూ ప్రశ్నించాడు [illegible] [illegible] మీ అమ్మానాన్నల్ని [illegible] అనుకునే ప్రమాదముంది, జాగ్రత్త!" అంటూ [illegible] వేళాకోళం [illegible] కూడా! [illegible] - [illegible] యెంతమార్పు! [illegible] వాక్య సారంగా ముగిలి [illegible] పోయాడు.

"సాగర్ ఎక్కడున్నాడు?" అపస్వరాలు వెలువడడం అ గది స్వభావమే మోసుపించింది అతడికి.

"డాక్టరు దగ్గరకి వెళ్ళాడు" అన్నపూర్ణ పళ్ళరసం గ్లాసు మానస దగ్గరికి తీసుకెళ్తూ సమాధానం చెప్పింది


"మానస డైట్ తీసుకుంటోందా!"- అడగ కూడదని అనుకుంటూనే ప్రశ్నించాడు.


"ప్చ్! ఫ్లాస్కులోని పాలు అలాగే ఉన్నాయి. పళ్ళరసం గ్లాసుల గ్లాసులుగా పారబోస్తున్నాం. [illegible] [illegible] [illegible]..." ఆమె [illegible] [illegible].

కృష్ణమూర్తి లేచి మానస పడుకున్న మంచంపైకి వెళ్ళి కూచుని, "అమ్మాయ్, లేచి జ్యూస్ తీసుకో! నా మాట విను..." అంటూ [illegible] పడసాగాడు.

రాజేష్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'గల గల పారే సెలయేరు...సాయంకాలపు [illegible] మలయమారుత వీచిక...వికసించిన సన్నజాజుల [illegible]...[illegible] [illegible] మెరుపు రంగు [illegible]...[illegible] పూలు!...[illegible]!... రోజుకోరకంగా కనిపించే ఆమె [illegible] టుగా అనిపించేది. [illegible] తరబడి ఆలోచించేవాడు తాను. కానీ...కానీ...[illegible] పోయిందని [illegible]





యీ భూప్రపంచంలో రోజూ రాలిపోతున్న లక్షలకొలది మానవమాత్రులలో చిరంజీవి కూడా వొకడు. వాడొకడు పోయినంత మాత్రాన యేం పుట్టిమునిగి పోయిందని ? కొండంత జీవితం నీ ముందుంది. యెందుకిలా నిరాశపడిపోయావు నువ్వు ?'

"సాగర్‌ను కలిసి..." తనలో తానే గొణుక్కుంటూ గది బయటకు నడిచాడు రాజేష్.

డాక్టరు గదిలోంచీ రకరకాల గొంతుకలు బిగ్గరగా వినిపిస్తున్నాయి.

బాయ్‌ని కేకేసి సాగర్‌కోసం వాకబు చేశాడు.

"రాజూ..." సాగర్ కంఠం వినిపించింది.

తిరిగి చూశాడు.

మేడమెట్లు దిగుతూ కనిపించాడు సాగర్.

అతడు దగ్గరికి వచ్చాక, "డాక్టరు దగ్గరి కెళ్ళావని అంటేనూ..." అంటూ ముందుకు కదిలాడు రాజేష్.

"లేదు. మేడపైన చల్లగా గాలి వీస్తోంది. అందుకని..."

"ఒంటరిగానా ?"

"అవును... యేమీ తోచలేదు. అందుకని టార్డ్‌స్టేర్లోకెళ్ళాను. ఓపెన్ ప్లేస్... పిట్టగోడపైనకూచుని, నువ్వొస్తావేమోనని రోడ్డుకేసి చూస్తూ కూర్చుండిపోయాను. అవునూ, నువ్వొచ్చి యెంతసేపయింది ?..."

"ఇప్పుడే !"

"నిజంగా రోడ్డుకేసి చూస్తున్నట్టయితే, తానొచ్చిన సంగతి తెలియకుండా యెలావుంటుంది ? యీ సాగర్ ఇంకా పలాయనవాదంనుంచీ బయటపడలేదు. గదిలో కూచోలేక, మేడపైకెక్కి వో మూల కూచుని, గుప్పెడు సిగరెట్లు తగలేసి వుంటాడు. రాజేష్‌కు కోపం వచ్చింది.

"వెళ్దామా ?" అన్నాడు సాగర్.

"ఎక్కడికి ?" రాజేష్ ప్రశ్న కటువుగా వినిపించింది.

"నేను భోంచేయాలి. ఆకలిగావుంది. ముందు హోటలుకు...తరువాత యెక్కడికైనా..."

మిత్రుడికోసారి పరకాయించి చూశాడు రాజేష్, 'లాభంలేదు. వీడు మధ్యాహ్నమేగాదు, నిన్నరాత్రి సైతం భోంచేసినట్టులేడు.'

"అమ్మతో వెళుతున్నానని చెప్పాలి. కాస్సేపాగు" అంటూ గదిలోకి వెళ్ళి, రెండు నిముషాలలోనే తిరిగొచ్చేశాడు సాగర్.

మరో అయిదు నిముషాలకంతా, నర్సింగ్‌హోంనుంచీ రెండు మోటారు బైకులు నగరంలోకి పరుగులు తీశాయి.

పదిహేను నిముషాల ప్రయాణం తరువాత, మిత్రులిద్దరూ హోటల్ చేరుకున్నారు.

"రూఫ్‌గార్డెనుకెళ్దాం" అంటూ తానే లీడ్ చేశాడు సాగర్.

లిఫ్టు అయిదో అంతస్థుపైకి తీసుకెళ్ళింది.

రెండు మూడు టేబుల్స్ మాత్రమే 'ఫిల్‌అప్' గావడంచేత, రూఫ్ గార్డెన్సులో వాతావరణం ప్రశాంతంగా వుంది.

నగరపు వెలుతురుతో పోటీపడలేక ముఖం వేలాడేసుకున్న చంద్రుడు, కూతవేటు దూరంలోనే వున్నట్టుగా కనిపిస్తున్నాడు.

ఫ్యాక్టరీ పొగలధాటికి తట్టుకోలేక, మేఘాలు పలాయనం చిత్తగించినట్టున్నాయి.

నగరపు రోడ్లపైన జరుగుతున్న దీపాల జాతరని రూఫ్‌గార్డెన్సులోంచి ఎంతసేపు చూసినా తనివి తీరడంలేదు.

మిత్రులిద్దరూ ఒక టేబుల్‌ముందు కూర్చున్నారు.

బేరర్ 'మెనూ' తీసుకొచ్చి టేబుల్‌పైన పెట్టాడు.

"ఆర్డర్స్ నేనేయివ్వనా" సాగర్ చిరునవ్వు నవ్వుతూ ప్రశ్నించాడు.

అతడివైపే, విస్తుపోయి చూస్తూ వుండిపోయాడు రాజేష్.

"యేమిటలా చూస్తావ్ ? నువ్వే చెప్పు అలాగయితే..." మెనూ

ముందుకు తోశాడు అతను.

"లేదు... నువ్వే చెప్పు..."

మెనూ తెరిచి, సర్వర్‌కు ఆర్డర్ చెప్పాడు సాగర్.

రాజేష్ ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు. 'సాగర్ ముఖంలో నవ్వును చూసి యెన్నాళ్ళయింది? యింత తొందరగా ఇతడెలా తేరుకోగలిగాడు? సమ్ థింగ్ ఈజ్ రాంగ్ విత్ హిమ్ ... ఏదో జరిగింది ... కొంపదీసి ... నో... అలా జరగడానికి వీల్లేదు... వీడి పలాయనంలో ఇదో మలుపు కాబోలు...'

"నాకు పిచ్చి పట్టిందనుకొంటున్నావుగదూ?" తానే ప్రశ్నించాడు సాగర్.

రాజేష్ వులిక్కిపడ్డాడు. "అబ్బే...నేను...అడిగాదు..." తడబడి పోయాడు.

సాగర్ మళ్ళీ ఒక చిరునవ్వు నవ్వాడు. "పరిస్థితులకు యెదురునిలిచి పోరాడమని సలహా ఇచ్చినవాడివి నువేగదా! మరి... నువే ఇలా స్టన్నయిపోతున్నా వెందుకు?..."

"......"

"చూశావా రాజూ! సలహా [illegible] కులభం... పాటించడమే కష్టం. కానీ సందిగ్ధావస్థలో పడి [illegible] ఫ్రస్ట్రేషన్... ఒక నిర్ణయానికి వచ్చాక, ఇక [illegible]..."

"అంటే ...!?"

"జరిగిన గొడవ యెందుకు జరిగిందన్న వివరాల్ని అనవసరంకి చెప్తే కాను. నువ్వెళ్ళి క్యాంపు పేరుతో ద్యాం దగ్గర వుండిపోయావు. [illegible] నాలుగు రోజుల్లో యెన్ని గొడవలు జరిగాయని? [illegible] జరిగిందని?..."

"..............."

"[illegible] ప్రపంచంలోకి నమ్మారని అనుకోలేదు. కానీ... [illegible] నేరుగా చెప్పలేక, వెళ్ళిన తరువాత [illegible] ఒక పెద్దమనిషిని పంపారు. [illegible] తతంగాలు యింకా మిగిలిపోయాయనీ, కోడల్ని యింటికి పంపమనీ కబురు మోసుకొచ్చాడు ఆ పెద్దమనిషి. యీ స్థితిలో మానసని వాళ్ళయింటికెలా పంపాలి?..."

"..............."

"అయినా యెందుకు పంపాలి? పంపిన తరువాత జరగబోయే పరిణామాలు యెలాంటివి? పట్టుకుని పాలికేళ్ళయినా లేవు గదా! అప్పుడే అలాంటి ఘోరాలన్నీ యెందుకు జరగాలి? అమ్మా నాన్న యేటూ చెప్పలేక యేడుస్తూ కూచున్నారు... నిన్ననే చిరంజీవి వాళ్ళ యింటి కెళ్ళొచ్చాను. యిక ఆ యింటికీ, మానసకూ యెలాంటి సంబంధమూ లేదని కచ్చితంగా చెప్పేశాను. యెవరయినా చాడ నష్ట చేష్టలు చేశారంటే, వాళ్ళ మొహం చూడనని మా అమ్మా నాన్నలతో కూడా చెప్పేశాను. యిదొక దుస్వప్నం. అంతే! మానస కసలు పెళ్లే జరగలేదు. కోలుకున్న తరువాత, దాన్ని యెమ్మేలో చేరుస్తాను. తన యిష్టం వచ్చినంత వరకూ చదువుకోమంటాను..."

సాగర్ కేసి పరిశీలనగా చూశాడు రాజేష్. అతడు ఆవేశపడడం లేదు. నింపాదిగా, తనతో తానే మాట్లాడుకుంటున్నట్టుగా, చెప్పుకుపోతున్నాడు.

"జీవితంలో లొంగుబాటుకూ, సర్దుబాటుకూ తల వొంచకూడదని నిర్ణయించుకున్నాను. యిప్పట్నుంచీ నాకున్నదొకటే లక్ష్యం. నిన్నటి వరకూ దుష్పరిణామాల్ని నిరోధించే పోరాటంలోనే గడచింది. యీ రోజునుంచీ నా ఆశయం వొకటే!... మానస జీవితం మళ్ళీ రుదుట పడాలి. మళ్ళీ మానస మామూలుగా తిరగాలి. అమ్మకూ, నాన్నకూ దాన్ని గురించిన చింత తొలగి పోవాలి. చూస్తూ వుండు రాజూ! మళ్ళీ మా మానస జీవితంలోకి వసంతాన్ని తీసుకొస్తాన్నేను..."

సాగర్ కళ్ళు మెరుస్తున్నాయి.

"ఆదర్శాలు వల్లించడం చాలా సులభం, కానీ రాజూ! నేను కోతలు కోయడం లేదు. నిజమే చెబుతున్నాను. మా చెల్లెలికి మళ్ళీ పెళ్ళి చేస్తాను. యిప్పట్నుంచీ నా ధ్యేయం అదే! మానసకు పెళ్ళి చేసిన తరువాతే, నా పెళ్ళి జరుగుతుంది. యిది పందెం కాదు... నా జీవిత లక్ష్యం..."

రాజేష్ అనిమిషనేత్రుడై మిత్రుడివైపు చూస్తూ వుండిపోయాడు.

పొగలు క్రక్కుతున్న ప్లేటితో బట్లర్ టేబుల్ దగ్గరి కొచ్చేశాడు. పింగాణీ ప్లేట్లు అమర్చి, వేడివేడి భోజనాన్ని వడ్డించాడు. ఖాళీ ట్రే తీసుకుని వెళ్ళిపోయాడు.

సాగర్ తినడం ప్రారంభించాడు.

రాజేష్ తన ప్లేటు ముందుకు లాక్కున్నాడు.

సాగర్ చకచకా భోం చేస్తున్నాడు.

రాజేష్‌కు అన్నం తినడానికి మనస్కరించడం లేదు. ప్లేటులో కెలుకుతూ కూర్చున్నాడు. 'వొకే రకమయిన పక్షులు వొకే గూటికి చేరుతాయని' అంటారు. తానూ, సాగర్ భవిష్యత్కార్యక్రమాల్ని గురించి, వూహాగానాలు సాగించేవాళ్ళు. కనీసం పదిమంది అభాగ్యుల్ని ఆదుకోగలిగే జీవితం, వృధా అవుతుందని అనుకునేవాళ్ళు. ఎన్ని ఆలోచనలు? ఎన్ని పథకాలు! రాజకీయాలతో ప్రమేయం లేని చారిటీ సొసయిటీ నొకదాన్ని స్థాపించాలి. అనాథ బాలలకు చదువు; వృద్ధులకూ, వికలాంగులకూ ఆశ్రయం; విద్యార్థుల కోసం హాస్టల్ — తమ ఆశయాల లిస్టు చాలా పెద్దది. ఆదర్శాలకు అంతెక్కడుంది? తమ ఆశయాల జాబితాతో వొక పుస్తకం తయారుచేస్తే, అది ప్రపంచంలోకెల్లా పెద్ద పుస్తకంగా గిన్నిస్ బుక్‌లో కెక్కుతుందని, జోక్ వేసుకుని నవ్వుకునే వాళ్ళు ... తనకంటూ యే యిబ్బందీ కలగనప్పుడు, ఇతరులకు ఆదర్శంగా బ్రతకమని సలహా యివ్వడం చాలా సులభం. అయితే వొకానొక పరీక్షా సమయంలో తానే వొక ఆదర్శానికి లోబడి నడచుకోవడం చాలా కష్టం! సాగర్ తన జీవితంలో ఆదర్శాలకూ, ఆచరణకూ లంకె కుదుర్చుకుంటున్నాడు. తన జీవితాన్నే వొక పరీక్షకు సిద్ధం చేస్తున్నాడు. యింతటి [illegible] సంకల్పాన్ని గూర్చి, తాను పలాయనమని అనుకుంటున్నాడు.' రాజేష్ [illegible]

భోజనం పూర్తయిన తరువాత [illegible] కడుక్కుంటూ, "[illegible] నువ్వు [illegible], సరిగ్గా లేదా?" అంటూ ప్రశ్నించాడు సాగర్.

"అవును ..." అన్నాడు రాజేష్, రాస్తుపోగి, తరువాత [illegible] గాడు — "మరి ... మళ్ళీ పెళ్ళిచేసుకోవడానికి మీ సిస్టర్ వొప్పుకుంటుందా?"

"వొప్పిస్తాను. నేను చెబితే తప్పకుండా వొప్పుకుంటుంది. [illegible] కష్టమయిన పనే! నాకూ తెలుసు ... కానీ నేనీ పని చేసి తీరాలి ..."

"కానీ ..."

మిత్రుడికేసి సూటిగా చూశాడు సాగర్. "నీ సందేహం [illegible] నాకూ తెలుసు. వొకసారి పెళ్ళయిన అమ్మాయిని పెళ్ళాడ్డానికి ఎవరు ముందుకొస్తారని గదూ నీ అనుమానం? వెతుకుతాను. గాలిస్తాను. యింత ప్రపంచంలో వొకడయినా మానవత్వమున్న మనిషి దొరక్కపోడు. దేశం గొడ్డుపోలేదు రాజూ! నూరుమందిలో దొరక్కపోవచ్చు. వేయిమందికి...కనీసం లక్షమందిలో అయినా వొక్కడు - వొక్కడంటే వొక్కడు వుండకపోడు. ఆ మనిషికోసం వెదుకుతాను ..."

రాజేష్‌కు వున్నట్టుండి యేదో వొకశక్తి తనను ఆవహించినట్టుగా తోచింది. 'ఆదినుంచీ ప్రతి విషయంలోనూ తామిద్దరూ భాగస్వాములుగా వుంటూ వచ్చారు. కానీ యీనాడు సాగర్, వో మహత్తరమైన కార్యాన్ని నిర్వర్తించడంలో తనను వెనక్కి నెట్టేసి ముందుకెళ్ళిపోతున్నాడు. తానిది సహించలేడు. వస్తున్నాను ... యిదిగో, సాగర్! నేనూ నీతో కలసి పరిగెత్తబోతున్నాను. యేదీ, నీ చేయి అందించు...' అతడి పెదవులు కదిలాయి. "నీకా వ్యక్తిని వెతికి పట్టుకోవల్సిన శ్రమ నెలాగయినా తప్పించాలని వుంది... సాగర్! నీకు మరెలాంటి అభ్యంతరమూ లేకపోతే, యీ పని చేయడానికి కావల్సిన అర్హతలు నాలోనూ వున్నాయని నీవనుకుంటే - నేను... నేను మానసని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధంగా వున్నాను..."

4

చుట్టూ బీటలు వారిన నేల. గరిక పోచయినా మొలవలేదు. మధ్యలో చేద బావి. కొంగు నడుం చుట్టూ బిగించి, నీళ్ళు తోడుతోంది ఆమె. రేగిన జుట్టూ, లోతుకు పోయిన కళ్ళూ, కష్టనష్టాలను భరించీ, భరించీ అలసిపోయినట్టున్న ముఖం. బావిలోంచి బయటి కొచ్చిన చేంతాడు కొండవీటి చేంతాడంత పొడవుంది. ఆమె వాలకం చూస్తే, యింకా మరింత పొడవున్న చేంతాడు బావిలోనే వున్నట్టుంది.

పాతాళంలోని నీళ్ళు... యెంతకీ పైకి రాని నీళ్ళ కడవ... తెల్ల కార్డ్ బోర్డుపైన యిండియన్ యింకుతో గీసిన బొమ్మ అది...

మంచంపైన సోలిపోయినట్టుగా కూచున్న మానస చూపులు చాలా సేపటినుంచీ యెదుటి గోడకు వ్రేలాడుతున్న బొమ్మపైన్నే వున్నాయి.

ఆ బొమ్మకు ఉపయోగించిన బాక్ గ్రౌండును గురించి గాని, ఆ స్త్రీ పరిస్థితి గురించి గానీ, ఆమె ఆలోచించడం లేదు. ఆ మాట కొస్తే ఆమె యే యితర విషయం గురించీ గానీ ఆలోచించడం లేదు. ఆలోచించి, ఆలోచించీ ఆమె మనస్సు మొద్దుబారిపోయింది. కానీ ఆ బొమ్మవైపు చూస్తూన్నప్పుడు తన కేదో వుపశమనం కలుగుతున్నట్టుగా ఆమెకు అనిపించసాగింది.

యెప్పుడో హైస్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో, ఆబొమ్మగీసింది మానస. ఆ రోజు సెలవు. యేమీ తోచలేదు. పుస్తకాల బీరువా సర్దుతోంటే, డ్రాయింగ్ షీటు దొరికింది. సగం మిగిలిన యిండియన్ యింకు బాటిల్ దొరికింది. మానస రెండు గంటలసేపు పట్టుగా కూచుని ఆ బొమ్మ గీసింది. బావి గీసిన తరువాత, నీళ్ళు చేదుతున్న స్త్రీని గీస్తే బావుంటుందని తోచింది. బావి చుట్టూ పచ్చని పట్టొకటి వుంటే బావుంటుందేమోనని కాస్సేపు ఆలోచించింది. యెందుకో మనస్కరించలేదు. అప్పటికే యింకు అయిపోయింది. బ్రష్‌లో మిగిలిన యింకుతో నేలపైన పిచులు మాత్రమే గీయొచ్చు.

"పెసిమిస్టిక్ ట్రాష్. చించిపారెయ్యి" అన్నాడు సాగర్.

మానస యేడుపు మొఖం పెట్టింది.

"లోపం బొమ్మలో లేదు. నీ దృష్టిలోనే వుంది. ఆమె పట్టుదలకు సింబల్ ... యిట్ షోష్ద యిండామిటబుల్ స్పిరిట్ ఆఫ్ ది హ్యూమన్ బీయింగ్ ... సాయంకాలం బజారు కెళ్తున్నప్పుడు నా కిష్వమ్మా ... ఫ్రేమ్ చేయిస్తాను..." అన్నాడు కృష్ణమూర్తి.

"థాంక్స్ నాన్నా !" అంది మానస.

ఆ మరునాటి నుంచీ, ఆ బొమ్మ మానస గదిలో వ్రేలాడుతోంది.

నీలరంగు గోడలు ... పసుపురంగు కిటికీలు ... ముదురు పంచాయ రంగు కిటికీ తెరలు ... కిటికీ కవతల ఆకుపచ్చరంగు కొమ్మల పింఛాన్ని విప్పి నిల్చొన్న చెట్టు ... గదిలో, వో చివర్న బూడిదరంగు బీరువా, టేబుల్‌పైన ఎర్రటి టేబుల్‌క్లాత్ ... తెల్లగా మెరుస్తున్న టేప్ రికార్డర్ ... రంగులు - యింద్రధనుస్సు విరిసినట్టు ఎటు చూసినా రంగులు రంగులు. కానీ, చిత్ర విచిత్రమైన వర్ణ విన్యాసంలో కనిపించని వోదార్పు తెలుపు నలుపుల్లోనే దొరుకుతోంది ఆమెకు. రంగులన్నీ భ్రమలుగా కన్పిస్తున్నాయి మానసకు. 'జీవితంలో వున్నవి రెండే రంగులు - వొకటి తెలుపూ, వేరొకటి నలుపూ ... తెలుపు నలుపుల్లో తెలుపు దెపుడూ వెనకడుగే ... నలుపు సత్యం ... నలుపు నిత్యం ... ఆలోచనలేక మొద్దుబారిన హృదయంలో నలుపు. రేపుపైన ఆశలేకపోతే మిగిలిందేమిటి ? కారునలుపు' - మానస చూపులు ఆ బొమ్మపైనే తారట్లాడుతున్నాయి.

ఆమె రిస్ట్‌వాచీ అలారం గొంతువిప్పి, కుయ్ కుయ్ మంటూ, హృదయాన్ని శూలాల్తో గుచ్చినట్టుగా అరుస్తోంది.

గడియారం చూసుకోవలసిన అవసరంలేదు - సమయం పదకొండు గంటలా మూడు నిముషాలు. ఆగస్టు పదవతేదీ రాత్రి, గడియారం తీసుకుని పన్నెండు గంటలా మూడు నిముషాలకు అలారం పెట్టాడు చిరంజీవి. యిరవై సంవత్సరాల క్రితం, ఆగష్టు పదవతేదీ మధ్యాహ్నం పదకొండు గంటలా మూడు నిముషాలకు ఆమె పుట్టింది.

"అంటే యీ అలారం మ్రోగిన తరువాత గానీ నేను యిరవయ్యో యేడులోకి అడుగు పెట్టనన్న మాట ..." అంది మానస.

"ఎవరన్నారామాట ? నీకింకా యేడాదయినా నిండలేదు." అన్నాడు చిరంజీవి.

ఆమె కతడి వుద్దేశమేమిటో అర్ధం కాలేదు

"ప్రాచీన గ్రీకు దేశంలో ఆడవాళ్ళ వయస్సును పెళ్ళయినప్పటి నుంచీ లెక్కించడం మొదలు పెట్టేవాళ్ళట ... కాబట్టి నీ వయస్సింకా ఆరు నెలలే ..." చిరంజీవి నవ్వసాగాడు.

అలారం మోగుతోంటే చిరంజీవి నవ్వుతున్నట్టే వుంది.

బీరువాలో పడేసిన వాచీని తీసుకొచ్చి, "యీ ఆటొమేటిక్ వాచీ కట్టుకోకపోతే ఆగిపోతుందట ..." అంటూ తానే కూతురి చేతికి కట్టింది అన్నపూర్ణ.


'తననెలాగయినా, మరో ధ్యాసలోకి మళ్ళించాలని ఆమె తపన. అదెలా కుదురుతుంది ? ఆ యింట్లో వుంటే అతడే జ్ఞాపకం వస్తూ వుంటాడని యిక్కడికి రమ్మన్నావు. అతడికి సంబంధించిన వస్తువులేవీ కంటబడనివ్వకుండా జాగ్రత్త పడుతున్నావు. కానీ, నీడను ఆకారంనుంచీ ఎలా వేరు చేయగలవు నువ్వు ? పెళ్ళయిన మరుక్షణం నుంచేమన్నావు? వొక క్షణమైనా విడిచి పెట్టకుండా, నీడలా వెన్నంటి వుండమన్నావు. యిప్పుడేమయింది ? అసలు కాల్తే లేదు. నీడ మాత్రమే మిగిలింది. బయట ఎక్కడో వుంటే అతడ్ని నానుంచీ దూరం చేయగలరు మీరంతా ... నాలోనే వుంటే మీరేం చేయగలరు ? ...'


బుగ్గలపైనుంచి జారిన కన్నీటిధార పెదవులపైన ఆగింది.

"పేరు చిరంజీవి ... యింతటి అల్పాయుష్కుడికి ఆ పేరు పెట్టి మన కొంప గుండం చేశారు..." కృష్ణమూర్తి హాల్లో కూర్చుని గొణుక్కుంటు న్నాడు.

'అయ్యో పిచ్చి నాన్నా ! ఆయన నిజంగా చిరంజీవే ! మనిషినయితే దూరం చేయగలిగారు గానీ, అతని ప్రభావాన్ని తొలగించగల వాడెవ్వడున్నాడు? సంసారం చేసింది ఆరు నెలలే గావచ్చు. కానీ దాని ప్రభావం చిరంజీవి ... ఆ అనుభూతి చిరంజీవి ... ఆ అనుభూతి తాలూకు వ్యక్తి యిక కంటికి కనిపించడని తెలిసినప్పుడు, అనుభవించవలసి వస్తున్న విషాదం చిరంజీవి ...'

"అలా ఎంతసేపు కూర్చుంటావు మనూ ? యివ్వాళ శనివారం ... నువ్వు మామూలుగా గుడికెళ్ళే రోజు ... లేచి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకో ... నేనూ వస్తాను ..."





మానస వెనుదిరిగి చూసింది.

సాగర్ మంచం వెనుకే నిల్చుని వున్నాడు.

పెల్లుబికి రాబోయిన యేడుపును బలవంతంగా గొంతులోనే అణచి పెట్టడానికి విశ్వప్రయత్నం చేసింది మానస.

"డు నాట్ బీ సిల్లీ ... డ్రైవ్ అవే ది సెంటిమెంటల్ యెగొనీ ... ఎందుకంత బేలగా మారిపోయావు ? యిప్పుడేం కొంప మునిగిందని ? లేచి బయల్దేరు. నేనూ బట్టలు మార్చుకోవాలి ...మళ్లీ అయిదు నిముషాల తరువాత యిక్కడి కొస్తాను. నువ్వు రెడీగా వుండాలి ..."

సాగర్ వెళ్ళిపోయాడు

'యిప్పుడేం కొంప మునిగిందని ? యిలాగంటున్నావేమిటన్నయ్యా నువ్వు ? కొంప గుండమైపోయిందని నాన్న వాపోయి అయిదు నిముషాలయినా కాలేదు. యింకా యేం జరగాలి ? యింకేం మిగిలింది నాకు ? శూన్యం, విషాదం, యెగొనీ, టార్చర్ ... అంతే ! చిరంజీవి ! ఎంత దుర్మార్గుడు ! అంత ప్రేమగా ఎవరుండమన్నారు నాతో ! నేను తప్ప తనకు మరో లోకం లేదని అన్నిసార్లు ఎందుకు చెప్పాలతను ? ఎంత సునాయాసంగా మోసం చేయగలిగాడు !'

"మీ అన్నయ్య బయల్దేరేశాడు. నువ్వింగా కదల్లేదన్నమాట !" అన్నపూర్ణ మందలిస్తోంది.

మానస తల్లికేసి చూసింది.

ఏమీ జరగనట్టుగా నటించడం కోసం విఫల ప్రయత్నం చేస్తోంది ఆమె. కానీ ... కళ్ళల్లో ఎందుకంత విచారం ? గొంతుకలో ఎందుకంత విషాదం ?

కూతుర్ని బలవంతంగా పైకి లేపి, ముఖం కడిగించింది ఆమె. బట్టలు మార్పించి, తల దువ్వించి, ముఖానికి కొంచెం పౌడరు అద్ది, చివరికి బయటికెళ్ళడానికి పీలయ్యేలా తయారు చేసింది.

సాగర్ స్కూటర్‌పైన కూర్చుని ఎదురు చూస్తున్నాడు.

మానస వెనుక సీటుపైకెక్కి కూర్చోంది.

స్కూటర్ స్టార్టయింది.

"యీ రోజు పాలిటిక్స్ డిపార్టుమెంటులో ఏం జరిగిందో నీకు తెలుసా మనూ ? ప్రొఫెసరూ, హెడ్డూ వరండాలో కుస్తీ పట్టేశారు. స్టూడెంట్లందరూ రెండు గ్రూపులయిపోయి, డిపార్టుమెంటును యుద్ధభూమిగా మార్చిపారేశారు. యూనివర్సిటీలోని స్టూడెంట్లందరూ తమ తమ స్నేహితులకు సహాయం చేయడం కోసం ఆయుధాలతో సహా రంగంలోకి దూకేశారు. వీసీ ఫోన్లపైన ఫోన్లు కొడితే పోలీసులు వాన్ల నిండుకూ దిగేశారు. మధ్యాహ్నం పైన పరిస్థితి కొంచెం అదుపులోకి వచ్చింది. యింతకూ హెడ్డూ, ప్రొఫెసరూ ఎందుకు గొడవ పడ్డారని వాకబు చేస్తే స్టూడెంట్లందరూ బిక్కమొహం పెట్టేశారు. కారణం తెలియకుండానే పోట్లాటకు సిద్ధమైపోయారన్నమాట ! ..."

'తన ధ్యాసను మరల్చడం కోసం అన్నయ్య కబుర్లు చెబుతున్నాడు. అన్నయ్యిలా కబుర్లు చెప్పి యెన్నాళ్ళయిపోయింది ? తనకు పెళ్ళిగాకముందు, ప్రతిరోజూ యిలాగే యూనివర్సిటీ విశేషాలు చెప్పేవాడు. పెళ్ళయ్యాక అన్నయ్యతో మాట్లాడ్డానికి తీరికెప్పుడు దొరికేద్చింది ? అన్నయ్య మాటల్ని వింటూంటే మళ్లీ ఆ రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. పెళ్లి, చిరంజీవి– యేదో పుక్కిటి కథలో నారదుడికి కలిగిన స్వప్నభ్రమలా కనిపిస్తున్నారు.'

స్కూటరొకటి, తుర్రుమని వోవర్‌టేక్ చేసుకుని, దూసుకెళ్ళిపోతోంది. వెనక కూర్చున్న అమ్మాయి, డ్రైవ్ చేస్తున్న వ్యక్తిని వాటేసుకుని, వొయ్యారంగా నవ్వుతోంది.

'అయ్యో పిచ్చిదానా ! యెంత భ్రమలో వున్నావు నువ్వు ? నువ్వెంత గట్టిగా కౌగిలించుకుని కూర్చున్నా, ఒకనాడు అతగాడు నిన్ను నిర్దాక్షిణ్యంగా విదిలించిపారేసి, యెటో వెళ్ళిపోతాడు. ఈ మూన్నాళ్ళ ముచ్చటే నిజమని అనుకుంటున్నావు నువ్వు... వొద్దు... మోసపోవద్దు...'

"నీకు చెప్పడంకంటే మౌనంగా వుండడమే మేలు ! ఆలోచించింది చాలుగానీ యిక దిగు..." సాగర్ విసుక్కుంటుండగా వులిక్కిపడి, స్కూటర్ దిగింది మానస.

గుడిదగ్గర సందడి అంతగాలేదు.

మెట్లదారి దగ్గర కొందరు బిచ్చగాళ్ళు బారులు తీరి కూర్చున్నారు.

"ఈ గుడిని చూసినప్పుడల్లా మా రాజేష్ యేమంటాడో తెలుసా మనూ ?" మెట్లెక్కుతూనే చెప్పుకు పోతున్నాడు సాగర్. "ఎక్కడో, ఏ ఏకాంత ప్రదేశానికో వెళ్ళాలనుకొని ప్రయాణమై, దారితప్పి నగరంలోకొచ్చి నిల్చుని, ఎటువెళ్ళాలో తోచక స్థాణువై నిల్చుండిపోయిన కాందిశీకుడిలా వుంటుందట యిది ! ఈ గుడిని కట్టక ముందు, ఈ గుట్ట మునిసిపాలిటీ వాళ్ళకు చెత్తకుండీలా పనికొచ్చేది. రాజేష్ యేమంటాడో తెలుసా ? యిలాంటి మెకానికల్ సిటీకి అటువంటి దిబ్బ ఉండడమే సహజంగా వుంటుందట ! ఈ గుడిని కట్టి, దీన్నొక ట్యూరింగ్ స్పాట్‌గా తయారుచేయడం యెబ్బెట్టుగా వుందట !... చిత్రంగా లేదూ వాడి ధోరణి !"

గుట్టపైన్నుంచీ వూరంతా కనిపిస్తోంది

గర్భగుడిలో పాలికేళ్ళ వయసున్న పూజారి ఏదో సర్దుకుంటున్నాడు.

"ఇలా కూచుందాం మనూ ! కాంపౌండువాల్‌పైన కూచోడం నీకెలాగూ యిష్టమేగదా ! అలా కూచో... యేం చెబుతున్నానూ ?...

మానస బిక్కమొహం పెట్టింది,

సాగర్‌కు చెప్పలేనంత కోపం వచ్చింది. "వసపోసిన పిట్టలా నేనేమో యిలా వాగుతూనే వున్నాను. నువ్వేమో, ఏమీ వినిపించుకోవడం లేదు. నీకేం చెప్పాన్నేను ? అలా ఏదో పుట్టిమునిగిపోయినట్టుగా కూచోవద్దన్నాను గదా ? అప్పుడేం జరిగింది ? అతను పోయాడు. అంతేగదా ! అంతమాత్రానికే ఇంతగా బెంబేలు పడిపోవాలా ? అనెడ్యుకేటెడ్ బ్రూట్‌లా ఏడుస్తూ కూచోవడానికి సిగ్గయినా కలగడంలేదా నీకు ? ఇదేనా నువ్వు చదువుకొంది ? 'కంబాటివ్ స్పిరిట్' వుండాలని పుస్తకాల్లో చదివి భుజాలెగరేస్తే సరిపోయిందా ? ఇదేనా నువ్వు జీవితాన్ని అర్థం చేసుకున్నది ? అడిగో, అదే వద్దన్నాను. యిక ఏడిస్తే నేనూరుకోను..."

మానస గ్రుక్కిళ్ళు మింగసాగింది.

"చిన్నపిల్లలా ఏడుస్తూ కూచోకు మానసా ! కాస్త అర్థం చేసుకోడానికి ప్రయత్నించు." కాస్సేపు మౌనంగా వుండిపోయిన తరువాత, అనునయిస్తూ మాట్లాడసాగాడు సాగర్. "పెళ్ళయిన తరువాత, జీవిత భాగస్వామి చనిపోతే, ఇక మిగిలిన కాలానికి జీవితమే వుండదని అనుకుంటున్నావేమో నువ్వు ? ఎవరిదాకానో యెందుకు ? తాతయ్య చెబుతూ వుండేవాడు, నీకు జ్ఞాపకముందా ? మొదటి భార్య చనిపోయాక, ఇక పెళ్ళొద్దని, సన్యాసుల్లో కలిసిపోతాననీ నాన్న మొరాయించుకుని కూచున్నాడట ! తరువాతేమయింది ? రెండో పెళ్ళి చేసుకోకుండా వున్నాడా ఏమయినానా ? మన అమ్మ, నాన్నకు రెండవ భార్యని చెబితే యెవరయినా నమ్ముతారా చెప్పు ?"

"నాన్నయితే మొగవాడు..." అంది మానస జీరబోయిన గొంతుకతో.

"అయితే ఏమిటి ? ఆడవాళ్ళు మాత్రం రెండోపెళ్ళి చేసుకోగూడదని మాటుందా ఎక్కడయినా ?"

మానసకేమని సమాధానం చెప్పాలో తోచలేదు. సాగర్ ధోరణేమిటో ఆమెకెంతకూ అర్థంగావడంలేదు.

"హలో !"– అంటూ సాగర్ చేయి వూపడంచూసి వెనుదిరిగి చూసింది ఆమె.

రాజేష్ మెట్లెక్కి వస్తున్నాడు.

"అదిగో, రాజేష్ వస్తున్నాడు. యివ్వాళ క్లబ్బుకొద్దని, నేనే ఇక్కడికి ప్రోగ్రాం ఫిక్స్‌చేశాను. నువ్విలా ఏడుపుముఖం పెట్టుకుని కనిపిస్తే అతనే మనుకుంటాడు చెప్పు ? కొన్నికొన్ని విషయాల్ని తొందరగా మరచిపోవాలి. ఏదయినా పెద్ద సమస్య యెదురయినప్పుడు రాజేష్ ఏమనేవాడో తెలుసా ? ముందెప్పుడో రాబోయే ఆనందానికి యిది కౌంటర్‌పార్టయివుంటుందని అనేవాడు. అలావుండాలి మనిషంటే..."

మానస నీరసంగా స్తంభానికి చేరగిలబడిపోయింది. ఆమెకు లోకమంతా అలుక్కుపోయినట్టుగా కనిపించసాగింది.

"హలో ! బావున్నారా ?" అంటూ యదాలాపంగా పలకరించి, అంత

గృహ ప్రవేశం

శ్రీ పి. ఏ. రామకుమార్

ఆ అమావాస్య చీకట్లో
నాకోసం నేను అన్వేషిస్తున్న సమయంలో
నా ఇల్లు నాకు ఎదురయింది
శిథిలమైన కలల శకలాలన్నీ పేర్చి
ఒక జీవితం సేపు శ్రమించి
నేను నిర్మించుకున్న మృత్యుసౌధం అదే నట
నన్ను నిలుచున్న పళంగా బంధిస్తాయి నా ఇంటి గోడలు
నన్ను పాతాళంలోకి తోసేస్తాయి ఆ మేడమెట్లు
నా యింటినుంచి—
కనుచూపుమేరలో అంతమవుతుంది
నా భూగోళం
అమావాస్యనాడు నేనా ఇంట్లో గృహప్రవేశంచేస్తాను

నేను ఇంట్లో అడుగుపెట్టగానే
నా గౌరవార్థం మ్రోగుతాయి కోటి శతఘ్నులు
నా ఇంటి ప్రహరీ గోడపై
వ్రేలాడతాయి అనంతకోటి ప్రాణాల నీడలు
కదిలితే కండలు తెగిపడేలా నాచుట్టూ—

విచ్చుకత్తులు అనుక్షణం నా భద్రత చూస్తుంటాయి
వంటింటి గొట్టంలోనుంచి వచ్చిన పొగ
యుద్ధమేఘాలుగా ఆకాశం అంతా కమ్ముకుంటుంది
నా ఇంటిని నేను
మంచిగంధపు మాలలతో అలంకరిస్తున్న వేళ
ఎక్కడో ప్రపంచం తగులబడుతున్న వాసన

లోనే నోరుజారిన విషయం గుర్తుకొచ్చి, నాలుక్కొరుకున్నాడు రాజేష్.

మానస సమాధానం చెప్పలేదు.

సూర్యుడు అస్తమించటంతో, ప్రహరీగోడకవతల పడిన పొదవాటి నీడలు, చీకటిలో మెల్లమెల్లగా కలిసిపోతున్నాయి.

మొక్కుబడికోసమన్నట్టుగా, అయిదారు నిముషాలకోసారి చెట్లు తలలాడిస్తున్నాయి. గర్భగుడిలోంచి వినిపిస్తున్న గంటల శబ్దాన్ని వెక్కిరిస్తున్నట్టుగా, మెట్లదగ్గర కూర్చున్న భిక్షగాళ్ళ బొరెలు దణదణలాడుతున్నాయి.

"మీరొచ్చి చాలాసేపయిందా?" అంటూ అడిగాడు రాజేష్.

"అరగంటయింది" అన్నాడు సాగర్.

"నేనూ అరగంట ముందుగానే వచ్చి వుండేవాణ్ణి. దార్లో మా కొలీగ్ వొకతను అడ్డు తగిలాడు..."

"......"

"యూనివర్శిటీలో ఏదో గొడవ జరిగిందని విన్నాను..."

"మామూలే...గ్రూపిజం... స్టూడెంట్లు స్ట్రయికు చేస్తున్నారు. వీసీ సెలవులు డిక్లేర్ చేసేశారు..."

"మోటార్ బైకును సర్వీసు చేయించాలన్నావు..."

"రేపు యివ్వాలి..."

"......"

"ఫీల్డ్ వర్కుందా రేపు?"

"డ్యాంసైటు కెళ్ళాలి మళ్ళీ..."

ఆకుకు అందకుండా, పోకకు చెందకుండా నిముషానికో మాట చొప్పున మాట్లాడుకోసాగారు మిత్రులిద్దరూ.

దాదాపు పదిహేను నిముషాలు అలాగే గడచి పోయాయి.

"మీ చెల్లెలి కోసం యెగ్జంప్షన్ కట్టాలన్నావు?" అన్నాడు రాజేష్

మానస తన ప్రశక్తి రాగానే తలపైకెత్తి చూసింది.

"యెమ్మే ప్రయివేటుగా నయినా చేయాలని అంటూ వుండేదానివి కదా! యీ సారి అయినా సెప్టెంబరు లోనే రాస్తే సరిపోతుంది. దాని కోసం యెగ్జెంప్షన్ కట్టాలనుకున్నాను..." రాజేష్ వైపుకు తిరిగాడు సాగర్.

"యీవిడ గారి ధోరణి చూస్తే పరీక్ష రాస్తుందో, లేదోనన్న అనుమానం కలిగింది. అందుకే యింకా పే చేయలేదు..."

"నువ్వు అప్లయి చేసేయి. వీలు కుదిరినప్పుడు పరీక్ష రాయొచ్చు..." అన్నాడు రాజేష్.

"యెప్పటికి వీలుకుదురుతుందని? యీ పిచ్చి పిల్లకెలా నచ్చచెప్పాలో నాకు తెలియడం లేదు. ఒకసారి లైఫ్‌పార్ట్‌నర్ చనిపోతే, యింకోసారి పెళ్ళి చేసుకుంటే సరిపోతుందిగదా అని నేనంటే, మా మనూ యేమందో తెలుసా? ఆ న్యాయం మొగవాళ్ళకేగానీ, ఆడవాళ్ళకు వర్తించదట!..."

సాగర్ యికాయికిని అసలు విషయంలోకి దిగిపోవడంతో, రాజేష్ కూడా యిబ్బంది పడిపోసాగాడు.

"పెళ్ళి గాక ముందు చిరంజీవంటే ప్రేమేమీ లేదు గదా నీకు? సంసారం చేసిన ఆరు నెల్లో నీకు అతన్ని మరచిపోలేనంతటి ప్రేమ యెలా పుట్టుకొచ్చేసిందో నాకు అర్థం గావడం లేదు. యింతకూ ప్రేమంటే యేమిటి? అపోహలతోనూ, భ్రమలతోనూ నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావు. ప్రేమంటే ఒక అగ్రిమెంటు మాత్రమే. సహజీవనం చేయడం కోసమని అతన్ని ప్రేమించావు. అతడిప్పుడు లేడు. ఆ అగ్రిమెంటుకు కాలం చెల్లిపోయింది. మళ్ళీ నువ్వు కొత్త అగ్రిమెంటును కుదుర్చుకోవచ్చు. జీవితం అంటే కలగాదు మనూ! ఆలోచనలు నేలపైన్నే నడవాలి, ఆకాశంలో గాదు. యీ ఆరునెలల జీవితాన్ని నువ్వు మరచిపో. అసలు పెళ్ళే కాలేదని అనుకో! మళ్ళీ చదువుకో! యెమ్మే పూర్తి చేయి... మళ్ళీ పెళ్ళి చేసుకో! చేసుకోడానికి సిద్ధపడే వ్యక్తి దొరకడని అనుమాన పడుతున్నావేమో! లోకం గొడ్డుపోలేదు మనూ! యెవరి దాకానో ఎందుకు? నువ్వు నీ ధోరణిని మార్చుకున్న వెంటనే, నిన్ను పెళ్ళి చేసుకోడానికి రాజేష్ సిద్ధంగా వున్నాడు..."


మెరుపొకటి శరీరంలోకి ప్రసరించినట్టుగా వులిక్కిపడిపోయింది మానస. ప్రపంచమంతా స్తంభించిపోయినట్టుగా తోచింది. షాక్‌తో మనస్సు మొద్దుబారిపోయింది. రెప్పలు వేయడం సైతం మరచిపోయి, సాగర్ వైపే చూడసాగింది.

సాగర్ చేయి పట్టుకుని ప్రహరీ గోడ దగ్గరికి లాక్కొచ్చేశాడు రాజేష్. "యేమిటి సాగర్, నువ్వు చేస్తున్న పని? యేమిటిది?" అంటూ కంగారుగా ప్రశ్నించాడు.

"నా ఆర్గ్యుమెంటు రీజనింగా లేదా?" అన్నాడు సాగర్ బేలగా.

"ఆర్గ్యుమెంటు రీజనింగా వుందా, లేదా అన్నది గాదు యిప్పుడు నేనడిగింది! మానస యింకా మొదటి షాక్‌నుంచి బయటపడనేలేదు. కోలుకున్నాక, సమయం సందర్భం కుదిరినప్పుడు, మెల్లమెల్లగా, స్పూన్ ఫీడింగ్ చేయించినట్టుగా చెప్పాలి గానీ యిలా కుండ బద్దలు కొట్టినట్టుగా చెబుతారా యెవరైనా? ఆమె ఇంకా కుదుట పడలేదు. మామూలు మాటలు వినడానికే బెంబేలు పడిపోతోంది. షాక్ పైన మరో షాక్ తగిలిస్తున్నావేమిటి నువ్వు?..." రాజేష్ ఆక్రోశించసాగాడు.

(ఇంకా వుంది)


పత్రికల్లో ఎప్పటికీ రాని వార్తలు
ఆదాయం పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకం, అమ్మకం పన్నుల రద్దు!
కోటికి ఒకడు అవినీతి పరుడు: సర్వేలో వెల్లడి
ప్రయోగం విజయవంతం! పోలీస్ స్టేషన్‌లో యువతికి పది రోజులుగా అపూర్వ రక్షణ!
రోజురోజుకి పడిపోతున్న బియ్యం ధరలు! ఇంకా తగ్గటానికి కృషి
ప్రజల సత్ప్రవర్తన దృష్ట్యా పోలీస్ శాఖ రద్దుకు యోచన
వంద స్థానాల్లో ఏ పార్టీ కూడా నామినేషన్లు వెయ్యని పరిస్థితి
ఎన్నికల్లో నిలబడకుండా ప్రజాసేవ చెయ్యటానికి పలువురి నాయకుల నిర్ణయం
నిరోధ్ వాడకానికి స్వస్తి
కేవలం నిగ్రహశక్తి తోనే కుటుంబ నియంత్రణ అమలు
ఈ ఏడాది అన్నీ సెక్సు, హింస లేని చిత్రాలే
నిరుద్యోగం పూర్తిగా నిర్మూలన
ఇరుగు పొరుగు విదేశీయులకు ఉద్యోగావకాశాలు
బాపు

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

మాత్రాచ్ఛందస్సులూ మహాకవి శ్రీశ్రీ

ఇది ప్రజాస్వామ్యయుగం. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంనుండీ ఈ సూచనలగుపిస్తూ వుండినాయి. ఈ శతాబ్దంలో ప్రజలదే పైచేయి-అన్ని రంగాల్లోనూ. అందుచేత కవితాసాహిత్య రంగాల్లోకూడా ప్రజలభాషకూ, వాళ్ళ ఛందస్సులకూ కవులూ, రచయితలూ పట్టంకట్టారీ శతాబ్దంలో. ప్రజలభాష వ్యావహారిక భాష, వాళ్ళ ఛందస్సులు-మాత్రాచ్ఛందస్సులు. ఈశతాబ్దం తొలిపాదంలోనే గిడుగు పిడుగు వ్యావహారిక భాషావాదాన్ని ప్రచారంచేశాడు. ఆ భాషను గురజాడ తన రచనల్లో ఆచరణలోనికి తెచ్చాడు. కన్యాశుల్కం ఉచ్చంగా ప్రజలభాషలో వ్రాయబడ్డ నాటకం. గురజాడ 'ముత్యాలసరాలు'లో మాత్రాచ్ఛందస్సులకు మహనీయమైన స్థానాన్ని కల్పించాడు. గురజాడ ముత్యాలసరాల ఛందస్సును రాయప్రోలూ విశ్వనాథా, కృష్ణశాస్త్రీ, వేదులా-మొదలగు భావకవులుకూడా బాగా ఉపయోగించుకున్నారు. విశ్వనాథ 'కోకిలమ్మ పెళ్ళి' పూర్తిగా ముత్యాలసరాలలోనే రచింపబడ్డ గేయకావ్యం ; అంతేకాదు-పూర్తిగా వ్యావహారికభాషలో రచింపబడ్డ గేయకావ్యం. భావకవులు అప్పుడప్పుడు, అక్కడక్కడ ముత్యాలసరాల ఛందస్సును ప్రయోగించినా, మరికొన్ని మాత్రాచ్ఛందస్సులలో గేయాలు వ్రాసినా-వాళ్ళు ముఖ్యంగా పద్యకవులే. వాళ్ళకు తేటగీతీ, చంపకోత్పలాల్పృత్తాలూ మిక్కిలి ప్రియాలు. గురజాడ కూడా మాత్రాచ్ఛందస్సుల్లో ముఖ్యంగా మిశ్రగతినీ, 'పూర్ణమ్మకథ'లో మాత్రం చతురస్రగతినీ ప్రయోగించాడు. త్ర్యస్ర, ఖండగతులను ఇంచుమించు ప్రయోగించలేదని చెప్పినా తప్పలేదు. నండూరి ఎంకిపాటలను మాత్రాచ్ఛందస్సులలోనూ, జానపదభాషలోనూ వ్రాసినాకూడా, జానపదచ్ఛందస్సులైన మాత్రాచ్ఛందస్సుల్లో నిక్షిప్తమయిన అక్షర, అక్షయశక్తిని పూర్తిగా ప్రదర్శించలేకపోయాయనే చెప్పాలి అవి.

శ్రీశ్రీ ప్రారంభదశలో భావకవే. కాని తరువాత తరువాత గురజాడ అడుగుజాడలో పయనింప ప్రారంభించాడు. వృత్తచ్ఛందస్సుల సర్పపరిష్వంగాలనూ వ్యాకరణాల సంకెళ్ళనూ పరిత్యజించాడు. మాత్రాచ్ఛందస్సులలోని అన్ని గతులలోని మర్మాలనూ, అందచందాలనూ-ఆకళించుకున్నాడు. 'మహాప్రస్థానం' మొదలైన గేయాలను రచించాడు. ఆ గేయాల అమేయశక్తిచేత-ఆకర్షింపబడని ఆధునిక కవులు లేరంటే అతిశయోక్తికాదు. ఈ వ్యాసంలో ఇకముందు శ్రీశ్రీ మాత్రాచ్ఛందస్సుల్లో నూత్ననూత్న చైతన్యం స్ఫురింపచేయడానికి చేసినప్రయోగాలను కొన్నింటిని గూర్చి దిఙ్మాత్రంగా చర్చించడం జరుగుతుంది. ఈచర్చ 'మహాప్రస్థానం' గేయ సంపుటికి మాత్రమే పరిమితం.

ప్రప్రథమంగా 'మహాప్రస్థానం' గేయాన్నే ఎన్నుకుందాం. దీని సంవిధానంలోని విశేషమేమిటి? ఇది చతురస్రగతిలో నడచిన గేయం. ఈ గతిలో మామూలుగా ఒక పాదానికి 4 చతుర్మాత్రాగణాలుంటాయి. జగణం చతురస్రగతిలో చాలా తక్కువగా వాడగలిగే గణం. ఈ గణాన్ని పాదంమొదట ప్రయోగించటం పూర్వ గేయకవులకు తెలియని రహస్యం. కాని శ్రీశ్రీ అదేపనిగా జగణంతోనే తన మహాగేయమైన 'మహాప్రస్థానం'ను మొదలుపెడతాడు! 'మరోప్ర' అన్న జగణాన్ని 'మరొకప్ర' అనే 'నల'గా మార్చితే గేయంలోని శక్తి సమస్తం చచ్చిపోతుంది. 'మరోప్రపంచం, మరోప్రపంచం, మరోప్రపంచం' అన్నపదాలకు అంతంలోవున్న అనుస్వారాలు మనచెవుల్లో రింగుమని మ్రోగుతూ మనకొక అవ్యక్తానుభూతిని కలిగిస్తాయి. అలాకాకుండా 'మరొకప్రపంచము....' అని గ్రాంధికంలో అంటే మనకు (పదాంతమందు అనుస్వారంలేనందున) ఆ శబ్దబ్రహ్మ సాక్షాత్కారం కలుగదు. ఈ గేయంలో వీలైనన్నిచోట్ల గేయపాదాలను జగణంతో ప్రారంభించడం గమనిస్తే శ్రీశ్రీ చతురస్రగతిని చైతన్యవంతం చేయడానికి ప్రయోగించిన ప్రక్రియ ఏమో తెలుస్తుంది.

'పొలాలనన్నీ హలాలదున్నీ' అంటూ ప్రారంభమయ్యే ప్రసిద్ధగేయం 'ప్రతిజ్ఞ'కూడా చతురస్రగతిదే. ఇదికూడా 'పొలాల' అనే జగణంతోనే మొదలవుతుంది. అంతేకాదు - ఇందులోని సుమారు ముప్పది పాదాలు జగణంతో మొదలవుతాయి. అంతేకాదు - ఈ గేయంలోని చాలా పాదాల్లో ప్రథమ పాదంలో లాగానే మూడవ గణమూ జగణమే. ఇలా చతురస్రగతిలోని పాదంలోని ఒకటి, మూడు గణాలను జగణాలుగా మలచడంవలన ఈగతికొక క్రొత్తలయ ప్రసాదింపబడుతుంది. ఇలాచేసి శ్రీశ్రీ మాత్రాచ్ఛందస్సూత్రాలలోని ప్రాత నియమాలను పగలగొట్టాడు. ఈ నియమోల్లంఘనం వలన శ్రీశ్రీకి వస్తువ్యక్తీకరణకు కావలసిన ఛందస్సంవిధానాన్ని అనుసరించేందుకు వీలు కలిగింది. అందుచేత శ్రీశ్రీ గేయాల్లో పాతచతురస్రగతే క్రొత్తశక్తిని ప్రదర్శించింది; క్రొత్తహొయలను ప్రపంచించింది. ఈ గేయం చివరవుండే 'శావం, భాగ్యం, ప్రాణం, ప్రణవం' అనే పదాలు మన గుండెల్లో ఘూర్ణిల్లుతాయి-మంత్రాల్లాగా. అందుకు కారణం వాటి అర్థశక్తిమాత్రమేకాదు; శబ్దశక్తికూడా. ఆ నాలుగు పదాల్లోని చివరవున్న 'ము'కారాన్ని వ్యావహారిక భాషారీత్యా అనుసార్యంగా మలచడం వలన ప్రభవించింది. వాటికి ఆ ప్రచండ మంత్రశక్తి!

గురజాడ ముత్యాల సరాల్లోనే శ్రీశ్రీ కొన్ని గేయాలు వ్రాశారు 'ఉన్మాది', 'బాటసారి', 'స్విన్‌బర్న్ కవికి', 'నిజంగానే' - ఇత్యాదులవి. ముత్యాలసరాల ఛందస్సు మిశ్రగతి. మిశ్రగతి అంటే త్రిమాత్రా, చతుర్మాత్రా గణాలు ఒకటి తరువాత ఒకటి వచ్చేనడక. గురజాడ ముత్యాలసరాల్లో మూడుమాత్రల గణాలుగా నగణమూ, గలమూ, వాడుతాడే కానీ 'గల'కు విలోమ గణమైన 'లగ' వాడడు. కాని శ్రీశ్రీ అలాకాదు. అవసరమైనపుడు మిశ్రగతిలో అసలుకీ ప్రయోగంలోలేని 'లగ'ను ప్రయోగిస్తారు. విలోమ గణమైన 'లగ' మిశ్రగతిలో చోటుచేసుకోవడంవల్ల గేయానికి కలిగే వైచిత్రి అది ప్రతిపాదించే వస్తువును హృదయానికి హత్తుకునేటట్లు చేస్తుంది. 'బాటసారిలో' -

జ్వరం కాస్తే,
భయం వేస్తే
ప్రలాపిస్తే-

అంటారు శ్రీశ్రీ. పైమూడు పాదాల్లోని ప్రథమ గణాలైన 'లగ'లు మనకు బాటసారి దయనీయ పరిస్థితిని ధ్వనిస్తాయి. 'జ్వరం', 'భయం' లలోని అంతిమానుస్వారాలు మన హృదయాంతరాలను స్పృశించి, బాటసారి దైన్యస్థితిపట్ల మన జాలిని జాలువారిస్తాయి. 'ప్రలా'లోని దీర్ఘ లకారం బాటసారి ప్రలాపనలోని తీక్ష్ణ దుఃఖాన్ని, తీవ్రభయాన్ని ప్రతిధ్వనించి, మనలో ఒక అనిర్వచనీయమైన శోక వేదనను కలిగిస్తాంది. అదేగేయంలో తరువాత-

వానవస్తే, వరదవస్తే,
చిమ్మచీకటి క్రమ్ముకొస్తే,
దారితప్పిన బాటసారికి
ఎంతకష్టం

అంటూ పాదం సగంలో గేయాన్ని కొంతసేపు ఆపుతారు. మిగిలిన సగం పాదం పూరించరు. 'ఎంతకష్టం' అన్న సగంపాదం చివర్లోగల అనుస్వారం మిగిలిన సగానికి బదులుగా ఆ 7మాత్రల కాలమూ మన గుండెల కొండల్లో గింగురుమని మ్రోగుతూ బాటసారి కష్టం మనకష్టంగా చేస్తుంది. మన కళ్ళలో నీళ్ళు తిరిగేటప చేస్తుంది.

'నిజంగానే' అనే గేయం ప్రారంభించడంలోనే ఏదోవిషాదచ్ఛాయా, నిరాశా వాతావరణమూ మనల్ని అలుముకుంటుంది. ఇందుకు కారణం ఆగేయ ప్రథమ పాదం–

'నిజంగానే నిఖిలలోకం నిండుహర్షం వహిస్తుందా?'

లోని ప్రథమగణం 'లగ' కావటమే! 'ఉన్మాది'లోని-

క్షమిస్తావా? సహిస్తావా?

పాదంలోని 'లగ' లే ఆపాదానికి విలువను తెచ్చిపెట్టాయి. ఆపాదంలో అనంతామృత శక్తిని ధ్వనింప చేస్తాయి!

"చేదుపాట" శ్రీశ్రీ రచించిన గేయాల్లోచాలా చిత్రమైనది. దానిలోని చిత్రమైన లయ దానిని మనకెంతో 'తీపిపాట'గా మార్చుతుంది! ఈ గేయం త్ర్యస్ర గతిలో నడుస్తుంది. ఈ గతిలో ఒకపాదానికి 4 త్రిమాత్రాత్మక గణాలుంటాయి. కాని శ్రీశ్రీ ఎప్పుడూ సూత్రప్రకారం గేయాలు వ్రాయరు. పాదానికి 12 మాత్రలుండేట్లు చూసుకుంటూ తన ఇష్టంవచ్చినట్లు గేయం నడుపుతారు. త్ర్యస్రగతిలో 'గల'కు విలోమగణమైన 'లగ' నిషిద్ధగణమని ఛందశ్శాస్త్రంలో ఎక్కడా చెప్పక పోయినా— ఇంతకు మునుపటి గేయకవులెవ్వరూ దీనినెక్కువగా ప్రయోగించ లేదనడం విదితమే. ఈ గేయంలో 'లగ' విరివిగా ప్రయోగించినందువల్లనే గేయానికాటూగూ పూపువచ్చాయి. శ్రీశ్రీ పాతనియమాలను అతిక్రమించడం వలన త్ర్యస్రగతి కొక క్రొత్తవూపిరి పోసినట్లయింది. ఇందువల్ల ఈ గేయంలో రసోత్పత్తికి అధికమైన అవకాశం చేకూరింది. 'చేదుపాట' లోని ఈ ఖండంలో 'లగ' చేసే చిత్రనృత్యం గమనించండి—

మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగులం,
వెనుక దగా, ముందు దగా,
కుడి ఎడమల దగా, దగా,

'భిక్షువర్షీయసి' కూడా త్ర్యస్రగతిలో నడచిన కవితే. కాని అందులో కొన్ని పాదాలు వాగ్లయ (స్పీచ్ రిథమ్)ల ననుసరించి గణవిభజనచేస్తే, 3 చతుర్మాత్రాగణాలుగా విభజింపబడతాయి. అలాటి పాదాల కుదాహరణలు - 1 'ఆరిన (4) / కుంపటి (4) విధాన (4) 'ముడుతలు (4) / తేరిన (4) / దేహం' - ఇలా త్ర్యస్రగతిలో చతుర్మాత్రాగణాలు చొప్పించడం వల్ల గేయగతిలో వైవిధ్యమేర్పడి, గేయం రోకటి పాటలాగా కాకుండా ఉండటానికి వీలుకలుగుతుంది. ఇట్టిమార్పులు చేయడానికి పూర్వకవులకు అవకాశ ముండేది కాదు.

శ్రీశ్రీ ఖండగతిలో రచించిన గేయాలు చాలా తక్కువ. అయినా వాటిలో కూడా ఆయన తన స్వేచ్ఛనూ, తిరుగుబాటు తత్వాన్ని ప్రదర్శింపక పోలేదు. 'గర్జించరష్యా' గేయం ఖండగతిలో నడచినదే. ఖండగతిలో పంచమాత్రాగణాలు ఒక్కొక్క పాదానికి నాలుగుంటాయి. ఆగతిలో యగణమూ, 'జల' (జగణం మీద లఘువు) ఇంచుమించు నిషిద్ధాలు. వాటి ప్రయోగం వలన ఖండగతిలో ఒక విధమైన కుంటితనం ఏర్పడుతుందని కాబోలు పూర్వగేయకవులు పైరెండు గణాలనూ నడకనుండి బహిష్కరించినట్లు తోస్తుంది. కాని శ్రీశ్రీ ఆవెలివేయబడ్డ గణాలను కూడా తనగేయంలో ప్రయోగించి ఖండగతికి ఒక వినూత్న వైచిత్రినీ, విచిత్రగమనాన్ని ప్రసాదించి, మనల్ని దిగ్భ్రాంతులను చేస్తాడు! ఉదాహరణలుగా ఈ క్రింది పాదాలను స్వీకరించవచ్చు.

జల జల జల
జ్వలించిన | వలించిన | సముజ్జ్వల | తేజం
య
యునైటెడ్ | సోవియెట్ | సోషలిష్ట్ | రాజ్యం
య జల
అసత్య | ప్రచారపు | రేడియో | బాకా
య జల
అనంత | ప్రపంచం | అంతటా | నీవై
జల జల
స్వతంత్రత | సమానత | సాధించు | రష్యా

పై పాదాల్లో నిషిద్ధ గణాల పేర్లు, వాటిమీద వ్రాయడం జరిగింది. వాటిని ప్రయోగించడం వలన ఖండగతిలో కలిగిన వైచిత్రిని పాఠకులు గమనింపవచ్చు.

ఇంతేకాకుండా శ్రీశ్రీ రష్యన్ల పేర్లు చెప్పేటప్పుడు ఏ ఛందస్సునూ పాటించకుండా ఊరికే కొన్ని పేర్లనొక పాదంలోనూ, మరికొన్ని పేర్లనింకొక పాదంలోనూ పేర్చి వ్రాస్తారు. ఈ గేయంలోని అసలుగతియైన ఖండగతికీ, పేర్లజాబితా వ్రాసిన గతికీ సంబంధమే లేకుండా ఉంటుంది. ఉదాహరణగా ఈ క్రింది పాదాల ఎంపిక చేయవచ్చు -


4 4 3 4
పుష్కిన్ | గోగోల్ | షెకోవ్ | టాల్‌స్టాయ్
4 4 4 4
దోస్తో | వస్కీ | గోర్కీ | కూప్రిన్

పైపాదాలు చతురస్రగతికి చెందుతాయి. కాని 'గర్జించరష్యా' గేయపుగతి ఖండగతి అదే గేయానికే చెందిన ఈ క్రింది చిత్రమైన పాదం పరికించండి—

2 4 5 5
మార్క్స్ | ఏంగెల్స్ | బుఖారిన్ | బకూనిన్

పైచరణంలో మొదటిగణం ఒకే ఒక్క గురువు | రెండవగణం–గగ (4మాత్రలు) 3,4 గణాలు పంచమాత్రాగణాలు | అవి కూడా యగణాలు పైపాదంలో శ్రీశ్రీ ఖండగతిని పిండిపిండిగా కొట్టాడని చెప్పవచ్చు!

ఆంగ్ల మహాకవి మిల్టన్ తన 'పారడైస్'లో పేర్లజాబితా లను వ్రాయవలసివస్తే గణనియమాలను పాటించక ఆపేర్లను తనకు తోచిన ఏదో ఒక క్రమంలో పేరతాడన్న విషయం జ్ఞాపకం చేస్తుంది పైపాదం. శ్రీశ్రీ కవితా గురువులు పలువురు పాశ్చాత్య కవులేకదా! మన జానపద గేయాల్లో కూడా కొన్ని చోట్ల ఛందోబంధోబస్తుల్ని ఛట్ ఫట్ మని తెంచివేసి వ్రాయబడ్డ పాదాలు కనిపిస్తాయి. అవి జానపద గేయకవులు ఛందస్సును గూర్చి ఏమీ తెలుసుకోక ఒక ధోరణినను



సరించి వ్రాసినందువలన దొరలివుంటాయి. కానీ శ్రీశ్రీ ఛందశ్శాస్త్రంలో అందె వేసిన చేయి, ఆరితేరిన అఖండపండితుడు. అతడు తన గేయాల్లో ఛందోభంగాలు చేశాడంటే అది తప్పకుండా అతని తెలియని తనంవలన రాదు. జానపద గేయం సంప్రదాయాన్ని తన గేయాల్లో వైవిధ్య వైచిత్రాలు సృష్టించడానికై అతడు శిల్ప దృష్టితో చేసిన అనల్పప్రయోగాలు అవి.

'ఐ' అనే గేయం కూడా ఖండగతిలో నడిచిందే. అందులోని ఈ పంక్తులు తిలకించండి.

స్మరిస్తే పద్యం
అరిస్తే వాద్యం

ఈ రెండు పంక్తులూ యగణంతో మొదలవుతాయి. అందుచేత వీటి నడక విచిత్రంగానూ, విలక్షణంగానూ తయారయింది. యగణంతో పాదాల్ని ప్రారంభించడం వలన నడకలో ఏర్పడిన వాతాత్పరివర్తన శ్రీశ్రీ ఔద్ధత్యాన్ని అత్యంత శక్తివంతంగా ధ్వనిస్తుంది.

'నవకవిత', 'ఋక్కులు', 'సంధ్యాసమస్యలు', 'పేదలు', 'అద్వైతం,' 'దేశచరిత్రలు' - ఈ గేయాలన్నీ ఒక ప్రత్యేకమైన ఛందస్సులో రచింపబడ్డాయి. వీటి గతి త్ర్యస్ర, మిశ్ర, చతురస్ర, ఖండ గతుల్లో ఏదీ కాదని వీటిని జాగ్రత్తగా పరిశీలించిన వాళ్ళకు బోధపడుతుంది. ఆధునికాంధ్ర కవిత్వము : సంప్రదాయము-ప్రయోగము'' అనే డా॥ సి. నారాయణరెడ్డిగారి బృహద్గ్రంథంలో 'శ్రీశ్రీ ఛందోరీతులు' అన్న శీర్షికన ఈ ఛందస్సును గూర్చి స్వల్పంగా చర్చించడం జరిగింది. ఆ చర్చ ఆ గ్రంథంలోని 589వ పుటలో క్రింది విధంగా ఉంది :- 'నవకవిత'లోని.

సింధూరం రక్తచందనం
బంధూకం సంధ్యారాగం
పులి చంపిన లేడి నెత్తురూ
ఎగరేసిన ఎర్రని జెండా

పంటి చరణాల నడక 'సింధూ | రంర | క్తచంద | నం' అన్న రీతిలో చదువుకొన్నచో చతురస్రగతిలోనికి వచ్చును. "సింధూరం | రక్తచందనం' అన్న ధోరణిలో విరతి చదివినచో వింతగతి వచ్చి అది చతురస్రగతి కాకపోవును.'' 'వింతగతి' గతి వచ్చునన్న డా॥ నారాయణరెడ్డిగారు ఆ గతి యొక్క స్వరూప స్వభావ సాక్షాత్కారానికై పరిశీలించలేదు; దానిని ఆవిష్కరించలేదు, కాన ఆ 'వింతగతి' స్వరూప స్వభావాలు అస్పష్టంగానే ఉండిపోయినాయి.

శ్రీ పి. రాజగోపాలనాయుడు గారు వ్రాసిన 'పాటలలో ఛందస్సు' అన్న ఛందోగ్రంథంలో శ్రీశ్రీ 'అద్వైతం'లోని 'ని | కంకణ | నిక్వా—ణాలో' తో ప్రారంభమయ్యే 6 చరణాలను ఎంపిక చేసుకుని, వాటిలో అన్నిట్లోనూ ఆదిలో గురువు ఉండడం వల్ల గురువుల్ని వేర్పరచి, మిగిలిన పాదాల్ని 3 చతుర్మాత్రా గణాలుగా విభజించి, మొదటి గురువును మినహాయిస్తే ఈ గేయం చతురస్రగతిలో నడుస్తుందని నిర్ధయించాడు. వారు గణవిభజన చేసిన విధానం నేను పైన చూపాను. వా రెంపిక చేసుకున్న చరణాలు ఆ విధమైన గణ విభజనకు లొంగుతాయి. కానీ -

ప్రపంచమును పరిపాలిస్తాం
భవిష్యమును పరిపాలిస్తాం

అన్న పాదాలు అలాంటి గణవిభజనకు లొంగవు. ఎందుకంటే వీటిల్లో మొదట్లో గురువులు లేనేలేవు! కాన 'అద్వైతం', 'నవకవిత' - ఇత్యాది గేయాల్లోని పాదాలన్నిందికీ వర్తించే ఛందస్సూత్రం ఏదన్నది సమస్యగానే మిగిలి పోయింది.

ఇలా విన్నగా ఆ ఛందస్సు 'వింతగతి'ని గురించి వ్యామోహిత ఆసక్తి ఉండడం వల్ల-శ్రీశ్రీగారినే ప్రశ్నించి సందేహ నివృత్తి చేసుకోవాలని 'ఆంధ్ర జ్యోతి సచిత్రవారపత్రికలో వారు నిర్వహిస్తూ వుండిన 'ప్ర | జ' శీర్షికకు ప్రశ్న పంపాను. వారు నా ప్రశ్నకు జవాబేమో దయచేశారు కానీ నా సందేహం మాత్రం సందేహంగానే మిగిలిపోయింది. నా ప్రశ్నా, వారి జవాబూ యథాతథంగా క్రింద పొందు పరుస్తున్నాను.


ప్రశ్న : మీరు 'అద్వైతం', 'దేశచరిత్రలు' మొదలగు గేయాలలో ఉపయోగించిన ఛందస్సు స్వకపోలకల్పితమా ? లేక వేరుభాషల నుండీ గ్రహించినదా? దాని స్వరూప స్వభావాలను గూర్చి సంగ్రహంగా సెలవీయండి.


జవాబు : స్వకపోలకల్పితమూ కాదు; వేరుభాషలనుండి సంగ్రహించినదీ కాదు. ఇది మన జానపదగీతాలలో తరచు కనిపించే 14మాత్రల ఛందస్సు. (తేది 5-3-1982 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో 41 పుటలో ప్రచురితమైంది)

శ్రీశ్రీ ఈ వింతగతిని 14 మాత్రల ఛందస్సన్నాడు. మిశ్రగతి 14 మాత్రల ఛందస్సే. అదే ముత్యాలసరాల ఛందస్సు. దానిలో త్రిమాత్రా గణాలూ, చతుర్మాత్రాగణాలూ ఒకటి తరువాత ఒకటి వస్తాయి. కాని ఈ వింతగతి'లో మూడు మాత్రలగణాలూ, నాల్గుమాత్రల గణాలూ ఒకటి తరువాత ఒకటి రావు. కాన ముత్యాల సరాల ఛందస్సుకూ, దీనికీ ఏమీ సంబంధం లేదని చెప్పవచ్చు.-పాదం పాదవు 14 మాత్రలుండడం తప్ప ఇక మిగిలిన 14 మాత్రల ఛందస్సు చతురస్రగతిలో హ్రస్వపాదపు ఛందస్సు. 'కేక' గేయంలోని

నేనొంటరినై నిద్రకువెలియై
నా గది | లోపల | చీకటి | లో
చీకటి | లోపల | నాగది | లో

అనుపాదాల్లోని హ్రస్వపాదాలైన 2వ, 3వ పాదాల్లో మూడు చతుర్మాత్రా గణాలూ, ఒక గురువూ వుంటాయి. నిలువు గీతంతో గణవిభజన చేయడం జరిగింది పాదానికి మొత్తం 14 మాత్రలవుతాయి. 'నాగదిలోపల - చీకటిలో' అన్న పాదపు





నడకకూ, 'ఆనందం- అర్ణవమైతే' అన్న పాదపు నడకకూ భేదం కొట్టవచ్చినట్లు గోచరిస్తుంది. కాని ఈ 'వింతగతి' ది షణ్మాత్రాలసరాల ఛందస్సూ కాదు; చతురశ్ర గతిలోని హ్రస్వపాదపు ఛందస్సూ కాదు అని సుస్పష్టంగా తెలుస్తోంది. మరి, ఇంక దీని ఛందస్సు ఏది? అన్నది తేల్చవలసిన విషయం.

శ్రీశ్రీ ఈ 'వింతగతి'లో రచించినటువంటి కొన్ని గేయ పదాల నైనా జాగ్రత్తగా పరిశీలిస్తే నేను వివరించబోయే విషయం విదితంకాక మానదు. ఉదాహరణకు డా॥ నారాయణరెడ్డిగారు స్వీకరించిన 'నవకవితలో'ని—

సిందూరం – రక్తచందనం
బంధూకం – సంధ్యారాగం

అన్న పాదాల్ని, 'ఋక్కులు'లోని—

ప్రపంచమొక – పద్మవ్యూహం
కవిత్వమొక – తీరని దాహం

అన్న పాదాల్ని స్వీకరిద్దాం. పై పాదాల్లో ప్రతి దానిలోనూ 6 మాత్రల తరువాత యతి (విరమస్థానం) అతి సుస్పష్టంగా అగుపిస్తుంది. యతి స్థానం అడ్డుగీతలతో గుర్తించడం జరిగింది. ప్రతి పాదంలోనూ 6 మాత్రల తరువాత 8 మాత్రలున్నాయి. ఇది ఒక్కొక్క పాదంలో 14 మాత్రలుగల ఛందస్సయినా, ఆ మాత్రలయొక్క అమరికలో ఉన్న తేడా వలన ఒక కొత్త ఛందస్సు ఉద్భవించింది. దీనిలో ప్రతి పాదంలోనూ రెండే రెండు మాత్రాగణాలుంటాయని చెప్పవచ్చు. మొదటిది – షణ్మాత్రాగణం; రెండోది – అష్టమాత్రాగణం. ఈ గణాల్లో గురులఘు విన్యాసానికి కట్టుబాట్లులేవు.

ఇంకా జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ 'వింతగతి' చతురశ్రగతిలోని కురుచ చరణపు (4 + 4 + 4 + 2 = 14) ఛందస్సుకు విలోమఛ్ఛందస్సని కొంతవరకూ ఋజువు చేయవచ్చు. 'కేక' గేయంలోని—

8 6
నా గది లోపల – చీకటిలో

అనే పాదాన్ని

6 8
చీకటిలో – నా గదిలోపల

అని విలోమంగా వ్రాస్తే మనకు ఈ కొత్త ఛందస్సు స్వరూపం కొంత స్పష్టపడుతుంది. చతురశ్రగతిలోని పొట్టిపాదం 'వింతగతి' పాదంగా మారిపోయింది! ఈ 'వింతగతిలో' నడిచే కొన్ని చరణాలను విలోమంగా వ్రాస్తే—

6 8 8 6
'హీనంగా — చూడకు దేన్నీ' అనేది 'చూడకు దేన్నీ — హీనంగా' గా మారుతుంది.

6 8 8 6
'ఉండాలోయ్—కవితావేశం' అనేది 'కవితావేశం—ఉండాలోయ్' గా మారుతుంది

6 8 8 6
'కాదేదీ — కవితకనర్హం' అనేది కవితకనర్హం — కాదేదీ గా మారుతుంది.

ఇలా చేయడం వలన ఈ 'వింతగతి'లోని పాదం చతురశ్ర గతిలోని కురుచ చరణంగా మారిపోయింది! రెండు సందర్భాల్లోనూ యతి స్థానాలు తారుమారవుతాయనడం సులభంగా గ్రహించవచ్చు. హ్రస్వపాదంలో 8 మాత్రల తరువాత వున్న యతిస్థానం 'వింతగతి'లో 6 మాత్రల తరువాతా, 'వింతగతి'లో 6 మాత్రల తర్వాతి యతిస్థానం హ్రస్వపాదంలో 8 మాత్రల తరువాతా చోటుచేసుకుంటుంది–అవలీలగా.

కాని చతురశ్రగతి హ్రస్వపాదంలోని అపరార్థంలోని అంతిమాక్షరం ఒక లఘువుగా కానీ, లేక ఒక గురువుగా కానీ ఉండవచ్చు. లఘువుగా వుంటే దాన్ని దీర్ఘీకరించి చదవాలి. గురువుకు బదులుగా రెండు లఘువులను ప్రతిక్షేపించడానికి వీలులేదు. అలా చేసినపుడు గతిలో విషమత ఏర్పడుతుంది. గతియొక్క లయ చెడిపోతుంది. "ప్రపంచమును – పరిహాసిస్తాం" అన్న పాదాన్ని విలోమంగా వ్రాస్తే 'పరిహాసిస్తాం-ప్రపంచమును' అని అవుతుంది కాని దీని లయ సరిపోవాలంటే "పరిహాసిస్తాం-ప్రపంచమున్" అని మార్చి వేయాలి. 'మును' అను రెండు లఘువుల్ని 'మున్' అనే ఒక గురువుగా మార్చాలి. కాన ఈ 'వింతగతి' చతురశ్ర గతిలోని హ్రస్వపాదానికి విలోమంగా వున్నట్లగుపిస్తున్నప్పటికీ—ఒక ప్రత్యేక వ్యక్తిత్వముగల ఛందస్సులా కనిపిస్తుంది. అందుకే ఇది ఒక వినూతన విచిత్రగతిగా వెలిసింది. శ్రీశ్రీ చేతుల్లో చిత్రవిచిత్రంగా సింగారాలు పోయింది. దీని ప్రత్యేకతేమంటే – దీనిలో ఎక్కడకానీ గురులఘువులు ఇలానే వుండాలనే నియమం లేదు. కవికి తన భావాల్ని ఈ ఛందస్సులో ప్రవహింపచేయడంలో ఎంతటి సౌలభ్యం, సౌకర్యం. స్వచ్ఛందతా ఉంటాయో తెలుసుకోవాలంటే 'దేశచరిత్రలు' గేయాన్ని పరిశీలించాలి.

ఈ విలక్షణమైన, వినూత్నమైన, విచిత్రమైన నడకగల ఛందస్సును శ్రీశ్రీ తప్ప ఆధునికాంధ్రగేయ కవులెవరూ ఇంచుమించు వాడనే లేదంటే తప్పు కాదు. "నేను నవీన గేయకవినే సుమి...." అనిచెప్పుకున్న డా. సి నారాయణరెడ్డి గారికి దీని స్వరూపస్వభావాలే తెలియలేదు! శ్రీ ఆరుద్రగారు కూడా మాత్రాచ్ఛందో కవిత్వంలో చాలా ప్రయోగాలు చేశారు. కానీ ఎందుకో ఈ ఛందస్సును తమ పాటల్లో ప్రయోగించినట్లులేదు. హిందీలో శ్రీ ఠాకూర్ గోపాల్ చరణ్‌సింహగారు తమ 'శిక్షా' అనే కవితలో ఈ ఛందస్సు ప్రయోగించారు. మచ్చుకు 2 చరణాలుదహరిస్తాను.

ఏకోంనే-ఇస్‌వసుధామే
మర్‌మర్ కర్ – దీనాసీఖా

సమాజంలోని కొంతమంది మానవులను అంటరాని వాళ్ళంటూ, వాళ్ళను బయటికి గెంటడం అన్యాయమని తలచి, వాళ్ళకు హరిజనులనే పేరుపెట్టి, అందరిలాగే వాళ్ళూ, అన్ని తావుల్లోనూ ప్రవేశించడానికి అర్హులేనంటూ, అలాంటి సంఘ బహిష్కృతుల సముద్ధరణ కోసం అహర్నిశలూ, అహరహమూ అవిరళకృషి చేశాడు మహాత్ముడు. మాత్రాగణాల్లో కూడా కొన్ని గణాలు అనాదిగా కవి పుంగవులచేత మాత్రాచ్ఛందో కవిత్వంనుంచి ఇంచుమించు వెలివేయబడినాయి. అవి నాలుగు. (1) లగ (IU) (2) జగణము (IUI) (3) జల (IUII) (4) యగణము (IUU). ప్రతిగణంలోనూ మొదటి అక్షరం లఘువుగానూ, రెండవ అక్షరం గురువుగానూ, వుండటమే – వీట్లో వున్న దోషం! వీటిని మాత్రాచ్ఛందో గతుల్లో ప్రయోగిస్తే, గతుల్లో విషమత ఏర్పడి లయచెడిపోయి, గేయపు సొగసు అధ్వాన్నమౌతుందని పూర్వ కవుల ఊహగా ఉండవచ్చు. మాకు గోడలులేవు. "గోడలను పగులకొట్టడమే మా పని" అన్న శ్రీ శ్రీ ఈ గణాలను తనగేయాల్లో విరివిగా ప్రయోగించాడు. ఊరక వాటిని ప్రయోగించడమే కాదు – వాటిని తన గేయాల్లో కొన్నిట్లో అగ్రాసనాధిపత్యమలంకరింప చేశాడు! అగ్రతాంబూలమిచ్చాడు. వాటికి కొన్నిగేయ ఖండాల్లో వాడిని గిలకొట్టి వాటినుండి అద్భుతశక్తిని ఆవిర్భవింపచేశాడు! 'మహాప్రస్థానం' గేయంలోని ప్రప్రథమగణం జగణమేకదా! 'ప్రతిజ్ఞ' గేయంలోని మొట్టమొదటి గణంకూడా అదేకదా! 'నిజంగానే' గేయపు తొలిగణం 'లగ' 'చేదుపాట'లో ఈ 'లగ' ఆటవెలదిలా ఆడి మన మనస్సులకు గిలిగింతలు పెడుతుంది. 'లగ' సృష్టించిన లయమాధుర్యమే 'చేదుపాట'లోని 'తీపి'కి మూలకారణం! 'ఐ' గేయంలోని 'స్మరిస్తే పద్యం | అరిస్తే వాద్యం' అన్నపంక్తులలోని ప్రత్యేకతా, ప్రపంచశక్తి యగణం పెట్టిన భిక్షే! 'గర్జించు రష్యా'లోని 'జ్వలించిన ఫలించిన సముజ్జ్వలతేజం' అన్న చరణంలోని మొదటి మూడుగణాలూ, 'జల'లే. ఆ 'జల'లే ఆపాదపునడకకు ఒక విశిష్టమైన గాంభీర్యాన్ని, విచిత్రమైన [illegible]న్ని ప్రసాదించాయి. శ్రీ శ్రీ మాత్రాచ్ఛందో కవిత్వానికి చేసిన మహోపకారాల్లో, [illegible] ప్రప్రథమ

[illegible] గా ప్రకాశిస్తున్నది. ప్రకాశిస్తున్నది, కోకిలగా [illegible] ప్రదర్శించిన ఈ సుమధుర దృశ్యాన్నే మనమంతా ఈ మాత్రాగణాలలోని 'దగాపడిన తమ్ములను' చేరవేసి, గానంచేసి, సిద్ధపరిచే [illegible]!

"శ్రీ శ్రీ కవిత్వమూ, పాల్‌రోబ్సన్ సంగీతమూ, ఒకటే రకం అంటుంది [illegible] అందరికీ హృద్యంగా, ఆహ్లాదంగా అప్పుడప్పుడు లక్షణాలనూ, రాగాలనూ [illegible] చెవి క్రీరుమనేట్టు ఇద్దరూ అరుస్తారు." – ఈ మాటలు 'చెలం'గారి 'యోగ్యతా పత్రం'లోవి. ఈ వాక్యాలు శ్రీ శ్రీ మాత్రాఛ్ఛందో కవితలో ప్రదర్శించిన స్వేచ్ఛా ప్రవృత్తిని సూచిస్తాయి. ఒక ఛందస్సులో నడిచే గేయంలో ఉన్నదున్నట్టే ఆ ఛందోలయకు భంగం కలగటంవల్ల ఈ అపశ్రుతి ఏర్పడుతుంది. ఒక ఛందస్సు లోని లయ తీవ్రంగా మారడం రెండు విధాలుగా జరుగుతుంది. 1) ఆ ఛందస్సుకు చెందని గణంకానీ, గణాలుకానీ, పాదంలో ప్రవేశించడంవల్ల. 2) ఆ ఛందస్సుకు చెందని లయగల పాదాలు ఒక ప్రత్యేక ఛందస్సులో నడిచే గేయంలో ప్రవేశించడంవల్ల.

మొదటికారణాన్ని పరిశీలిద్దాం. 'అపిమాషం మషం కుర్యాత్, ఛందోభంగం న కారయేత్' అన్నది మన ప్రాచీనులు ఛందస్సు విషయంలో పాటిస్తూ వచ్చిన సూత్రం. మనవాళ్ళు ఛందస్సులో లయ చెడటం బొత్తిగా సహించరు. ఛందోలయ కనుగుణంగా పదస్వరూపాన్ని మార్చినా ఫరవాలేదంటారు. లయచెడితే పఠిత సమాధికి భంగమేర్పడి తద్వారా రసభంగ మేర్పడుతుందని ఆ విధమైన సూత్రాన్ని ఏర్పాటు చేసివుండవచ్చు. కానీ ఈ సూత్రాన్ని పాటించడాని కేమాత్రమూ వీలు పడని పరిస్థితుల్లో మనకవులు ఛందోభంగాన్ని చేయకపోలేదు. చతురస్ర గతిలో నడచిన 'భజగోవిందం' స్తోత్రంలో శ్రీమత్ శంకర భగవత్పాదులు ఛందోభంగాన్ని చేయడానికి వెనుకీయలేదు! అందుక 'పరే బ్రహ్మణి కోపి న సక్తః' అన్న పాదమే [illegible]. ఈ పాదంలో 'పరే' అన్నది మూడు మాత్రల గణం. [illegible] ఈ పాదంలో లయకన్న అర్థానికీ, భావానికీ ప్రాధాన్యమిచ్చినట్లగుపిస్తుంది [illegible] 'దేశభక్తి' గేయం మిశ్రగతిలో నడచిన ముత్యాలసరం. అందులోని [illegible] అన్నపాదంలోని ప్రథమాక్షరం 'దే' ఛందస్సు ప్రకారం అధిక మైంది. [illegible] శ్రీశ్రీకి ఈ పైన ఉదాహరించబడిన పాదాలు తెలియనివికావు. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గేయపు మొదటి రెండు పాదాలూ 'భజగోవిందం' స్తోత్రపు మొదటి రెండు పాదాలను అనుకరించి, అనుసరించి మలచబడినవే అని అతడే చెప్పుకున్నాడు. ఇక గురజాడ శ్రీశ్రీకి కవితా గురుదేవుడే అతని అడుగుజాడే కదా శ్రీశ్రీకి బాటబాట. శ్రీశ్రీ [illegible] సాహిత్యంలో అఖండ పండితుడు [illegible] కవితల్లో ఛందో భంగాలు సర్వసాధారణం [illegible] అక్షర పురుషులే (మెన్ ఆఫ్ లెటర్స్) రసఋషులే [illegible] శ్రీ శ్రీ [illegible] పాటలో పయనించడానికి పూనుకున్న శ్రీ శ్రీ [illegible] తన పాటల్లో [illegible] ప్రయోగించాడు. [illegible] ప్రయత్నంలో ఛందస్సుకూ, [illegible] సిద్ధాంతాలుగా పున్న శ్రీశ్రీ [illegible] భావాభివ్యక్తికి, ఏ పదాలూ, పదబంధాలూ, వాక్యాలూ అవసరమో వాటిని నిరాఘాటంగా ప్రయో గిస్తాడు. అప్పుడు గేయం ప్రధానలయ తప్పిపోతుంది. చెవి క్రీరుమంటుంది. [illegible]. భావ తీవ్రతకూ ప్రథమ ప్రాధాన్యాన్నిచ్చిన శ్రీ శ్రీ అప్పుడప్పుడు [illegible] ఛందోభంగాలు చేసి, చెవి క్రీరుమనిపించినా, మనమ తనిని [illegible]. [illegible] గిరిలిన గేయభాగాల్ని బ్రహ్మాండమైన [illegible] మనల్ని ఆనంద ప్రవాహంలో, [illegible]. అంతేకాక – చాలా చోట్లలో [illegible] వుంటాయి. ఇందుకు రెండుమూడు దాహ [illegible].

'[illegible]'లో నడచినగేయం అందులోని —

4 4 3 4

ఎగిర వి | గిరి వెగి | రి వడు | [illegible]

పాదంలో మొత్తం 16 మాత్రలున్నాయి. మూడవగణం త్రిమాత్రాత్మకం. అందువలనలయచెడిపోయి చెవికిర్రుమంటుంది.

4 4 4 2

తిరిగి తి | రిగి తిరి | గ సము | ద్రాల్

చరణంలో 3 చతుర్మాత్రాగణాలూ, ఒకగురువూ ఉన్నాయి. చరణద్వయంలో 14 మాత్రలు ఈ రెండు పాదాలూ ఒకదానికొకటి ఉల్టాగా వ్రాయబడినాయి. కాని వాటి పొడుగుల్లో తేడాఉంది. ఇందువలనకూడా చెవి క్రీరుమంటుంది. ఎనభై లక్షల మేరువులు ఎగిరి, ఎగిరి, ఎగిరి పడడము, సముద్రాలు తిరిగి, తిరిగి, తిరిగి జల ప్రళయనాట్యం చేయడమూ జరగడం వల్ల సంభవించిన వినాశనాన్ని, విలయాన్ని స్ఫురింపచేయటానికి శ్రీశ్రీ ఈ పాదాల్లో ఛందస్సూత్రాలని పాటించకుండా వాగ్గేయల కనుగుణంగా పాదరచన చేశాడు. చెవిక్రీరుమనిపించినా శ్రీశ్రీ రస స్ఫూర్తిని కలిగించాడిక్కడ!

'జ్వాలాతోరణం' గేయంలో—

చావుపుట్టుకల పొలిమేరలలో
ఆవులించెనొక చితాగ్నికుండం
అనాథజీవుల సమాధులన్నీ
అఘోరించి, ఘోషించాయి.

అన్న భాగంలో మొదటి మూడుచరణాల్లోనూ గేయం చతురస్రగతిలో చక్కగా నడచిందికానీ 4వచరణం చెవి క్రీరుమనిపిస్తుంది. ప్రతిపాదానికి 16మాత్రలుండాలిగ తిలో కానీ 4వ పాదంలో మొత్తం 13మాత్రలున్నాయి. ఈ పాదాన్ని 4గణాలుగా

3 3 4 3

విభజిస్తే – 'అఘో | రించి | ఘోషిం | చాయి' – ఇలా తయారయింది. ఈ పాదం ఇంచుమించు త్ర్యశ్రగతి పాదంలావుంది. 3వ గణం మాత్రం 4 మాత్రలది.

5 5 3

ఇదే పాదాన్ని 3 గణాలుగా విభజిస్తే – 'అఘోరిం | చిఘోషిం | చాయి' – 2 పంచమాత్రాగణాలూ, ఒక త్రిమాత్రాత్మక గణమూ ఉంటాయి ఇది ఖండగతి పాదంలావుంది. ఖండగతిలో లయను అడ్డుదారి పట్టించే యగణాలు మొదటి రెండు గణాలు! పాదం ఏవిధంగా చూచినా గేయంలోని ప్రధానగతికి బొత్తిగా సరిపడ కుండా వుండడం వల్లనే చెవి క్రీరుమంటుంది ఒక్కసారిగా అనాథజీవుల సమాధు లన్నీ గావుకేకలుపెట్టి, గందరగోళాన్ని సృష్టించినపుడు ఉత్పన్నమయ్యే వాతా వరణం పాదంలో ప్రతిధ్వనింపచేయడానికి ఘోషద్వయంతో కొకటికిగా కొంకర్లు తిరిగిన ఈ పాదం శ్రీశ్రీ ప్రయత్నపూర్వకంగానే బనాయించాడు శ్రీశ్రీ గాక ఇంకెవరైనా అల్పకవి అయివుంటే ఈ పాదాన్ని చతురస్రగతిలో చాలా చక్కగా నడపి పాదంలోని వ్యంజకతను పాడుచేసి వుండేవాడు.

'స్వినబర్న్‌కవిక' అన్న గేయంలోని ఈ క్రింది ఖండంపరిశీలించండి.


విషంకక్కే భుజంగాలో,
కదంతొక్కే తురంగాలో,


3 4 4 4

మదం | పట్టిన | మాతం | గాలో
కపీ నీ పాటల్.

ఇందులోని మూడవ పాదంలో మూడవగణం త్రిమాత్రల గణంగా వుండాలి. ఎందుకంటే ఈ గేయంగతి మిశ్రగతి. మిశ్రగతిలో త్రిమాత్రా, చతుర్మాత్రా గణాలు ఒకటి తర్వాత ఒకటి వస్తాయి. త్రిమాత్రాగణానికి బదులుగా చతుర్మాత్రా గణం ప్రయోగించి నందువల్ల ఈ పాదం చదివేటప్పుడు చెవి క్రీరుమంటుంది. 'మాతంగ' శబ్దాన్ని 'మతంగ'గా మార్చడానికి వీలులేదు. కాన శ్రీశ్రీ సహజసిద్ధ మైన శబ్దస్వరూపాన్నే వాడి ఛందోభంగాన్ని చేయడానికి సాహసించాడు.

భాషయొక్క సహజసౌందర్యాన్ని సంరక్షించడానికోసం శ్రీశ్రీ గణభంగం,





చేసిన మరొక సందర్భాన్ని మనవిచేస్తాను. 'జగన్నాథుని రథచక్రాలు' శ్రీశ్రీ జగత్ప్రసిద్ధమైన గేయం. ఆ గేయంలోని మొదటి మూడు చరణాలూ దానికి పల్లవి వంటివి; ప్రాణంలాంటివి. ఆ మూడవపాదం, 'బాధాసర్పదష్టులారా? అన్నది. ఇందులో 'ధా' అనే అక్షరం 'ధ' అయితేనే పాదంలోని త్రిస్రగతి నడక సరి పోతుంది. కానీ పాదంలోని అందమంతా అది ఇప్పుడెట్లుందో అట్లాగా వుంటేనే అతి సహజంగా వుంటుంది. అందుకే సహజత్వాన్నీ, సజీవభాషనూ అభిమానించే, అపరిమితంగా గౌరవించే శ్రీశ్రీ గణదాసుడై అందాన్ని హననం చేయడానికి ప్రయత్నించలేదు! శ్రీశ్రీ మాటల్లోని మంత్రశక్తి చెవి కిర్రుమనిపించే ఇలాంటి అపశ్రుతులను మనం పెదచెవిని పెట్టేటట్టు మాయచేసి, దానిని గూర్చి మనం మనస్సుకు పట్టించుకోవడానికి వీలు కలిగించకుండా హఠాత్తుగా మనలను ఆవేశమహానిర్ఝరిలోకి త్రోసుకుపోయి, ఆనందసాగరంలో ముంచిపారవేస్తుంది !

శ్రీశ్రీ కవితకు ఛందస్సు సాధనం మాత్రమే - సర్వస్వమూ కాదు ! తన వస్తువర్ణనకూ, రసోత్పత్తికీ అది అనుకూలంగా వుండేటంతవరకూ అతడు ఛందస్సు ననుసరిస్తాడు. కాని అది తన ఉద్దేశాలకు అననుకూలంగా, అడ్డంకిగా వుండగలదని తెలిస్తే అతడు దానిని ధిక్కరిస్తాడు; బ్రద్దలుకొడతాడు ! అలా చేయడం వల్ల అతని కవితకొక అపూర్వ; అనన్య, అద్భుత శక్తి కలుగుతుంది ! అందుకే ఇలాంటి తావుల్లో, చాలావరకూ, ఒక రమణీయ కవితాశిల్పం చివురిస్తుంది ! 'తప్పు లిగివ చోటనే ఒప్పు గలుగు, సరస కవితావళోక్తుల సరణియందు' అని తెనాలి రామకృష్ణకవి అన్నట్లు శ్రీశ్రీ ఛందోభంగం చేసిన సందర్భాల్లో శిల్పం ప్రదర్శింపబడటం ఇంతకు మునుపే ఇవ్వబడిన కొన్ని ఉదాహరణల్లో ఉల్లేఖింపబడింది ఛందోభంగం చేసినట్లేచేసి గేయరచనలో ప్రౌఢ శిల్పాన్ని ప్రదర్శించడం శ్రీశ్రీ మాత్రాఛందో కవిత్వానికి చేసిన మరొక మహోపకారం.

శ్రీశ్రీ కవితలో చెవి కిర్రుమనిపించే రెండవ కారణాన్నిగూర్చి ఇక పరిశీలిద్దాం. శ్రీశ్రీ స్వచ్ఛందప్రవృత్తి ఒక ఛందస్సులో నడిచే గేయంలో మరొక ఛందస్సు సంకరం చేయడానికి వెనుదీయదు. ఈ ఛందస్సాంకర్యం శ్రీశ్రీ తిరుగుబాటు తత్త్వానికి ప్రతీకేమో-పకాకపూడా. 'ఐ' గేయం ఖండగతిలో గంభీరంగా నడుస్తూ నడుస్తూ చివరకు చతురస్రగతి నందుకుంటుంది. చూడండి—

4 4
నాదొక | స్వర్గం

4 4
నేనొక | దుర్గం

4 4 4 4 4
అనర్గ | ళం | అని | తర సా | ధ్యం నా | మార్గం

పైపాదాల్లోని మూడవపాదం గణవిభజన చేయకుండా చతురస్రగతి అని గ్రహించడం సులభంకాదు. 'కళారవి' గేయం చతురస్ర గతిది. కాని ఇందులో కూడా—

3 3 3 4
సతుల్ | సుతుల్ | హితుల్ | పోనీ

లో మొదటి మూడుగణాలూ త్రిమాత్రాత్మకాలు గేయం చివరిపాదాలు—

3 3
కళా | రవీ

3
కవీ

3
పవీ

మళ్ళీ త్రిమాత్రాత్మకాలు 'ఋక్కులు' గేయంలో హ్రస్వరణాలు 8 ఉన్నాయి వాటిలో మొదటి ఏడు - 'కుక్క | పిల్లా' వంటివి—మిశ్రగతిలో వున్నాయి. మిగిలిన రెండూ 'హారతి | పళ్ళెం' లాంటివి— చతురస్రగతిలో ఉన్నాయి. 'స్విన్ బర్న్ కవికి' గేయం గతి—మిశ్రగతి అందంగా హుందాగా సాగిన ఆ గేయంలో కూడా శ్రీశ్రీ తన స్వేచ్ఛాప్రియత్వాన్నీ, శిష్టాచారోల్లంఘన తత్త్వాన్నీ ప్రదర్శించక పోలేదు. మిశ్రగతికి బదులుగా ఈ క్రింది పాదంలో చతురస్రగతిని ప్రయోగించాడు ! తిలకించండి—

4 4 4 4
షెల్లీ | కవనపు | హల్లీ | సకమూ

అన్నపాదం అచ్చంగా చతురస్రగతిలో నడచింది శ్రీశ్రీ సంప్రదాయాలకూ, చట్టాలకూ కట్టుబడే కవికాదు! అతడు వ్రాసిందే గేయం! గిరిగీసిందే గీతం! 'అవతారం' గేయం ఖండగతిది. కాని దాని చివర్లోవున్న ఈ క్రింది పాదాలు—

మానవకోటి సామ్రాజ్యదూతలు, కళా
యజ్ఞాశ్వముల్, గాలులై, తరగలై, తావులై,
పుష్పాళ్ళు, కుంకుమల్, పొగలై సాగిరి !

శుద్ధ తుష్కవచనం! మూడుపాదాలుగా విభజింపబడింది. మానవకోటి సామ్రాజ్యదూతల సుదీర్ఘ్యకేతులను సూచించడానికై ఉండవచ్చు! ఇదికూడా శ్రీశ్రీ ప్రదర్శించిన ఒక శిల్పమేమో!!

'అద్వైతగేయం శ్రీశ్రీ గేయరచనా కళకు పరమావధి; పరాకాష్ఠ! అది మూల రచనకు మెరుగులు దిద్దిన రచన! ఇది వినూత్న విచిత్రగతిలో నడిచిన విశిష్టమైన రచన! అందులోకూడా ఛందస్సాంకర్యం ఉందని ఎవరూ సులభంగా ఎఱుగలేరు. దీని విచిత్రగతి చతురస్రగతిలోని హ్రస్వపాదం గతికి విలోమగతి అని ఇంతకుమునుపే చెప్పటం జరిగింది. ఈ విచిత్రగతిలో ప్రతిపాదంలోనూ 8వ మాత్ర

ప్రకృతి-ప్రవృత్తి

కొండలు నవ్వితే శిలలు
శిలలు నవ్వితే శిల్పాలు.
నదులు నవ్వితే ఉరవడులు
ఉరవళ్లు నవ్వితే తరంగాలు.
వెదుళ్ళు నవ్వితే వేణువులు
వేణువులు నవ్వితే నాదతరంగాలు.
నింగి నవ్వితే తారలు
తారలు నవ్వితే కాంతిధారలు.
నేల నవ్వితే చేలు
చేలు నవ్వితే సిరులు.
చెట్లు నవ్వితే పూలు
పూలు నవ్వితే పరిమళాలు.
అన్నీ వినిర్మల సుందర ప్రకాశాలు
విస్పష్ట మధురహాసాలు.
జగమంతా నవ్వులమయం
వెలుగు రవ్వలమయం.
కానీ మనిషి నవ్వుల్లో ఎందుకో మాలిన్యం!
ఆ మాలిన్యంలో ఏమిటో మాత్సర్యం!!

ఊహలు

మౌనగీతాలు ఆలపించేవి.
మనోహరంగా అగుపించేవి.
మానస విహాయసంలో
ముగ్ధ మోహనంగా విహరించేవి.
వెన్నెల్లో కలవరించేవి
వెలుగులనే వరించేవి....ఊహలు
మననసే తేనెపట్టును చుట్టుకొని
మధురసాన్ని నింపేవి.
హస్తాలలో అమృతకలశాలతో
విశ్వమోహినులులా ఊరించేవి.
తలచిన వెంటనే తరుణీకలహంసల్లా
వయారంగా ప్రత్యక్షమయేవి....ఊహలు
వసంత మొకటే ఋతువై
యౌవన మొకటే ప్రాయమై
అందాలతో.
ఆనందాలతో
సుదూర ప్రాంతాలను చుట్టివచ్చేవి
నిరాశావాదులను తట్టివచ్చేవి
పగలూ వెన్నెలా కలిపి
పాలరాతి బొమ్మల్లో నిలిపితే వచ్చే అందం
వాని అపురూప చందం
పూలూ రేలూ ఒకటై
చందనం సౌరభం ఏకమైతే వచ్చే అనుభవం
వాని వైభవం
ఊహలు....మనిషికి ఆయాచితంగా లభించే వరాలు
మూటవిప్పిన ముత్యాల సరాలు

శ్రీ పైల క్రిష్ణారావు

తరువాత విరమస్థానం. చతురస్ర హ్రస్వపాదంలో ౧౬వ మాత్ర తరువాత విశ్రమ స్థానం. కాని—

విషవాయువులై - ప్రసరిస్తే
విరితేనియలై - ప్రవహిస్తే

అన్నపాదాలను చదువుతున్నప్పుడు మనం ఎంతగా ప్రయత్నించినా 6 మాత్రల తరువాత ఆగడానికి సాధ్యపడదు 6 మాత్రల తరువాతే అప్పుడు ఆగాలి అంటే గేయగతికి విలోమగతిని పైచరణాల్లో శ్రీశ్రీ ప్రయోగించాడన్న మాట! శ్రీశ్రీ పై పాదాలలో విజాతీయ విలోమచ్ఛందాన్ని ప్రయోగించాడని తెలుసుకోవడానికి కూడా పరిశీలనా, పరిశోధనా కావాలి. మాత్రాచ్ఛందో కవితలో 'ఏకనాదత' (మొనాటనీ)ను పరిహరించడానికోసం ఛందస్సాంకర్యాలు చేసిన సాహసం శ్రీశ్రీకే దక్కుతుందనడంలో అవంతహడా అతిశయోక్తిలేదు. ఈ సాహసయుక్తమైన ప్రయోగం శ్రీశ్రీ మాత్రాచ్ఛందో కవితకు చేసిన మరొక మహోపకారం!

శ్రీశ్రీ 'మహాప్రస్థానం గేయసంపుటి ఆధునికాంధ్ర కవితలో ఒక మైలు రాయి. ఇది ఆధునికాంధ్ర కవిత్వంలో గేయకవితకొక అత్యంత ప్రముఖస్థానాన్ని కల్పించడమేకాక, గేయకవితకు ఇతఃపూర్వం లేని వినూత్నతనూ, విశాలతనూ, గంభీరతనూ చేకూర్చింది. గేయకవితను కట్టుబాట్లనుండి విడిపించి దానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించింది. అందువలన గేయం ప్రజలకు ఒక కౌశేయంగా తయారయింది. శ్రీశ్రీ గేయాలూ, గేయపాదాలూ ప్రజలగుండెల్లో మూర్తిల్లాయి- మంత్రాలమాదిరిగా! తెలుగు ప్రజలకు లోకోక్తులూ, జాతీయాలూ, నానుడులూ అయ్యాయి- శ్రీశ్రీ పదాలూ, పదబంధాలూ, ఆధునికాంధ్ర కవితను ఎద్దేవా చేయడానికి శ్రీశ్రీ గేయపాదాలు పరమఛాందసులు సైతం ఉదహరించగలిగినంతటి ప్రచారాన్ని, పలుకుబడినీ గడించాయి. శ్రీశ్రీకి 'మహాప్రస్థానం' గేయసంపుటి ప్రజల హృదయాల్లో పదిలంగా పసడి పీటను వేసింది. అందుకు కారణం అతని గేయాల్లోని వస్తుభావములు మాత్రమేకావు - వాటిలోని ఛందస్సౌందర్యమూ, ఛందశ్శిల్పమూ కూడా. ఈమాట స్తవం కాదు - వాస్తవం!

(నాలో ఆవేశించి, నన్ను ఈ వ్యాసరచనకు ప్రేరేపించిన మరుపురాని మనీషి, మహాకవి, శ్రీశ్రీ మధురస్మృతికి ఇది అంకితం.)

□

శ్రీరామ

పాలగుమ్మి వెంకటేశ్వరరావు

'శ్రీరామ' గట్టిగా వుచ్చరించాడు ఉద్దండం ఉక్కతో, ఆయాసంతో తెగ రొప్పాడు. ప్రొద్దుట్నించీ, ఆకాశంలో ఎక్కడా మబ్బు తునక లేదు. సూర్యుడు సర్వ ప్రపంచాన్ని తుకతుక లాడించేస్తున్నాడు. ఎక్కడా ఒక్క గాలి రివటా లేదు. చెట్లూ, చేమలూ కళదప్పి ఎండలో మల మల మాడ్తూ చిటచిటలాడ్తున్నాయి. కుక్కలు చొంగలు కారుస్తూ అటు ఇటు పరుగులు పెట్తున్నాయి.

బయట్నుంచి బిక్కుబిక్కుమంటూ దొంగ చూపులు చూస్తూ అప్పుడే దొడ్లోకి చొరబడ్డాడు దిబ్బయ్య. మాసిన పీలిక ఒకటి దిబ్బయ్య నడుముకి చుట్టుకుని వుంది. వెన్నుపూసకి అంటిన కడుపుకి పైభాగాన వున్న ప్రక్కటెముకలు చర్మాన్ని చీల్చుకుని ముందుకి వస్తున్నాయి. ఉద్దండాన్ని చూసి దిబ్బయ్య నడక ఆగిపోయింది.

"శ్రీరామ" గర్జించినట్లు అన్నాడు ఉద్దండం.

ఆ గర్జనకి దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఒరే !" ఉరిమి చూశాడు ఉద్దండం ఆ చూపులో తీక్షణత వుంది !

దిబ్బయ్య ఆగిపోయి నిలబడిపోయాడు. చమట్లు ధారలుగా కారి, ఉద్దండం నుదుట వున్న పంగనామాలు రూపు మాసిపోవటానికి సిద్ధంగా వున్నాయి ఆయాసంతో రొప్పుతున్న ఉద్దండం కడుపు పైకి క్రిందికీ వూగింది కోపం పొంగి వచ్చింది.

"ఎక్కడ్నించిరా వస్తున్నావు ?"

"పడమటి పొలంనుంచండి."

"ఎంతవరకూ వచ్చిందిరా, నీ పనీ ?"

"దుక్కి దున్నటం అయిపోయిందండి, రేపో మాపో నీళ్ళు బెట్టి నాట్లు వెయ్యించాలి."

"శ్రీరామ" అరిచాడు వుద్దండం.

డిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఏరా ? ఇవ్వాళ మంచిది గాదని ఎవడన్నా చెవులో పువ్వు పెట్టుకున్నవాడు నీకు చెప్పేడ్రా ?"

"........."

"ఏంట్రా అట్లా వెర్రిచూపులు చూస్తావ్ ? ఆ నీళ్ళేదో ఇవ్వాళే పెట్టి ఏడ్చి, ఆ నాట్లు ఏవో వెంటనే ఎందుకు వెయ్యరాదూ, అని అడుగుతున్నానురా, నేను."



"ఇప్పుడే గదండి దుక్కి దున్నటం అయింది. నేలకి ఆరాలి గదా..."

"ఆరాలిరా, ఆరాలి. ఈలోగా నా కొంపె ఆర్పుతావు ? శ్రీరామ ... రామ రామా !"

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"సరే అదేదో త్వరగా ఏడ్వు. అవునా ? ఇకపోతే మరి ఆ బస్తీకి పోయి ఆ ఎరువుల బస్తాల్ను ఎప్పుడు వేసుకుని వస్తావురా ?"

"ఇవ్వాళో రేపో వెళ్ళిరావాలండి."

"ఆ ఆకుమడిని పీకించాలి గద."

"అవునండి. కూలీల్ని మాట్లాడాను, ఎల్లుండి.."

"ఇంట్లో నాల్రోజుల్నించీ కరంటు లేదు. ఆ ఎలక్ట్రిషియన్ని నీవు పిల్చుకు రావాలి. జరూరు. కరంటు రాపోతే నేను పోయేట్టు వున్నాను ! అబ్బబ్బ."

"చిత్తం. వెళ్ళి తీసుకు వస్తానండి."

"శ్రీరామ" - 'ధాం' మని ఎక్కడో్న దూరాన కొండల్లో ప్రేలుడు -

"నువ్వు అమ్మాయిని దీసికెళ్ళి పాలెంలో అత్తవారింటి దగ్గర బండిగట్టి తీసుకెళ్ళి దింపి రావాలి. వాళ్ళు అసలే మూర్ఖపు ముండా కొడుకులు !"

"ఆయ."

"ఆ కంసాలి బత్తుడు అమ్మాయి నగల్ని ఇవ్వాళా రేపూ అన్చెప్పి ఇవ్వకుండా దిప్పుతున్నాడు. అవి బట్టుకరావాలి - ఆ ఎద్దుల్నేం జేశావ్ ? ! వాటి మానాన వాటిని ఎండలో వదిలేశావా ? ఒరే వాటి చేత ప్రొద్దుట్నించీ చాకిరీ చేయించుకుని అలా వదిలేయటం పాపంరా. నోరులేని జీవాల్ని అట్లా ఏడిపిస్తే మళ్ళీ నువ్వు మనిషి పుటక పుట్టవురొరే ! నీ బుద్ధిని మార్చుకోవాలి మరి ! కాదంటే నీ ఖర్మ, నీవే అనుభవిస్తావ్ ! నీ ఇష్టం."

"ఎద్దుల్ని పాకలో కట్టేసి, నీళ్ళుబెట్టి మేత వేసి వస్తున్నానండి, ఇప్పుడే."

"ఆ మాట ముందే ఏడ్వవద్దా ? సర్లె, సర్లె. పోయి ఆ ఎలక్ట్రీషియన్ని పిల్చుకురా, పో. పోమరి."

"ఇంత ముద్ద దిని పోతామనుకుంటున్నా స్వామీ!"

"శ్రీరామ" ఉరిమాడు ఉద్దండం.

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఒరే ! నాకు దెలవకడుగుతానూ ? ఎప్పుడు జూసినా 'ముద్ద ముద్ద' అని ఏడుస్తూ తిరుగుతావ్ ! మనిషికి ముద్దే మోక్షమట్రా ? ! అంత ఆకలి అయితే ఆ ముద్దని మట్టికి కట్టుకునే తిరగ రాదట్రా ? !"

"పొద్దుట్నించీ కడుపులో ఏమీ పడలేదండి. ఆకలి ..."

"ఆకలీ ! ఆకలి ! ఒక్క పూట తిండి దినకపోతే చచ్చిపోతావట్రా ?"

"ఎండలో దుక్కి దున్ని వచ్చానండి."

"శ్రీరామ !"

దిబ్బయ్య వులిక్కిపడ్డాడు.

"ఒరే ! పిచ్చి వెధవా ! అమ్మగారు పూరి మీదకి పెత్తనానికి వెళ్ళి గంటన్నరయింది. ఆవిడగారు తిరిగి రావాలి. పొయ్యి వెలిగించి అన్నం వండి వార్చాలి; నీ పళ్ళెంలో గుమ్మరించాలి; అప్పుడు గదా నీ ఆకలి దీరేదీ ... అందువలన ... పిచ్చి పిచ్చి ఆశలు పెట్టుకోక వెంటనే పోయి ఆ ఎలక్ట్రీషియన్ని పిల్చుకురా. ఎండకి చచ్చిపోతావున్నాను. గాలిలేదు, చమటలా. ఒరే ! దీని బాధ ఇంతని చెప్పలేను. అట్లాగే దోవలో నేనెప్పానని చెప్పి ఒక రూపాయి పకోడీలు కట్టించుకురా నరహరి శెట్టి దగ్గర ... తిరిగి వచ్చాక కుంభం ఆరగిద్దువుగానిలే. ఏ పాటు దప్పినా సాపాటు దప్పదు గదా."

"అయ్యా ..."

"పో. పో. పోయిరా, వేగరం...శ్రీరామ రామ. ఈ ఆకలిని ప్రపంచం నుంచి మాయం చేయ రాదటయ్యా మంగళాకారా ! – పిచ్చి వెధవా ! ఇంకా ఇక్కడ్నే వున్నావా ? నాకు కోపం వస్తే అసలు నేను మనిషిని కానురో, వెర్రి వెధవా !"

దిబ్బయ్య కాలే కడుపుని చేత్తో పట్టుకుని, తుర్రుమన్నాడు తూనీగలాగ.

"శ్రీరామ"

ఆపసోపాలు పడ్డాడు ఉద్దండం.

"శ్రీరామ రామా ! జానకీ వల్లభా !"

ఉద్దండం చెమటతో తడిసి ముద్దయిపోయాడు. కడుపులో గురగురమనింది. భారీగానే, పొద్దుట ఒకవిడత 'మిషన్లో' వేసిన ఆ భోజనం అరిగిపోయి కడుపులో కాళీగా వుంది. ఇప్పుడు పేగులు గుడగుడమన్నాయి. కండలు తీపులు పెట్టేయి. వంట బట్టిన కొవ్వు కరిగి చిమచిమలాడింది. ఆయాసం 'ఆకలి' వగర్పులు. వేడి వేడి నిట్టూర్పులు. అవస్థ.

నాయనా, అవస్థ ! శ్రీరామా ! ఆపద్బాంధవా ! అనాథ రక్షకా ! ఈ జీవుని వేదన, వినలేవా ? కావగ వేవేగ రాలేవా ? ఏడి వీడు ! ఈ వెర్రి వెధవ, ఈ బక్క సన్నాసి.

ఈ నోరులేని చవట – ఏమయిపోయినట్లూ ? ఏడీ ఆ ఎలక్ట్రీషియనూ ఏవీ ఆ నోరూరించే వేడి వేడి ఉల్లిపాయ పకోడీలూ ఏదీ దర్మపత్నీ! ఆదేమని అడిగితే – శ్రీరామా పెద్ద నోరు పెట్టుకుని మీదపడి పచ్చడి పచ్చడి చేస్తుంది గదా ! ఎవరండీ మన భారతనారికి స్వాతంత్ర్యం లేదని బల్ల లెక్కి దంచేదీ ! పనికి మాలిన లెక్చర్లూ !...

స్ర్రున ఒక గాలి ప్రవాహం వూపుకుంటూ వెళ్ళింది, చెట్టు చేమల్ని.

అమ్మయ్యా! దీనెమ్మ కడుపు చల్లగా వుండ ! రావే గాలీ, హాయిగా.

ఒక మూలన ఆకాశంలో నల్ల మచ్చ అవుపించింది. క్షణాలలోనే అది పెద్దదయి ఆకాశాన్నే ఆక్రమించింది. చల్లని చల చల్లని గాలి వీచింది. సూర్యుడు మరుగున పడి పరుగు లంకించుకున్నాడు. మబ్బుల దెబ్బకి దారె త్తిపోయి, విపరీతంగా సకిలించి – "శ్రీరామా !–" అని ఉద్దండం ఉరిమాడు. పట్టపగలే నల్లని చీకట్లు క్రమ్ముకుని వచ్చాయి. పరవశించిన చెట్టు చేమలు ఆకులలములను కదిలిస్తూ మౌనగీతాలు కమ్మగా పాడాయి. అంతలో కుండ పోతగా ద్రిమ్మరింపు మొదలయింది.

తడిసి ముప్పందుమయిన మంగళాంబ పెనుగాలి వలె – ఇంట్లోకి అడుగు పెట్టింది. మెరుపులు మెరుస్తుండగా వురుములు వురిమాయి. పిడుగులు పెఠిల్లు పెఠిల్లున పడ్డాయి.

"అయినయ్యా షికార్లూ ?" అనబోయిన ఉద్దండం నాలిక్కర్చుకున్నాడు.

రయ్యి రయ్యిన పెనుగాలులు వీచాయ్. ఉద్దండాన్ని క్రూరంగా, ఘోరంగా ఒక చూపు చూసి– "లేవండి లేవండి" అని గర్జించింది మంగళాంబ.

"ఏమిటే ? ఏమిటే ?!" అనబోయాడు ఉద్దండం.

"నోర్మూసుకుని లేవండి. లేవండి. మీరు మనుషులా ?! మానులా ! లేవమని మీకు కాదూ చెప్పటం ?! గాలి తోపుడికి క్రిందపడి, అమ్మాయి నడ్డి విరిగింది. బండి గట్టి ఆస్పటలుకి తీసికెళ్ళాలి, వేగిరం"

గాలివెంట తూనీగలా కొట్టుకుని వచ్చాడు దిబ్బయ్య.


"అయ్యా ? మా యాడది నొప్పులు పడతా వుందండి..."

"అయితే నన్నేంజెయ్యమంటావురా, అంట్ల వెధవా ? ముందు అమ్మాయిని ఆస్పటలుకి దీసికెళ్ళాలి, బండి గట్టు. అర్జంటు"

"తుపానుకి నా పాక ఎగిరి పోయిందండి. కబురు వచ్చింది – ఇప్పుడే"

"అయితే – నీ పెళ్ళాన్ని నా ఇంట్లోకి దీసుకొచ్చి పెడతాననటావా?" అదేం వల్ల కాదు అంతే, బండికట్టు అమ్మాయిని ఆస్పటలుకి దీసుకెళ్ళాలి, వింటున్నావా ?"

"...నా భార్య చావుబతుకుల్లో వుందండి. దయదల్చాలి అయ్యగారూ ! ఈ పరిస్థితిలో నాకు మీరే దిక్కు. ఎక్కడికి దీసికెళ్ళను ? ఏం జెయ్యను ? నాకు కాళ్ళు చేతులు ఆడటం లేదండి. అది కంటానికి సిద్ధంగా వుందండి, ఎట్లా నయినా మీరు ..."



"శ్రీరామ" గర్జించాడు ఉద్దండం.

పెళిల్లు పెళిల్లుమని పిడుగు పడింది.

దిబ్బయ్య గజగజ వణికిపోయాడు.

జోరుగా వాన కురవసాగింది. మంత్రం వేసినట్లు, గాలి మాత్రం ఆగిపోయింది. వాగులూ వంకలూ నిండి ప్రవహించసాగాయి. ప్రపంచాన్ని తెల్లని ముసురు ముసుగు కప్పి వేసింది. అప్పటివరకూ ఎండకీ, తాపానికీ అల్లాడిన ప్రపంచం – చలికి గజగజ వణకటం మొదలు పెట్టింది చిత్రంగా.

బురద బురదగా అయిన డొంక వెంట ఎద్దులు అతి కష్టంమీద బండిని లాగుతున్నాయి. వర్షంలో తడుస్తూ తొట్లో కూర్చుని ఎద్దుల్ని అదిలిస్తున్నాడు దిబ్బయ్య. బండిలో మూలుగుతూ ఏడుస్తూవుంది 'ఉద్దండం కూతురు.' ఆమెను ఓదారుస్తూ అవస్థ పడుతున్నారు, ఉద్దండం, అతని భార్య మంగళాంబా !

ఆ ముసురులో నల్ల నల్లగా ఒక ఆకారం ఆ బండికి ఎదురుగా వచ్చింది,

"ఎహె ! ఎహె ! పద ! పద !" దిబ్బయ్య ఎద్దుల్ని అదిలించాడు.

"ఎవరూ ! ఒరే ! దిబ్బయ్యా ! నువ్వేనా !?" అని ఆ ఆకారం ప్రశ్నించింది.

ఆ గొంతుని పోల్చుకుని – "ఆఁ. నేనేనే కోటయ్య మామా ! ఏంటి విశేషం?" అని దిబ్బయ్య అడగ్గా ...

"ఒరే! నీభార్యని దీసికెళ్ళి సూర్కుల్లో పెట్టాంరా. వుప్పుడే మగపిల్లాడ్ని కనింది. మన దాసు పురుడు పోశాడు. తల్లీ, బిడ్డా క్షేమం. ఈ వార్త నీకు చెప్పిపోదామని వచ్చా. ఆ విషయం గురించీ దిగులెట్టుకోమాక. ఏం?"

"సర్లె. సర్లె."

"అవునూ ... వుప్పుడు నువ్వెక్కడికిరా బండి గట్టుకునీ ? వాగులు నిండుగా పారుతున్నయ్!"

"సర్లె. నువ్వెళ్ళు మామా ! నే వస్తాలే. కాస్త పనుంది."

"ఎహె ! ఎహె !" బురదలో కూరుకుపోతూన్న బండిని బరువుగా శక్తినంతట్నీ కూడదీసుకుని లాగుతున్నాయి ఎద్దులు. వర్షం జోరుగా కురవసాగింది.

"శ్రీరామ" – దూరంగా పిడుగు పడింది.

"నోర్మూయ్యండి" అంది మంగళాంబ.

"ఉద్దండం కూతురు బాధగా మూలిగింది. బండి భారంగా కదిలింది; కిరకిర లాడింది, వూగి వూగి.

వాగులూ వంకలూ దాటి, ఆ బండి నడవవలసిన దూరం చాలావుంది !

*

నా పేరు ప్రతిభ

శ్రీ మిరియాల రామకృష్ణ

ఎవరదీ ఝంఝామారుతంలా మనస్సు లోంచి
ఉద్గమించి చుట్టూ కనిపించే ఏవస్తువైనా సరే ఆకర్షించి
అలా అలా ఎగిరిపోయి ఆశ్చర్యపరుస్తూ
కిందికి మందమలయానిలంలా వీస్తారు !
ఎవరదీ గ్రంథాలయాల్లో కూచుని నమూనాలు గీస్తూ
కళాకారుల శయనమందిరాల అందాల ననుకరిస్తూ
ఎప్పుడో ఉండుండి గుండెపునాది మీద
అరంతస్తుల భావమందిరం నిర్మిస్తారు!
ఎవరదీ పెద్దమ్మగారి దద్దమ్మపొలాలు దున్ని
చిన్నమ్మగారి చెంగల్వ సరస్సులో ఈది
సమాజం గురించి వాస్తవచిత్రాలు రచించి
కాలకుడ్యాల మీద ప్రదర్శన నేర్పాటు చేస్తారు!
__అది నేనే! _హృదయం నా సదనం
నా పేరు ప్రతిభ__ఉదయం నావదనం

కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారి సంస్మరణ సంచిక

సుప్రసిద్ధ పండితులూ, చారిత్రిక పరిశోధకులూ అయిన కీ. శే నిడుదవోలు వేంకటరావు గారి స్మృత్యర్థం భారతి ప్రత్యేక సంచికని ఒక దానిని వెలువరించటానికి నిశ్చయించుకున్నాము

ఈ ప్రత్యేక సంచికలో శ్రీయుతులు పి. పరబ్రహ్మశాస్త్రి, ఇంగువ కార్తికేయశర్మ, వంతరాం రామకృష్ణరావు, ముదిగొండ ఈశ్వరచరణ్, చీమకుర్తి శేషగిరిరావు, తిరుమల రామచంద్ర తీర్థం శ్రీధరమూర్తి వక్కలంక లక్ష్మీపతి సూర్యదేవర రవికుమార్ ముదిగొండ వీరేశలింగం, కీ. శే. రేకళిగ మఠం వీరయ్యగారల రచనలు పడగలవని తెలుపటానికి సంతోషిస్తున్నాము.

1985 డిసెంబరు భారతి, కీ. శే. నిడుదవోలు వేంకటరావు గారి సంస్మరణ సంచికగా వెలువడటానికి ఏర్పాట్లు చేస్తున్నాము.

సంపాదకుడు

సీరియల్

సమిధలు

దిలావర్

(గతసంచిక తరువాయి)

11

సాయం సమయం. పగలంతా కాలికి బలపం కట్టుకొని తిరిగి తిరిగి అలసిపోయిన సూర్యుడు విశ్రాంతి తీసుకుందుకు పడమటిగూటికి చేరుకున్నాడు. పగలంతా పొగలు సెగలు కక్కిన గాలి కాస్త చల్లబడ్డది. బారులుతీరిన పక్షులు వెండి రెక్కలల్లార్చుకుంటూ ఆకాశంలో కదిలే నక్షత్రాల్లా మెరిసిపోతున్నాయి. ఇంటి దారి పట్టిన ఆలమందల జాడతెలుపుతూ ఆకాశాన్నంటుతున్నది గోధూళి. గోధూళితో సంధ్య చెక్కిలి మరింత ఎరుపెక్కుతున్నట్టుంది.

ప్రకాశం మాస్టారు ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో కొంచెంసేపు నడిచి మెల్లగా పార్కుకు చేరుకున్నారు.

రకరకాల కుసుమంతో చీకూ చింతాలేని ప్రశాంతపు ప్రపంచంలా కనిపించే ఆ పార్కు జనసందడితో కళకళలాడిపోతున్నది. జనానికి దూరంగా ఏకాంతంలో వున్న ఓ సిమెంటు బెంచీమీద కూర్చున్నారు మాస్టారు.

కళ్ళజోడును వుత్తరీయంతో తుడ్చుకుంటూ చుట్టూపరికించి చూస్తున్నారు.

"నమస్కారం మేస్టారు" అనుకుంటూ వచ్చారు రవి, రేవతి.

తలెత్తి వారిద్దరినీ చూసి ప్రతినమస్కారం చేశారు మాస్టారు.

రవీ, రేవతి అంటే మాస్టారికి ప్రత్యేకమైన అభిమానం. రేవతి ఎంత తెలివైనదో అంత వినయం కలది. ఎంత ఆవేశపరురాలో అంత అణకువ కలది. ఎంత అందమైందో అంత సంస్కారం కలది. రవి అందరి యువకుల్లా కాక తన ఆదర్శాలకు, ఆశయాలకు కట్టుబడ్డవాడు. తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించాలని నిజాయితీతో సంకల్పించుకున్నవాడు. ఏ వుద్యమమైన గుండెల్లో చోటుచేసుకున్నాక వాటికోసం పోరాడేవాళ్ళ మార్గాలు వేరుకావచ్చు. వారి లక్ష్యాలు వేరు కావచ్చు. కాని వాటిని చేరుకునేందుకు వారి నరనరాల్లో ప్రవహించే పట్టుదల దీక్ష కార్యోన్ముఖత ఒక్కరకంగానే వుంటుంది అనడంలో సందేహం లేదు. భావసామీప్యత కంటే ఒక స్నేహం బలపడడానికున్న కారణాల్లో బలవత్తరమైంది యింకేముంటుంది ? అనుకున్నాడు మాస్టారు.

మాస్టారు శాంతస్వభావుడు. సాత్వికభావాలు కలవాడు. ఆలోచనలతో నిరంతరం తన మెదడుకు పదును పెట్టుకుంటూవుంటాడు. విద్యార్థులను కేవలం పాఠాలతో కొట్టక నిజంగా ఎడ్యుకేట్ చేయాలన్న తపన వున్నవాడు. కేవలం తపనేకాక అందుకు అహరహరం శ్రమిస్తున్నవాడు. అణువణువునా నిండిన దేశభక్తితో భావిపౌరులను సానబడుతున్నవాడు. ఒకజ్ఞానజ్యోతి మరికొన్ని జ్యోతుల్ని వెలిగించడంలో ఆశ్చర్యమేముంటుంది ? ఇంకొకోణంలో ప్రజ్వరిల్లుతున్న కాగడా రవి. మరోకోణంలో వెలుగుతున్న ప్రమిద రేవతి. ఆ ముగ్గురి కలయిక కాంతిరేఖల త్రికోణంలా వుంది.

జీవితంలో మరపురాని నిర్ణయం తీసుకున్న భావావేశంలో-ఉద్విగ్నతలో ఉత్సాహంలో ఓలలాడుతున్న రవీ రేవతి మాస్టారుకు చెరోవేపు వంగి "మమ్మల్ని ఆశీర్వదించండి మాస్టారూ !" అని పాదాభివందనం చేశారు.

ఓ క్షణం అప్రతిభుడయ్యాడు మాస్టారు. వారిద్దరి స్నేహం వరకు మాత్రమే తానెరుగును. వారిద్దరూ యిలా ఏకంకావడం తనను వుక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఇది కలో-వాస్తవమో - సంతోషమో - ఆశ్చర్యమో - తెలియని ఒక అవ్యక్త అనూహ్య పరిస్థితికి లోనయ్యాడు మాస్టారు.

ఒక జ్యోతి మరో జ్యోతిపుంజంలో లీనమై అఖండజ్యోతిగా కాంతులు విరజిమ్మనున్నది....! ఆ భావం మాస్టారి మనసులో అనిర్వచనీయమైన ఆనందాన్ని నింపుతున్నది.

"ఐయామ్ ప్రౌడాఫ్‌యూ...యంగ్ కపుల్ ....! వేదికలమీద దంచే వూకదంపుడు వుపన్యాసాలకు, జీవితరంగంలో నటించేతీరుకూ పొంతన కుదరని యీ రోజుల్లో—కులాలకూ, మతాలకూ వర్గాలకూ అతీతంగా మీ ఆదర్శాలను యిలా ఆచరణగా రూపకల్పన చేయడం నిజంగా గర్వించ దగిన విషయం. మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను..." ప్రవాహంలా పొంగుతున్న వుద్రేకాన్ని అణచుకుంటూ వణుకుతున్న చేతులతో యిద్దర్నీ లేవనెత్తాడు.

శిష్యులిద్దరి కళ్ళలో ఓ కొత్తవెలుగును చూస్తున్నాడు మాస్టారు.

"సర్ కలసివుందామని నిర్ణయమైతే తీసుకున్నాం....కాని ఎంతవరకు నిలబెట్టుకుంటామో తెలీదు...." ఎటోచూస్తూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నవాడిలా కళ్ళుమోడ్చి అన్నాడు రవి.

"అదేమిటి రవి ? ఓ నిర్ణయమంటూ తీసుకున్నతర్వాత పిడుగులుపడ్డా ఆ నిర్ణయానికి తిరుగుండకూడదని నీకు వేరేచెప్పాలా ?" కలవరపాటుతో అన్నాడు మాస్టారు.

"సర్ కూడులేక గూడులేక గుడ్డలేక....ఆకలిపంజా దెబ్బతిని యీ ప్రపంచంలోని ఏమూలో నిత్యం రక్తం స్రవిస్తూనే వున్నది. ఆ ప్రవాహాన్ని ఆపేందుకు ఎన్ని వూపిర్లతో ఆనకట్టకట్టాలో....లేకపోతే భావిచరిత్ర మనల్ని క్షమించదు మాస్టారు..." ప్రతిమాటలో వుద్రేకంనింపి అన్నాడు రవి.

"అయితే....?" అయోమయంగా రవివేపు చూస్తూ అడిగాడు మాస్టారు.

"ఏవర్గం యీ ఆకలీ ఆక్రందనలు సృష్టిస్తున్నదో....ఏవర్గం తమ దోపిడికి యీ దారిద్ర్యాన్ని అవకాశంగా చేసుకుంటున్నదో ఆ వర్గానికి వ్యతిరేకంగా నా తరం ప్రాణాలైనా పణంగాపెట్టి పోరాటానికి ప్రతిన తీసుకున్నదో ఆ తరం ప్రతినిధిగా నా ప్రతిన చెల్లించుకుంటాను" పిడికిలి బిగించి కసిగా అన్నాడు రవి.

రవి ఆవేశాన్ని అర్థంచేసుకున్నాడు మాస్టారు. అయితే ఆవేశం వివేకాన్ని ఎలా కప్పివేస్తుందో అనుభవంతో తెలుసుకున్న మాస్టారు తనలోతాను నవ్వుకున్నాడు.

"బాబా ! నీ ఆవేదన నేనర్థంచేసుకోగలను. నీ యువరక్తంలోని లావా ఏవర్గ శత్రువులను మసిచేయగలదో కూడా నేనూహించగలను. కాని ఒక రక్త

పాతాన్ని ఆపేందుకొరకు మరొక రక్తపాతం సృష్టించడం అసలు మొదటి లక్ష్యాన్ని విస్మరించడమే కదా! తుపాకి గొట్టంద్వారా విప్లవమొస్తుందని ఏ పది పదకొండుమందో ఆయుధాలు ధరించి ఒకరిద్దరిని హత్యచేయడంద్వారా ఈ దోపిడీ ఆగుతుందా? ఈ దారిద్ర్యం నిర్మూలించబడుతుందా? ఏనూతన సమాజావిర్భం కోసం యీ రక్తతర్పణ....?" రవి ఏదో పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా కనిపిస్తున్నాడు మాస్టారికి.

"ఈ కుటిలరాజకీయాలు పాలిస్తున్న యీ కుళ్ళు వ్యవస్థలో అంతకన్నా వేరే మార్గం లేదు మాస్టారు..." కంఠంలో స్థిరనిశ్చయం ఖంగున ధ్వనిస్తుండగా అన్నాడు రవి.

"నిజమే నువ్వు కోరుకుంటున్న నూతనవ్యవస్థ రావాలని నేను కోరుకుంటున్నాను. కాని కేవలం హింసామార్గం తప్ప వేరేమార్గం లేదంటే నేనొప్పుకోను. ఆల్ రైట్...నీనమ్మకం నీది. ఆలోచనే ఆయుధం అయిననాడు-ఆయుధాలే ఆలోచన అయ్యే ప్రమాదం తప్పుతుందని నేను నమ్ముతున్నాను. మార్గాలు వేరుకావచ్చు మన గమ్యం ఒక్కటే. ఏదేమైనా మీ త్యాగంలోని చిత్తశుద్ధికి జోహార్లర్పిస్తున్నాను..." గాఢంగా నిట్టూరుస్తూ అన్నాడు మాస్టారు.

గురుశిష్యులిద్దరి మాటల్ని సీరియస్‌గా వింటోంది రేవతి.


"సర్! అందుకే....అందుకే మాస్టారు....నేను నమ్మిన సిద్ధాంతంకోసం అవసరమైతే నా రక్తం ధారపోయవలసి రావచ్చు. రేవతి నా జీవిత భాగస్వామి అయి మోసపోకూడదు....ఆమె జీవితంలోకి నేను ప్రవేశించి ఆమెకు శూన్యాన్ని మిగిల్చేహక్కు నాకులేదు....కాని...ఆమెలేని నా కొన్నిక్షణాలైనా ఊహించుకో లేక పోతున్నాను....ఆమె ముందు ఎంతో సుందరమైన భవిష్యత్తు పరచుకొని వున్నది. దాన్ని నేను ఎడారిగా మార్చలేను...." రవి మొఖంలో విషాదం కమ్ముకుంటున్నది.

రేవతి రోషంగా రవి వేపు చూసింది.

"పిరికితనంతో .... బానిసగా .... వ్యక్తిత్వం లేకుండా క్షణానికి వెయ్యి చావులు చచ్చే - నూరేళ్ళ బ్రతుకుపంట కంటే దేశం కోసం తన సర్వస్వాన్ని ధారపోసే త్యాగమూర్తికి ఒక్క క్షణం భార్యగా బ్రతికినా నా జన్మ ధన్యమైందని భావిస్తాను. నీవు నడిచిన బాటే నా జీవిత పథం కూడా అవుతుంది. నిన్ను విడిచే ప్రసక్తే లేదు...." పిడుగులు పడ్డా చెదరని దృఢనిశ్చయం ఆమె గొంతులో ధ్వనిస్తుంది.

ఒక మహా యజ్ఞంలో సమిధలు కావడానికి పోటీ పడుతున్న వారిద్దరి త్యాగదీక్ష మాస్టారి కళ్ళల్లోకి నీళ్ళు తెప్పించింది.

విద్య యొక్క మౌలికమైన నైతిక విలువలు మరచిపోయి, కేవలం స్వార్థానికే - లాభనష్టాల గణితానికే - పరిమితం చేసుకొని జీవితంలో అన్ని విధాలా దిగజారిపోయి పతనమవుతున్న నేటి విద్యా వ్యవస్థలో యీ మహోన్నత త్యాగమూర్తులను ఎదుటనే చూస్తున్న మాస్టారికి నోట మాట రావటం లేదు.



వాళ్ళు ఎన్నుకున్న మార్గం ఎటువంటిదయినా, జయాపజయాలు - లక్ష్యాల సాధ్యాసాధ్యాలు ఎంత దారుణంగా వున్నా పటిష్టమైన జాతి నిర్మాణానికి వారు అంకితం కావడం నిజంగా గర్వించదగిన విషయం.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం ఎందరు మహానుభావులు యీ కాలం సిలువ మీద తమ రక్తాన్ని ధారపోశారో....

ఆ బాటలో యింకెన్ని సుకుమారమైన ఎర్ర ఎర్రని మందారాలు రాలిపోవాలో....

ముక్కుపచ్చలారని ఆ యిద్దరు ఆదర్శమూర్తులను చూస్తుంటే మాస్టారి హృదయం ఆవేదనతో సుళ్ళు తిరుగుతున్నది.

మనసులోనే వారిద్దరినీ వేయి చేతులతో ఆశీర్వదించాడు మాస్టారు.

12

గోపి బుర్రలోని ఆలోచనలకు మల్లే ఆ గది లోని సీలింగు ఫ్యాను గిర్రున తిరుగుతున్నది.

ఇంటి దగ్గరి నుండి వచ్చిన ఉత్తరాన్ని పదోసారి చదువుతున్నాడు గోపి. అతని మొహంలో సంతోషం వెలిగిపోతున్నది.

కళ్ళజోళ్ళ నుంచి తీక్షణంగా కనిపించే చురుకైన కళ్ళు. కొనదేలిన ముక్కు. తెల్లని శరీరచ్ఛాయ. పొడుగ్గా రివటలా వుండి గొప్ప తేజస్సుతో వెలిగిపోయే ముఖంతో చూడగానే జీనియస్ అనిపిస్తాడు గోపి. అనిపించడమే కాదు. నిజంగా జీనియసే గోపి. రాంకులో పాసుకావడం పదవ తరగతి నుండే మొదలయింది. ఉన్నత కుటుంబం. తండ్రి మంచి హోదాలో వున్నారు. తల్లి విద్యావంతురాలు. స్వతహాగా గోపికి చురుకు పాలెక్కువ. అన్నీ కలిసి చదువుల్లో అద్భుతంగా రాణిస్తున్నాడు గోపి.

గోపి తల్లిదండ్రులకు తమ కుమారుడు గొప్ప మేధావి అవుతాడన్న నమ్మకం వుంది. అందుకు అన్నివిధాలా గోపీని ప్రోత్సహిస్తున్నారు. కన్నవారి కలలను నిజం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాడు గోపి. చదువే లోకం, పుస్తకమే ప్రపంచంగా బతుకుతున్నాడు.

తలిదండ్రుల్నుండి వచ్చిన ఆ ఉత్తరం గోపిలో ఎన్నో మధురోహల్ని రేపింది. ఆలోచనలు కట్టలు తెంచుకుంటున్నాయి. మమ్మీ డాడీల ఆశలకు ప్రతిరూపంగా ఎదుగుతున్న తాను వారు గర్వించదగ్గ కుమారునిగా ర్యాంకులే కాకుండా గోల్డుమెడల్సు కూడా సంపాదించాడు. ఈసారి కూడా తాను సాధించి తీరాలి. తనను స్టేట్స్‌కు పంపించాలని వాళ్ళు కంటున్న కలలను వాస్తవం చేయాలి.

తమ ప్రతిభా పాటవాలతో ప్రపంచాన్ని దిగ్భ్రాంతుల్ని చేసిన భారతమాత ముద్దు బిడ్డలు .... శాస్త్రవేత్తలు .... తత్త్వవేత్తలు .... మేధావులు ... ఎందరో మహానుభావులు .... వారంటే తనకు ఎనిలేని గౌరవం. ఏదో ఒకరోజు తనపేరు కూడా వారి సరసన చేరడం తన జీవిత లక్ష్యం. ఆ లక్ష్యసాధన కోసం తన బ్రతుకులో ఒక్క నిముషాన్ని కూడా వృధా కానివ్వడు.

నోట్సులో బూతుపుస్తకం పెట్టుకొని లొట్టలేసుకుంటూ చదువుతున్నాడు హరి.

బికినీ దుస్తుల్లో ఒంటి పొగరునంతా ప్రదర్శిస్తున్న మళయాళం సినిమా తార సెక్సీ ఫొటోసెట్‌ను, తమకంగా కళ్ళతో తినేస్తున్నాడు రెడ్డి.

నరాల టెన్షన్ భరించలేక ఓ నిముషం పుస్తకం గుండెలమీద పెట్టుకొని బద్ధకంగా ఆవులించాడు హరి. మంచినీళ్ళు తాగుతే బాగుండు అనిపించింది. కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళు వొంపుకోబోయాడు. వట్టిపోయిన గొడ్డులా వుంది కూజా. కోపంగా గోపి వేపు చూశాడు. గోపి అసలు ఈ లోకంలోనే లేనట్టున్నాడు. గోపి వాలకం చూసిన హరికి కోపం స్థానంలో నవ్వు ఆక్రమించుకుంది.

"కళ్ళజోడు కలలు కంటున్నట్టుందిరోయ్...." గోపి కళ్ళజోడును ముక్కుమీదికి లాగుతూ అన్నాడు హరి.

"ఆఁ...." అంటూ యీ లోకంలోకి వూడిపడ్డాడు గోపి.

"వురేయ్.... కలలు తీరిగ్గా కందువుగానిలేరా బాబూ! దాహంతో నాలుక పిడచ కట్టుకుపోతున్నది...."

"నీళ్ళు లేకపోతే వాణ్ణేం చేయమంటావురా....?" అన్నాడు రాజు డిటెక్టివ్ నవలను టేబులు మీదికి గిరాటువేస్తూ.


"చేయమన్నా ఆ మాలోకం చేసేరకం కాదులేరా. ఇదిగో మనం బాలచందర్ లాంటివాడు 'దాహం-దాహం' అంటూ నెత్తీ నోరూ బాదుకున్న బర్నింగ్ ప్రాబ్లమ్ గురించి డిస్కస్ చేస్తున్నామా. వాడు చూడు. ఎంచక్కా వాడి కలల ప్రపంచంలో కి-ట్రాన్స్‌లోకి పోయినవాడికిమల్లే ఎట్లా మైకంలో వున్నాడో...."


"ప్రెషియస్ టైం ఎందుకురా వేస్ట్ చేస్తారు. వినోద్‌లో మళయాళం నూన్‌షోలు వేస్తున్నాడు. పదండిరా వెళదాం" అన్నాడు రెడ్డి.

"మళయాళం అందాలు చూడక దాన్నాళ్ళనుండి నరాలు ఒహటే సలుపుతున్నాయి. పన్లోపని గోపిగాడ్ని కూడా లేపండి...." అన్నాడు రాజు.

"భలే జోక్ కట్‌చేశావు బ్రదర్! ఇంకా ఆంజనేయస్వామివారిని రమ్మంటే వస్తాడేమో ఆ సినిమాగ్గాని మన గోపిగాడా....హ్హ హ్హ హ్హ.... వాడు పుస్తకంలోకి తలదూర్చాడంటే పుట్టలోకి వుడుం తలదూర్చినట్టే...." నవ్వుతూ అన్నాడు హరి.

ఐదు నిమిషాల్లో గోపి తప్ప స్నేహితులంతా గదిలోంచి బయటికి వెళ్ళిపోయారు. వెళ్తున్న వారివేపు అయోమయంగా ఓసారి చూసి చిన్నగా నిట్టూర్చాడు గోపి. ప్రపంచంలో చాలా పదార్థాలను చెడిపోతే బాగుచెయ్యొచ్చు.





కాని యీ శాల్తీలను మరమ్మత్తు చెయ్యడం యిక ఆ బ్రహ్మతరం కూడా కాదు అనుకున్నాడు. పైగా ఏదో ఒక పార్టు అయితే రిపేరు చేయడం సులువు. ఆపాదమస్తకం అన్నిపార్టులూ లుకలుక లాడుతుంటే ఆ బ్రహ్మకాదు కదా వాడ్ని పుట్టించిన జేజెమ్మ తరంకూడా కాదు అనుకొన్నాడు.

తిరిగి తన మూడ్‌లో కొచ్చాడు గోపి.

ఉత్సాహంగా కలం అందుకొని తన భావాలకు అక్షర రూపంయిస్తూ తల్లిదండ్రులకు వుత్తరం రాశాడు. ఉత్తరం రాశాక ఎంతో హాయిగా, ఎంతో తృప్తిగా వున్నట్టు ఫీలయ్యాడు. నిజంగా తాను ఆ పుణ్యదంపతుల ఏకైక సంతానం కావడం ఎన్ని జన్మల పుణ్యఫలమో ! తమ కొడుకుని ప్రయోజకుడ్ని చేయాలన్న కోరిక ప్రతి తల్లిదండ్రులకు వుంటుంది. అవకాశం వున్నంత వరకు అందుకు శ్రమిస్తారు. కూడా. కానీ తన తల్లిదండ్రులు కేవలం తనకోసం బ్రతుకున్నారు. తన ఉన్నతి కోసం తమ బ్రతుకులోని ప్రతిక్షణాన్ని త్యాగం చేస్తున్న ఆదర్శమూర్తులు అనుకుంటూ వుత్తరం పోస్టు చేసివచ్చి పుస్తకంలో మొహం దూర్చాడు గోపి.

గంట మధ్యాహ్నం మూడు కావొస్తున్నది.

ఎండలు మండిపోతున్నాయి.

కిటికీలోంచి వడగాలి నిప్పులా సోకుతున్నది. ఆ వేడిని ఫాన్‌గాలి మరింత వేడెక్కిస్తున్నట్టుంది. విసుగ్గా ఫ్యాన్ ఆఫ్ చేసి కిటికీ మూసివేశాడు గోపి,

మిత్రబృందం చెమటలు కక్కుకుంటూ హడావుడిగా లోనికి దూసుకొచ్చారు.

"వీడెవడ్రా యూజ్లెస్‌ఫెలో. గాలిఆడక మేం చస్తుంటే ఫ్యాన్ కట్టేశాడు...." విసుక్కుంటూ ఆన్ చేశాడు. హరి.

"చూస్తే ఐ, వి. శశి పిక్చర్లే చూడాల్రా ! హాథేరింగ్ అండ్ హానేచరల్. నరాలు తెగిపోయే ఎక్సైట్‌మెంట్. ఇంత సెక్సీగా ఇండియాలో మరొకడు తీయలేడు...."తన్మయత్వంతో అంటున్నాడు రెడ్డి.

"అంత బిరితెగించి ఎలా వొప్పకుందిరా ఆ హీరోయిన్ ?" ఆశ్చర్యపోతూ అన్నాడు రాజు.

"మన అదృష్టం బావుండి వొప్పకుంది. లేకుంటే ఆ డ్రీమ్‌గర్ల్ పర్వనాలిటీని నేకెడ్‌గా చూసేఛాన్స్ ఈ జన్మకు మిస్సయ్యే వాళ్లం కదా !" లొట్టలు వేస్తూ అన్నాడు రెడ్డి.

"ఒరేయ్....యీ తాపం ఎండలకు మరీ ఎక్కువవుతున్నదిగాని యిదిగో.. యీ యిరవై తీసుకొని మూడు బీర్లు పట్రా పోరాహరి... నాగొంతుక ఎండుకుపోయి ప్రాణం పోయేట్టున్నది...." ఉస్సురుస్సురంటూ పురమాయించాడు రెడ్డి.

హరి డబ్బులందుకున్నాడు. బీర్ అనగానే ప్రాణాలు లేచొచ్చాయి హుషారు పుంజుకొని పక్కరూం ముందు ఎవడిదో సైకిలుంటే ఝామ్మని వుడాయించాడు దానిమీద.

ఐదు నిమిషాల్లో రూంలోకి చల్లని బీర్లొచ్చాయి.

అవురావురంటూ బాటిల్సు ఓపెన్ చేసి సీసాలకే మూతులు పట్టి లాగించేశారు. ముగ్గురు మిత్రులు.

పుస్తకాల బీరువాలోంచి పేకముక్కలు బయటికి తీశాడు రాజు.

"బోరుకొట్టు చస్తున్నా యిందాకట్నుంచి....తీసుకురా తీసుకురా" చతికిలబడుతూ అన్నాడు హరి.

"కూచోండి కూచోండి....మంచి కాలక్షేపం...." అంటూ రెడ్డికూడా కూలబడ్డాడు.

రాజు పేకముక్కలు పంచుతున్నాడు.

హరి గోపి వైపు చూశాడు. గోపి యివేమీ పట్టించుకోకుండా ధ్యానమగ్నుడైన మునీశ్వరుడిలా తపస్సమాధిలో వున్నట్టున్నాడు.

"అటు చూడవోయ్ రెడ్డి. మనం తాగితేవాడు నిషాలో వున్నట్టు కనిపిస్తున్నాడు..." గోపి వేపు చూపిస్తూ అన్నాడు హరి.

"గో టు హెల్. ఎవడిలోకం వాడిది. వాడు అపుత్రరంగు పిచ్చోడు....రతిగాడు లేడు....వాడిదోలోకం. నన్ను పట్టుకొని నువ్వు భూస్వామివి, బూర్జువావర్గశత్రువి....అంటూ ఏమిటేమిటో పేలాడు. నేను చదువు కొందుకు రాలేదట. రౌడీయిజం చెలాయించడానికి వచ్చానట....వాడు ఆ బ్రూట్... ఈ దేశాన్ని చైనాకి అమ్మడానికి రాలేదూ....?" మైకంలో ముద్దముద్దగా మాట్లాడుతున్నాడు రెడ్డి.

"వాట్...నువ్వు చదువుకుందుకు రాలేదా ? అసలే గోపిగాడు రాకముందు నీదే కదరా యీ కాలేజిలో ఫస్టుర్యాంకు" అన్నాడు హరి,

గోపి వేపు ఓ సారి విసురుగా చూసి అవును అన్నట్టు తల వూపాడు రెడ్డి.

"ఏడొచ్చాకే నీకు కనిపట్టుకుంది భాయ్. అప్పుడున్న లెక్చరర్లేకదా యిప్పుడూ. అప్పుడున్న స్టూడెంట్లే కదా యిప్పుడూ..."

"అయితే"

"ఇంకా అయితే అంటావేంటి నా మొహం. అంతా మన వాళ్లే. కాని వీడు గోపి మనవాడు కాదు. మనవాడు కానివాడికి ర్యాంకేమిట్రా....నాన్సెన్స్...." రెడ్డి సానుభూతి కోసం ఏదేదో చెప్పాలని ఆరాటపడుతున్నాడు హరి.

రాజు మౌనంగా వాళ్లమాటలు వింటున్నాడు.

రెడ్డి మనసులో ఏదో ఆలోచన వికృతంగా మెరిసింది. ఒక్కసారి తల విదిలించుకొని గోపి వేపు చూశాడు. కనిపుస్తకం చదువుతూ ఎదురుగా కన్పించింది. హరిమాటలు బాగా పనిచేస్తున్నాయి.

'ఈ జిడ్డుగాడు ఇంకలా పుస్తకాలకు అతుక్కుపోయి అలా రేయింబవళ్ళు తెగ చదివేస్తుంటే మనకు కనే మిగుత్తుంది' కసిగా అనుకున్నాడు రెడ్డి.

"ఏయ్‌రెడ్డీ... నువ్వేమైనా చెప్పు. యీ సంవత్సరం నువ్వు ర్యాంకు కొట్టెయ్యాల్సిందే." అన్నాడు హరి.

"ఆరునూరైనా నూరు ఆరైనా. గోల్డ్‌మెడల్ నువ్ కొట్టేయాల్సిందే. నిన్నగాకమొన్నవచ్చిన యీ కొన్‌కిస్కాగాడు రాకెట్టులా యిలా దూసుకుపోతుంటే నువ్వుగాజులు తొడుక్కుంటావా రెడ్డీ?" పురి ఎక్కించాడు రాజా.

"హరీ .. మరో మూడు బీర్లు తీసుకురారా" అన్నాడు రెడ్డి.

నిమిషాల్లో బీర్లు వచ్చాయి.

పీకలమొయ్యా పట్టించారు.

కొంచెంసేపు గంభీర నిశ్శబ్దం అలుముకుంది రూంలో. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ "అల్‌రైట్... యీసారి యీ రెడ్డి.... గోల్డ్ మెడలిస్ట్ అయితీరుతాడు..." అన్నాడు మూసుకుపోతున్న కళ్లు నులుముకుంటూ,

"బ్రేవ్ మైడియర్ ఫ్రెండ్.... దట్‌టాల్ రైట్.... ఈ శనిగాడు నీకుపోటీవున్నంతవరకు అది సాధ్యం కాదే—" నొసలు చిట్లించుకొంటూ అన్నాడు హరి.

అందుకేరా— బిడ్డా... వాడి పోటీ యీసారి వుండదు...." వికటంగా నవ్వుతూ అన్నాడు రెడ్డి.

"అదెట్లానోయ్... " తెల్లబోయారు మిత్రులిద్దరూ.

"చెబుతా.... టాప్ సీక్రేట్— కాని ఇక్కడకాదు. ఇవ్వాళ... బీర్‌తో జీవుడు సంతృప్తి పడ్డం లేదురా. రాండి... బార్‌కెళ్ళి ఓ పట్టుపడదాం...."అంటూ లేచాడు రెడ్డి.

బార్ పేరు వినగానే రెడ్డికంటేముందు బయటికి దారితీశారు హరి, రాజు.

* * *

మసక చీకటి యింకా విడిపోనేలేదు వెలుగు రేకలు ఇంకా విచ్చుకోనేలేదు పిట్టలు యింకా పిసపిస లాడుతూనే ఉన్నాయి... యింకా తెల్లవారనేలేదు-

అప్పుడే గోపీబ్రతుకు తెల్లారిపోయిందన్నవార్త దావానలంలా హాస్టల్ని చుట్టుముట్టింది.

లెక్చరర్లు, వార్డెన్, విద్యార్థులు- అంతా గోపి రూం ముందు గుమిగూడివున్నారు.

రూం లోపలి భయంకర దృశ్యం గుండెల్ని పిచు పిచు మనిపిస్తున్నది. నాలుక నోటినుండి బయటికి వచ్చి, పళ్ళు కరచుపోయి, కనుగుడ్లు భయంకరంగా పొడుచుకొచ్చి ముఖం వికృతంగా మారి-సీలింగు ఫ్యానుకు వేలాడుతున్నది గోపి శవం.

క్షణాలమీద వూళ్లోకి వ్యాపించావార్త.

ఎవరినోట విన్నా ఆ దారుణ మరణవార్తే.

ఎక్కడ విన్నా ఆ ఘోర సంఘటనను గురించిన చర్చే.

బ్రిల్లియంట్ స్టూడెంటు- జీనియస్- ఒకరి జోలికి సొంటికి పోయేవాడు కాదు. చదువు తప్ప మరోప్రపంచం తెలీదు. గోల్డ్ మెడలిస్టట తెలుసా- ఉరి పెట్టుకున్నాడంటే నమ్మశక్యం కావడంలేదు. అది ఆత్మహత్యేనంటావా....?

వ్యాఖ్యానాలూ- సానుభూతి- విచారం- సంతాపం- ఎక్కడచూచినా ఎవరిని కదిలించినా ఇవేమాటలు....

పోలీసు బలగంతో బాటు ప్రిన్సిపాల్‌కూడా వచ్చారు.

పోలీసులు తమ రొటీన్‌పనిలో నిమగ్న మయ్యారు.

టెలిగ్రాం అందుకొని హతాశులైన గోపి తల్లిదండ్రులు గుండెలు పగిలేట్టు ఏడ్చుకుంటూ వచ్చారు.


గోపీశవాన్ని చూచి దేవ్వలుడిగి పోయాయివారికి. హృదయ స్పందన లేనట్టు- దృష్టిలోపించినట్టు నిర్జీవంగా నుంచున్నట్టు బ్రమన్పడి పోయారు.


•గుండెలోతుల్లోని ఘోషను మూగవోయిన వారిగొంతు అనువదించ లేకపోతున్నది. తాము యిన్నాళ్లుగా వూపిరి పోసి పెంచిన ఆశలు. ఆశయాలు, ఆదర్శాలు ఎండమావులని తెలుసుకున్న ఆ తల్లిదండ్రుల గుండెలు బ్రద్దలవుతున్నాయి. కుమిలి కుమిలి కుళ్ళికుళ్ళి మౌనంగా విలపించడం తప్ప వారికి దిక్కుతోచడం లేదు.

"సర్ ! మీ అబ్బాయి...ఆత్మహత్య చేసుకున్నాడనే మీరు నమ్ముతున్నారా...?" గుంపులోంచి ఎవరో అడిగారు గోపి తండ్రిని

గోపి ఆత్మహత్య ఎందుకు చేసుకుంటాడు ? తమకు తెలియని రహస్యాలేవీ జీవితంలో చోటు చేసుకోలేదు. ప్రేమ వ్యవహారమైనా సరే నిర్భయంగా తమతో చెప్పుకోగల స్వాతంత్ర్యం అతనికెప్పుడూవుంది ఆర్థిక సమస్యలంటూ ఉండేందుకే వీలులేదు. తాము రెండుచేతులా సంపాదించిన స్థిరచరాస్తులకు ఏకైక వారసుడు గోపి. ఏ చెడు అలవాట్లకూ లొనిన కాదు. ఏ లోటూ లేనివాడు. ఏ చీకూ చింతా తెలియని వాడు. భవిష్యత్తుమీద ఎన్నో కలలుకనేవాడు, జీవితం మీద ఎన్నో ఆశలు అల్లుకున్నవాడు మేధావి జీనియస్....అతడు ...అతడు.... పిరికిగా....జీవితం నుండి పలాయనం చేస్తాడంటే...ఎంత అమాయకుడైనా సరే నమ్మడు ..తాను...తానెట్లా విశ్వసిస్తాను. అనుకుంటున్నాడు. గోపి తండ్రి

మరి యీ విషాదం ఎలా సంభవించింది ? ఒక వేళ ఎవరైనా శత్రువులు...? ఓహ్....గోపికక్కూడా శత్రువులుంటారా? ఎందుకుండకూడదు? ఆధునిక విద్యాలయం విద్యార్థికి ఒక పద్మవ్యూహం. గోపి తెలివితేటలే - అతడి బ్రిల్లియన్సే-అతడి జీనియస్సే అతడికి శత్రువై కాటేసిందేమో? యెంత ఖ్యర





చించుకున్నా అంతకుమించి ఆ తండ్రి కారణాలను వూహించలేక పోతున్నారు.

"ఇది ఆత్మహత్యకాదు....వాడికి ఆత్మహత్యచేసికోవలసిన అగత్యం ఏమాత్రం లేదు.. యిది హత్యే....హత్యే...ఆవేశంగా అరచినట్టు అన్నారు గోపి తండ్రి.

గోల గోలగా వున్న వాతావరణం ఒక్కసారి స్తంభించినట్టుగా నిశ్శబ్దంగా మారింది.

"అంటే....మీ అభిప్రాయం...."

"అభిప్రాయంకాదు...నూటికి నూరుపాళ్ళు నిజం. ఐదు సంవత్సరాల నుండి వాడు ప్రతి క్లాసులో ఫస్టుర్యాంకు సంపాదిస్తున్నాడు. వాడి ప్రతిభాపాటవాలే వాడికి ప్రాణాంతకమయ్యాయి...." అంతవరకూ దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ గంభీరంగావున్న గోపి తండ్రి ఒక్కసారే బావురుమన్నారు.

"ఏమండీ..."మన గోపి....మనకంటికజ్యోతి.... మన ప్రాణం ... ఇక మనకు లేడండీ....రెండు చేతులతో మొహాన్ని కప్పుకొని వలవల ఏడుస్తూ కుప్ప కూలిపోయింది తల్లి.

గుండెల్ని చీల్చే ఆ సన్నివేశం అక్కడున్నవారిని చలింపజేసింది. అందరి కళ్ళూ అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

పట్టణంలో సంచలనం కలిగించిన ఆ వార్తను ప్రముఖ పత్రికలన్నీ ప్రచురించాయి.

గోపి తండ్రి పత్రికల్లోయిచ్చిన ప్రకటనలనుబట్టి గోపిని ఎవరో హత్య చేశారన్న అభిప్రాయం అందరిలోనూ బలపడింది.

ప్రకాశం మాస్టారిలో ఆవేదన. ఆవేశం, ఆక్రోశం వరదలై ప్రవహిస్తున్నది.

విద్యార్థులారా! ఎటు మీ పయనం? ఈ దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నారు?

అసలు మన దేశంలోవున్న మేధావులే తక్కువ. ఉన్నవారికి గుర్తింపు లేదు. వారికి కావలసిన సౌకర్యాలు సమకూర్చేవారులేరు. ఆశ్రిత పక్షపాతంతో కుళ్లిన రాజకీయవ్యవస్థను భరించలేక మేధావివర్గం వలస పోతుంటే నిస్సహాయంగా చూడవలసివస్తున్న దౌర్భాగ్యం మనది. విదేశాలు తమ డాలర్లతో మేధావులను ఆకర్షిస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టు నిశ్శబ్దంగా చూస్తున్న దేశం మనది. భావితరాల మేధావులనన్నా మనం దక్కించుకోలేకపోతే - మన కళ్ళను మన వేళ్ళతోనే పొడుచుకుంటే సభ్య ప్రపంచంలో తలెత్తుకొని తిరిగే అర్హత కూడా మనకు వుండదు.

మంచిని వంచనమీదా - ప్రతిభను మూర్ఖత్వంమీదా సిలువవేస్తే భావి చరిత్రకు మనం సంజాయిషీ యిచ్చుకోవలసిన రోజు వస్తుంది.

కసి ద్వేషం, ఈర్ష్యా అసూయలతో - నాప్రియమైన విద్యార్థులారా... ఈదేశం బంగారపు భవితవ్యాన్ని హత్యచేయకండి

స్పర్థవుండవలసిందే. కాని అది పరస్పరం విద్యార్థులు హత్యలుగావించుకుందుకు కాదు. విద్యలు వర్ధిల్లేందుకు మాత్రమే. మేధస్సునుకూడా కులాలవారీగా మతాలవారీగా వర్గాల వారీగా కోటాలుగా కేటాయించుకుంటూపోతే ఇక యీ దేశంలోని విద్యార్థులను - విద్యాలయాలను ఆ దేవుడే రక్షించాలి.

గోపి స్మృతికి మౌనంగా రెండు కన్నీటి బొట్లు రాల్చారు ప్రకాశం మాస్టారు.

(ఇంకా వుంది)

శ్రీ జమ్మి కోనేటిరావు

హాలీ తోకచుక్క

ఆకాశమార్గాన అలరారే అద్భుతాలు
అన్నిటినిమించి అందాలరాశి తోకచుక్కలు
అయితే అసలు హాలీ తోకచుక్క మించినదుందా?
సామాన్యకంటికే కనబడుతుంది కదా ?
పైగా వస్తుంది ప్రతిడెబ్భైఅయిదు, ఆరుసంవత్సరాలకి.

ప్రపంచ ఖగోళశాస్త్రజ్ఞులతో బాటు సామాన్య ప్రజానీకం కూడా ఎంతో ఆతురతతో వేచి ఉన్న అద్భుత దృశ్యం త్వరలోనే కనబడబోతోంది. భయోత్పాతం కలిగించినా, ఆందోళన రేకెత్తించినా తోకచుక్క వంటి అద్భుతదృశ్యం మరేది గగన ప్రాంతంలో కనబడదంటే అతిశయోక్తిలేదు.

1985–86 సంవత్సరంలో కనబడబోయే హాలీతోకచుక్కకి పి హాలీ అని నామకరణం చేశారు. దీనిని అప్పుడే 2 1/2 సం. క్రింద గమనించడం జరిగింది. ఆ సరికి భూమి మీద నుంచి అది 160 కోట్ల కి.మీ దూరంలో ఉంది జి. ఎడ్వర్డ్ డేనియల్సన్, డేవిడ్ జెవిట్ అను ఇద్దరికి దీని ప్రథమవీక్షణం అక్టోబర్ 1982లో జరిగింది. దాని అసలు దృశ్యప్రకాశానికి 5 కోట్ల రెట్లు తక్కువ ప్రకాశవంతంగా ఉన్నా, సౌందియాగో పాలోమార్ కొండమీదనున్న 200–అం. టెలిస్కోప్ ద్వారా దీనిని గమనించారు. అసరికి ఇది సూర్యకుటుంబంలోకి గంటకి 58వేల కి. మీ. వేగంతో దూసుకొని వస్తోంది. వచ్చే నవంబర్ నాటికి మన భూగ్రహానికి సుమారు 10 కోట్ల కి. మీ. దూరానికి వస్తుంది. ఏప్రిల్ 1986లో మాత్రం 6 కో. 20 లక్షల కి. మీ. దూరంలో ప్రయాణిస్తుంది.

పురాతన పరిశోధనలు :

హాలీతోకచుక్క మానవులకు కొత్తకాదు. 240 క్రీ.పూ. నుంచి దీనిని గమనిస్తున్నారు. అయితే ఇందులో చైనా వారిదే చురుకైన చెయ్యి 1466 సం క్రీ. శ. వరకు దీనిని వారు గమనించిన ఆధారాలు బాగా ఉన్నాయి. ఆ తరవాతనే యూరప్ ఖగోళశాస్త్రజ్ఞులు అందుకొన్నారు. దీనిని గమనించడమే కాక చైనా వారు దీనిని శాస్త్రీయంగా పరిశోధించారు. విశేషం ఏమంటే తోకచుక్కలని వారు "పొరకతారలు" లేదా "చీపురు నక్షత్రాలు" అనేవారు. అనాడే వారు తోకచుక్క సూర్యునినుంచి దూరంగా వ్యతిరేకదిక్కుగా వ్యాపిస్తుందని గుర్తించారు.

చైనా రాజఖగోళ శాస్త్రజ్ఞులు ఒక చారిత్రక గ్రంథం (దియచైజ్ ఆఫ్ టిన్వు)లో రాస్తూ తోకచుక్కలు స్వయం ప్రకాశాలు కాదని సూర్యకాంతిని గ్రహించడమే కాక తమ దృశ్యభాగాన్ని సూర్యునికి వ్యతిరేకమార్గంలో ఉంచుకొంటాయని రాశారు.

ఈనాడు 1985–86లో దీని దర్శనం "మనకు" 30వ సారి. అయితే ఏ కారణం వల్లనో 164 క్రీ.పూ. లో దీని ఆగమనాన్ని చైనా వారు కూడా గుర్తించినట్లు లేదు. అంతమాత్రాన అది అంతకు ముందు (240 క్రీ.పూ) నుంచి లేదని కాదు. మానవ దృష్టిని పడే ఉంటుంది–శాస్త్రీయంగా అయినా కాక పోయినా బహుశా హిందూసంస్కృతిలో దీనిని గుర్తించే ఉంటారు. తగిన పరిశోధనలు జరిపి (ఈ విషయం తెలిసిన పాఠకులు, పరిశోధకులు సమాచారాన్ని అందించాలి) అదేవిధంగా రాబోయే కాలాల్లో 75–76 సంవత్సరాల విరామ కాలాల్లో ఇది కనబడే అవకాశాలు ఉండనే ఉన్నాయి



(1970 నాటి ఛాయాచిత్రం)

చైనా శాస్త్రజ్ఞులు గమనించిన విషయాలని, ఈనాడు డోనాల్డ్ కె ఎమాన్స్ టావోజాంగ్ అను ఇద్దరికి బాగా ఉపయోగపడ్డాయి. గతంలో "హాలీ" ప్రయాణించిన మార్గాలన్నిటిని శుద్ధంగా అధ్యయనం చెయ్యగలిగారు. 1884 (!) ఏప్రిల్ 11న హాలీ భూమికి అతిదగ్గరగా వచ్చిందని లెక్కలు సూచిస్తున్నాయి. సుమారు 69 లక్షల కిలోమీటర్ల దూరం నుంచి ఇది దూసుకొనిపోయింది. భూమి చంద్రుని మధ్య దూరానికి ఇది 15 రెట్లు మాత్రం. రేపు రాబోయే అతి దగ్గర ప్రాంతం దీనికి 6 రెట్లెక్కువే.

ఇదిలా ఉండగా యూరప్ ఖండంలో జొహానెస్ కెప్లర్ మొదటి సారిగా దీనిని శాస్త్రీయంగా అధ్యయనం చేశాడు. ఇది సెప్టెంబర్ 26, 1607న జరిగింది. అయితే అతను దీనిని కేవలం సామాన్యకంటితోనే చూసాడు. చివరిసారిగా అయితే 24మే 1911న నుంచి టెలిస్కోప్‌లో దర్శించడం జరిగింది. 1910లో కొడైకెనాల్ అబ్జర్వేటరీలో కూడా దీని పటం తీసారు.

కెప్లర్ తరవాత ఎడ్మండ్ హాలి రంగప్రవేశం చేసాడు. అనాటికి తోకచుక్కల సమాచారం గొప్పగా లేదు. కాని అంతంత మాత్రంగా ఉంది. అయినా దానిని ఉపయోగించుకొనే ఈ ఖగోళశాస్త్రజ్ఞుడు తన ప్రఖ్యాత జోస్యం చెప్పాడు. 1531, 1607, 1682 సంవత్సరాలలో కనబడిన తోకచుక్కలు నిజానికి ఒకే ఒకటి అన్నాడు. అంతేకాక ఇది తిరిగి 1758లో రాబోతోంది. "నేను చెప్పింది నిజమే అయితే అదే విరామ కాలాల్లో ఆ తోకచుక్క తిరిగి తిరిగి వస్తుంది. అనడంలో సందేహం లేదు" అన్నాడు. అతని జోస్యం నిజం అయింది. ఆనాటి నుంచి ఇది హాలీ తోకచుక్క అయింది.

అయితే ఇంత ఖచ్చితమైన జోస్యంలోనూ అతను ఒక విషయాన్ని మర్చిపోలేదు. సౌర కుటుంబంలోని పెద్ద పెద్ద గ్రహాల ఆకర్షణ ప్రభావం దీని మీద కూడా కొంత పడుతుంది. అందువల్ల దీని రాకపోకలు అంత ఖచ్చితంగా లెక్కలు కట్టలేము. జర్మనీలోని ఒక ఔత్సాహిక ఖగోళ శాస్త్రజ్ఞుడు దీనిని మొదట 1758లో

క్రిస్టమస్ సందర్భంగా చూసాడు. 1759 మార్చి 13 న సూర్యునికి అతి దగ్గర ప్రాంతం (రవి నీచస్థానం లేదా పెరిహిలియాన్) చేరుకొంది.

తోకచుక్కల నిర్మాణం

తోక చుక్కల ద్రవ్యరాశిని దృష్టిలోకి తీసికొంటే ఇవి నీరసమయిన విశ్వ దేహాలు అనవచ్చు. సరాసరిగా కట్టిన లెక్కలు తెలియకపోయినా కోటి టన్నుల బరువైనా కనీసం ఉంటాయని అంచనా. బహుశా అతిపెద్ద తోకచుక్క దీనికి 10 లక్షల రెట్లు బరువుండవచ్చు. హాలీ తోకచుక్క 10 వేల కోట్ల టన్నుల బరువుండవచ్చునేమో. మన భూమికన్నా ఇది 100 కోట్ల రెట్లు తక్కువ.

అసలు తోకచుక్కలని "మట్టి కొట్టుకొన్న మంచు బంతులు"గా వర్ణిస్తారు 1950-51 లోనే ఫ్రెడ్ ఏ. విపుల్ దీనిని వర్ణిస్తూ దానిలో మంచు కణికలు ధూళిరేణువులు ఉంటాయని అన్నాడు. ముఖ్యంగా దీనిలో నీటిమంచు అధికంగా ఉంటుంది. ఇక భూమిమీద సర్వత్రా కనబడే "ఇసుక" (సిలికేట్) ఇందులోనూ ఉంటుంది. ఇవన్నీ దాని కేంద్రకంలో ఉంటాయి. ఈ కేంద్రకం కొద్ది కి. మీ వ్యాసం కలిగి ఉంటుంది. ఒక్కొక సందర్భంలో ఇది 100 మీ. వ్యాసం కలిగి అతి చిన్నదిగా ఉండవచ్చు.

తోక చుక్కలకు సంబంధించి ఇంత చిన్న కేంద్రకాలని భూమిమీదనుంచి శక్తివంతమైన టెలిస్కోప్‌ల ద్వారా సయితం గమనించడం కష్టం. అవి బుల బులాగ్గా ఉన్న సముదాయాలా, లేక గట్టి రాళ్ళ మాదిరిగా ఉన్న విశేషాలా శాస్త్రజ్ఞులు చెప్పలేకపోతున్నారు.

ఇటీవల ఐ. ఏ. ఆర్. ఎస్. (ఇన్‌ఫ్రారెడ్ ఆస్ట్రోనామికల్ సాటిలైట్) ఒక విశ్వదేహాన్ని గమనించింది. ఇదొక ఆస్టరాయిడ్ దేహం. దానిని 1983 టి. బి అన్నారు. బహుశా ఇది మంచు కోల్పోయిన తోకచుక్క దేహం అయి ఉంటుంది ఇది కొన్ని రకాల ఉల్కాపాతాల మార్గంలోనే సంచరిస్తోంది. చాలా ఉల్కాపాతాలకు, తోకచుక్కలకి సంబంధం ఉందని శాస్త్రజ్ఞులు విశ్వసిస్తారు.

ఇంతకీ తోకచుక్క కేంద్రకం గుండ్రంగా ఉంటుందా, లేక అస్తవ్యస్త రూపంలో ఉంటుందా ఇదమిద్ధంగా తేలలేదు. మే 11న 1983లో భూమికి 46లక్షల దూరంనుంచి ఒక తోకచుక్క ప్రయాణించింది. దాని కేంద్రకం బంతిలాగా కాకుండా పెట్టెమాదిరిగా ఉన్నట్లు రాడార్ ప్రతిధ్వనులు చెబుతున్నాయని ఇర్విన్ ఐ షెపైరో అన్నారు. గత జనవరిలో తీసిన హేలీతోకచుక్క పటాలు దానిలోని తెలుపు నలుపు మచ్చల లక్షణాన్ని గుర్తించాయి.

హాలీతోకచుక్క ఇంకా ఈ సమయానికి (మార్చి 1985) సూర్యప్రభావానికి గురికాలేదు దాని తోక ఇంకా ప్రభావితం కాలేదు. సుమారుగా 120 కోట్ల కి మీ. దూరంలో ఉండడంవల్ల సూర్యకాంతి ఆ దూరానికి దానిమీద ఎర్రగా పడుతోంది. అందువల్ల హాలీతోకచుక్క కేంద్రకం మంచులాగా తెల్లగావుందని భావిస్తున్నారు.

తోక ఏర్పడే విధానం :

తోకచుక్క తోక కోట్లకొద్ది కి. మీ. పొడవున సాగుతుంది. దాని కేంద్రకం నుంచి వ్యాపించిన సూక్ష్మకణికలు అంగుళంలో కోటోవంతు వ్యాసం కల్గినంత సూక్ష్మంగాకూడా ఉంటాయి. ఆ సూక్ష్మపరిమాణంలో సూర్య వికిరణానికి పీడనానికి గురిఅవుతాయి.

అందువల్ల కేంద్రకం లేదా పెద్ద పెద్ద రేణువులకన్నా ఇవి అతితక్కువ పీడనానికి గురి అవుతాయి: అంతకంతకు వెనకబడి తమతమ ప్రత్యేక భ్రమణ మార్గాలలో ప్రయాణిస్తాయి. ఆవిధంగా ఈ కణికలు క్రమక్రమంగా కోట్లాది కి.మీ (మైళ్లు అనికూడా చెప్పవచ్చు) వెనకకిపోయి బ్రహ్మాండమైన తోకగా రూపొందుతాయి.

తోక ఏర్పడడం ఇంతసరళవిషయంకూడాకాదు. వాయువుల్లోని నీటి అణువులు మిగతాభాగాలు క్లిష్టరసాయనిక మార్పులకు గురి అవుతాయి. సూర్యవికిరణానికి విశ్లేషణ చెందుతాయి. తరవాత విద్యుదావేశానికి ప్రభావితం అవుతాయి. సూర్యుని నుంచి వ్యాపిస్తున్న సౌరపవనాల తాకిడికి లోనయి ఈ పరమాణువులు అయస్కాంత క్షేత్రాల ద్వారా సూర్యునినుంచి దూరంగా వెళ్లగొట్ట బడతాయి. ధూళి కణాలతో ఏర్పడిన తోకభాగం సూర్యరశ్మిని ప్రతిబింబింప చేస్తాయి. కాని వాయుపదార్థంతో ఏర్పడిన తోకలు తమ స్వంతకాంతినే ప్రజ్వలింప చేస్తాయి. అందువల్ల తోకచుక్కల తోకల్లో ఈ లక్షణాలు ప్రస్ఫుటంగా విడివిడిగా కనబడడం వల్ల తోకలు వంపులు మలికలు కలిగి తాడు పేనినట్లుంటాయి.

విరామ కాలం

హాలీ తోకచుక్క విరామకాలం 75-76 సంవత్సరాలు. అయితే చరిత్రలో మనకు తెలిసినంతవరకు సుమారు 5 సం తేడాకనబడింది. 1835 - 1910 సం మధ్య 74-42 సంవత్సరాలే ఉన్నా, 451-530 సం॥ మధ్య విరామం 79 - 25 సం॥ ఉంది. పై చెప్పినట్లు దీనికి సౌరకుటుంబ గ్రహాల ప్రభావం కారణం.

ప్రదక్షిణాలు

తోకచుక్కలు కొన్ని సూర్యుని దగ్గిరగానే ప్రదక్షిణలు జరిపేస్తాయి. హాలీ తోకచుక్క ఇలాంటిదే అయినా ఈ తరగతిలో అత్యధిక దూర ప్రయాణం కలిగినదిగా చెప్పవచ్చు. నెప్ట్యూన్ గ్రహానికి ఆవల 480 కోట్ల కి.మీ. దూరంవరకు ఇది పోతుంది. ఈ స్థితిని రవిఉచ్ఛస్థితి అంటారు. మళ్ళీ తిరిగి 2024 సం॥ ఈ ప్రాంతానికి ఇది చేరుతుంది. సూర్యనీచస్థితిలో ఇది సూర్యుని నుంచి 8 కోట్ల 78 లక్షల కి.మీ. దూరంలో ఉంటుంది. మొత్తానికి ఈ దూరాలు, కాలాలు కొంత వరకు సూర్యకుటుంబంలోని పెద్దపెద్ద గ్రహాలు వాటి ఆకర్షణ శక్తులవల్ల నిర్ణయిస్తాయి.

తోకచుక్కల సంఖ్య పుట్టుపూర్వోత్తరాలు

తోకచుక్కల సంఖ్య కోటానుకోట్లుంటుంది. ఇవన్నీ పై చెప్పిన దానికన్నా లక్షలరెట్లు దూరంలో తిరుగుతుంటాయి. అక్కడ అవి ఒక పద్ధతి లేనట్లుగానే తిరుగుతూంటాయి. 1950లో జె. హెచ్. ఊర్ట్ అనే డచ్చి ఖగోళశాస్త్రజ్ఞుని సిద్ధాంతం ఆధారంగా ఒక పెద్ద గోళాకారంలో తోకచుక్కల మేఘం ఉందని శాస్త్ర ప్రపంచం విశ్వసిస్తోంది. ఆ మేఘం మన సౌరకుటుంబాన్ని కూడా ఆవరించి ఉందని అంటున్నారు. మనకు అతిదగ్గరగా ఉన్న నక్షత్రం ఆల్ఫా సెంటారి అంటారు. దీనికి మనకి, మధ్యేమార్గంగా ఈ మేఘం విస్తరించి ఉంది. అంటే సౌరకుటుంబ అర్థ వ్యాసానికి సుమారు వెయ్యిరెట్లు దూరంవరకూ.

ఈ తోకచుక్కల ప్రవర్తన కూడా చిత్రంగా ఉంటుంది. ఆ మేఘంలోని తోకచుక్కలు యాధాలాపంగా తిరుగుతుంటాయి నిజమే. అవి పాలో మార్ టెలిస్కోప్ దృష్టికికూడా అనవు. అయితే ఏదయినా ఒక నక్షత్ర ప్రభావం వల్ల వాటిలో కొన్నిటికి విడుదలయినట్లయి సౌరకుటుంబంలోకి ప్రవేశిస్తాయి. సామాన్య పరిస్థితుల్లో ఏడాదికి 15-30 వరకు ఇలా విడుదల చెందితే నక్షత్ర ప్రభావం ఆకర్షణ కాని తోడయితే వందలాది తోకచుక్కలు తేనెటీగల పుట్టని రేపినట్లు- లేచి సౌరకుటుంబంలోకి ప్రవేశిస్తాయి. వాటివల్లనే ప్రళయాలు సంభవిస్తాయని ఒక సిద్ధాంతంకూడా ఉంది. చాలవరకు ఇవి బృహస్పతి మొదలైన గ్రహాల ప్రభావానికి లొంగి స్థిరపడతాయి. అయితే కొన్ని మొత్తం సౌరకుటుంబం నుంచి వెళ్ళగొట్ట బడతాయి

ఇంతకీ ఈ విషయంగా ప్రాధాన్యం ఏమిటంటే ఊర్ట్ మేఘంలోని తోక చుక్కలు అతిస్వచ్ఛంగా కల్తీలేకుండా ఉన్నాయి. సూర్యవేడికికాని, గ్రహాల ప్రభావానికికాని లొంగకుండా అతి శీతలంగా ఉండి ఏమార్పులకి గురిఅయివుండవు. అందువల్ల అసలు సిసలైన సౌరనెబులా పదార్థం వాటిలో ఉండి ఉంటుంది.

నిజం చెప్పాలంటే ఈ తోకచుక్కల మేఘం మన చుట్టూ ఉన్నట్లే గ్రహాంతర భాగాలలో ఉన్న ఈ మేఘం వల్లనే జోడియకల్ కాంతి [రాశిచక్ర ప్రకాశను సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి తరవాత ఆకాశంలో కనబడే ప్రకాశవంతమైన గగనదృశ్యం. సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న ఉల్కామేఘ పదార్థంనుంచి ఇది వెలువడుతుందని నమ్ముతారు.]

గెగెన్‌షెన్ ప్రభావం కనబడుతుంది. ఉల్కలుకూడా దీనినుండే ఉత్పన్నమవుతాయి.

[రాత్రిపూట అతి తక్కువ ప్రకాశంతో ఎలిప్టికల్ ఆకారంలో కనబడేకాంతి ఆకాశంలోని తోకచుక్కల పదార్థం సూర్యకాంతిని ప్రతిబింబింప చెయ్యడంవల్ల ఇది కనబడుతుందని భావిస్తారు. (పాలపుంతకాదు) ప్రభావం కనబడుతుంది. ఉల్కలు కూడా దీనినుంచి ఉత్పన్నమవుతాయి.]

ప్రస్తుత ప్రయోగాలు

ప్రస్తుతం హేలీతోకచుక్క అధ్యయనం అత్యంత ఆధునిక పద్ధతిలో నేటి శాస్త్రవిజ్ఞానస్థాయికి తగినట్లు జరుగుతోంది. తోకచుక్కలోని పదార్థాన్ని బాగా అక్కడికక్కడే పరిశీలిస్తే తప్ప దానిలోని విశేషలక్షణాలు తెలియవు. ఈ యజ్ఞంలో అనేకదేశాలు సహకారం అందించుకొంటున్నాయి.

రష్యా దీనిలో అగ్రగామిగా ఉంటోంది. అనడానికి సందేహంలేదు. అమెరికా ఈ విషయంగా అంత ఆసక్తి కనబరచడం లేదుకాని నామమాత్రపాత్రవహిస్తోంది. జపాన్, పశ్చిమయూరప్ దేశాలు చాలా ప్రముఖ పాత్రవహిస్తున్నాయి.

మొత్తానికి అయిదు అంతరిక్షనౌకలు ప్రయాణం సాగిస్తాయి. రవి నీచస్థితి దాటి సూర్యగ్రహంనుంచి పారిపోతున్న సమయంలో ఇవి హాలీతోకచుక్కను కలుస్తాయి. రష్యా రెండు వేగా అంతరిక్ష నౌకలను పంపుతోంది. డిసెంబర్ 15, 1984న ఒకటి అప్పుడే ప్రయాణించింది. 6 రోజుల తరవాత మరొకటి దాని వెనకనే ప్రయాణించింది. జపాన్‌వారి ఎం. ఎస్. - టి5 అనే అంతరిక్షనౌక జనవరి 8న బయలుదేరింది. దాని సహాధ్యాయి ప్లానెట్ -ఎ. ఆగస్ట్ 14న బయలుదేరతోంది. ఇక అయిదవది జియోటో ఖండాంతరవేధి. ఇది యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వారిది. ఇది జూలై 2 తన ప్రయాణం ఆరంభిస్తుంది.

జియోటో ఒక ఇటాలియన్ చిత్రకారుడు. "పాదువా" నగరంలో ఇతడు చిత్రించిన పటం ఉంది. ఈ పటం హాలీ తోకచుక్కదే అని శాస్త్రజ్ఞుల నమ్మకం. 1301లో తోకచుక్క కనబడింది.

ప్రొ. మైకేల్ ఎఫ్. హెర్న్ మేరీలాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ ఖగోళశాస్త్రజ్ఞుడు. ప్రప్రథమంగా అతిసమీపం నుంచి తోకచుక్క అధ్యయనం మొదటిసారి జరుగుతున్నది అంటూ దీనివల్ల తోకచుక్కల విజ్ఞానం బహుగుణీకరణం అవుతుందని అభిప్రాయపడుతున్నారు. మామూలు పద్ధతిలో దూరం నుంచి కాక ఆ వాయువులని ధూళిని అక్కడికక్కడే యథాతథంగా పరిశీలించడం కొలతలు తూనికలు వెయ్యడం ఇందులో ప్రముఖ విషయం అన్నది.

'విశ్వఅవశేషాలు'

తోకచుక్కలు విశ్వఅవశేషాలుగా భావిస్తున్నారు. గత 500 కోట్ల సంవత్సరాల నుంచి ఏ మార్పులు చెందకుండా ఈ తోకచుక్కలు తమవ్యక్తిత్వాన్ని కాపాడుకొంటున్నాయి. వీటిద్వారా సూర్యజన్మకాలంనాటి పరిస్థితులను యథాతథంగా అధ్యయనం చెయ్యబోతున్నాము. ఆనాడు బిగ్ బ్యాంగ్ జరిగినపుడు కొద్దిక్షణాల లోనే లిథియమ్ -6, లిథియమ్-7 అధిక ప్రమాణాలలో ఉత్పత్తికావడం జరిగింది. ఈ మహావిశ్వం ఏర్పాటుఅయిన మధురక్షణాలను తిరిగి "జీవించబోతున్నాం" మనకు ఈ పరిశోధనలు సంపాదించి పెట్టే ముఖ్యాంశం ఇది.

వేగా అనే నక్షత్రం ఉంది. కాని వేగా ఖండాంతరవేధికి దీనికి సంబంధం లేదు. రష్యాభాషలో వెనెరా అంటే శుక్రుడు. గాల్లేయ అంటే హాలీ. రెండు పదాల లోని మొదటి రెండు అక్షరాల సమన్వయంవల్ల వేగా పేరువచ్చింది. వీనస్ ప్రక్కగా పోయి అక్కడ కొన్ని అంతరిక్ష భాగాలను ఆ గ్రహంలో వదలి ఈ రెండు ఖండాంతర వేధులూ తోకచుక్కను ఢీ కొనడానికి ప్రయాణిస్తాయి.

ప్రథమ వేగా ఖండాంతర వేధి హేలీకేంద్రకానికి 9, 600 కి.మీ. దూరంలో ప్రయాణిస్తుంది. ఇది 6 మార్చి 1986న జరుగుతుంది. రెండవ వేగా ఖండాంతర వేధి ఇదే దూరాన్ని మూడు రోజుల తిరువాత (9 మార్చిన) చేరుకొంటుంది. వీటిలో రెండు టి. వి. కెమెరాలున్నాయి ఇవి భూమికి చిత్రాలను పంపుతాయి. ఇవి కాక ద్రవ్యరాశి స్పెక్ట్రామీటర్లున్నాయి. ఫ్రెంచి శాస్త్రజ్ఞులు రూపొందించిన ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రామీటరుంది. వీటి సహాయంతో ధూళి, వాయు విశ్లేషణ జరుగుతుంది.

ఇఎస్ఎ శాస్త్రజ్ఞులు ఈ ప్రయాణమార్గ అనుభవాన్ని ఉపయోగించదలిచారు మార్గం ఎలా సుకరంగా ఉందో చూసుకొని జియోటో ప్రయాణమార్గాన్ని సరియైన పంథాలో పెట్టడానికి వీరికి అవకాశం కలుగుతోంది. దీనికి సంబంధించిన కేంద్రం పశ్చిమ జర్మనీలో ఉంది. ఈ సహకారంవల్ల జియోటో తోకచుక్క కేంద్రానికి కొద్దివందల కి. మీ. దూరంలోకే రావడానికి అవకాశం కల్గుతోంది. కేంద్రకంనుంచి ఆవిరిగా అయి విడుదల అవుతున్న వాయువు ధూళిని ఇందులోని పరికరాలు పరీక్షిస్తాయి.


మొత్తానికి దాని నుంచి రంగులపటాలు కూడా రాబోతున్నాయి. 50 మీటర్ల మంచి తీసినస్పష్టత వాటిలో గోచరిస్తుందని ఆశిస్తున్నారు.

ఈ ప్రయోగాల్లో అంతరిక్ష నౌకలకి కొంత ప్రమాదం లేకపోలేదు, ఒక విధంగా ఆత్మహత్యా సదృశమైనదే అని చెప్పవచ్చు. కారణం ఏమంటే 2½ లక్షల కి. మీ. వేగంతో ప్రయాణిస్తున్న అతిసూక్ష్మరేణువులు సమితం అంతరిక్ష నౌక ప్రమాదం తీసికొనిరావచ్చును. మహా అయితే రెండవ అర్ధభాగం ప్రయోగకాలంలో ఫలితాలు మనకు చేరకపోవచ్చు. అయితే ఇటువంటి అవకాశం మళ్ళీ ఎప్పుడో కదా అందువల్ల ఈ విధమైన రిస్క్ తీసికోవడంలో తప్పులేదు అంటారు రోజర్ ...

జపాన్ ప్రయోగాలు కొంతదూరంనుంచే జరుగుతాయి, ఎం. ఎస్. టి బహుశా కొన్నిలక్షల కిలోమీటర్ల నుంచీ తనపనిని నిర్వర్తిస్తుంది. ప్లానెట్ ఎ కూడా 2 లక్షల కి. మీ. కంటె దగ్గిరకుపోదు. దానిలో సౌరపవన జ్ఞాన గ్రహీత ఉంటుంది అతినీలలోహిత పటవ్యవస్థ కూడా ఉంది. ఇది తోకచుక్క యొక్క ప్రాంతాలను రవినీచస్థితికి 10 రోజుల ముందు, ఆ తరువాత గ్రహిస్తుంది.

అమెరికన్ పయొనీర్ ప్రస్తుతం వీనస్‌ను చుట్టుముట్టుతోంది, తగిన సమయానికి ఇది తనవీక్షణాన్ని హాలీ తోకచుక్క మీదకి మరల్చి కొంత విషయాన్నయినా గ్రహిస్తుంది. మొత్తానికి ఒకటి విఫలమయినా మరొకటి సమాచారాన్ని అందించడానికి సిద్ధంగా ఉంటుంది.

గుర్తుంచుకోండి. మళ్లీ ఈ తోకచుక్క దర్శనం 2061 లోనే ఆనాటి శతాధికులుగా ఉన్నవారికే ఈనాటి దీని దర్శనం బాగా గుర్తుకు ఉంటుంది అయితే వారి జ్ఞాపకశక్తి తగ్గిపోకుండా ఉండాలి కూడా? ●



ఇలా జరిగిన కళ్యాణం

పాలకోడేటి సత్యనారాయణరావు

ఆ పెంకు టింటిముందే రిక్షాదిగాం నేనూ, సూర్యమూ.

నేను రిక్షావాడికి డబ్బులిస్తోంటే, సూర్యం ఆ ఇంటిని పరిశీలించటం పూర్తి చేశాడు. రిక్షా వెనక్కువెళ్లిపోయింది. అప్పుడన్నాడు సూర్యం. తన పరిశీలనా ఫలితాన్ని ఒకే మాటలో తెలియజేస్తున్నట్లుగా : 'మంచి వ్యాపారంలాగానే ఉంది ఇది !' అని.

ఉలికిపడ్డాను నేను – ఎందుకన్నాడు ఆ మాట అని !

రిక్షా దిగగానే ఆ ఇంట్లోకి వెళ్లిపోదమన్న ఆత్రుతను చంపుకొంటూ అక్కడే నిలబడిపోయి అడిగాను సూర్యాన్ని – "ఎందుకంటున్నావ్ అలాగ ?" అని.

"చూస్తే తెలీటంలేదూ ! ఇంత పెద్ద పెంకుటిల్లు, ఇంటి ముందు చిన్నతోట. ఇంటికి ముందు ఈ గేటు. గేటుకు ఈ బోర్డు. అబ్బో, బాగానే సంపాదించి ఉంటాడు

సూర్యం అంటున్నది నిజంలాగానే ఉంది. పరిశీలించి చూస్తోంటే ఈ మాత్రంగా ఉండాలంటే బాగానేఉండి తీరాలి. అయినా...ఇదంతా.. ఈ'వ్యాపారం' వల్లే ?.. అయి ఉండకపోవచ్చు ! అదే అన్నాను సూర్యంతో.

సూర్యం నవ్వాడు ! "నువ్వు ఉత్తపిచ్చాడివిరా ! ఇల్లు చూడు. కొత్తగా కట్టినట్లు లేదూ ? ఇంత పెద్ద ఇంటిని ఇంతకు మునుపు ఎప్పుడైనా ఈ వీధిలో చూసిన గుర్తుందా నీకు, చెప్పు ?" అనడిగాడు సూటిగా.

నిజమే – ఈ వీధిలో రోజూతిరిగాల్సిన పనేమీనాకు లేదుగానీ వచ్చిన సందర్భంలో ఎప్పుడు ఇంత పెద్దఇంటిని ఈ వీధిలో చూసిన గుర్తులేదు.

అంటే....సూర్యం అంటున్నది నిజమేనా ? ?

"ఇంకా సందేహం దేనికి ? నేను చెప్పింది నిజమయిఉంటుంది. ఈ రోజుల్లో నాకు తెలిసినంతవరకు పెట్టుబడిలేని వ్యాపారాలు రెండే ఉన్నాయిరా ! ఒకటి పెళ్లి చేసుకోవటం... పెళ్లి చేసుకొంటామని చేప్తే చాలు, ఆ వ్యాపారంలో నీకు వేలకొద్దీ లాభాన్ని సంపాదించి పెట్టడానికి ఆడపిల్లల తండ్రులు కట్నాల సంచులు చేతిలో పట్టుకొని సిద్ధంగా ఉంటారు.. ఇక రెండో వ్యాపారం....ఇదిగో, ఇదే పెళ్లి చేసుకొనే వయసయిపోయిందిగాబట్టి, ఇక పెళ్లిళ్లు చేస్తామంటూ మారేజ్ బ్యూరోలు పెట్టుకోవటమే ! పాతకాలంలో పెళ్లిళ్ల పేరయ్యలు అంటూ ఉండేవారు! అట్టు ఆడాళ్లదగ్గర, ఇటు మగాళ్లదగ్గరా కూడా డబ్బుగుంజటం ఒక్కటే వాళ్లపని. ఆ పెళ్లిళ్ల పేరయ్యకే ఇదికొత్త పేరు – మారేజ్ బ్యూరో ! పెట్టుబడిలేని రెండో వ్యాపారం ...!"

సూర్యం అంటున్నది సరిగ్గానే ఉన్నట్లుతోస్తోంది నాకు. వాడిమాటల్లో రవ్వంత నిజం కూడా ఉందన్నట్లు ఆ గేటుమీద బోర్డుకటి – 'యాజీ మారేజ్ బ్యూరో.... స్వర్గంలో కుదరని పెళ్లిళ్లను ఇక్కడ కుదురుస్తాం !' అని ! !

'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని సూక్తి. అక్కడ కుదరని పెళ్లిళ్లను ఇక్కడ ఆయన కుదురుస్తాడట ! ఎంతధైర్యమో అలా చెప్పుకోవడానికి !

క్షణం ఆగి అన్నాను – "పోనీ, వెళ్లిపోదామేమిట్రా ?"

'నీ ఇష్టం. నాకు ఇలాటివి ఇష్టముండవని ముందే చెప్పాను. విన్నావుకాదు. మూతి మీద మీసం పెరిగినమగాళ్లం. మనకు పెళ్లికాకపోవటమేమిటా అంటే విన్నావుకాదు. ఇక్కడికి లాక్కొచ్చావు. ఇపుడు వెనక్కువెళ్లిపోదాం అన్నా, నాకేమీ అభ్యంతరంలేదు !" సూర్యం మళ్లీ తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.

తప్పుచేశానా అనిపించింది, నిన్న ఉదయం పేపరుచూసినప్పటినుంచీ మనసులో ఇదే ఆలోచన నన్ను వెంటాడుతోంది. అందుకే ఇలా వచ్చాను !

చెప్పుకోవాలంటే సిగ్గుగాఉంది. కానీ నిజం మరి. ఏం చెయ్యను. నాకు కట్నం తీసుకోకుండా పెళ్లిచేసుకోవాలని ఉంది. ఆఫీసులో ఖాళీఉన్నపుడల్లా పేపరు తిరగెయ్యటం నాహాబీ. ఏరోజుపేపరు చదువుతున్నా ఈ మధ్యకాలంలో కట్నాల కోసం కాల్చి చంపెయ్యటాలే వార్తలుగా ఉంటున్నాయి. ఇచ్చిన కట్నం చాలలేదని కొందరు. ఇస్తానన్న కట్నం ఇవ్వలేదని ఇంకొందరు. అది చెయ్యలేదు. ఇదివ్వలేదని మరికొందరు. కారణం ఏదైతేనేం, ఆడపిల్లల్ని కాల్చుకుతినడం ఎక్కువయిపోయింది. ఇదివరకు ఇలాటి వార్తలు ఉత్తరాది ఊళ్లకే పరిమితంగా ఉండేది. ఇపుడు మన ఆంధ్ర జనం కూడా ఈ విషయంలో ముందునే ఉంటున్నారు. ఆలోచిస్తోంటే అనిపిస్తోంది.—ఎందుకివ్వాలి ఆడాళ్లుకట్నం చెప్పండి ! ఒకే పుట్టుక పుట్టాంగదా, మరి వాళ్ల తక్కువేమిటి, మన మగాళ్ల ఎక్కువేమిటి ? ఇవే పశ్నలు నన్ను నిలవనిచ్చేవి కావు.

ఒక రోజున ఇవే ప్రశ్నలు ఆఫీసులో అడిగాను. ఎదురు సీట్లో టైపుచేసే సుందరి ఉలికిపడింది." "ఈరోజుల్లో కట్నం తీసుకోనివాడిని మగాడని ఎవ్వరూ అనుకోరు !" అంది తన నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడిచేస్తూ.

ఈసారి ఉలికిపడటం నా వంతయింది.

"ఏమో మరి; మా ఆయన పాతికవేలుతీసుకొన్నాడు. ఆ విషయం చెప్పుకోవాలంటేనే నామోషీగా ఉంది. నాకిప్పటికీ .... మేనమామకొడుకు కాబట్టి పాతిక వేలే ఇచ్చారుగానీ, అదే మాలో.... మా ఆయనలా ఇంజనీరింగ్ చదివితేచాలు, లక్ష ఇచ్చుకోవల్సిందే !" అంది సుందరి – తనమొగుణ్ని, తక్కువకట్నం తీసుకొన్న కారణంగా అసలు మగాడేకాదని జమకట్టేస్తూ.

రెండో రోజున సుందరి లేనపుడు మా సెక్షన్‌లోనే పనిచేస్తున్న పెళ్లికాని పిల్ల జానకితో ఆ విషయం ప్రస్తావించాను— "మీరన్నది నిజమే ! అందుకే ఇలా దిగొడవలన్నీ దేనికని, నేనెప్పటినుంచో రికరింగ్ డిపాజిట్ వేస్తున్నా ! నెలకు అయిదొందలు... ఇంకో రెండేళ్లువేస్తే....యాభై వేల వుతుంది. అప్పుడు సుఖంగా పెళ్ళిచేసుకోవచ్చు!!" అందావిడ.



'మహాతల్లీ నీకెంత ఓపికే !" అనుకున్నాను మనసులో.

అసలు ఇలాటివిషయం ఈ ఆడవాళ్ళతో ప్రస్తావించటమే తప్పనిపించింది. లేకపోతేఏమిటి ?– కట్నం తక్కువతీసుకొన్నారని ఒక ఇల్లాలు బాధపడుతోంటే, తనెక్కువ కట్నం ఇవ్వాలని ఇంకో ఇల్లాలు బాధపడుతోంది. అంతేగానీ, అసలు కట్నం ఇవ్వటం తప్పు అని ఏఒక్కరు అనుకోవటం లేదు. -కట్నం గురించి ఇంకా ఏమైనా అన్నానంటే 'ఒకసారి మీరు మెడికల్ చెకప్‌కు వెళ్లిరండి ! మీకు మెంటల్‌గానో, ఫిజికల్‌గానో ఏదో తేడాఉండి ఉంటుంది! అనేస్తారు జనం !

అందుకే కట్నం తీసుకోకూడదని నిర్ణయించుకొన్నా, ఆ నిర్ణయం గురించి పైకి చెప్పుకోవాలంటే భయంగా ఉంది, సిగ్గుగాఉంది.

నిన్న ఉదయం పేపర్లో–'యాజీ మారేజ్ బ్యూరో' వారి ప్రకటన చూశాను తెలిసినవాళ్ళతో చెప్పుకోలేని విషయాన్ని తెలియని వాళ్ళతో చెప్పుకోవటం చిత్రంగా ఉంటుంది! ఎదుటివ్యక్తి మనకు పరిచితుడు కాకపోవటం ఒక్కోసారి మేలే చేస్తుంది కాబోలు ! అందుకే ఈరోజు మా ప్రయాణం ఇక్కడికి !!

అయినా-ఇంతదూరం వచ్చి వెనక్కు వెళ్ళిపోవటం ఏమిటి ? అనుకొంటూ ముందుకే కదిలాను. అయిష్టంగానే సూర్యం కూడా నాతో వచ్చాడు.

గేటు బయట దగ్గరున్న కాలింగ్‌బెల్ నొక్కి ఇంట్లోకి వెళ్లాము.

వసారా దగ్గరకు వచ్చేసరికి లోపల్నించి రుద్రాక్షమాలతో, నుదుటిమీద విభూతితో, ఎర్రరంగు పట్టు పంచెతో అరవై ఏళ్ళ వయసున్న ఆయన వచ్చారు. ఆయనే కాబోలు 'యాజి'....అదే సోమయాజి, కాకుంటే సోమయాజులు !

"నమస్కారం" అన్నాను నేను విషయాన్ని ఎలా అడగాలో, ఎలా కదపాలో కూడా తెలీటంలేదు. ఎప్పుడూ ఎరగని పరిస్థితి ఇది. అసలు నాముందు ఇంకో వ్యక్తి ఇలావచ్చి ఉంటాడా అన్నదీ సందేహంగానే ఉంది నాకు!

మాకు ప్రతినమస్కారం చేస్తున్నట్లుగా చెయ్యి ఎత్తారాయన. క్షణం ఆగి అన్నారాయన "ఫారం నింపటానికి వచ్చారా ?"

నాకు అర్థంకాలేదు, ఇక్కడ ఫారాలేమిట్రా అనుకొన్నా !

ఆయనే విశదీకరించారు. ఆ బ్యూరోలో పెళ్ళికొడుకుల, పెళ్ళి కుమార్తెల వివరాలు సవివరంగానే రాసి ఉంచుతారు. ఇవన్నీ స్వయంగా వాళ్లు కానీ వాళ్ళ

వాళ్లుగాని రాసి ఇవ్వాలి. పంతకం చేసి మరీనూ! ఇలావచ్చిన వివరాలన్నీ నమోదవుతాయన్నమాట. నమోదు చేసుకోవటానికి ఏఫీజూ చెల్లించనక్కర్లేదు కాని ఇంత్రకితమే నమోదయిన వారి వివరాలు చూడాలంటే మాత్రం అర్ధనూటపదహార్లు చెల్లించాలట!!

అయనా సంగతి చెప్తోంటే నేను సూర్యంకేసి చూడలేదు. కాని నాకు సూర్యం ఏమనుకుంటూ ఉంటాడో తెలుస్తూనే ఉంది-'పెట్టుబడిలేని వ్యాపారం!'

సూర్యంకేసి చూశానంటే నాలోఉన్న నిర్ణయం దెబ్బతినేయవచ్చు. అందుకే అటుకేసి చూడకుండానే నేను ఫారం అందుకొని అన్ని వివరాలు రాసిఇచ్చాను. పేరు, వయసు, చదువు, ఉద్యోగం, కులం, గోత్రం, కావాల్సిన కట్నం, వధువుకు ఉండాల్సిన అర్హతలు వగైరాలన్నీ...కావాల్సిన కట్నం దగ్గర 'అక్కర్లేదు!!' అని రాసి అండర్‌లైన్ చేశాను. వధువు 'నచ్చితేచాలు' అన్నమాట కూడా రాశాను.

ఆ ఫారమ్ అందుకొన్నారాయన. అన్నీ చదువుతువి "సంతోషం" అన్నారు.

క్షణం తర్వాత అడిగాను. "మీదగ్గర ఇప్పటికే నమోదయినవి చూడాలని వుంది." అంటూనే జేబులోంచి డబ్బుతీశాను. ఆయన అడగకముందే ఇచ్చేస్తే మంచిదిగదా నని!

"అవి చూడాలంటే రెండు నిబంధనలున్నాయి నాయనా! ఒకటి-నేను చూపించే వధువులలో ఎవరూ నచ్చకపోయినా మీడబ్బు మీకు తిరిగి ఇవ్వం! రెండోది, ఈ వధువుల్లోంచి మీకెవరైనా నచ్చి అది వివాహానికిదారితీస్తే నాకు వెయ్యి న్నూట పదహార్లు ఇచ్చుకోవాలి మీరు. సమ్మతమైతే..." ఆగిపోయారాయన.

'సమ్మతమే' అన్నట్లు తల వూపాను. ఆయన వెంటనే లేచి ఇంట్లోకి వెళ్లారు. ఆయనలా వెళ్ళగానే సూర్యం మొదలుపెట్టాడు- "చెబితే విన్నావుగాదు. ఇపుడు అర్థనూటపదహార్లట. అప్పుడు మళ్ళీ వెయ్యిన్నూటి పదహార్లుట!...బాగుందా ?"

'ఊరుకో!' అన్నట్లు సైగచేసి వాడి నోరునొక్కాను.

లోపల్నించి అయన వస్తున్న చప్పుడు వినిపించి వాడే ఊరుకొన్నాడు. అయన రెండు పెద్ద ఫోటో అల్బంల వంటివి తెచ్చి మాముందు పడేశారు. వాటిని అందుకోబోయేముందు అక్కడ నేను యాభైఎనిమిది లెక్కపెట్టి మరీ ఉంచాను. అతర్వాత అల్బం అందుకొన్నాను.

ఒక్కొక్క పేజీ తిరగేస్తోంటే నాకు ఒక్కొక్క జీవితసత్యం ఎదురవుతున్నట్లుగా ఉంది—పద్దెనిమిదేళ్ళనుంచి నలభై ఏళ్ళ వయసువరకూ ఉన్న వధువులు వరుసగా క్యూలో నిలబడినట్లుగా ఉంది. ఎందుకు కావటంలేదు ఇందరికి పెళ్ళిళ్ళు? ఎక్కువ కారణం-కట్నమే! 'ఇవ్వగలిగిన కట్నం' అని ఉన్న ప్రతిచోటా ఆ సంఖ్య ఐదు వేలు దాటటంలేదు. ఏ ఒకరో ఇద్దరో మరింత మొత్తాన్ని వేశారు. ప్రతి పేజీలోను ఓ ఫోటో ఆ ఫోటోకింద వారి వివరాలు....అన్నీ తిరగేస్తూ ఉండిపోయాను.

ఒక పేజీలో—జానకి ఫోటోకూడా ఉంది. కాని ఇవ్వగలిగిన కట్నాన్ని మాత్రం 'పదివేలు' అనే రాసి ఉంది. అంటే మిగతా నలభై వేలు బ్లాక్‌లో ఇస్తుంది కాబోలు! నవ్వొచ్చింది నాకు!!

నా నవ్వును ఎలా అర్థం చేసుకున్నారో కాని, చిన్న ప్రశ్నమాత్రం సూటిగా అడిగారు-"దేనికి బాబూ నవ్వుతున్నావ్?"

అబద్ధం చెప్పటం ఎంత కష్టమో నాకు అపుడర్థం అయింది. అతకగలిగే అబద్ధాన్ని అందంగా అల్లటం కొందరికే చేతనవుతుంది కాబోలు!

"కట్నం ఇవ్వటం పుచ్చుకోవటం నేరంకదా ఈరోజుల్లో...మరి, మీరేమో ఇంత పబ్లిగ్గా కట్నం గురించి రాశారే!" అన్నాను.

ఆయన నవ్వారు"మనవాళ్ళు చట్టాల్ని చెయ్యడంలో సిద్ధహస్తులే. కాదనను! కాని ఆ చట్టాల్ని చేసే పెద్దమనుషులే లక్షలకొద్దీ కట్నాలుపోసి మరీ తమ కుమార్తెల పెళ్ళిళ్ళు చేస్తున్న రోజులివి! ఆ చట్టం ప్రచురితమైన కాగితంపాటి విలువకూడా ఆ చట్టాలకు లేదన్న సంగతి మీకు చెప్పాలా చెప్పండి!" అన్నారు.

సూటిగా ఎంత చక్కగా చక్కని నిజం చెప్పారో అనిపించింది.

—పేజీలు తిప్పుతూనే ఉన్నాను. నాజీవితంలోకి వచ్చి నన్నూ నాఇంటినీ ఏలే స్వామాజ్ఞికోసం అన్వేషణ సాగిస్తూనే ఉన్నాను.

అదుగో అప్పుడు కనిపించింది ఆ అమ్మాయి ఫోటో- 'శీతహరిణేక్షణ' అన్నమాట పుస్తకాలలో చదువుకోవటమేగాని ప్రత్యక్షంగా చూసి ఎరగను కాని ఇపుడీ అమ్మాయి ఆ పదానికి అందమైన నిర్వచనంలా, సికార్పయిన అర్థంలాగా నాముందు నిలబడి ఉంది. చెంపకు చేరదేసి కళ్ళతో, కళ్ళ సరిహద్దుల్ని తీర్చిదిద్దిన ఆ కాటుకతో అందంగా ఉంది. అకట్టుకొనేలా ఉంది.

పేరు—రుక్మిణి.

వయసు—నాకన్నా తక్కువే!

చదువు—దాలినంత!!

ఇచ్చుకోగల కట్నం—'ఏమీలేదు!' అని ఉంది.

ఉలికిపడ్డాను—కట్నం ఇచ్చుకోలేమని రాయటమేనాకు చిత్రంగా తోచింది.

ఎలాటి రోజులివి! ఫాల్స్ ప్రెస్టేజ్ ప్రపంచాన్ని రాజ్యంచేస్తున్న రోజులివి. అలాటి రోజుల్లో నీతిగా, నిజాయితీగా ఏమీ ఇచ్చుకోలేనని చెప్పుకోవడానికి ఎంత గుండెధైర్యం కావాలి! ఎంతటి నిజాయితీ కావాలి!!

నాకు ఆ అమ్మాయి, నా మనసుకు ఆమె నిజాయితీ నచ్చాయి.

అల్బంలో పేజీలు మరి తిప్పలేదు. సోమయాజులుగారికి చెప్పి అడ్రసు తీసుకున్నాను. రుక్మిణిగారి ఇంటికి వెళ్ళి అన్ని విషయాలు మాట్లాడుకొంటానని చెప్పాను. పెళ్ళి నిశ్చయమైతే అనుకొన్నట్లుగా అంతా ఇచ్చేస్తానన్నాను.

'మంచిద'ని నిండుమనసుతో దీవించారు సోమయాజులుగారు.

ఆ తర్వాత—

కథ నడవటానికి ఎక్కువకాలం పట్టలేదు. సూర్యాన్ని తీసుకుని రుక్మిణి వాళ్ళ ఇంటికివెళ్లాను. నాలుగు పోర్షన్లున్న ఇంట్లో వీళ్ళది ఒకదాంట్లో సగం పోర్షన్. తండ్రి ఎపుడో పోయారు. తల్లికివచ్చే పింఛనుమీదే కుటుంబం గడుస్తోంది. 'ఇప్పటికి గడుస్తోంది కానీ ఇంకెన్నాళ్లో ఇలాకూడా గడిచేలా లేదు!' అంది తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటూ

చేతిలో కానీ లేదనీ, జీవితం అంటే ఆసక్తి చచ్చిపోయిందని ఎపుడైనా ఏదో క్షణంలో ఏదేవుడో ఆదుకోడా అన్న నమ్మకం బతుకును ఈడ్చుకొస్తున్నామని నిజాయితీతో కదుపుచించుకుని మరీ నా కళ్ళముందు వాళ్ళు తమ జీవితాన్ని పరిచారు.

రుక్మిణి నాకు నచ్చింది. పేరుకుతగ్గ నమ్రత ఆమెలో నాకు కనబడింది. ఏ భేషజమూ పోకుండా టకప్పు కాఫీ మాత్రమే ఇచ్చారు. నేను దీనికి జవాబుగా రుక్మిణినే పెళ్ళి చేసుకొంటానని మరీ మాట ఇచ్చివచ్చాను. ఇక మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళింది నేను పెళ్ళిముహూర్తాన్ని నిర్ణయించుకొన్నాకనే. ఆ విషయం విని ఆతల్లి కన్నీరు పెట్టుకొంది. రుక్మిణి తన కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పుకొంది.

అపుడు బయటపెట్టాను నా మనసులోని కోరికను—"మీరేమీ అనుకోనంటే...రుక్మిణిని నేను తెలోకసారి బయటకు తీసుకెళతా! యాజులు గారింటి వరకూ!..."అన్నాను.

పెళ్ళికాకముందు...పెళ్ళి సెటిలయ్యాకకూడా అమ్మాయిని అబ్బాయితో

పంపటానికి ఒప్పుకోరు చాలామంది! అయినా ఆవిడ ఏమీ అనలేదు.

రుక్మిణే అంది—"వెళ్ళొస్తానమ్మా! సోమయాజులుగారికి మనం ఎంతైనా ఋణపడి ఉంటాం! ఆ సంగతి చెప్పివస్తా!"

ఆ తల్లి 'సరే'నంది,

నేనూ, రుక్మిణీ వెళ్ళి సోమయాజులుగారికి పెళ్ళి సెటిలయిన సంగతి చెప్పాం. ఆయనెంతో సంతోషించారు. భార్యను పిలిచి మా ఇద్దర్నీ పరిచయం చేశారు. ఆ దంపతుల్నిచూసి నాకెందుకో వాళ్ళ కాళ్ళకు దణ్ణం పెట్టాలనిపించింది నేను దణ్ణంపెడుతుంటే రుక్మిణీవచ్చి నాతో పాలు పంచుకొంది. రుక్మిణిమీద నాకు నమ్మకం రెట్టింపయింది.

తిరిగి రాబోతుంటే-నేనే ఆగి జేబులోంచి కవరు తీశాను. అందులో వెయ్యి న్నూట పదహార్లున్నాయి. ముందనుకొన్న ఫీజే అది! సోమయాజులుగారికి అందించబోయాను. ఆయన నవ్వుతూ నిలబడ్డారు. కాని తీసుకోలేదు.

రూపాయినోటు చేత్తో పట్టుకుని నిలబడితే వందచేతులు ఒక్కసారి మీద పడి లాక్కునిపోయే రోజులివి. నా అంతట నేనే ఆయనకు వెయ్యికి మించిన మొత్తాన్ని ఇస్తోంటే ఆయన అందుకోనేలేదు. నాకు చిత్రంగా తోచింది అదే అన్నాను.

"పెళ్ళిరోజున ఇద్దువుగానిలే. ఉంచు! ఇపుడెన్ని ఖర్చులు ఉంటాయో! నా సంగతి అఖరికి అట్టిపెట్టు!" అన్నాడాయన నవ్వుతూ.

డబ్బులివ్వకుండానే తిరిగి వచ్చేశాం, నేనూ, రుక్మిణీనూ!

ఆ తర్వాత మా ఇద్దరిపెళ్ళి ఇంకో మూడురోజులుందనగా వెళ్ళి ఆయనను పిలిచాం నేనూ, సూర్యమూ వెళ్ళి.

"మంచిది నాయనా! ఒక మంచి ఆశయంతో పెళ్ళి చేసుకుంటున్నావు! సంతోషం! కాని ఒకటి గుర్తుంచుకో అనవసరమైనవాటికి డబ్బు ఖర్చుపెట్టి ఇబ్బందులపాలవకు! వీలైనంత తక్కువ ఖర్చుపెట్టుకో!" అన్నారు సోమయాజులు.

బయటకు వచ్చాక సూర్యం పకపక నవ్వాడు—"పొదుపు చెయ్యమంటు న్నాడ్రా గురుడు! ఆయనకు ఇవ్వాల్సిన డబ్బు ఎగగొట్టడం దగ్గర మొదలుపెట్టు నీ పొదుపు!" అన్నాడు.

నాకు చిన్నతనంగా అనిపించింది. చీకొగ్గా అనిపించింది! సూర్యం చెప్పినట్లు చేస్తే రేపెప్పుడూ నేను అద్దంలో నాముఖాన్నే చూసుకోలేనన్నది నిజం! అంత కృతఘ్నం కాని నేరమది!

కానీ నా అభిప్రాయాన్ని సూర్యం ముందు వ్యక్తం చేయలేదు నేను. విలువలు ఏవీ లేవంటున్న వాడిముందు ఇలాంటివి చెప్పి నవ్వులపాలు కావటం ఇష్టం లేదు నాకు.

—పెళ్ళయిపోయింది.

'యాంటీ మ్యారేజ్ బ్యూరో' పుణ్యమాని నేనూ, రుక్మిణీ ఏకమయ్యాము. రుక్మిణి మెడలో మూడుముళ్ళు వేశాక సోమయాజులుగారి దగ్గరకు వెళ్ళి దణ్ణం పెట్టాము. అంత హడావిడిలోకూడా నేను నా పంచె మడతలలోంచి తీసి వెయ్యి న్నూట పదహార్లకవరు ఆయనకి అందించబోయాను. సోమయాజులుగారు అదేమీ పట్టించుకోలేదు. మరీ ఎక్కువ స్ట్రెయిన్ దానికే ఇస్తే. అందరికీ విషయం తెలుస్తుం దని నేను ఊరుకుండిపోయాను.

రుక్మిణిని నాకు అందించిన ఋణం వెంటనే తీర్చుకొనే అవకాశం నాకెందుకు ఇవ్వటంలేదో నాకు అర్థం కావటంలేదు.

అందుకే....

పెళ్ళయిన రెండోరోజునే మళ్ళీ యావెళ్ళా మేం ఇద్దరమూ.

సోమయాజులుగారు లేరప్పుడు. అంతక్రితం ఎప్పుడైనా ఒకసారి తొంగి చూసి చిరునవ్వులు మాత్రం చిందించి వెళ్ళే సోమయాజులుగారి ఇల్లాలు ఆ రోజున మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు. కూర్చున్నాక టిఫిన్, టీ ఇచ్చారు. అప్పటికి ఇంకా ఆయన రాకపోయేసరికి జేబులోంచి కవరు తీశాను.

ఆవిడ చిరునవ్వునవ్వారు.

"అది ఇవ్వాల్సింది నువ్వుకాదు!" అందావిడ. ఆ మాటకు అర్థం తెలీలేదు నాకు. నా ముఖంలోకి ప్రశ్నచదివిందేమో ఆమె, నవ్వుకొంటూ ఇంట్లోకివెళ్ళి తిరిగి వచ్చింది. ఈ సారి ఆమె చేతిలో ఒక కవరుంది. "ఇది ఇవ్వాల్సింది మేం!" అంటూనే ఆమె ఆ కవరు రుక్మిణికి అందించారు.

రుక్మిణి విప్పిచూస్తే. ఆ కవరులో రెండువేలరూపాయలకు ఓ చెక్కుంది. ఉలికిపడ్డాను! సూర్యం ఈ క్షణంలో ఉండి ఉంటే...అనిపించింది. అయినా ఆవిడ దేనికి ఇస్తున్నట్లు ఇదిమాకు!.... అదే అడిగాను.

ఆవిడ చిన్నగా నిట్టూర్చారు.

ఆ నిట్టూర్పు వెనక ఆవిడ చెప్తున్న గతకాలపు కథ వాసన ఏదోనాకు స్పష్టంగా తెలుస్తోంది. ఎదలోతుల్లోంచి ఉబికివస్తున్న వ్యథకు ఆవిడ ఆ క్షణంలో అక్షరరూపం కల్పిస్తోందనీ నాకు తెలుస్తూనే ఉంది.

"దాదాపు ఆరేళ్ళకిందటి సంగతినాయనా! మా అమ్మాయి అపుడే పెళ్ళికు దొచ్చింది. తిరగని ఊళ్ళులేవు. తగిన సంబంధాలు చెప్పమని అడగనివారంటూలేరు. సంబంధాలు ఎలా కుదురుతాయో, ఇందరి పెళ్ళిళ్ళు ఎలా అవుతున్నాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడిపోయింది మాకు! ఆ సమయంలోనే ఓ సంబంధం కుదిరింది. అబ్బాయి లక్షణంగా ఉన్నాడు. ఇంజనీరు. దాదాపు రెండువేలజీతం. పెళ్ళిచూపులకు అమ్మాయిని వాళ్ళఊరికే తీసుకెళ్ళాం. అమ్మాయి నచ్చింది వాళ్ళకు నలభైవేలదగ్గర కట్నం కూడా సెటిలయింది. సంబరంలో తిరుగుముఖంపట్టాం. అపుడు జరిగింది ఆ యాక్సిడెంట్! మేం వస్తున్న బస్సుకు వెనకనున్న ఓలారీ, దాన్ని ఓవర్‌టేక్ చెయ్యాలని ప్రయత్నిస్తూ. ఈ బస్సును గుద్దేసింది. ఆ యాక్సిడెంట్‌లో మేం మిగిలాం. మా అమ్మాయి మాత్రం...." ఆవిడ చెప్పలేక ఆగిపోయింది. కన్నీటి తెరగా ఆవిడ చెప్తున్న కథకు అర్థం అయింది.

క్షణం తర్వాత ఆవిడ సంబాళించుకొంది.

'అమ్మాయి పెళ్ళికి దాచిన కట్నం మిగిలింది. అమ్మాయిపెళ్ళి చేయాలనే తపన మిగిలింది. అందుకే ఆకోరిక తీర్చుకొనేందుకే- ఇంకెవరూ మాకు కన్నబిడ్డలు లేకపోవడంతో-ప్రపంచంలో పెళ్ళికానివాళ్ళంతా మన బిడ్డలేనన్న ధోరణిలో ఈ బ్యూరో పెట్టారాయన! ఇలాగ కొందరు జంటల్ని అయినా కలిపితే, కనీసం వచ్చే జన్మలోనైనా....'

ఆవిడ మళ్ళీ మాటల్ని మింగేసింది.

కానీ, రుక్మిణికిచ్చిన రెండువేల మాటేమిటి?

అది మా అమ్మాయికోసం దాచిన కట్నం డబ్బుమీద వడ్డీ!

పెళ్ళి జరగనప్పుడు ఇక కట్నం ఖర్చేమిటి?, అందుకే దాన్ని బాంకులో వేశాం. కట్నం తీసికొని పెళ్ళిచేసుకొనే దంపతులనుంచి ఫీజు వసూలుచేస్తున్నాం. మీలాగ కట్నంతీసుకోని దంపతులకు ఆడబ్బుమీద వడ్డీని కానుకగా అందిస్తున్నాం. అందుకే ఆ డబ్బు మీకే..." అందావిడ.

నాకు చిత్రంగా తోచింది-ఆవిడ చెప్తున్నది వింటూంటే.

తమ జీవితంలోని విషాదాన్ని దిగమింగుకొని, ఇతరులకోసం శ్రమిస్తూ తమ డబ్బు వాళ్ళకోసం ఖర్చుపెట్టే ఇలాంటి పిచ్చిదంపతులూ ఉంటారా? అని పించింది నాకు!

నా సందేహానికి జవాబు ఇస్తున్నట్లుగా-'ఉంటారు'! అంటున్నట్లుగా సోమయాజులుగారు పట్టుపంచెతో ఇంట్లోకివస్తూ కనిపించారు.

ఒక్కసారిలేచి, ఒక్కడుగు ముందుకువేసి, ఆయనకు రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేశాను.

ఆయన కళ్ళల్లోంచి జారుతున్న కన్నీరు మా ఇద్దరి జీవితాలూ సుఖమయ్యం కావాలని ఆ దంపతులు చిలికిస్తున్న అక్షింతల చిరుజల్లులుగా తోచాయి నాకు. ●

ఆకాశం సరదా

డా॥ సి. నారాయణరెడ్డి

సరదా పుట్టింది ఆకాశానికి
మనిషి లాగే
తన ముఖం చూసుకోవాలని.

సింగారించుకుంది

పల్చబడ్డ మబ్బుల్ని
ముంగురుల్లా ఒత్తుగుంటయూ.
నాలుగు పోచలు మిగిలిన నెత్తిని

నలభైసార్లు దువ్వుకునేమనిషి

చెడగొట్టి నట్టున్నాడు
చిదంబరం కప్పుకున్న అంబరాన్ని,
కాకుంటే
ఆకాశానికి అద్దమెక్కడ?

చేదబావిలో చెరువులో
అవులించే సముద్రం నురుగులో
అగుపించేది

ఆకాశం ముఖమే కదా!
అయినా సరదా పుట్టింది ఆకాశానికి

తన ముఖముద్రను మరింతగా
తరిచి తరిచి చూడాలని.

గుండెను చీల్చుకుని
కళ్ళనిండా నింపుకుని చూసింది
తన ముఖం కనిపించింది
త్యాగధనుల రక్తంమడుగులో

(6 వ పేజీ తరువాయి)

రంగంలో నిత్య నూతన కృషి సాగించి సఫలీకృతాశయులుగా విజయాలు సంపాదించ గలుగుతున్నారు. వీరి పినతల్లి కుముదవల్లిగారూ, ఆమె తనయుడైన సోదరుడు విజయరాఘవుడూ కూడా సంగీత రసజ్ఞులే. అలా సంగీతపు కుటుంబములో సంగీత వాతావరణంలో చిన్ననాటినుండి విశిష్ట వ్యక్తిగానూ, మహా కళాభిజ్ఞురాలుగానూ రూపొందిన గాయత్రి ఫ్రాన్సునుండి, జర్మనీ, యు.కె. (బ్రిటన్) యు. యస్. ఎ (అమెరికా) దేశాలుకూడా పర్యటించి, అక్కడి ప్రైవేటుసంస్థల స్పాన్సరింగులో పలు వీణ కచేరీలు యిచ్చి, తమ కీర్తి మకుటంలో మరికొన్ని మహోజ్జ్వల మణులు పొదుగుకుని త్వరలోనే తమ జన్మభూమి అయిన భారత దేశానికి తిరిగి రానున్నారు. బుద్ధి సూక్ష్మతలలోనూ, గ్రహణ ధారణా శక్తులలోనూ గాయత్రి గాయత్రేసాటి. సహజ గుణమైన చిలిపితనం సంభాషణలో చిందులేసేలా చలోక్తులూ, జోకులూ, పన్నులూ వేస్తూ బంధుమిత్ర పరివార సభ్యులనందరిని అలరిస్తూ అకట్టుకనే జరవై ఆరేళ్ళ బాలికామణి గాయత్రి. ఈ బాలిక, ఇప్పుడు ఇద్దరు బాలికలతల్లి. దీప్తి హరిత అనే నామధేయాల సెలక్షన్‌లో తమ స్పెషాలిటీని నిరూపించారు గాయత్రి రామకృష్ణులు. ఆ ఇద్దరు పసిబాలికలూ, అప్పుడే, గాయత్రి పాటకీగాని వీణా వాదనానికీగాని అనువుగా తాళంవేస్తూ హావభావాలు ప్రదర్శిస్తూ నాట్యంచేసే టంతగా ఎదిగారు. తల్లి మేధా సంపదని పుణికి పుచ్చుకుని పుట్టిన ఈ బాలికా మణులు, భవిష్యత్కళాకారిణులుగా వన్నెకెక్క అవకాశాలెన్నైనా వున్నాయి.

ప్రస్తుత విదేశీ పర్యటనద్వారా పాశ్చాత్య సంగీతంలోని కొత్తపోకడల్ని, ఇతర నూతన ప్రవృత్తుల్ని ప్రక్రియల్ని అధ్యయనం చేసి రానున్న గాయత్రి కళాభిజ్ఞత పలురెట్లు పెంపొంది ఆమెకి ఇంకా ఇంకా సర్వతోముఖ దిగ్విజయాలు గడించి పెట్టగలదని గాయత్రి హితైషులైన అభిమానులందరి అకుంఠిత విశ్వాసం

దివ్య మంత్రాలలో గాయత్రీ మంత్రానిది వైయక్తిక ప్రముఖ విశిష్టస్థానం. గాయత్రీదేవి ఆశీర్వాద బలంతో ప్రజ్ఞాపాటవాలకి తగిన కీర్తిధనంతో వెలుగొందుతున్న చి॥ సౌ॥ గాయత్రిది శ్రావ్య సంగీత విశ్వంలో వైయక్తిక ప్రముఖ విశిష్టస్థానం

నేడు బహుళ ప్రచారంలోవున్న గజల్ సంగీత పద్ధతిలో ప్రఖ్యాతిగన్న మెహదీహసన్, గులాం ఆలీలగానం అంటే ప్రత్యేక గౌరవంగల సంగీతాభిమానుల కోవలోగాయత్రికూడా ఒక ప్రముఖాభిమాని. ఉత్తమ కళాభిరుచులుగల ఈ వీణాగాన, గాయకామణి శ్రీమతి "ఈ గాయత్రి"కి మహోజ్జ్వల భవిష్యత్తుయోగం వుందని గాయత్రిని అభిమానించే శ్రోతుగణాలకి ఉదాత్తాశయంతో కూడిన గట్టినమ్మకం. తథాస్తు! దిగ్విజయోస్తు, సమస్త సన్మంగళానిసన్తు!!

గాయత్రి సాధనలలోనూ గాయత్రికి లభించిన అనేక అవార్డులలోనూ కొన్ని ముఖ్యమైన వాటిని ఇక్కడ వివరించడం సముచితం.

(క) తొమ్మిదవ ఏటనే వీణా సంగీత స్పర్ధలో సంగీత నాటక ఎకాడమీ వారు 1969లో ఈమెకు మొదటి బహుమతి ప్రసాదించారు.

(ఖ) ప్రొఫెసర్ సాంబమూర్తి అని గణుతికెక్కిన మహాసంగీతాభిజ్ఞులు బాలమేధావి (చైల్డ్‌రోజ్) అనే బిరుదంతో సత్కరించారు.

(గ) తమిళనాడు ఫైనాన్సు మినిష్టర్ తిరు. వి. ఆర్. నెడుంచెళియన్ గారి సతీమణి డా॥ విశాలాక్షి మద్రాసు ఆర్ట్సు అకాడమీవారి తరపున "యాళి శై చెల్వి" అనే బిరుదు అందించారు.

(ఘ) 1971లో, భారతీయ ఆకాశవాణి అధికార వర్గంద్వారా గాయత్రికి ఆడిషన్‌లేకుండానే 'ఎ' గ్రేడు లభించింది.

(చ) అడవి మృగాలపై తీయబడిన ఒక డాక్యుమెంటరీ చిత్రానికి ఈమె సముచిత సంగీతం సమకూర్చారు.

(ఛ) 1977లో రోటరీ జెయసీస్ క్లబ్బువారు విశిష్టమైన యూత్ షీల్డుని సమర్పించారు.

(జ) డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి సంస్థ అయిన "మురళీ రవళి" ఈమెను "నాదసుధార్ణవ" బిరుదంతో సన్మానించింది.

(ఝ) తమిళనాడు ముఖ్యమంత్రి తిరుయం. జి. రామచంద్రన్ గాయత్రికి 1984లో "కలైమామణి" పట్టం గట్టారు. గాయత్రి ఇలా మరెన్నో బిరుదులూ అవార్డులూ సన్మాన సత్కారాలు అందుకోవాలని శుభాకాంక్షిద్దాం.

తిల్లానా

కొడవంటి కాశీపతిరావు

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోనుండి దిగేసరికి ఎదురుగా నిల్చున్న జనసమూహాన్ని చూసి విస్మితుడై పోయాడు శివశంకరం. ఆహ్వానించడానికి అంతమంది వేచి వుంటారనుకోలేదు. పైగా అందరిచేతుల్లోనూ పూలదండలో, పూలగుత్తులో సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి. హృదయం ఉప్పొంగిపోతుంటే రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ వుండిపోయాడు శిలావిగ్రహంలా. పూలదండల్తో ముఖం కనిపించని ఆ శిలావిగ్రహాన్ని రైల్వేస్టేషన్లో ఎందుకు ప్రతిష్ఠించేరో నన్నట్టుగా ప్లాట్‌ఫారంమీది జనం ఎగబడ్డారు. ఎగబడిన జనానికి కొంతసేపటికి అర్థమైంది... అది శిలావిగ్రహం కాదు...ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు శివశంకరమని.

స్టేషను బయటికివచ్చి మరింత ఆశ్చర్యపోయేడు శివశంకరం. 'త్యాగరాయ గానసభ' పేరుతో ఉన్న బేనర్ పట్టుకుని కార్యకర్తలూ...వెనకగా సన్నాయి వాయిద్యమూ...ఆ వెనుక జీపుమీద శివశంకరమూ...అట్టహాసంగా గమ్యం చేరుకున్నారు. స్వాగతమే ఇంత పెద్దయెత్తున చేస్తే కచేరీ, సత్కారాలు ఇంకెంత గొప్పగా ఉంటాయో అన్న ఆలోచన వచ్చింది. ప్రజాదరణ తగ్గిపోతున్న సంగీతానికీ, తనవంటి సంగీత విద్వాంసులకూ దేశంలో ఇంకా ఏమూలనో కొస్తంత చోటు ఉన్నందుకు కళ్ళు చెమర్చాయి శివశంకరానికి.

కనుచీకటి పడుతోంది.

మర్నాడు ప్రారంభంకానున్న సంగీతోత్సవాలకి సన్నాహాల తుదిమెరుగులు దిద్దుతున్నారక్కడ.

"శివశంకరంగార్ని మా ఇంటిలో విడిది చేయమనికోరేం. కాని సాధన చేసుకోడానికనుకూలమైన వాతావరణం ఉంటుందని ఈ ఆవరణలో ఉంటానన్నారు. అంచేత ఆ భాగ్యం నాకు కలగలేదు.." అని అధ్యక్షులవారు ఎవరితోనో అంటున్న మాటలు లీలగా వినబడుతోంటే తనపట్ల అక్కడివారికున్న ఆదరాభిమానాలకి పొంగిపోయేడు శివశంకరం.

"ఇక మీరు విశ్రమించండి... మేం సెలవు తీసుకుంటాం..." అన్నారు అధ్యక్షులవారు.

"మంచిది. మీకు శ్రమ ఇచ్చాననిపిస్తోంది."

"ఎంతమాట...మీకేదైనా అవసరమైతే చూడటానికి ఇదిగో ఈ వెంకడు ఇక్కడే వుంటాడు. మొహమాట పడకండి. ఆజ్ఞాపిస్తే చిటికెలో చేసేస్తాడు. వెళ్ళొస్తాం...తిరిగి ఉదయాన్న దర్శనం చేసుకుంటాం..." అంటూ వెళ్ళిపోయేడాయన.

కొంతసేపటివరకూ కార్యకర్తలకేవేవో సూచనలిస్తూ, పనివాళ్ళకి పనులు పురమాయిస్తూ అధ్యక్షులవారి గొంతు విన్పించింది. ఆ తర్వాత వెళ్ళిపోయినట్టున్నారు సద్దుమణిగింది. అప్పుడు లేచి స్నానంచేసి బట్టలు మార్చుకున్నాడు శివశంకరం.

పట్టు లుంగీమీద పట్టులాల్చీ వేసుకున్నాడు. ఆపైన ఆకుపచ్చని ఉన్ని



శాలువా కప్పుకున్నాడు, బయటికి వచ్చాడు. ఊళ్ళో ఎక్కడా శబ్దం వినిపించడం లేదు. బాగా రాత్రయ్యిందేమో వెన్నెల వెలుతురు పరచుకుంది.

అంతదూరంలో రేపు కార్యక్రమం జరుగనున్న భవన ప్రాంగణం కనిపిస్తోంది. చుట్టూరా చలవపందిళ్ళు వేయిస్తున్నారు, చల్లగా వుండటానికి కాదు. చల్లని రాత్రివేళ మెల్లగావీచే సంగీత మారుతానికి వణికిపోకుండా ఉండటానికి—పందిళ్ళమీద కూలివాళ్ళు ఎక్కి పరదాలు కడుతున్నారు.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరని" వేసిన కవిప్రశ్న అంకుశంలా గుచ్చుకుంది శివశంకరానికి.

అవును. రేపు తాను పాడుతూంటే ఖరీదైన మనుషులు సుఖంగా ఆ పందిళ్ళకింద కూర్చుని కడుపునిండిన శరీరాలనే కాదు కష్టాలుసోకని మనసునికూడా ఆనందింపజేసుకుంటారు.

జాలిదృష్టితో అలా చూస్తూండిపోయారు.

"బాబేటి కావాలేటి బాబూ."

ఎప్పుడొచ్చి నిలబడ్డాడో ఎంతో వినయంగా చేతులు కట్టుకుని వంగి మరీ అడిగేడు వెంకడు.

వాడికేసి కన్నార్పకుండా చూసేడు శివశంకరం.

ముతకపంచె ఎగ్గట్టుకున్నాడు దానిమీద వేసుకున్న సైనుబనీను ఘాసివుంది. తలక్కట్టుకున్న తలపాగానిండా అంతవరకూ పడిన కష్టానికీ, చేసిన పనికీ లంకెలా చెమటతో కూడిన మట్టితో ముఖం మకిలిబారి ఉంది. ఎంత కష్టమైనా చేస్తాం కడుపునిండా కూడు దొరికితే మహరాజు నన్నంత దిగులులో కూడిన ధీమా అతని ముఖంలో ప్రస్ఫుటమౌతోంది.

"ఏటిబాబూ...ఏటీ సెప్పినారుకాదు పనాగిపోతంది..." అంటూ అటువేపు చూసేడు వెంకడు.

వెంకడు వచ్చెయ్యడంతో అక్కడ పనివాళ్ళుకూడా పనాపేసి చుట్టలు ముట్టించుకుని కబుర్లాడుకుంటున్నారు.

"అబ్బే...పనేంలేదు. నీపని చూసుకో..." అన్నాడు గంభీరంగా.

"సిత్తం..." అంటూ వినయంగా వంగునిలేచి వెళ్ళిపోయేడు వెంకడు.

అతడు వెళ్ళినవేపే కాసేపు చూస్తూ నిల్చున్నాడు.

మనసులో తరంగాలు తరంగాలుగా నాదం ఉబికుబికి తన్నేస్తోంది.

అవును !

ఆ మర్నాడు తాను ఈ కచేరీకి ప్రత్యేకంగా తిల్లానా కూర్చవలసివుంది అన్న సంగతి జ్ఞాపకానికి వచ్చింది.

వెంకడు వెళ్ళేసరికి కూనిరాగాల్తో పన్లోకి దిగేరంతా.

"ఆపండెస్...ఆ బాబు మాగొప్ప పాటగాడట...మన పోసికోలుపాట విని నవ్వుకుంటాడు" అంటున్నాడు వెంకడు.

"ఏపాటి పాటగాడో...మనంకూడా ఇందారేంటి..."

"పెద్ద పెద్దోళ్ళొస్తార్రా...మనదాకా ఎక్కడ...సరిసరి...బేగి పని కానియ్యండెస్..."

నవ్వుకున్నాడు శివశంకరం. అక్కడికి దగ్గర్లో సిమెంటుచప్టా కనిపించింది. అక్కడ ఆసీనుడయ్యేడు.

మరం వేసుకుకూర్చుని చుట్టూచూసేడు శివశంకరం. అతని కళ్ళకి ఎక్కడ చూసినా విద్యుద్దీపాల కాంతే ! ఏవైపునా తలలూచే జన సందోహమే ! ఏవంకా మృదుమధుర సంగీత నాదమే ?

సంగీత సమాధిలోనికి ప్రవేశించినట్టుగా ఉంది.

అతనిని సంగీత సరస్వతి ఆవహించినట్టుగా గాంది.

ఎడమవైపు నుండి వాయులీనం, కుడిదిక్కుగా మృదంగ ఘట్టనం, వెనుక నుండి తంబుర నాదం అతనిని అమాంతంగా లేవనెత్తి సంగీత సాగరంలోకి విసిరేసినట్టూ...అందులో తలమునకలై కొట్టుకుపోతున్నట్టూ వుంది శివశంకరానికి.

"తోం...తోం...దిరిదిరితోం...నాదిరిదిరిదిరి.."

తిల్లాన అతని నోటినుండి ప్రవహించసాగింది. ఆ ప్రదేశమంతా స్వేచ్ఛా విహారం చేసి తిరిగి అతని మనసులోకే ప్రవహించి ఇంకిపోతోంది.

స్వరజతులు వింతగా మేళవిస్తున్నాయి. చెవులకు సంగీతప్రియులు ప్రోత్సాహకరంగా చేస్తున్న చప్పట్లు తప్ప ఇంకేం వినిపించడంలేదు. కనులకు శృంగారాన్ని ఒలకబోస్తూ తను కూర్చున్న తిల్లాన మరింతగా రసమయం చేస్తూ అభినయిస్తున్న నర్తకి తప్ప ఏమీ కనిపించడంలేదు.

"అమ్మో..." అన్నకేకతో చుట్టూ సాగమంచులా ఆవరించుకున్న వాతావరణం పటాపంచలయ్యింది.

ఏం జరిగిందో ఒక్కక్షణం అర్థంకాలేదు శివశంకరానికి.

అదిగో !

మంటపం దగ్గర మూగివున్నారు.

ఏవిటేవిటేవిటయ్యింది ?

తపోభంగమేకాదు, రసభంగం కూడా పొందిన శివశంకరానికి కోపం రాలేదు, గగ్గోలుతో ఆత్రుత వచ్చింది.

నెమ్మదిగా లేచి అటువైపు నడిచాడు.

అంతదూరంలోనే కనిపించిన దృశ్యం నిశ్చేష్టుడిని చేసింది.

వెంకడు !

పడివున్నాడు. పందిరిమీది నుండి పడ్డట్టున్నాడు.

వెంకడి పక్కనే వాడి పెళ్ళాం కామోసు.

"నన్నూ, పిల్లల్నీ ఎలా బతకమన్నావురో దేవుడో" అంటూ పడిఏడుస్తోంది. ఆ ప్రాంగణంలోనే ఓ మూలగావున్న వెంకడి గుడిసెనుండి బిలబిలలాడుతూ కేరు కేరుమంటూ వాడి పిల్లలు కామోసు పరిగెత్తుకు వస్తున్నారు.

అప్పటికప్పుడో నిర్ణయానికి వచ్చినట్టుగా కూలీలంతా "పట్టండెయ్..." అని ఒకళ్ళనొకరు అనుకుంటూ వాడ్ని మోసుకుపోతున్నారు. ఆత్రుత అడగమంటోంది. అంతస్తు అడ్డు పడుతోంది. అయినా అంతా అర్థమయిపోతోంది...వాళ్ళు తీసుకుపోతున్నది ధర్మాసుపత్రికని.

అక్కడినుండి తిరిగివస్తాడా వెంకడు ?

మనసు వికలమైపోయింది శివశంకరానికి. తిల్లానా కకావికలైపోయింది. పల్లవి, అనుపల్లవి అత్యంత రమణీయంగా, శృంగార రసమయంగా వచ్చింది. ఇక చరణం మిగిలిపోయింది.

అంతవరకూ చేసిన అభినయానికి చరణం ఒక రూపు నిస్తోంది; కాని దాని కూర్పు ఆగిపోయింది.

వాళ్ళంతా వెళ్ళిపోగానే తిరిగి చప్టామీద కూర్చున్నాడు శివశంకరం.

అంతవరకూ కలకలంతో కూడిన నిశ్శబ్దం కళకళలాడింది. కనకరస మాధురి ప్రపంచింది. ఇప్పుడు ? క్రీమ రాళ్ళ కీచుశబ్దాంతో నిశ్శబ్దం బీభత్సంగా ఉంది.

తల విదిలించేడు. కాని తలకు పట్టిన బాధ చెదరలేదు. కళ్ళుమూసుకున్నాడు కంటిపాపమీద తెరమీది బొమ్మలా వెంకడి నిర్జీవుడై పడివున్న అవస్థ కనిపిస్తోంది. శక్తినంతా కూడదీసుకుని చరణం కూర్చబోయేడు. కాని ఎంత ప్రయత్నించినా విఫలుడే అయ్యేడు శివశంకరం.

మర్నాడు...

వెంకడు చచ్చిపోయినందుకు కార్యక్రమం ఆగిపోలేదు.

దేశమంతా మారుమోగిన శివశంకరం పేరు విని...ఆ మహదవకాశం వినియోగించుకోవడానికి ఊరు ఊరంతా పొర్లి ప్రవహించింది, వెంకడు అలంకరించిన పందిట్లోకి.

సభా ప్రారంభంలో అఖండసత్కారంతోపాటు అనుకోని బహుమానంకూడా ముట్టింది శివశంకరానికి.

కచేరీలో...

తంబురనాదం, వాయులీనం, మృదంగ దరువూ అతనిని ప్రోత్సహిస్తూంటే "తోం,,,తోం...దిరిదిరితోం...నాదిరి దిరిదిరి..." అంటూ చరణంవరకూ హోరుమంటూ ప్రవహించింది తిల్లానా.

కాని...

అక్కడ..., చరణం దగ్గర...

కంటి ముందరి ఆకారం...మనసులో పేరుకున్న జాలి...గొంతులో ఉండ చుట్టిన బాధ...శివశంకరాన్ని పలకనివ్వలేదు.

జనం...

గడబిడ చేస్తున్నారు...

కేకలేస్తున్నారు...

చెప్పులు విసరబోతున్నారు...

తిట్లు కుమ్మరిస్తున్నారు...

శివశంకరానికి కర్తవ్యం వెలుగుదారి చూపినట్లుగా గంభీరంగా లేచేడు. నెమ్మదిగా వేదికదిగి...జనం మధ్యగా...ఆ మూలనున్న వెంకడి గుడిసెవైపు... భుజాలమీద వున్న శాలువాతో పాటు చేతిలోని బహుమానంతో సహా నడవసాగేడు.

కుమారి స్వాతి సోమనాథ్

పదవ ఏట నుంచీ ఎంతో పట్టుదలతో భరతనాట్యం, కూచిపూడి నేర్చుకుని, ఇరవై సంవత్సరాల లోపు వయసులోనే ఒక నృత్య పాఠశాలను నెలకొల్పే స్థితికి ఎదిగిన కళాకారిణి కుమారి స్వాతి సోమనాథ్ తనకు తెలిసిన విద్యను శిష్యులకు నేర్పాలన్నది తమ అభిలాష అంటారిమె గురువులను ఈమె నిశితంగా విమర్శిస్తారు. తన గురువుల పేర్లు చెప్పడం కూడా ఈమెకు ఇష్టం ఉండదు. శిష్యుల వ్యక్తిత్వాన్ని గుర్తించలేని గురువుల పేర్లు చెప్పుకోవడమే సిగ్గుచేటు అంటారు స్వీయానుభవమే ఇందుకు కారణం కాబోలు! పేరు పొందిన గురువులు సయితం డబ్బు కోసం భరతనాట్యాన్ని "ఉచ్చులో" బిగించారనీ, అందువల్లనే ఈ రంగంలో మధ్యలో మానివేసే వారి సంఖ్య అధికంగా ఉంటుందనీ అంటారు స్వాతీసోమనాథ్.

ఈమె శ్రీకాకుళం జిల్లా దూసి అగ్రహారంలోని సోమనాథరావు గారి కుమార్తె. ఉద్యోగరీత్యా ఆయన హైదరాబాదులో స్థిరపడవలసి వచ్చింది ఈమె సికింద్రాబాద్ నుంచి సుమారు నాలుగు ఏళ్ల పాటు సైకిల్‌పై హిమయత్‌నగర్ వరకు వచ్చి భరతనాట్యం నేర్చుకున్నారు ఈ కళను పిల్లలకు పంచాలి, సంతోషంతో పంచాలి, వారిని తనను మించిన శిష్యులుగా తయారు చేయాలి అంటారు. తన పాఠశాలలో యీ విషయాలని ఆచరణాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు.

నాట్యం పట్ల శ్రద్ధతో చదువును నిర్లక్ష్యం చేయలేదు గత ఏప్రిల్‌లో జరిగిన పరీక్షలలో పట్టా పొంది, ఇప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం ఎ లిటరేచర్‌లో చేరారు

– శ్రీ సి. వి. రాజగోపాలరావు

****

కాటేపల్లిలో పూర్ణిమ

నాకు వంశపారంపర్యంగా ఒక్క
చపల చిత్తయే సంక్రమించింది
నేను యే దిశలో ప్రయాణించాలో తెలిని బాటసారిని
ఒక్కోసారి నా పాదాల్ని అడవితీగలు
సుకుమారంగా బంధిస్తాయి
ఒక్కోసారి బందిపోటుకొండలు దారిపన్ను విధిస్తాయి
ఎప్పుడో అమావాస్యకో పూర్ణిమకో వినిపిస్తుంది నాకు
సముద్రపు హూరు....
నేను పరిగెడుతాను
అలల మీద చంద్రుడెలా నిద్రలేస్తాడో
ఈ సాయంత్రం చూచి తీరాలని
కోడెదూడలా గంతులేస్తూ తీరాన్ని చేరుకుంటాను.
ఇసకలో తళతళలాడే గవ్వలూయుద్రయంద్రకాయలూ
నన్ను సైగచేసి పిలుస్తాయి
నేను మోసే భారంకంటే ఎక్కువ
శంఖాల్ని ఏరుకుంటూ ఉండిపోతా....
హఠాత్తుగా నాకు జ్ఞాపకమొస్తుంది
నా యుద్ధం ఎప్పుడూ సముద్రంతోనే అని
నీళ్ళతో ద్వంద్వ యుద్ధం చేసేందుకు
గట్టుని వదిలేస్తాను
కెరటాలు నన్ను సవాలు చేస్తాయి
వాటి రాచక్రీడను కసిగా ఆపేందుకు
మోచేతుల్తో పొడుస్తా ఛాతీతో ఢీకొంటూ
భయపడ్డ అలలు నా పాదాల సందుల్లోంచి
పారిపోతాయి
జయోత్సాహంతో కేకలేసాను నా విజయాన్ని గురించి
దూరంగా వాలిన
డేగల్తో కొంగల్తో అరిచి చెప్తాను
అవిచేతులు చాపి నీలిమలో కెగురుతాయి
ఆనందపు వలయాల్ని చుడుతూ
అలలు ఆగిపోతాయి సముద్రమే పారిపోయిందనిపిస్తుంది
నేను నిటూర్చి గట్టెక్కుతాను
జాలర్లు నన్ను హేళనగా చూస్తారు
పోటు తగ్గిపోయిందంటారు
దూరాన అలల సైన్యాలు తీరంతోయుద్ధం చేకస్తూ నిపిస్తాయి
ఆ ఓటమిలో నాకు ఆమె గుర్తుకొస్తుంది
అంతర్ముఖుణ్ణయిపోతా
నేను తిరిగి వచ్చేవరికి చంద్రుడు
నక్షత్రాల్ని దాటిపోతూ కనిపిస్తాడు
నేను పశ్చాత్తాపపడి
సూర్యోదయాన్నయినా చూద్దామని
ఇసకలో మేను వాలుస్తాను
'నీకు తెల్లారి పొద్దెక్కాక కానీ మెలుకువివ్వను'
అంటుందామె.

వనమాలి

కలగూరగంప

శ్యమంతకోపాఖ్యానము - భిన్నకథారీతులు

శ్యమంతకమణి కథ ఆబాలగోపాలం మెరిగినదే. ఏటేటా వినాయక చవితి నాడీ కథను చెప్పుకోటం పరిపాటి. ప్రాచీన పురాణములలో నొకటగు విష్ణు పురాణమున అనంతర కాలమున వెలసిన భాగవత, హరివంశములలో ఈ కథ విపులముగా చెప్పబడినది. అయితే ఈ మూడింటిలో చెప్పబడిన కథలలో భిన్నరీతులు కన్పించుచున్నాయి. ఆయా భేదాంను పరిశీలించుట ఈ వ్యాసోద్దేశము.

సంస్కృత విష్ణుపురాణమునకు యథామాతృకానువాద మనదగిన కలిదిండి భావనారాయణ కవి రచించిన విష్ణుపురాణము, పోతన భాగవతము, ఎఱ్ఱాప్రెగడ హరివంశములలో ఈ కథ చెప్పబడిన తీరును గమనింతము.

నిఘ్నుని కుమారులైన ప్రసేన సత్రాజిత్తులలో సత్రాజిత్తునకు సూర్య భగవానుడు స్నేహితుడు. సత్రాజిత్తు సముద్రతీరమున సూర్యుని ఆరాధించినాడు. ఈ ఆరాధన "పదునొకండు దినంబులు" జరిగినట్లు ఒక్క హరివంశముననే చెప్పబడినది. విష్ణుపురాణ, భాగవతములలో ఈ ఆరాధనాకాలము తెల్పబడలేదు. సత్రాజిత్తునకు సూర్యుడు ప్రత్యక్షమైనాడు. సూర్యుని కంఠమునగల శ్యమంతకమణిని సత్రాజిత్తు కోరగా సూర్యుడు ఇచ్చినాడు. దినమునకు ఎనిమిది బారువుల బంగారమును ప్రసాదించే ఆమణిని సత్రాజిత్తు తన అంతఃపురమున దాచినాడు. సత్రాజిత్తు శ్యమంతకమణిని సంపాదించినట్లు శ్రీ కృష్ణునకు తెలిసినది. ఆ మణిని ఉగ్రసేన మహారాజుకు ఇప్పించవలెనని కృష్ణుని కోరిక. కాని అది తగాయిదాలకు మూలము కాగలదని కృష్ణుడు అడుగడని విష్ణుపురాణమున గలదు. హరివంశమున కృష్ణుడు సత్రాజిత్తు నడిగినట్లు అతడీయనన్నట్లు చెప్పబడినది. భాగవతమున ఈ నిరాకరణకు కారణము 'ధనేచ్ఛ'గా తెల్పబడినది. శ్రీ కృష్ణుడు ఆ మణిని అడుగుతాడను భయముతో సత్రాజిత్తు దానిని తన సోదరుడైన ప్రసేనున కిచ్చినాడు. ప్రసేనుడు ఆ మణిని మెడలో వేసికొని వేటకు వెళ్ళగా అతనిని ఒక సింహము చంపి ఆ మణిని నోటకరచుకొని పోవుచుండగా దానిని చంపి జాంబవంతుడు మణిని గ్రహించాడు. దానిని తన గుహలో ఉన్న సుకుమారుడను పేరుగల కుమారున కిచ్చినట్లు విష్ణు పురాణ హరివంశములలో చెప్పబడగా, భాగవతమున "తన కూరిమి సుతకును ఘనకేళీ కందుకముగా జేసి"నట్లు చెప్పబడినది.

ప్రసేనుడు వేటనుండి తిరిగి రాకుండుటచే అతని బంధువులు శ్రీకృష్ణుడే ప్రసేనుని చంపి మణినపహరించి యుండవచ్చునని గుసగుసలు పోవుటచే శ్రీకృష్ణుడానింద పోగొట్టుకొనుటకు సైన్యసమేతుడై (అనుచరులని భాగవత హరివంశములు) అడవికి వెళ్ళి చంపబడిన ప్రసేనుని, సింహాన్ని చూచి జాంబవంతుని అడుగుజాడలు గమనించి అతని బిలమును చేరి సేనను అక్కడ నిల్పి బిలము ప్రవేశించినాడు. అక్కడ జాంబవంతుని కుమారునికి జోలపాటపాడుతు అతని దాది మణి లభించిన వృత్తాంతమును వినిపించగా కృష్ణుడువిని లోనికి వెళ్ళి మణిని చూచి దానిని తీసికొనబోగా దాది భయపడి అరచినది. అదివిని జాంబవంతుడు వచ్చి శ్రీకృష్ణునితో తలపడినాడు. ఈ పోరు 21 దినములు సాగినట్లు విష్ణుపురాణ హరివంశములలోను, "ఇరువది ఎనిమిది దినములు" సాగినట్లు భాగవతములోను తెల్పబడినది.

శ్రీకృష్ణుని సైన్యము బిలద్వారమున వేచియున్న దినములు ఏడెనిమిది అని విష్ణుపురాణమున ఎనిమిది అని హరివంశమున పండ్రెండు అని భాగవతమున చెప్పబడినవి. శత్రువధకు శ్రీ కృష్ణునకు ఇంతకాలము పట్టదు గనుక అతడు మరణించి యుండునని భావించి ఉత్తరక్రియలు జరిపినట్లు విష్ణుపురాణ హరివంశములలో చెప్పబడగా, భాగవతమున బంధుమిత్రులు కృష్ణుడు రాకుండుటకు శోకించి దుర్గాదేవిని ప్రార్థించగా ఆమె "బాలామణితో, హేలాగతివచ్చు నంబుజేక్షణుడనుచు" అభయమిచ్చినట్లు చెప్పబడినది.

జాంబవంతుడు శ్రీకృష్ణుని శ్రీమన్నారాయణునిగా గుర్తించి శరణువేడి తన కుమార్తె జాంబవతిని, శ్యమంతకమణిని ఇచ్చి ద్వారకకు పంపెను. శ్రీ కృష్ణుడు సత్రాజిత్తును పిలిపించి బంధువుల సమక్షమున మణివృత్తాంతమును వివరించి దానిని అతనికి ఇచ్చి తనపై వచ్చిన అపనిందను తొలగించుకొనెను. సత్రాజిత్తు తానిదివరలో భావించినదానికి చింతించి తనకుమార్తె సత్యభామను శ్రీకృష్ణునకిచ్చి పెండ్లి చేసినట్లు విష్ణుపురాణ హరివంశములలో చెప్పబడగా, భాగవతమున సత్రాజిత్తు సత్యభామను శ్యమంతకమణిని శ్రీకృష్ణునకీయగా, అతడు సత్యభామను పరిగ్రహించి మణిని త్రిప్పి యిచ్చినట్లు చెప్పబడినది.

సత్రాజిత్తు మొదట సత్యభామను అక్రూర, శతధన్వ కృతవర్మాది యాదవ వీరులలో నొకరికి ఇచ్చెదనని చెప్పి యిప్పుడు శ్రీకృష్ణున కిచ్చుటచేత వారందరు ఒకచోటచేరి సత్రాజిత్తును చంపుటకు (రత్నమునుకూడ తీసికొనుటకనిహరివంశము) శతధన్వుని నియోగించిరి.

ఆ సమయముననే పాండవులు వారణావతమున లక్క యింట మరణించిరని శ్రీకృష్ణుడు ఆ నగరమునకు వెళ్ళినట్లు విష్ణుపురాణ హరివంశములలో చెప్పబడినది. భాగవతమున 'పాండవులు లాక్షాగారంబున దగ్ధులైరని విని.... కృష్ణుండు బలభద్రసహితుండై కరినగరంబునకుం జని" నట్లు తెల్పబడినది. ఇదే అదనుగా శతధన్వుడు ఒక అర్ధరాత్రి నిద్రిస్తున్న సత్రాజిత్తును చంపి మణిని అపహరించినాడు. వెంటనే సత్యభామ శ్రీకృష్ణునిచేరి విషయమును తెల్పగా కృష్ణుడు ద్వారకకు వచ్చి బలరామునితో కలిసి శతధన్వుని చంపబోయెను.

బలరామకృష్ణు లిరువురు తనపైకి వచ్చుటను తెలిసికొని శతధన్వుడు కృతవర్మ, అక్రూరులను సహాయపడుడని ప్రార్థించగా వారు నిరాకరించిరి. అక్రూరుడు ఎక్కడికైనను పారిపొమ్మని సలహా చెప్పగా శతధన్వుడు 'మణినైనను దాచుము' అని అక్రూరునకు మణినిచ్చి రోజునకు నూరుయోజనములు పోగలిగే గుర్రమునెక్కి పారిపోయెను. బలరామకృష్ణులు ఆ విషయము తెలిసికొని రథారూఢులై శతధన్వుని వెంబడించిరి. శతధన్వుని గుఱ్ఱము మధిలానగర సమీపమునకు పోయి ఇకపోలేక మరణించగా శతధన్వుడు పాదచారియై పరువెత్తెను. తన రథమునకు కట్టిన గుర్రములు కూడా అలసిపోవుటచే శ్రీకృష్ణుడు అరథమును బలరామునకు అప్పగించి పాదచారియై శతధన్వుని వెంబడించి చక్రమున అతని తల ద్రుంచెను. శతధన్వుని శరీరము నంతయు వెదకినను మణి కృష్ణునకు కన్పించలేదు. ఆ విషయమునే తిరిగివచ్చి బలరామునితో చెప్పగా అతడు కోపించి కృష్ణుని నిందించి 'ధనాశచే మణినపహరించితివి. నీమాయ లెవరికి తెలియవు. నాకు నీతో పనిలేదు. నేను మిథిలకు పోవుచున్నాను" అని చెప్పినట్లు విష్ణుపురాణ హరివంశములలో నుండగా భాగవతమున బలరాముడు శ్రీకృష్ణునితో—

అమణి శతధన్వుం డపహరించుట నిక్క
మెవ్వరిచే దాంప నిచ్చినాండొ
వేగమె నీవేగి వెదకుము పురిలోన
వైదేహు దర్శింప వాంఛగలదు
పోయివచ్చెదనీవు పొమ్మని" చెప్పినట్లు కలదు.

బలరాముడు జనకుని వద్దకు వెళ్ళగా కృష్ణుడు ద్వారకకు తిరిగివచ్చెను ఆ సమయములో దుర్యోధనుడు మిధిలకువెళ్ళి బలరాముని దర్శించి అతనివద్ద

మూడు సంవత్సరములు ఉండి గదావిద్య నేర్పినట్లు విష్ణు పురాణమున కలదు. హరివంశమున ఇది "కొంతకాలము" అని చెప్పబడినది. తరువాత ఉగ్రసేన మహా రాజు మొదలగు యాదవులు శ్యమంతకమణి శ్రీకృష్ణుని వద్ద లేదని గ్రహించి మిధిలకు వెళ్ళి బలరామునికి నచ్చచెప్పి అతనిని ద్వారకకు తీసుకొని వచ్చిరి. అయితే ఈ విషయము భాగవతమున లేదు.

అక్రూరుడు శ్యమంతకమణి తనకు ప్రతిదినము ప్రసాదించే బంగారమును దానధర్మ యజ్ఞయాగాదులు చేయుట కుపయోగించెడి వాడు. ఇట్లు అతడు 22సంవత్సరములు గడిపినట్లు ఒక్కహరివంశముననే చెప్పబడినది. అప్పుడు అక్రూరుని బంధువులైన భోజులు శత్రుఘ్నుడను వానిని చంపి అక్రూరునితో సహా ద్వారకను వదలి వెళ్ళిరని విష్ణుపురాణ హరివంశములలో చెప్పబడినది. భాగవతమున 'అక్రూర కృతవర్మలు శతధన్వుని మరణంబును విని వెరచి ద్వారకా నగరంబు వెడలి బహుయోజన దూరభూమికిం జనిరి' అని చెప్పబడినది.

అక్రూరుడు ద్వారకను విడిచి వెళ్ళిన తరువాత ద్వారకలో దుర్భిక్షాది దోషములు కన్పించినవి. శ్రీకృష్ణుడు పెద్దల నందరిని పిలిపించి దీనికి కారణమేమని అడుగగా అంధకుడనే వృద్ధుడు ఇట్లు వివరించినాడు.

అక్రూరుని తండ్రి శ్వఫల్కుడు ఉన్నదేశమున దుర్భిక్షాదులుండవు. పూర్వము కాశీరాజ్యమున వానలులేక కరువు వచ్చినపుడు ఆరోజు శ్వఫల్కుని అక్కడకు తీసుకొని వెళ్ళగా వర్షములు కురిసినవి.

ఆ కాశీరాజు భార్యగర్భవతియై సరియైన సమయమున ప్రసవించక 12 సంవత్సరములు గర్భిణితో ఉండగా రాజు ఆగర్భస్థ శిశువు కూతురని తెలిసికొని ఆమెతో 'తల్లీ! నీముఖము చూడవలెననే కోరికతో యున్నాను. తొందరగా పుట్టుము అనగా ఆమె 'ఈరోజు మొదలుగా రోజుకొక్క ఆవును బ్రాహ్మణులకు దానమిచ్చిన మూడేళ్ళకు పుట్టుదును' అనినది. ఆ రాజు ఆవిధముగనే చేయగా ఆమె పుట్టినది. ఆమె పేరు 'గాందిని' అని విష్ణుపురాణమున, గోనందిని' అని హరివంశమున చెప్పబడినది. ఈమె జన్మవృత్తాంతము భాగవతమున లేదు. ఈమెను రాజు శ్వఫల్కునకిచ్చి పెండ్లి చేసెను. వారి కుమారుడే అక్రూరుడు. ఇతనికి తండ్రి ప్రభావము కలదు. ఇతడు మనదేశమును వదలి వెళ్ళుటచే ఈ ఉపద్రవములు వచ్చినవి. ఇతనిని తిరిగి రప్పించుము. అని చెప్పగా శ్రీకృష్ణుడు అక్రూరుని ద్వారకకు పిలిపించెను.

తరువాత శ్రీకృష్ణుడు శ్యమంతకమణి మహిమవలనదే అక్రూరుడు యాగాదులు నిర్వహించ గలుగుతున్నాడని గ్రహించి ఒకరోజు బంధువుల సమక్షమున అక్రూరుని రావించి 'శతధన్వుడు శ్యమంతకమణిని నీకిచ్చిన విషయము నాకు తెలుసు. అది నీదగ్గరే ఉండ తగినది. మా బలరాముడు ఈమణి విషయంగా నన్ను నమ్ముటలేదు. ఒక సారి నీదగ్గరగల మణిని చూపి మా అన్నకు నమ్మకము కలిగించు'మని పలికెను. అక్రూరుడు తనవద్దగల మణిని ఆ సభలోని వారందరికి చూపెను. దానిని చూచి బలరాముడు ఈమణి కృష్ణునకు నాకు కావలసినది అనుకొనెను. ఈ మణి నాతండ్రిది కనుక నాకే కావలెనని సత్యభామ అను కొనెను. దీనిని గ్రహించి శ్రీ కృష్ణుడు అక్రూరునితో 'ఈమణిని దాల్చువారు శుచులును, బ్రహ్మచర్య వ్రతులును అయి యుండవలయును కనుక ఇదిమాకు ధరింపదగదు, నీవే దీనిని ధరింప నర్హుడవు'అని చెప్పి అక్రూరునకే ఆ మణిని ఇచ్చును. ఈవృత్తాంతము విష్ణుపురాణ హరివంశములలో ఒకేరీతిగా నున్నది, భాగవతమున శ్రీకృష్ణుడు అక్రూరునితో

'మణి గ్రహింపుమీవ మాయన్న నను నమ్మ,
దెలమి బంధుజనులకెల్ల జూపవయ్య'

అని చెప్పినట్లు చెప్పబడినది. ఇందు 'మాయన్న ననునమ్మ' దను దానికి కారణము చెప్పబడలేదు. అలాగే మణిని అక్రూరుని వద్దనే ఉంచుటకుకూడా కారణము భాగవతమున అసలు చెప్పబడలేదు.

ఈ శ్యమంతకమణి వృత్తాంతము స్కాందపురాణములోకూడా ఉన్నట్లు చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు కథలు-గాథలు రెండవ సంపుటములో ఇలా వ్రాశారు.

"...యింకా యీవిషయం భాగవతంలో కన్నా స్కాందంలో విస్తరించి వుంది. సత్రాజిత్తు పశ్చాత్తపించి కూతురు సత్యభామను మాణిక్యంతోసహా శ్రీహరికి కానుకగా సమర్పించాడు, కాని శ్రీకృష్ణుడు శ్యమంతకాన్ని మళ్లాయిచ్చేశాడు. యిటీవల "శతధన్వుడు" కాబోలును ఆ యీ మణికోసం సత్రాజిత్తును వధించడం జరిగినది. ఆ సమయానికి శ్రీ కృష్ణభగవానుడు ద్వారకలోలేడు. సత్యభామ తన తండ్రికి జరిగిన ఘోరాన్ని స్వయంగా హస్తినాపురంలో నున్న కృష్ణునకు తెల్పినట్టున్నూ, పిమ్మట కృష్ణ బలరాములు కల్పించుకున్నట్టున్నూ శతధన్వుడు పాఱిపోయినట్టున్నూ వెంబడించి పట్టుకోబోయేటప్పటికి యీలోగానే గమనాయాసం చేత "శతధన్వుడు" మరణించినట్టున్నూ స్కాందంలో ఉంది.

"శ్యమంతకాన్ని" అక్రూరుని వద్దదాచి శతధన్వుడు పాఱిపోవటంచేత శతధన్వునిపద్ద మాణిక్యం దొరకలేదు. బలరాముడు తనకు తెలియకుండా దాన్ని తమ్ముడు అపహరించినట్టనుమానపడి కృష్ణున్ని ద్వేషించడం వగైరా స్కాందంలో ఉంది."

మొత్తముమీద శ్యమంతకమణి కథ విష్ణు పురాణ హరివంశములలో విపులముగ, భాగవతమున కొంత సంక్షిప్తముగ చెప్పబడినది. ఆయా కథారీతులలో గల భేదములు ఈ వ్యాసమున వివరింపబడినవి.

సూర్యదేవర రవికుమార్

మహా సంగీతనిధి నాదజ్యోతి ముత్తుస్వామి దీక్షితుల వైశిష్ట్యం

త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు మన వాగ్గేయకారత్రయం. త్యాగయ్య నాద బ్రహ్మఅయితే, శ్యామశాస్త్రి నాదస్రోతస్సు, ముత్తుస్వామి దీక్షితులు నాదజ్యోతి. 1773–1835 మధ్య సంగీత లోకాన్ని పరవశింపజేసిన ముత్తుస్వామి ప్రజ్ఞా విశేషాలు అపారం.

అపూర్వ రాగాలు, నవ్యరాగాలతో ముత్తుస్వామి దీక్షితులు ఎన్నో కృతులు రచించారు. విభిన్న జాతులు గీతులతో సప్తతాళాలతో కృతులను సమకూర్చారాయన. మన కర్నాటక సంగీతంలోని లయాన్విత దృష్టి ముత్తుస్వామి దీక్షితులుకు ఎక్కువ ఆకర్షించింది.

ముత్తుస్వామి దీక్షితులు ముందు తరాల వారికి అందించి పోయిన సంగీత సంపత్తి బహుళం. ఆయన రచించిన కృతులలో సాహిత్య సౌరభం మిక్కుటం. ఏకతాళం నుంచి ధృవతాళం వరకు ఆయిన తాళాలను వాడారు. ఆయనే లేకుండే కర్నాటక సంగీతానికి నేటి విశిష్ట కీర్తన సంపద లభించేది కాదు.

నవగ్రహ కీర్తనలు

ముత్తుస్వామి దీక్షితులు నవగ్రహాలను కీర్తిస్తూ కృతులు రచించారు. వేదాంగాలలో జ్యోతిష విద్య కూడా ఒకటి. వేదాధ్యయనంలో ప్రధానం. జ్యోతిర్వేదంలో కూడా ముత్తుస్వామి దీక్షితులు నిధి వంటివారు. మానవ జీవనగతుల మీద గ్రహ ప్రభావాలను బాగా గుర్తెరిగిన వ్యక్తి. గ్రహ జ్ఞానంతో తన కృతుల్ని రచించిన విజ్ఞాని ముత్తుస్వామి దీక్షితులు.

నవగ్రహాలను గురించి ఆయన వ్రాసిన నవకృతుల్లో ఆయా గ్రహాల ఖగోళరాశిక విశేషాలన్నిటిని నిక్షిప్తం చేశారు. అందువల్ల, ఈ నవగ్రహ కీర్తనలు పాడడం ఆయా గ్రహాల కరుణను పొందడమన్నమాటే. నవగ్రహ కీర్తనగానం ఒక నవగ్రహహోమం వంటిది. భగవదర్చనల్లో నాదోపాసన ఒక విధానం. దీని ప్రత్యేకతను కంచికామకోటి పీఠాధిపతులు జగద్గురు

శంకరాచార్యులు కూడా తమ అంతేవాసులకు బోధించటం గమనార్హం.

విశ్వ సృష్టి జరిగనిప్పటి నుంచి శక్తికి తేజస్సుకు మూల భూతంగా సూర్యోపాసన జరుగుతూవస్తున్నది. హిందూమతం ఈ సూర్యోపాసనకు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. ముత్తుస్వామి దీక్షితులు సూర్యభగవానుని కీర్తించే ఒక అపూర్వ కృతిని రచించారు. "సూర్యమూర్తే "నమోస్తుతే" అనే కృతిని సౌరాష్ట్ర రాగం, ధృవ తాళాలతో సంబద్ధం చేశారు. జ్యోతిష విజ్ఞానం ప్రకారం సూర్యుడు సింహరాశికి అధిపతి, ఆరోగ్యప్రదాత, సప్తాశ్వరధాన్ని అధిరూఢం చేసి సూర్య భగవానుడు విశ్వపాలనం చెయ్యడాన్ని ఆ కృతిలో ముత్తుస్వామి దీక్షితులు వర్ణించారు.

చంద్ర గ్రహాన్ని గురించి ఆయన గానం చేసిన కృతి "చంద్రం భజమనసా" కవితా పరాకాష్ఠకు నిదర్శనం. అసావేరి రాగంలో మధ్య తాళానికి ఈ కృతిని సంబద్ధంచేసారు. మహాశివుడు చంద్రచూడుడు. చంద్రుడు కుముదప్రియుడు. దానితో పాటు పద్మవిరోధి చంద్రుడు కనిపించే రాత్రిపూట పద్మం ముకుళించుకుపోతుంది. తన అకృత్యాలు కొన్నింటి వలన చంద్రుడు గురుశాపగ్రస్తుడౌతాడు. ఈ విశేషాలన్నిటిని తమ కృతిలో ఇమిడ్చారు దీక్షితులు.

"అంగారక మాశ్రయామ్యహం" అంటూ సురటి రాగంలో రూపక తాళంలో ముత్తుస్వామి దీక్షితులు రచించిన కృతి అంగారక గ్రహ సంకీర్తనం. జ్యోతిశ్శాస్త్రంలో అంగారకుడు భూమి కుమారుడు. కృతిలో భూమి కుమారుడనే కీర్తించారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా గ్రహాలన్నింటిలో భూమికి సమానమైన లక్షణాలు కలిగిన గ్రహంగా అంగారకుని పేర్కొంటారు.

నాటకురంజి రాగంలో జంపె తాళంలో ఆయన రచించిన "బుధ్ధమాశ్రయామి" కీర్తన బుధ గ్రహ సంకీర్తనలో ఆయన చూపిన సంగీత విశేషాలకు నిదర్శనం.

మానవులకు ఎంతో సంపత్తిని ప్రయోజనాలను సమకూర్చే గ్రహం బృహస్పతి. ఆ విశిష్ట గ్రహాన్ని గురించి దీక్షితులు అఠాణా రాగంలో త్రిపుట తాళంలో "బృహస్పతే" అనే కృతి రచించి కీర్తించారు.

ఫరస్ రాగంలో ఆట తాళంలో ముత్తుస్వాతి దీక్షితులు "శ్రీ శుక్ర భగవంతం" అంటూ ఒక మహోజ్వల కీర్తన రచించారు. ఇందులో "హే శుక్రభగవాన్" అంటూ సంబోధనతో అను పల్లవి ప్రారంభం కావడం సంగీతపరమైన ఒక విశేషం. శుక్రుడు సామాన్యంగా రాజయోగకారకుడని ప్రతీతి. అతడు రాజ్య ప్రదాత. మామూలు జీవితానికి వైభవోపేతమైన అవకాశాలు కలసివచ్చి తిలఖించిందంటే శుక్రమహర్దశలో అన్నట్టు చెప్పుతారు.

"దివాకరతనూజం" అనే కృతిలో శని గ్రహాలు కూడా ముత్తుస్వామి దీక్షితులు అభివర్ణించారు. యదుకులకాంభోజి రాగంలో ఏకతాళంలో ఈ కీర్తన నాయన సంబద్ధం చేశారు. శని గ్రహలక్షణాలను అతిక్రూరఫలదా అతిశయ శుభఫలదా అంటూ ఆ కృతిలో నిక్షిప్తంచేశారు. ఈ కృతికి ఎంతో మతపరమైన విశిష్టత ఉంది. శని గ్రహారాధనలో భాగంగా చాలామంది ఈ కృతిని గానం చెయ్యడం సాధారణం.

రాహు కేతువుల్ని గురించి కూడా ముత్తుస్వామి దీక్షితులు కృతులు కావించారు. అపూర్వరాగమైన రామమనోహరిలో రూపకతాళంలో స్మరామ్యహం సదా రాహుం" రాహుగ్రహం గురించి దివ్యకీర్తన ఉంది. చామరం రాగంలో రూపక తాళంలో "మహాశూరం కేతుమహం" అంటూ ఆయన వ్రాసిన కీర్తన కేతుగ్రహం పట్ల ఆయన ఆరాధన దృక్పధాన్ని తెలియజేస్తుంది. ఇప్పుడు ఈ కృతిని షణ్ముఖప్రియ రాగంలో కూడా పాడుతున్నారు.

నవగ్రహ కీర్తనల ద్వారా నాగజ్యోతిర్మూర్తి అయిన వాగ్గేయ కారుడు ముత్తుస్వామి దీక్షితులు. ఏడు రకాల తాళాలను వాడటం సంగీత సరస్వతికే ఒక ఉపహారం. సంగీత వేత్తలకిది గర్వించదగిన విషయము.

సంగీత విద్యలో నిష్ణాతుడు

ముత్తుస్వామి దీక్షితులు మహావిద్వాంసులు, సంగీత విద్యలో ఆయన అందె వేసిన చేయి; సంప్రదాయం బాగా పెరిగిన వాగ్గేయకారుడు. 1550–1620 మధ్య జీవించిన గోవింద దీక్షితుల వారి శిష్య పరంపరలోని వాడు కావడం వల్లను 72 మేళకర్త రాగాలను సంఘటించిన వేంకటమఖి శిష్యపరంపరకు కూడ చెందినవాడు కావడం వల్లను ముత్తుస్వామి దీక్షితులు కొక ప్రత్యేకత, సంగీత పారమార్థికత లభించింది. గోవింద దీక్షితుల వారు "సంగీత సుధానది" అనే గ్రంథం రచించిన విద్వాంసులు, కాని ఆ గ్రంథం ఇప్పుడు లభ్యం కావడం లేదు.

ముత్తుస్వామి దీక్షితుల వారి కీర్తనలన్నీ చక్కని సరళమైన సంస్కృత భాషలో ఉన్నాయి. అవి సాహిత్య సంపదకు కూడా కారణాలు. రాగభావాన్నే కాకుండా సాహిత్యభావాన్ని కూడ ప్రస్ఫుటం చేయడానికి అనువైన ముత్తుస్వామి దీక్షితులు కృతుల సంపద అసామాన్యం. అందువల్ల సద్గురుని శుశ్రూష లేకుండా ఈ కృతులను నేర్వడం అసాధ్యం. ఈ కృతుల్లో ఉన్న లయజ్ఞానం కూడా అనుపమానమైనది. ఈ కృతిన్ని గానం చెయ్యడం సంగీత విధులకే తగినది. కాబట్టి అగ్ర సంగీత వేత్తలు, కచేరిల్లో ప్రసిద్ధులు కూడా ఒకటి రెండు కన్న ఎక్కువగా దీక్షితుల కృతులను తమ గానంలో చేర్చుకోవడం జరుగడం లేదు.

ఈ మహామహుడు, ఈ సంగీత తపస్వి, ఈ వాగ్గేయకారుడు, ఈ నాదజ్యోతి 1835 లో పిట్టాయపురంలో (తమిళనాడు–మధుర జిల్లా), దీపావళినాడు అస్తమించారు. అనంతజ్యోతులు వెలిగే దీపావళీనాడే ఈ నాదజ్యోతి ఆ పరంజ్యోతిలో కలిసిపోవడం నిజంగా ఒక విశేషం.

గౌరవరపు వాసుదేవరావు

భారతికి రాసేవారికి మనవి!

- భారతికి రాసేవారు కాగితానికి ఒక వైపునే పూర్తి తెలుగు లిపిలోనే రాయాలి. పూర్తి చిరునామా అవసరం.
- రచనలని ప్రచురించటానికి స్వీకరిస్తే ఆ విషయం మేమే తెలియపరుస్తాము.
- ప్రచురణకి స్వీకరించబడని రచనలని తిప్పి పంపాలని కోరుకొనే వారు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన పూర్తి చిరునామా రాసిన కవరుని జత చేయవలసి ఉంటుంది. ఇలా కవరుని జత పరచని పక్షంలో రచనలని తిప్పి పంపటానికి కుదరదు. ఈ విషయంపై ఉత్తర ప్రత్యుత్తరాలకి ఆస్కారం లేదు.
- శాసనాల గురించి వ్యాసాలు రాసే వారు తమ వ్యాసాలతో పాటు వాటికి సంబంధించిన ఛాయా చిత్రాలని కూడా జతపరచి పంపవలసి ఉంటుంది.
- ప్రచురణకి స్వీకరించిన రచనలని మూడు, నాలుగు నెలలలోపు వీలునిబట్టి ప్రచురించడం జరుగుతుంది ఈలోగా ఉత్తరాలు రాస్తే ప్రయోజనం ఉండదు.
- రచనలు పడ్డ భారతి ప్రతులని ఆయా రచయిత్రులకీ రచయితలకీ పంపడం తప్పనిసరిగా జరుగుతుంది. ప్రతులు అందలేదనీ మళ్లీ పంపవలసిందని రాసేవారు ఈ అంశాన్ని గమనించగలరు.

–సంపాదకుడు

గ్రంథవిమర్శలు

నిర్వాణ దశకము

[సురభారతీ సాంస్కృతిక గ్రంథమాల, చతుర్దశ కుసుమము. మూలం శ్రీ శంకర భగవత్పాద విరచితము. వ్యాఖ్యాత శ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు, డెమ్మీసైజు 68 పుటలు. వెల 5 రూ. ప్రకాశకులు, ప్రాప్తిస్థానం, కార్యదర్శి, సురభారతీసమితి, ఉస్మానియా యూనివర్శిటీ కాంపస్, హైదరాబాదు 500007.]

"తదేకో౽వశిష్టః శివః కేవలో౽హం" అని అద్వైత తత్త్వాన్ని సంగ్రహంగా పది శ్లోకాలలో, పయిమకుటంతో శ్రీ శంకర భగవత్పాదులు రచించారు. వాటికి నిర్వాణ దశకమనే పేరు ప్రసిద్ధంగా ఉన్నది. సూత్రప్రాయంగా ఉన్న ఆ పది శ్లోకాలలోనే శాస్త్ర ప్రమేయంగా ఇమిడి ఉన్నది. చర్చించినకొద్దీ అనేక విషయాలు వాటివల్ల అవగాహన అవుతూ ఉంటాయి పరమ పురుషార్థాన్ని బోధించి లోకాన్ని ఉద్ధరించడం కోసమే భగవత్పాదులు ఈశ్లోక దశకాన్ని రచించారు. ప్రగాఢంగా పరిశీలించినవారికి గాని వాని సమగ్రాభిప్రాయం గోచరించదు.

వ్యాఖ్యాత శ్రీనివాసరావుగారు అద్వైత వేదాంత గ్రంథాలను పఠించి, వాటిలోని తత్త్వాన్ని విజ్ఞుల వలన విని, మననంచేసుకుని విశిష్టజ్ఞానాన్ని సంపాదించారు. అద్వైత తత్త్వాన్ని గురించి ఉపన్యాసాలిచ్చి జిజ్ఞాసువుల కామోదాన్ని కలిగించారు. వ్యాఖ్యలు సాధారణంగా ప్రతిపదార్థ తాత్పర్యాలతో సంగ్రహంగా ఉంటాయి. ఈ వ్యాఖ్య అటువంటిదికాదు. చాలా విపులమైనది. శ్రీనివాసరావుగారు సునిశిత దృష్టితో పరిశీలించి ప్రతి శ్లోకంలోని గూఢార్థాన్ని విపులంగా తెలియజేశారు. అద్వైతాన్ని గురించిన పెక్కు విషయాలు ప్రతి శ్లోక వ్యాఖ్యలోను పొందుపరుపబడినది.

వీటిలో తొమ్మిది శ్లోకాలే మకుటంతో ఉన్నవి. చివరి శ్లోకంలో అద్వైతానుభవమంటే ఎలాటిదో, అందులోని వైలక్షణ్యం ఏమిటో విపులీకరించబడింది. అద్వైత తత్త్వాన్ని సులభంగా, సంగ్రహంగా గ్రహించడానికి సులభశైలిలో కూర్చబడిన యీ వ్యాఖ్య మిక్కిలి ఉపకరిస్తుంది.

ఆంధ్రులకూ, ఇతర ప్రాంతీయులకూ ఉత్తమ సంస్కృత గ్రంథాలు ఉండేటట్లు, కొన్నిటిని సవ్యాఖ్యగా తెలుగులోనూ, కొన్నిటిని దేవనాగరిలిపిలోనూ ప్రచురిస్తూ సురభారతికి ఎనలేనిసేవ చేస్తున్న సురభారతీ సమితివారు ఈ ఉత్తమ గ్రంథాన్ని ప్రచురించుట ప్రశంసించదగినది. అద్వైత తత్త్వ జిజ్ఞాసువులు దీనిని తప్పక ఆదరించగలరని నా విశ్వాసం.

బులుసు వేంకటరమణయ్య

సోమసుందర్ కథలు

'ఈ దేశంలో నా పాఠకుల కెందరికో నేను కథలు రాస్తానని గానీ, ఎన్నో వ్రాశాననిగానీ తెలియదు. అంటున్నారు సోమసుందర్‌గారు. ఈ అపోహ తొలగడం కోసం దాదాపు 500 పేజీలలో ఒక నిండైన కథా సంపుటాన్ని ప్రచురించారు. ఇందులోని మొత్తం 28కథల్ని సంచారిణీ దీపశిఖ (8 కథలు) బానిసల దేశం (9 కథలు) రేపటి పాటలకోసం (11 కథలు) అంటూ మూడు భాగాలుగా విభజించారు. 'సంచారిణీ దీపశిఖ' ఒక తాతయ్య కథతో ప్రారంభమై ఒక అమ్మమ్మ కథతో పూర్తయిపోతుంది. శుద్ధ వైదిక కుటుంబానికి చెందిన సామవేదం రామచంద్ర చక్రపాణి సనాతన విద్యల యొక్క నిరర్థకత్వాన్ని గుర్తెరిగి, ఆంగ్లవిద్యా పారంగతుడవుతాడు. లక్షణంగా పెండ్లాడి గృహస్థుడైన తర్వాత, ఒక అమెరికన్ లేడీ డాక్టరును చేరదీసి అది అతిలోకమైన దివ్యప్రేమగా భావిస్తాడు. బ్రాందీ విస్కీలలోని మాధుర్యాన్ని సైతం గుర్తిస్తాడు. నిండా మునిగాక చలేముందని సకుటుంబంగా క్రైస్తవ మతం స్వీకరిస్తాడు. తన ప్రియురాలు యిచ్చిన కానుకల వల్ల బాగా లబ్ధిగూడా పొందుతాడు. కానీ తన మనవడి దగ్గరి కొచ్చేసరికి అతడు బ్రాహ్మణ క్రిస్టియన్‌ను తప్పితే మరొకర్ని పెళ్లాడరాదని ఆశిస్తాడు. ఆదేశిస్తాడు. స్వరాజ్యం వచ్చిన తర్వాత గూడా దొరతనమంటే ఆంగ్లేయులదే దొరతనమని విశ్వసిస్తాడు. ఉత్తమ పురుషలో ఈ కథ చెప్పుకుంటూ వచ్చిన రమారంజనశర్మకు తన తాతగారి వ్యక్తిత్వం పట్ల అచంచలమైన ఆరాధనా భావం వుండేవుండవచ్చును గాక! పాఠకులు అతనితో ఏకీభవించడం కష్టం. 'సంచారిణీ దీపశిఖ'లోని అమ్మమ్మపాత్ర యిందుకు పూర్తిగా విభిన్నమైనది. ఇరవైయేళ్ల పసిప్రాయంలో భర్తను పోగొట్టుకున్న జానకమ్మ ఆప్తుల్ని, ఆత్మీయుల్ని సమీకరించుకుని వసుధైక కుటుంబినిలా రూపొందింది. అందరి దుఃఖాన్ని పంచుకుంది. తన కంటూ కించిత్తు సుఖంలేకపోయినా అందరికీ ఆనందాలు పంచింది. ఆమె ఎదురైతే వెలుగు; మరుగైతే చీకటి. అట్లాజీవించింది. మధురవిషాదం మూర్తీభవించిన మహోన్నతమైన పాత్ర అది. అమ్మమ్మను గురించి మనవడు చెప్పిన ఈ కథ పాఠకులకు పారవశ్యం కలిగిస్తుంది. అడుగడుగునా కళ్లు చెమ్మగిల్లుతాయి. మొదటి విభాగంలోని మిగిలిన కథలు గూడా మానవ సంబంధాలను చిత్రించేవే. కోరిన వలపుల కోనలో కురిసిన పన్నీటివాన 'రాగరేఖలు' తాగలేక పాలను బోర్లపోసుకున్న ఒక నిర్భాగ్యుడి జీవితగాథ 'తుపానులో రాలిన జీర్ణపత్రాలు ! ఒక యువకుని జీవితంలోని విషాదాధ్యాయం 'చచ్చిపుట్టిన వాళ్లు' లేతగుండెలో గూడుకట్టుకున్న నిర్వేదం 'గులకరాళ్లు' చాదస్తపు పిడివాదాలకు బలైపోయిన ఓ పడుచు ఇంటిజీవితం 'చరమరేఖ'

ఈ సంపుటిలోని రెండో విభాగం బానిసలదేశం'లో సోమసుందర్‌గారు. 'సమాజం నాడీపరీక్ష' చేయడానికి పూనుకున్నారు. బానిస దేశంలో 'మంచి బానిస'ల మనస్తత్వాన్ని షావుకారు ఐశ్వర్యానికి నివాళిపట్టే రాఘవేంద్రం ద్వారా, పోస్టుమాస్టరుగారికి దాసానుదాసుడుగా బతికే తపాలా బంట్రోతు అప్పారావు ద్వారా నిరూపించారు. అన్యాయాన్ని సహించలేని తొమ్మిదేళ్ల కుర్రవాడి గుండెల్లో 'అగ్ని పర్వతం భుగభుగలను యుద్ధరాక్షసి నోట్లోకి చిన్నతినుబండంలా వెళ్తున్న వెంకన్న పగటి కలల్లోనుంచీ 'రాబందుల రెక్కల చప్పుడు'ను చిత్రించారు. అభివృద్ధికి అడ్డు గోడకాగానే - అప్పటివరకు రక్షణ కవచంగా వున్న పైగుల్లను పగులకొట్టుకుని ఈ వలికి వచ్చే కోడి పిల్లలా అవసరమైనప్పుడు బాహ్యపరిస్థితులతో పోరాడడం మానవుడి జన్మహక్కని ప్రబోధించారు. ఈ ప్రబోధాత్మకమైన కథల్లో ఎన్నదగింది 'ప్రేమకథలో ఆఖరుఘట్టం? సమాజపు భౌతిక పరిస్థితుల్లో మార్పు తీసుకరావడానికి మించిన ప్రయోజనం మానవజీవితానికింకొకటిలేదని రచయిత ఈ కథలోని ముఖ్యపాత్ర ద్వారా పలికించారు.

'రేపటి పాటల కోసం' అనే మూడో విభాగంలో లోకులంతగా పట్టించుకోని దీనులు. దుఃఖభాగులు, నిస్సహాయులు అయిన అజ్ఞాత, అమాయిక. దౌర్భాగ్య జీవుల బాధామయ జీవితాలు చోటుచేసుకున్నాయి. 'గుప్తసాలగ్రామం' లోని బైరాగి, 'పశ్యేమశరదశ్శతం' లోని బిచ్చగాడు, 'గురువెంద పూసలతావళం' లోని యీరాదారి పెళ్లాము. 'ఇల్లాలి జాలిగీతి'లోని సుశీల మొదలైనవి మరపురాని పాత్రలు. 'అగోచరమైన ఏ సూత్రానికో బంధించబడి ఏదో శక్తి ఆడించినట్లు ఆదే కీలుబొమ్మలం తప్పిస్తే, మనమంతా మరేమీ కానేకాదేమో ?' అన్న వాక్యం రచయిత తాత్విక చింతనకు కేంద్ర బిందువుగా తోస్తుంది. ఆ అగోచరమైన శక్తి ఏది ? భగవంతుడా ? సామాజిక వ్యవస్థా ? ఆర్థిక పరిస్థితులా ?_ ఇది ఎవరికివారు ఆలోచించుకోవలసిన విషయం.

మధురాంతకం రాజారాం

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd , by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone : 75667 & 61247.



మళ్ళీ మళ్ళీ తిరిగి చూస్తారు జనం
సూపర్ రిన్‌తో తళతళలాడే
ఆ తెల్లదనం
SUPER
RIN
STRIKES WHITER
సూపర్ రిన్‌తో తళతళలాడే తెలుపు
మరే ఇతర డిటర్జంట్ బిళ్ళ లేదా బార్ కంటే తెలుపు.
హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి.
LINTAS RIN 93 2720 TL


అమృతాంజన్‌కే
తెలుసు
ఒంటి నొప్పులు
మరియు
బెణుకుల బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ
AMRUTANJAN
Pain Balm
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
OBM 8777 TG